గాంధీ - గాంధీతత్త్వము

(మొదటి సంపుటము)

రచయిత:

డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్య

అనువాదకులు:

కోడాలి ఆంజనేయులు

ప్రభాత ప్రచురణ సమితి

ఖమ్మంమెట్టు (నైజాం)

ప్రభాత ప్రచురణము - 4

ప్రథమ ముద్రణ
2000 ప్రతులు
మార్చి 1947

వెల 4-0-0

ముద్రాపకులు :
"దివ్యవాణి" పత్రికవారి
శ్రీనివాసా ప్రింటింగ్ వర్క్సు,
సికింద్రాబాద్.

రథస్యైకం చక్రం భుజగయమితా స్సప్తతురగాః
నిరాలంబో మార్గశ్చరణ రహిత స్సారథిరపి
రవిర్యా త్యేవాంతం ప్రతిదినమపారస్య నభసః
క్రియాసిద్ధి స్సత్త్వేభవతి మహతాం నోపకరణే॥

సమర్పణ

నిత్య సిద్ధాంతాలైన
సత్య - అహింసలను
ప్రబోధించిన అనుసరించిన
అన్నిమతాల అన్నియుగాల
ఋషుల, ప్రవక్తల, భక్తుల
స్థితప్రజ్ఞుల, పూర్ణపురుషుల
పవిత్ర స్మృతికి
తన దోషాలను, వైఫల్యాలను, సంపూర్ణంగా
తెలిసికొన్న ఒక హృదయపూర్వక
అహింసారాధకుని సమర్పణ

విజ్ఞప్తి

గాంధీ తత్త్వానికి సంబంధించిన సాహిత్యం తెలుగులో అంతగా వెలువడలేదు. ఆ లోపాన్ని యథాశక్తి తీర్చవలెననే మా సంకల్పానికి ఈ పుస్తక ప్రచురణద్వారా ముందుకు సాగుటకు ప్రోత్సాహమిచ్చిన రచయిత శ్రీ పట్టాభి సీతారామయ్యగారికి, అనువాదకులు శ్రీ కొడాలి ఆంజనేయులుగారికి మా ధన్యవాదాలు.

మునుముందు ఇట్లే ఆంధ్ర రచయితల ఆదరాభిమానాలు పొందగలమని ఆశిస్తున్నాము.


నానాటికి పెరుగుతున్న కాగితపు కరువురోజుల్లో, ముద్రణా సౌకర్యాలు చాలా తక్కువగానున్న ప్రదేశంనుంచి ఇంత పెద్ద పుస్తకాల ప్రచురణకు కాలయినా ఊనని మా సమితి పూనుకోవడం సాహసమే. అయినా ఆంధ్ర పాఠక లోకంపై మాకు సంపూర్ణ విశ్వాసం ఉన్నది. మేమిప్పటికి ప్రచురించిన మూడు పుస్తకాలకు చూపిన ఆదరాభిమానాలనే మునుముందు కూడా ఆంధ్ర ప్రజానీకం చూపగలదని విశ్వాసం.

పుస్తక ప్రాశస్త్యాన్ని గురించి పాఠకులకు విన్నవించడం దీపంతో సూర్యుని చూపటం వంటిది.

ఖమ్మంమెట్టు
1-3-47

ఇట్లు
ప్రకాశకులు

విషయసూచిక



మహాత్మా గాంధి

మా ప్రచురణలు

1. హైదరాబాదు రాజ్యాంగ సంస్కరణలు - శాసనసభ :

వెల 0—8—0

రచయిత : శ్రీ కోదాటి నారాయణరావుగారు

"ఇది చక్కని భాషలో సుబోధమగు శైలిలో వ్రాయబడి మన రాజ్యాంగసంస్కరణలలోని వివరములన్ను అందలి దోషములను ప్రస్ఫుటముగా వ్యక్తపరచజాలి యున్నది. నిజాంరాష్ట్రి ఆంధ్రి ప్రాంతములోని వారీ యుత్తమ రచనను బాగుగా చదివి లాభము పొందెదరని నమ్ముచున్నాము."

ఆంధ్రి పితామహులు

శ్రీ మాడపాటి హనుమంతరావుపంతులుగారు

2. హైదరాబాదు రాజ్యాంగ సంస్కరణల పాటలు :

వెల 0—4—0

"సంస్కరణల బహిష్కరణను విజయవంతం చేసిన ప్రచార గేయాలు"

3. నల్లగొండజిల్లా ప్రజల దురవస్థలు :

వెల 0—1—6

రచయిత : శ్రీ ద్వారకానాధ కచూరి

"నల్లగొండజిల్లా ప్రజలపై ప్రభుత్వం సాగించిన మిలిటరీదాడుల గాధ"

తొలి మాట

"గాంధీ-గాంధీతత్వము" ను గూర్చి గ్రంథము వ్రాసి పంపవలసిందని నిరుడు వేసగిలో కితాబిస్థానంవారు నన్ను కోరినారు. అందువల్ల ఆ విషయంలో నాకుగల అభిప్రాయాలను తిరిగి కూర్చడానికి ఈ నూతనప్రయత్నం చేశాను. మొట్టమొదట క్రైస్తవ కళాశాలలలో దీర్ఘకాలం పొందిన శిక్షణవల్లనూ, పిదప 1905 లో వంగదేశంలో ఉద్భూతమైన నూతనచైతన్య వికాసంవల్లనూ, తరువాత మహాసంగ్రామం నాటి (1914-1918) డాక్టరు బెసెంటు హోంరూలు ఉద్యమంవల్లనూ రెండు దశాబ్దములుగా దున్ని పదునుచేయబడిన మనోక్షేత్రములో ఈ అభిప్రాయములు నాటుకొని దోహదము చేయబడి మఱి ఇరువది సంవత్సరాలనుండీ పెరిగి పెద్దవవుతూ వచ్చినవి. యుద్ధం ముగియడంతో నే భారత రాజకీయ నైతిక ఆర్థిక విషయాలలో- అదీ ఇదీ ఏమిటి భారతదేశ సర్వతోముఖ పునరుద్ధరణ విషయాలలో నే గాంధీశకం ప్రారంభమయింది.

౧౮౫౭ లో మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగింది. దానికీ ఒక కారణముంది; నాయకుడున్నాడు; జండా ఉన్నది. కాని అది సరియైన కట్టుబాట్లలో జరుగలేదు. దాని ఉద్దేశంగానీ, పద్ధతిగానీ మహోన్నతములైనవి కావు. అది అంతా హింసాపద్ధతిమీద నడిచింది. కాంగ్రెసు ౧౮౮౫ నుండీ భారత స్వాతంత్ర్య సంపాదనకు పూనుకొన్నది. కాని

30 సంవత్సరములవరకూ అది ఆలోచనా ప్రపంచాన్ని దాటి వెళ్ళలేకపోయింది. ౧౯౦౮ లో ప్రారంభమైన తలలు పగలు కొట్టేపని ౧౯౧౯ నాటికి నెలుసులు వెదకడంలోకి దిగింది. తరువాత ఆత్మబలయుగం ప్రారంభమయింది. పశుబలానికీ బుద్ధిబలానికీ సంబంధించిన కార్యక్రమాలన్నీ దానితో మఱుగు పడ్డాయి. ఈ యుగపురుషుడైన గాంధీ డెబ్బదిరెండవ జన్మదిన జయంతి ఇప్పుడే జరిపాము. ఆయన జీవితంలో అనేక పోరాటాలు చేశారు. ఇప్పుడాయన చేసేది చివరిపోరాటం. ఇదివరకాయన పోరిన పోరాటాలన్నిటిలోకీ నిస్సందేహంగా ఇది పెద్దది. మనదేశంలో కారాగారశిక్ష ననుభవించినవారిసంఖ్యను బట్టికాదు ఈ పోరాటం గొప్పదనడం- తనకృషికి పరమావధిగా ఉపవాసవ్రతమూలమున- బహుశా అది ప్రాయోపవేశమే కావచ్చును- మాతృదేశ చరణములకు పూజాపుష్పం కావడానికి నిశ్చయించుకొన్నాడాయన.

ఈ పోరాటంలో ప్రతిసంవత్సరమూ మనము మన వీరులకూ, మృతజీవులకూ (Martyrs), యోగులకూ, రాజకీయ చతురులకూ, శిల్పులకూ, కవులకూ, జన్మజయంతులు జరుపుతూన్నాము. ఇంతకుపూర్వము దాదాభాయి ఫిరోజిషా మెహతాలకూ, గోఖేలు తిలకుమహాశయులకూ, సురేంద్రనాథ్ బిపినచంద్రపాలులకూ, లజపతిరాయి దేశబంధుదాసులకూ మనము మన స్తుతిగీతములను సమర్పించాము. కాలమనే ఇసుకదారులలో వారి అడుగుజాడలు మాసిపోలేదు. వారింకనూ మనకు మార్గదర్శకులే. వారి స్మృతి మన భావోత్సాహ

అను చిగిరిస్తూ మన జాతీయ జీవితానికి నూతనచైతన్యం కలిగిస్తూన్నది; మన ఆదర్శాలనూ అభిప్రాయాలనూ మహోన్నతపథాలకు తీసికొనిపోతూన్నది. కాని వారు దురదృష్టవశమున భావిసంతానము పాడుకోవడానికి మిగిలిన స్మృతిగీతములుగా మాత్రమే నిలిచిపోయినారు.

గాంధీ అలాకాదు. నేడు జీవంతో ఉన్న భారత భాగ్యవిధాత ఆయన. ఆయన జీవితం దీర్ఘమైనకొలదీ భావాలు గంభీరము లవుతున్నాయి. ఉపాయాలు (Plans) ఉన్నతస్థాయిని పొందుతూన్నవి. ఆయన కర్మక్షేత్రం విశాలమవుతూన్నది. ఆయన ఆదర్శవాంఛలు నింగిముట్టుతున్నవి. ఆయనముందు గాలిలో అవ్యక్తంగా ఊగులాడే సమస్యలు లేవు. ఆయనకు నిన్నటి పగటికలలు నేటికి ఘనీభవించిన అభిప్రాయాలు. అవి రేపటికి ఉపాయాలుగామారి ఎల్లుండికి రూపందాల్చిన ఒక స్పష్టమైన కార్యక్రమంగా పరిణతి పొందుతవి. ముప్పైఐదుకోట్లజనం ధరిస్తూన్న 72 కోట్ల రూపాయిల విలువగల విదేశీవస్త్రం ఇండియాకు రాకుండా ఆపవలెనంటే ఒక పాతరాట్నంతోనూ చాలీచాలని ఖద్దరు ధోవతీతోనూ ఆయన పని ప్రారంభిస్తాడు. నాలుగైదుకోట్ల మందియొక్క అంటరానితనమును రూపుమాపడానికి ఆమరణాంతోపవాసవ్రతం అవలంబించి తద్వారా "దైవం కూర్చిన కూర్పు విచ్ఛిన్నం కాకుండా" హరిజనులను హిందూసంఘంలో నిల్పచూస్తారాయన. తాగుడుద్వారా వచ్చిన పాపపు రాబడిని రద్దుచేయడానికి ఆయన రాష్ట్రీయమంత్రుల కార్యాసక్తిని

నైతిక సంస్కారమార్గములకు పట్టించారు. హిందూమహమ్మదీయ సఖ్యతకొఱకు ఆయన 1924 లో ౨౧ నాళ్ళు ఉపవాసం చేశారు. నేడాయన తన 72 వ యేట 1940 లో హిందూదేశాన్ని యుద్ధప్రయత్న బాధ్యతనుండి తప్పించడానికి వైస్రాయితో రాయబారములద్వారానూ, సత్యాగ్రహోద్యమం ద్వారానూ భగీరథప్రయత్నాలు చేస్తున్నారు. ఉత్త ఆయుధవిసర్జన కార్యక్రమంకింద కాక, అహింసా సిద్ధాంతంలో నైతికసూత్రము ననుసరించి, ఆయన సైనికసన్నాహములులేని భారత కేంద్రప్రభుత్వాన్ని భావింపగలుగుతున్నారు.


గాంధీ నాయకత్వంకింద నడచిన రెండు దశాబ్దములలో ఆయన భారత జాతీయసౌధానికి అంతరువులపైన అంతరువులు నిర్మించడమేకాక దాని మూలముకూడ క్రమంగా వైశాల్యంచేశాడు. ఆయన 1928 నాటికే భారత రాజ్యాంగంలో సంస్థానాలు పొందవలసిన ప్రాముఖ్యతను గుర్తించి, భారత స్వరాజ్యప్రణాళికలో వాటి అగ్రస్థానాన్ని అంగీకరించాడు. తరువాత సంస్థానప్రజా మహాసభ దాని శాఖోపశాఖలతో ప్రత్యేకసంస్థగా నుండనక్కరలేదని ప్రబోధించి మహాసభా కార్యవర్గమూ, కాంగ్రెసు కార్యవర్గమూ రెండూ దాదాపు లీనమయ్యేటట్లు చేశాడు. సంస్థాన ప్రజామండలికీరోజున గాంధీ కొండంతబలం. అంతేకాదు; రాష్ట్రాలకూ, సంస్థానాలకూ, సంస్థానాధిపతులకూ, సంస్థాన ప్రజలకూ గాంధీజీ కొలికిపూస.

గాంధీ ఇండియాకు వచ్చినప్పటినుండీ పూర్తిగా ఆయన వ్యవహారములను పటం (Graph) లో చిత్రిస్తే ఆయన నడకలోని ఎచ్చుతగ్గులు మంచి అనుభవాన్ని చేకూరుస్తవి. 1915-1919 సంవత్సరాలమధ్య ఆయన జీవితంలో ముందుకు తోసుకొనివచ్చే స్వభావమున్నట్లు కనపడదు. 1919 లో అమృతసరం కాంగ్రెసునాడు ఒక్కసారిగా పైకివచ్చి కలకత్తా, నాగపురం కాంగ్రెసులనాటికి (1920) నాయకత్వం వహించగలిగినాడు. ఒక పదిహేనుమాసములు చేసిన గట్టి కృషి ఫలితంగా ఆయన జైలుకు పంపబడి 1924 లో తిరిగి విడుదలయినాడు. తరువాత మూడునాలుగు సంవత్సరాలవరకూ, 1926, 1927, 1928 సంవత్సరాలలో రాజకీయాలలో జోక్యం కలిగించుకోకుండా కేవలం నిర్మాణ కార్యక్రమంలోనే నిమగ్నుడైపోయినాడు. 1928 లో తిరిగి కలకత్తా కాంగ్రెసులో ముఖ్యపాత్ర వహించాడు. పిదప ఏడాదియైనా నిండకుండానే 1929 డిశంబరు 23 తేదీని, పూర్ణస్వరాజ్యంనిమిత్తం యావద్భారతోద్యమం ప్రారంభింపబోతున్నానని ఇర్విన్ ప్రభువుకు శ్రీముఖం పంపించాడు. దీనిఫలితమే 1930-1934 వరకూ జరిగిన సత్యాగ్రహోద్యమం. తరువాత ఆయన కాంగ్రెసునుండి విరమించి కౌన్సిలు కార్యక్రమంలో ఎక్కువ ఉత్సాహం కనపరచలేదు. 1937 లో వైస్రాయి దగ్గరనుండి "హామీలు" సంపాదించడానికి చురుకుగా రాయబారాలునడిపించాడు. ఇవే రాష్ట్రీయ మంత్రివర్గ నిర్మాణమునకు కారణభూతములైనవి. కడలిలో ఈతగానివలె ఆయన "పోటు" లో

పైకివస్తూ "ఆటు" లో కనపడకుండా లోపలికి పోతూంటాడు. హింసాసంగ్రామ సముద్రకల్లోల తరంగములనుండి కాంగ్రెసు నౌకను ఒడ్డుచేర్చడానికి ఆయన నేడు కొండమీది కొడిదీపం. ఆయనకు మార్గంప్రధానం; అవధికాదు; ప్రయత్నంప్రధానం. ఫలితంకాదు; ఉపాయాలు ప్రధానం. పర్యవసానాలుకాదు; ఉపాయాలు పరిశుద్ధములై, ప్రయత్నం మంచిదై, మార్గం తిన్ననిదైతే, అందువ తగినఫలం కలుగనే కలుగుతుంది. ఆవిధంగా వచ్చిన ఫలితం శాశ్వతంగాకూడా ఉంటుంది. అంతే కాదు. ఆఫలితం పొందే ప్రతివాని శాశ్వత సౌభాగ్యానికీ అది తోడ్పడుతుంది.

కాబట్టి గాంధీ సిద్ధాంతాలనూ సూత్రాలనూ ఆయన వాటిపైన నిర్మించిన రాజకీయార్థిక సాంఘిక పునర్నిర్మాణ విధానములనూ భారత స్వరాజ్యమునకు ముఖ్యాంగములుగా సమన్వయం చేసుకోవడానికి ఈ గ్రంథమును ప్రచురణ నిమిత్తం "కితాబిస్థాన్" కు సమర్పించినాను.

బందరు,
28-12-1941. } భో. పట్టాభి సీతారామయ్య.



డాక్టరు పట్టాభి

గాంధీ - గాంధీతత్వము

హేతువాదం

గాంధీ ఉద్యమానికి యే హేతువాదం కలదో అదంతా దాదాపు గాంధీభాషలోనే సంగ్రహంగా ఇక్కడవ్రాస్తాము. అదే ఈ పుస్తకానికికూడా మూలం కాగలదు.

గాంధీ భావోద్రేకం లేనివాడుకాడు. కాని ఆయనబోధలు కానీ సిద్ధాంతాలుకానీ దానిపైన ఆధారపడి ఉండవు. దేవుడు సర్వాంతర్యామియని ఆయన విశ్వాసం. "నాస్తికుని నాస్తిక్యం" కూడ ఆయనకు దైవస్వరూపమే. ఆయన దేవుడు సత్యం (సత్); ఆయన సత్యం జ్ఞానం (చిత్); నిజమైన జ్ఞానమున్నచోట ఆనందముంటుంది. కాబట్టి ఆయన సచ్చిదానంద స్వరూపంలో దేవుణ్ని తెలుసుకొంటూన్నాడు. పూర్ణసత్యం తెలుసుకోవడమంటే తననుతాను తెలుసుకోవడమూ తన పరమావధి యేమిటో తెలుసుకోవడమూను. అంటే పూర్ణపురుషుడవడం. అందువల్లనే గాంధీ "మన జీవితానికి సత్యమే ఊపిరి కావాలని" పదేపదే చెబుతూంటాడు. మనమహాభారత మహార్షులవలెనే ఆయన త్రాసుకు ఒకవైపున సమస్త యజ్ఞములనూ మఱొకవైపున సత్యాన్ని ఉంచితూస్తాడు. రెండోది మొదటిదానికంటె ఎక్కువ తూగుతుంది. కనుక సత్యాన్వేషణమే భక్తియని ఆయన తాత్పర్యం. ఒకరికి సత్యంగా తోచినది

రెండవవారికి సత్యంగా తోచకపోవచ్చు. అందువల్లనే సత్యం సహనభావాన్ని సాధించమంటుంది. "మనమంతా సత్యాన్ని వివిధ దృక్పథములలోనుండి కొద్దికొద్దిగా మాత్రమే చూస్తూ ఉంటాము."

"అహింస ప్రాణంలేని కట్టెసిద్ధాంతం కాదు. అది సజీవమూ ప్రాణప్రదమూను. అది ధైర్యవంతులకు నైజము. అదే వారి సర్వస్వము. అది ఆత్మయొక్క ప్రత్యేక ప్రకృతి. అందువల్లనే అది ఉత్కృష్ట ధర్మంగా పేర్కొనబడుతూన్నది. అహింసా భానూదయంతో అసూయా, కోపం, ద్వేషం మొదలైనతమో గుణాలు విరిసిపోతవి". గాంధీ.

కాబట్టి ఆయనప్రకారం "అహింస లేకుండా సత్యాన్వేషణం దుర్లభం."

"నన్ను హిందూమతాన్ని వివరించమంటే నేనొక్క మాటలో 'అహింసద్వారా సత్యాన్వేషణము' ని చెప్పివేస్తాను." అంటాడు గాంధీ. అన్నిప్రాణులనూ ప్రేమించడమే అహింస. భారత సంతానానికి మాతృదేవిగానూ, కోరికలపంటగానూ పరిగణింపబడే ఆవు జంతుప్రపంచంలో అహింసకు చిహ్నం!*

కాబట్టి అంటరానితనమును అట్టేఉంచడం హింసా కళంకమునకు పాల్పడడమే. అంటరానితనాన్ని ఉంచడం మనం గర్వపడే అహింసా సిద్ధాంతాన్ని తృణీకరించడమేనని గాంధీ అభిప్రాయం. కాబట్టి దానిని శాశ్వతంగా నిర్మూలించాలి. చట్టంద్వారాకాదు; హిందూ అంతరాత్మ విజృంభించి తనం

* ఈ విషయం వివరంగా అనుబంధంలో వ్రాయబడినది.

తట తాను ఈ సిగ్గును తుడిచివేసుకోవాలి. అప్పుడే ప్రేమ అహింసకు పరమావధి అనీ, మానవ సంబంధములకు మూల కందమనీ అర్థమవుతుంది. అహింస భయంవల్లనో పిఱికితనము వల్లనో నాశనమవుతూన్నది. అహింసను అవలంబించి తీర వలెనని చెప్పని మతంలేదు. అయితే ఒక్కొక్కప్పుడు మతం హింసను అంగీకరించి ఉండవచ్చును. కాని మనం అభివృద్ధి పొందినకొలదీ ఆ అంగీకారంకూడా మన మతసిద్ధాంతాలలో నుండి పోవాలి. పిఱికితనంకంటె హింస మంచిదికావచ్చు. కాని అహింస హింసకంటె మంచిది. అహింసలో తాను బాధ పడడమున్నది. ఆ బాధ ఫలప్రదం కావలెనంటే అది పవిత్ర వంతంగా ఉండాలి. పవిత్రతనుబట్టి బాధ తీవ్రమవుతుంది. బాధా తీవ్రతనుబట్టి ఫలితముంటుంది. కాబట్టి మనం ప్రేమ వల్లనే ఇతరులుపెట్టే క్లేశమునూ వెలినీ భరిస్తాము. కుటుంబ ప్రతిష్ఠనూ ఆస్తినీ పోగొట్టుకోవడానికి ఒప్పుకొంటాము. అటు వంటి పరిస్థితులలో ప్రతిక్రియ చేయకుండా ఉండవలెనంటే ఆత్మనిగ్రహం అవసరం. కాని ఆత్మనిగ్రహమనేది కేవలం మిన్నకుండడమే (Passive Force) కాదు. అందువలన సేవా తత్పరత సర్వతోముఖం కావాలి. నిరంతర సేవాసక్తి త్యాగ మునకుదారితీస్తుంది. ఈ త్యాగసిద్ధాంతం మానవులందఱికీ అను ల్లంఘనీయముగా ప్రతిపాదింపబడినది. మనవాళ్ళంతా ఉద యమూ సాయంకాలమూ భోజనానికిపూర్వం జపించే మంత్రా లలో ఈ విషయమే గ్రథితమైఉంది. కాని చిరస్మరణీయమైన త్యాగచిహ్నముగా నుండవలసిన ఈ సిద్ధాంతం కాలక్రమేణా

అర్థంలేని అభ్యాసముగుపోయింది. హిందువుడైనవాడు భోజనమునకు పూర్వం రెండుపూటలా అయిదు చిన్న అన్నపుకవళ్ళను విస్తరిచుట్టూ ఉంచుతాడు. అవి ధర్మ, ధర్మరాజ, చిత్ర, చిత్రగుప్తులకూ సర్వదేవతలకూ అంకితం చేయబడుతూన్నవి.♦ భోజనం చేయడానికిముందు పరిషేచనంపిమ్మట నడుపబడే ఈ క్రియ దాతృత్వబుద్ధిని ప్రజ్వలింపచేయడానికీ ప్రతిరోజూ మానవుడు నిర్వర్తించవలసిన ధర్మాన్ని స్మరింపచేయడానికీ ఉద్దేశింపబడ్డది.

దీనినిబట్టి భోగలాలసత్వము, ఎక్కువగా డబ్బు కూడబెట్టడము, నికృష్టంగానూ అవాంఛనీయంగానూ తలపబడుతూన్నవి. శరీరకష్టం-మగ్గంమీద పనిచేసినా, రాట్నంమీద పనిచేసినా పొలంలో పనిచేసినా, మిల్లులో పనిచేసినా, చెప్పులుకుట్టినా, దొడ్డిఊడ్చినా యేపనియైనాగానీ- పరమధర్మంగా యెన్నబడుతూన్నది. నూలువడకడం నిరాడంబరమైన నిష్కళంకమైన శరీరకృషికి చిహ్నం. కాబట్టి అది విధేకాదు సంస్కారం కూడాను. కనుక నీవు గ్రామాలయెడలనూ గ్రామ పరిశ్రమల యెడలనూ నీ ప్రథమధర్మాన్ని నిర్వర్తించవలసి యున్నది, గ్రామపరిశ్రమలే నిజమైన స్వదేశీవస్తువులు. వాటిలో అందచందాలు లేవని భావించకూడదు. నిజమైనశిల్పం అంతరంగికమైనదికాని బహిర్గతమైనదికాదు. ఆశిల్పమే అందం. ఆఅందమే సత్యం-ఆసత్యమే అహింస. ఆ అహింసయే ప్రేమ. ఆప్రేమయే

♦ ధర్మాయనమః ఓమ్, ధర్మరాజాయనమః ఓమ్, చిత్రాయనమః ఓమ్, చిత్రగుప్తాయనమః ఓమ్, సర్వదేవేభ్యోనమః ఓమ్.

గ్రామస్థులు తమ చేతిపనులతో పొట్ట పోసుకోవడానికి సహాయకారి అవుతుంది. పూర్వకవి ఒకాయన ఇలా గానం చేశారు.

"అందమే సత్యమూ
సత్యమే అందమూ
తెలిసిందదేనీకు
తెలియ వలసిందదే"

గాంధీజీ ఇలా అంటున్నారు :

"నిజమైన శిల్పం ఆత్మజ్ఞానం కలగడానికి తోడ్పడాలి. మన తోడి వారు సంతోషంగా ఉన్నప్పుడూ అందుకు మనం ఎంత స్వల్పంగానైనా సరే సహాయపడ్డప్పుడూ మాత్రమే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది."

ఈ అభిప్రాయాలను మనమంగీకరించినట్లయితే మన విద్యావిధానమే మారిపోవాలి. జాతీయసంస్కారంద్వారానే యువక హృదయాలు శిక్షితములు కావాలి. అప్పుడు బుద్ధీ చేయీ హృదయమూ కలసి అవిరుద్ధమైన ఏకసంస్కృతి కలిగిఉండడానికి వీలవుతుంది.

"అనుభవంలేని సిద్ధాంతం కుళ్ళకుండా రక్షింపబడిన శవం వంటిది. అది బహుశా చూడడానికి అందంగా కనిపిస్తే కనపడవచ్చునుగాని యేవిధమైన భావోత్కృష్టతనూ ప్రేరేపించదు" అని గాంధీజీ అంటారు.

ఇటువంటి ఇంగ్లీషువిద్య "భారతీయ విద్యార్థుల నరాలు తోడి వారిని ఆంగ్లమానస పుత్రులనుగా చేస్తున్నది" అని కూడా. గాంధీజీ విశ్వాసం. మన భాషద్వారాన మన మతంపై

ప్రేమా గౌరవమూ కలుగతవి. మనమతమును గౌరవించడం తెలిస్తే ఇతరమతాలుకూడా సత్యాన్నే ప్రతిపాదిస్తున్నవి కాబట్టి వాటినిగూడా మనం గౌరవించగలుగుతాము.

ఈ ప్రధానసిద్ధాంతాలనన్నిటినీ అంగీకరించినప్పుడు సత్యాగ్రహం సనాతన ధర్మంయొక్క వ్యక్తస్వరూపమేనని వెంటనే గ్రహిస్తాము. సత్యాగ్రహం అనగా సత్యానికి నిలబడడమే; పశుబలానికి విరుద్ధమైన సత్యబలం లేక ఆత్మబలం; జగత్తుకు సత్యం మూలం. సత్యాగ్రహం అసత్యాన్ని అరికట్టడానికి సత్యాన్ని అంటిపట్టుకొని ఉంటుంది; చీకటిని నిరోధించడానికి వెలుతురుతో ఉంటుంది; చావును జయించడానికి బ్రతుకుతో నిలబడుతుంది. కాబట్టి ఎక్కడ క్రూరత్వమున్నా సరే- అది వ్యక్తిదికానీ, సంఘానిదికానీ, ప్రభుత్వానిదేకానీ-దానిని సత్యం ధైర్యంగా ఎదుర్కొంటుంది. సత్యాగ్రహం చెడుగును అరికట్టేటంతవరకు ఓటమిని యెఱుగదు. సత్యాగ్రహంద్వారా ఆదర్శాలను అందుకోవలెనంటే బాధాసహిష్ణుత ఒక్కటే మార్గం. కాని అది ఎడతెగని బాధ అయినప్పుడు ఓటమివలె కనిపించవచ్చును. అయితే అది గెలుపుకు మొదటిమెట్టు. ఒకప్పుడా బాధవలన చావుకూడా తటస్థించవచ్చును. అప్పుడుకూడా దానివిలువ కొఱవడదు. ఏది ఎలాఉన్నా ఒక్కసంగతిమాత్రం మనం జ్ఞాపకం ఉంచుకోవాలి. సత్యాగ్రహం ఎప్పుడూ ఇతరుల రక్షణకు భంగంరానీయదు. సత్యాగ్రహి తనకు తాను బాధను ఆహ్వానించుకొంటాడు. ఇతరులను సత్యాగ్రహం అవలంబించమనికూడా నీవు బలవంతపెట్టరాదు. అది క్రూరత్వ

మనిపించుకొంటుంది. అందువల్ల నీవు బలవంతచదలచుకొన్న ఉద్యమానికి కీడు కలుగుతుంది. సంఘంలోనుండి వెలిబెట్టడం గాని సాంఘికసహాయం నిరాకరించడంకానీ నిజంగా ఒకవిధమైన క్రూరత్వమే. సంఘమర్యాదలను అతిక్రమించినవానితో మనం బుజాలు రాచుకొంటూ తిరుగకపోతే తిరుగకపోవచ్చు. కాని వానియింటికి మంగలి చాకలి మొదలయిన పనిబాగుల వాండ్లను రానీయకపోవడం తప్పు. మొట్టమొదట ఒకరి మధ్యవర్తిత్వాన్ని అంగీకరించి తరువాత వారితీర్పుకు కట్టుబడనంత మాత్రాన యెవరినీ సంఘబహిష్కారం చేయకూడదని గాంధీ విశదీకరించే ఉన్నాడు.

"వాని పెండ్లివిందులలాంటి సాంఘిక సమావేశాలలో మనం పాల్గొనకపోవచ్చు. వానిదగ్గరనుండి మనమేమీ బహుమతులు గ్రహించకపోవచ్చు. కాని వానికి సాంఘిక సేవనుమాత్రం నిరాకరించకూడదు. సత్యాగ్రహి అజాతశత్రువు." (గాంధీ).

ఉపవాసమూ ప్రార్థనా- ఈ రెండూ సత్యాన్వేషణకు మార్గాలు. పూర్వఋషులూ యోగులూ మనకోసం సత్యాన్వేషణకు తగిన పద్ధతినీ ధోరణినీ యేర్పాటుచేసిపోయినారు. అసహాయోద్యమం, సాత్వికనిరోధం, శాసనోల్లంఘనం, సత్యాగ్రహం, ఇవన్నీ సత్యాన్వేషణముయొక్క వివిధపరిణామాలు. సహాయ నిరాకరణం పరిణతదశలో అరమరలేని నిష్కళంక ప్రేమగామారి జీవితమంతా ఆవరిస్తుంది. దానిదృష్టిలో రాజకీయమే మతము; మతమే రాజకీయము; దానికి రహస్యముంటే గిట్టదు; కుండ పగులకొట్టినట్లు ప్రవర్తించవలసినదే. భయాన్ని

దులిపివేస్తుంది; సత్యానికి జంకదు; ప్రభుత్వాలను సౌమ్యంగా తృణీకరిస్తుంది. కాని క్రమశిక్షకులోబడి శాసనాలకు విధేయులుగా ఉండేవారుమాత్రమే సత్యాగ్రహులుగా కొన్ని ప్రత్యేకచట్టములను నిరాకరించడానికి అర్హులు. అన్యాయచట్టాలను నిరాకరించినందువల్ల (Civil Disobedience) కల్లోలము కలుగుతుందని భయపడడం కేవలం పొరపాటు. న్యాయచట్టాలను తృణీకరిస్తే (Criminal Disobedience) కల్లోలము కలుగుతుంది. సత్యాగ్రహమునకు ప్రేమ, భ్రాతృత్వము, మర్యాదా- ఇవి మూలం. అందువల్ల సత్యాగ్రహి యెన్నడూ న్యాయచట్టాలను తృణీకరించడు. కాబట్టి చెడుగును నిర్మూలించేటందుకు సర్వగుణసంపన్నుడైన ఒక్క సత్యాగ్రహియే చాలు. అహింసాపూర్వకమైన సాత్వికనిరోధము తప్పకుండా మంచిఫలితాలను చేకూరుస్తుంది. కాని నాయకుడుమాత్రం తనస్థానాన్ని గుర్తించుకొని మూకలకు లోబడిపోకుండా వుండాలి. ఇటువంటి ప్రణాళికపైన ఆధారపడిన ఉద్యమం ఒకొక్కప్పుడు ఆకస్మికంగానూ మరొకప్పుడు చాలా నెమ్మదిగానూ అభివృద్ధి పొందవచ్చును. సత్యాగ్రహంలో సంస్కారోద్యమ బీజాలూ విప్లవోద్యమ బీజాలూ కూడా ఉన్నవి. భారతీయులమైన మనము కలియుగంలోనుండి తిరిగి ఎన్నడో గడచిపోయిన స్వర్ణయుగమనబడే కృతయుగంలోకి తొందరలోనే రాబోతూన్నాము. ఈమార్పుక్షణంలోవచ్చి మరుక్షణం లోపోయేదికాదు. మనంకృతయుగం (సత్యయుగం) చేరుకోవాలెనంటే సత్యాగ్రహమొక్కటే శరణ్యం.

అధ్యాయం ౧

"గాంధీ - ఆయన వ్యక్తిత్వము"

౧

మానవసంతానం పరిశీలించవలసిన మహోత్కృష్ట విషయం మనిషినిగూర్చినదే అయినట్లయితే తన సమకాలికులలోనేగాక పూర్వీకులలోకూడా మహాపురుషుడుగా భావింపబడుతూన్న వాని జీవిత సూక్ష్మాంశముల పరీక్ష అత్యుదాత్తమైనదిగా భావించవలసి యున్నది. సాధారణంగా మనం, మన మహాపురుషులు కర్మక్షేత్రమునుండి విరమించినంతనే వారికి దైవత్వమాపాదిస్తాము. వారిచుట్టూ ఒక అగ్రాహ్యమైన ఊహాతీతమైన తేజస్సును సృజిస్తాము; వారిని మనం అందుకోలేనంత ఉన్నతపథాలలో ఉంచుతాము. వారి యశోగీతాలు గానం చేస్తూ ఉంటాము. ఇది మనకిష్టమైనపని. గాంధీ విషయంలో ఇదంతా అన్యథా పరిణమించింది "కీర్తిపథములు కాటికే కేలుచూపు" నని కవీశ్వరుడు గీతం పాడి ఉండవచ్చును. కాని గాంధీయొక్క కీర్తిపథము లాయన జీవితంలోనే, ఆయన పేరు ప్రతిష్ఠల ననుసరించి ఆయనకు దైవికశక్తులూ అద్భుతచర్యలూ ఆపాదింపబడకపూర్వమే, ఆయన సహచరులకు ప్రత్యక్షము లైనవి. గాంధీ పూర్ణపురుషుడనని ఎన్నడూ అనలేదు. ఆయన మనుష్యులలో మనుష్యుడూ దేవతలలో దేవత.

ఆయన వ్యక్తిత్వము.

గాంధీ సామాన్య మానవుడుగా జన్మించి మహాపురుషుడైనాడు. ఆయన తన అర్థబలంవలన అనుచరులను సంపాదించుకోలేదు.

అసంగత్వంవలన సంపాదించుకొన్నాడు. కొత్త సిద్ధాంతాలను ఆచరణలో పెట్టినందువల్లనే ఆయన కనుచరవర్గం చేరింది ఆయన తాను సేవింపబడుటవలన గాక మానవసేవమూలమున మంది మనసుకు నచ్చినవాడైనాడు. ఆయనిది ప్రత్యక్షసిద్ధాంత వాదం. ఆయన జీవితం నిరాడంబరమైనది; ఆదర్శపూర్వక మైనది; ఉదాత్తమైనది; గాంధీ సేద్యగాడూ నేతగాడూను. మానవహృదయంలో తిరిగి మఱొకతూరి ప్రేమను ఆయన ప్రజ్వలింపచేశాడు; మానవ స్వాతంత్ర్యాన్ని పునఃప్రతిష్ఠితంగా చేశాడు. ఆయనబోధ మానవకృషికి మర్యాదను చేకూర్చినది. ఖండానికి ఖండానికీ, సంఘానికి సంఘానికీ, స్త్రీకీ పురుషునకూ ఉండే భేదాలన్నీ ఆయన చూపుమేరలో లేనేలేవు. కాబట్టి అవన్నీ పోయితీరాలి. అవి పోకపోతే ఆయన నిరంతరానంద మనుభవించే మహానుభావులతోకంటె కంటికీ మంటికీ ఏకధారగా కన్నీరుకార్చే కరుణామూర్తులతోనే కలసి మెలసి ఉంటాడు. "ఆయన వ్యక్తిత్వము ఇతరులపైన ప్రసరించడమే సృజనశక్తి. అది వారిదృష్టిని విశాలంచేసి సామర్థ్యమును పెంపొందిస్తుంది" అన్నాడు ప్రొఫెసరు మ్యాక్‌ముర్రే ఆయననుగూర్చి. ఆయనను ప్రజలనేకులు అనేకవిధాలుగా తలుస్తారు. అర్థంకాని మనిషిఅనీ, రాజకీయచతురుడనీ, యుద్ధాలకు వ్యతిరేకిఅనీ, ప్రజాప్రభుత్వవాదిఅనీ, సాంఘిక విప్లవకారుడనీ, అభివృద్ధినిరోధక పూర్వాచార పరాయణుడనీ, కైతవ నీతికోవిదుడనీ, అడ్డంగా ఆలోచించ్చే చపలచిత్తుడనీ, యోగిఅనీ, అడవిమనిషి అనీ, జెహోవా అనీ, జోవ్ అనీ, జీసస్ క్రైస్తుఅనీ,

మెస్సయ్య అనీ, పైగంబర్ అనీ, వలి అనీ, అందరూ తలోక విధంగానూ అంటారు. ఆయన ఏమైనా ఏమి కాకపోయినా, యుద్ధాలతోనూ రక్తపాతంతోనూ చిందరవందర అవుతూన్న రోజులలో, అంతర్జాతీయ వివాద పరిష్కారమునకూ అంతరంగిక నియతిని సంరక్షించేటందుకూ, ఆరణ్యక న్యాయమైన హింసయే ప్రయోగింప బడుతూన్న ప్రపంచంలో, ప్రజాభిప్రాయాన్ని అంతరాత్మనూ అణగద్రొక్కి ప్రభుశాసనమనే పశుబలప్రయోగం శాంతిస్థాపన పేరుతో పీఠం పెట్టుకొనిఉన్న సంఘంలో, ఆయన ప్రేమ, సేవ, త్యాగం, బాధాసహిష్ణుత మొదలగు సిద్ధాంతముల ద్వారా మానవునికి తన గొప్పతనంలో విశ్వాసం చేకూర్చి తిరిగీ అతనికి అంతరాత్మను అధిష్ఠానదేవతగా ప్రతిష్ఠించడానికి సహాయపడ్డాడు. మానవ సౌభాగ్యంకోసం ఆయనచేసిన విశాల కృషివల్లనే ఆయనను వేదాంతి అనీ, యోగి అనీ, సంఘసంస్కారి అనీ, విజ్ఞానవేత్త అనీ, ఆర్థికశాస్త్రకోవిదుడనీ, రాజకీయ ధురంధరుడనీ, ధర్మప్రతిపాదకుడనీ, పోరాటమునకు అతిరథుడనీ, ఎవరికి తోచినట్లు వారు పరిపరివిధాల చెప్పుకోవడానికి సావకాశం కలిగించి. ఆయనపద్ధతులు కొన్ని అసందర్భాలుగానూ సంబంధరహితాలుగానూ కనిపించవచ్చు. కాని కొంచెం దూరదృష్టితో చూచినా, లేదా కొంచెంకాలం వేచియున్నా, ఆయన కార్యక్రమంలోని వివిధవిషయములకుగల పరస్పర బాంధవ్యం గోచరం కాకపోదు. అప్పుడది శాస్త్రానుగుణంగా తీర్చి దిద్దబడినట్లు గ్రహించగలము.

ఆయన ఉపదేశాలు.

ఆయన ఉపదేశముల మూలమున త్రాగుబోతు మితాహారి అయినాడు. ఆయన ఆశీర్వాదమువలన వ్యభిచారిణి గృహిణిగా మారిపోయింది. ఆయన శిక్షణకింద సోమరిపోతు కష్టజీవి అయినాడు. ఆయన సర్వసంగ పరిత్యాగం పేదరికానికి పెద్దరిక మిచ్చినది; ఆయన చిన్నమాట బానిసకు మోక్షమిప్పించింది; ఆయన నిట్టూర్పుతో అచేతనముగా వ్యవహరింపబడుతూన్న స్త్రీ చైతన్యంపొంది సంఘంలో బాధ్యతగలిగిన సభ్యురాలయింది. ఆయనది సర్వమత సమన్వయం. కాని ప్రధానంగా ఆయన హిందువు. ఆయన సంఘసంస్కర్తే కాని ముఖ్యంగా పూర్వాచార పరాయణుడు. గ్రామ పునరుజ్జీవన మాయనకిష్టం. కాని తిరిగి పురాణయుగంనాటికి పోవాలని కోరడు. ఆయన గ్రామాన్ని ప్రేమిస్తాడు. పట్టణాన్ని ద్వేషించడు. ఆయన బ్రిటనుతో పోరాడినా బ్రిటిష్‌వానితో స్నేహం చేయగలడు. ఆయన పాపాన్ని నిరసిస్తాడు. కాని పాపిని ద్వేషించడు;

గాంధీ దృష్టిలో స్వేచ్ఛ అంటే దుర్బలుల సర్వస్వమూ అపహరించడానికి బలవంతులకిచ్చే పట్టాకాదు. ప్రతిపౌరుడూ బహిరంగంగా ఆలోచించుకొని ఆయన అభిప్రాయాల కనుగుణంగా ప్రవర్తించడానికి హక్కు ఉండడమే గాంధీ స్వాతంత్ర్యానికి అర్థం. అన్ని అధికారాలకువలెనే ఈ స్వాతంత్ర్యాధికారానికి కూడా కొన్ని షరతులూ మేరలూ ఉన్నవి. పక్కవాని స్వేచ్ఛకు మొదలే నీ స్వేచ్ఛకు చివర. (పక్కవాని స్వేచ్ఛకు నీ స్వేచ్ఛ అడ్డంకాకూడదు.) పక్కవాని ఈహక్కును నీవు గుర్తిం

చడమే నీధర్మాన్ని గ్రహించడం. అదే అహింసకు పునాది. అప్పుడది కేవలం నిర్మూలనశక్తి గాక నిర్మాణశక్తి కాగలదు. స్వాతంత్ర్యమనే మాటను ఈవిధంగా గ్రహించినట్లయితే రాజకీయార్థిక సాంఘిక విషయాలకు కొలతలు క్రొత్తవి కావలసివస్తవి. ఈ కొలతనుబట్టి బాహ్య పరిశుద్ధత ఒక్కటే పవిత్రతకాజాలదు. వేషమే గౌరవభాజనం కాజాలదు. ధనమువలన గౌరవంకాని పుట్టుకవలన ఉత్కృష్టత గాని కలిగినట్లు తలంపబడదు. ఆయుధబలంవలన శక్తి వస్తుందనికాని అధికారంవలన పలుకుబడి వస్తుందనికాని నమ్మము. సంఖ్యాబలమే ప్రజా ప్రభుత్వముగానూ చట్టమే న్యాయమైనట్లూ భావించము. సంస్కారమంటే విద్వత్తనిగాని, నాగరికత అంటే సంప్రదాయమనిగాని అనుకోము. వివేకమంటే కేవలం లౌకికమని మోక్షమంటే స్వర్గమని కూడా ఊహించము. మతమంటే వైదిక కర్మలనీ ప్రార్థన అంటే వట్టి మాటలనీ గ్రహించము. పాండిత్యమంటే పదాడంబరం కాదనీ భక్తి అంటే సన్న్యాసం కాదనీ తెలుసుకోగలము. నాయకత్వం వోట్లతో వచ్చేది కాదనీ గవర్నమెంటంటే నిరంకుశత్వం కాదనీ నిజం తేలుతుంది.

ఆయన తత్వం.

గాంధీ పూర్తిగా ఆధ్యాత్మిక నైతిక తత్వం కలవాడు. ఆయన ఆర్థిక సిద్ధాంతాలుకూడా ఆ తత్వము ననుసరించియే నిర్మింపబడ్డవి. ఆయన ఔదార్యమే ఆయన ఉత్కృష్టతకు కారణం. ఆయన సిద్ధాంతాలకూ ఆచరణకూ భేదం లేనందువల్లనే ఆయన ప్రభావము సర్వతోముఖమయ్యింది. ఆయనకు ప్రజాసామాన్యంలో

ఎక్కువ విశ్వాసం. కాని తన ప్రతిష్ఠకోసం వారిని వినియోగించు కోడు: వాళ్లని సేవించడమే ఆయనమతం. ఆయన న్యాయదృష్టి చట్టు సంప్రదాయాలంటే సహించదు. అది సాంఘిక నైతిక మర్యాదలమైన ఆధారపడి ఉంటుంది. ఆయనకు భారతీయ పురాతన నాగరికతమైన భక్తి. కాని ఆ పూర్వాచారములవల్ల సంకుచితహృదయుడు కాలేదు. ఆయన సంస్కారం పాండిత్యంవలన కలిగినదికాదు. పుట్టుకనుబట్టీ పరిసరములనుబట్టీ కలిగిన ఆత్మశిక్షణములవలన లభ్యమైనది. ఆయన కేవలం భౌతికదృష్టితో నడచుకొనే పిచ్చిప్రపంచంనుండి విరమించుకోడు సరిగదా వారిలో నిరుపేదవానితో కలసి వాని అభివృద్ధికోసం కృషిచేస్తాడు. ఆయన చాలా దైవభక్తి కలవాడు. అయితే ఆయనప్రార్థన త్రికాల సంధ్యావందనమూకాదు; పంచ్ నమాజ్ కాదు; ఆదివారపు పూజాకాదు; ఆయన ఆత్మనూ సత్యమునూ మాత్రమే దైవముగా భావించి, ప్రపంచాన్ని సేవించడంద్వారా ఉపాసిస్తాడు. ఇల్లిల్లూ మనిషి మనిషి దగ్గరకూ తిరిగి సంపాదించిన వోట్లమూలమున ఆయన నాయకుడుకాలేదు. ఆయన ఉపదేశాలను హృదయపూర్వకంగానూ స్వచ్ఛందంగానూ అవలంబిస్తూన్న తన అనుచరవర్గంద్వారా ఈ మానవలోకాన్ని నడుపుతూన్నాడు. ఆయన ప్రజలను త్యాగశీలురుగా నడిపినాడేకాని వెనుక ఎక్కడో ఒకమూల ఉండి సబలంగా నడుచుకోవలసిందని ఉపదేశించలేదు.

ఆయన మహాత్ముడు.

గాంధీ మహాత్ముడు. ఆయనకీపేరు అకారణంగా వచ్చినదికాదు. అది సార్థకనామం. మనకు రెండు వ్యక్తిత్వాలున్నట్లు ప్రతిరోజూ

కలిగే అనుభవమువల్ల తెలుస్తూన్నది. అవి ఉచ్చము, నీచము. అంతేకాక జాగ్రదవస్థలో ఒక వ్యక్తిత్వం స్వప్నావస్థలో మరొకవ్యక్తిత్వం కూడా ఉన్నవి. వివిధవిధములగు జాగ్రదవస్థలు గ్రంథాలలో వివరింపబడడమేకాక అనుభూతవిషయములుగాకూడా ఉన్నవి. మనము కలగని లేచినవెంటనే మెలకువలో గూడా ఆ కలలోగలిగిన భావోద్రేకాలను అనుభవిస్తూ మన మంతకుపూర్వము కన్నది కల అని గ్రహించగలుగుతూన్నాము. మనము జాగ్రదవస్థనూ స్వప్నావస్థనూ ఈవిధంగా అనుభవిస్తూన్నప్పుడు చేతనాతీతావస్థ (Super Conscious State) మఱొకటి ఉండడానికి వీలుకలదని గ్రహించవచ్చును. అది పునీతులు, స్వార్థరహితులు, విరాగులు విశ్వప్రేమగల మహానుభావుల అనుభవములో మాత్రమే కలదు. ఆ అనుభవము మహాత్ముల యొక్కయూ జీవన్ముక్తుల యొక్కయూ సొమ్ము. అందువల్ల కోట్లాది ప్రజలకు గాంధీమాట అంటే శ్రీరామాజ్ఞ. ఆయన వాణీ వ్రాతా యెంతపని చేయగలవో మౌనంకూడా అంతపని చేస్తుంది. ఆయన వాడిచూపు నీ హృదయంలోదూరి పాప పుణ్యాలను పరిశీలిస్తుంది. ఆయన ఎత్తిన చిటికినవ్రేలు సముద్ర ఘోషనుకూడా చల్లారుస్తుంది. ఆయన బోసినవ్వు తొలకరిమెఱుపు వలె మెఱసి వర్ణించరాని వెలుతురును వెదజల్లుతుంది.

ఆయన ముఖవికాసం పరిసర ప్రదేశాన్ని ప్రభావంతంగా చేస్తుంది.

ప్రపంచంలోని కాలుష్యాన్ని కడిగివేయడానికి గాంధీ భూమి పైకి దిగిన అవతారపురుషులలో ఒకడు. వారు భూమండలానికి

శిక్షకులుగానూ రక్షకులుగానూ కూడా వస్తారు. వారు తమ పరిసరములలోని పరిస్థితుల కత్యంత సన్నిహితులుగానుండి అక్కడి జనసామాన్యంతో కలిసిమెలిసి పనిచేస్తూ వారి నిర్ణీతకార్యమును ముగించుకొని, యెక్కడనుండి శిష్టరక్షణమూ దుష్టశిక్షణమూ చేయడానికి ఇహలోకానికి వచ్చారో తిరిగి ఆ శాశ్వతలోకానికి చేరుకొంటారు.

౨

కాలమే మహాపురుషుల జన్మకారణమనేమాట కేవలం స్వభావోక్తి. 19 వ శతాబ్దపు మొదటి పాతికసంవత్సరాలలో కలిగిన ప్రాచ్య పాశ్చాత్య నాగరికతల కలయికయే శ్రీ రాజా రామమోహన్న రాయలవారి మతసిద్ధాంతాలకూ, వారి సంస్కృతికీ, మహత్కార్యములకూ కారణభూతమయినది. ఆయన మరణించిన మఱియొక అర్ధశతాబ్దమునకు భారత జాతీయతకూ లోకసంస్కృతికీ ప్రవక్తయైన మఱియొక మహాపురుషుడు జన్మించినాడు. ఆయన భావాలు దక్షిణ ఆఫ్రికా యుద్ధమువలననూ, 1914-1918 లలో జరిగిన ఐరోపా మహాసంగ్రామము వలననూ ఘనీభూతములయి యుంటవి. ప్రెసిడెంటు విల్సను నూతన ప్రపంచాన్నిగూర్చి కలలుకన్నాడు. టాల్స్టాయి, క్రొపోట్కినులు ఆ విషయంలో చాలావ్రాశారు. ఘోరకృత్యాలను చూస్తే మానవస్వభావం తిరుగుబాటు చేసేమాట నిజమేగాని తరువాత వాటిని త్వరలోనే మఱచిపోతుంది. మఱచిపోవడమేకాదు; తిరిగి ఆ పనిలోకే దిగుతుందికూడా ఒక్కొక్కప్పుడు. గాంధీమాత్రం ఈ సందర్భంలో తన కాలిక్రింద గరిక మొలవనీయలేదు. ప్రత్యుతముగా తామనుభ

వించిన దానినిబట్టి, తాము కళ్ళారా కనిన దానినిబట్టి, మానవ లోకం గుణపాఠం నేర్చుకొనేటట్టు చేయడమే ఆయన జీవితాదర్శము.

తన చుట్టూఉన్న పరిస్థితుల ననుసరించి మనిషిశీలం ఉంటుంది. శీలం అనగా రోడ్డుమీద పడిఉన్న నగను పోలీసువారి స్వాధీనం చేయడంకానీ, దోవలో తేలుకనిపిస్తే దానిని చంపకుండా తొలగి పోవడంకానీ, రోడ్డుమీద బాధపడుతూన్న జంతువుకో మనిషికో సహాయం చేయడంగానీ మాత్రమేకాదు. శీలమనేమాటకు అంతం గానీ అవధిగానీ లేదు. అది వయస్సుతో పెరుగుతుంది; అనుభవంతో మెరుగెక్కుతుంది; లోహాలకు కొన్నివస్తువులతో కలిగిన సంపర్కంవల్ల తుప్పుపట్టినట్టుగానే మనిషి శీలంకూడా కళంకితం కావడానికి సావకాశమున్నది. కాబట్టి మానవుడా పరిసరాలకు దూరంగా ఉండాలి. లేదా వినాశ హేతుభూతములైన ఆ పరిస్థితుల అవగుణాలు తనపైన ప్రసరించకుండా నిరోధించగలిగి ఉండాలి. శీలం పరిస్థితులకు అతీతంగా ఉండడానికి నిరంతరమూ ప్రయత్నించాలి.

సంఘ వ్యవస్థ.

మన జీవితంలో తటస్థించే అనుకూల ప్రతికూల పరివర్తనముల పర్యవసానమే మానవ ప్రవర్తనమునకు లేక సంఘవ్యవస్థకు మూలము. మనమూ పరిణామాలకు కేంద్రస్థానమువంటివాళ్ళము. లేదా త్రాసుముల్లు మొన వంటివాళ్ళము. ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క విషయాన్ని నొక్కిచెప్పడమే ఒక కొత్త మతం. అనగా మానవవ్యవస్థ అనే త్రాసుముల్లు మొనను. ఒక వైపునుండి మరి

యొక్క వైఫల్యకు మొగ్గేటట్లుగా చేయ ప్రయత్నించడ మన్న మాట. కొన్ని ప్రత్యేకాదర్శములతో ప్రారంభమైన ఉద్యమాలు వివిధ మతములుగా పరిణమించవచ్చును. అసత్యాన్ని నశింపచేసి సత్యమునూ, మృత్యువును రూపుమాపి ప్రాణమునూ, చీకటిని పోగొట్టి వెలుతురునూ రప్పించవలెనంటే రైలుపట్టాలవంటి దోవ పనికిరాదు. రోడ్డుమీద మెలికలు తిరిగిపోయే మోటారుదారివలె ఉండవలసివస్తుంది. అందువల్లనే నిర్మాణంలోగాని, కార్యవిధానంలోగాని, ఎంత సన్నిహిత సంబంధం కలిగిన మతమైనా, కొద్దిరోజులలోనే అభిప్రాయభేదాలకు తావలమై పక్షాలుగా చీలిపోవడానికి వీలు కలుగుతూన్నది. ఆ పక్షాలలో కొందఱు మొదటిసిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారు. మఱికొందరు వాటికి చాలా దూరంగా ఉంటారు. ఇందుకుదాహరణం లెనిన్, ట్రాట్స్కీ—స్టాలినులు. ప్రథమంలో మన కౌన్సిళ్ళ, కాలేజీల, కోర్టుల బహిష్కరణమూ, తరువాత కౌన్సిళ్ళ ప్రవేశము, మంత్రిత్వ స్వీకణమూ, రాజీనామాలనూ కూడా ఇందుకు తార్కాణంగా చెప్పవచ్చును. ఈ సందర్భంలో కౌంట్ హర్మన్ కీసర్‌లింగ్ ఇలా అన్నాడు.

"ప్రత్యేక ఉద్యమాలకు సంబంధించిన ప్రత్యేకాభిప్రాయాలను లెక్కలోకి తీసుకోకూడదు. అవి సాధారణంగా అపార్థాలకు ఆస్పదాలుగా ఉంటవి. ముఖ్యంగా ప్రతిఉద్యమంలోనూ దానిపేరుకు మించిన ఉద్దేశాలూ విషయాలూ ఇమిడిఉంటవి. నామరూపాలకూ వాటివెనుకనున్న నిజమైన శక్తికీ ఏమీ సంబంధంలేదని కాలక్రమేణా తెలిసిపోతుంది. ఇది చరిత్ర చెప్తూన్న విషయం. ఒక ప్రత్యేకాదర్శముతో ప్రారంభ

మైన ఉద్యమం కొంతకాలంలో దానికి భిన్నమైనదిగా పరిణమించడం నిత్యమూ జరుగుతూనే ఉన్నది. కాబట్టి ప్రపంచోద్యమాలను గురించి నేడు చలామణిలో ఉన్న యే పేరునూగూడా సరియైన పేరుగా నే నెంతమాత్రమూ విశ్వసించను. ప్రజా పరిపాలనకోసమో, సోషలిజం కోసమో, స్వాతంత్ర్యంకోసమో, నాస్తికత్వముకోసమో పోరాడుతూ న్నామని నటించే ప్రపంచంలోని యే జాతికూడా తానను కొన్నది పైకి చెప్పడంలేదు. నిజానికి వాళ్ళ పరమావధి యేమిటో వాళ్ళకే తెలి యక చీకట్లో తడువుకొంటూన్నారు. వారి ఆదర్శములిప్పుడే మొల కెత్తుతూన్నవి. అవి కొంచెం పెరిగి మారాకు దొడిగినప్పుడుగాని వాటిని గుర్తుపట్టడం కష్టం. మనకాలంలోని ఈ మానవులు పోరాడుతూన్న యే ఒక్క ఆదర్శమూకూడా చివరకు విజయంపొందడం కష్టం. ఎందు వల్లనంటే నేటి మానవప్రపంచం పరస్పర మహాసంఘట్టనముల కాక రములయిన భీషణశక్తులకు కేంద్రములుగా విభజింపబడి •యున్నది. ఈ తరుణం కడచినపిమ్మట మిగిలిఉన్న వివిధ సిద్ధాంత సమ్మేళనమే- అటువంటి సమ్మేళనం కలగడం చాలాకష్టమే- పర్యవసానానికి ఇతర మైన యే ఒక్క సిద్ధాంతంకంటెనూకూడా మేలుగా ఒడిదుడుకులు లేని ప్రపంచనియతికి కారణం కాగలదు.

3

గాంధీ తత్వజ్ఞానియా లేక అజ్ఞేయవాదియా అనిగానీ, ఆయన దేవుడు రూపం కలవాడా లేక భావకల్పితుడా అనిగానీ, ఆయ నకు వ్యష్టిప్రార్థనలలో విశ్వాసమా లేక సమష్టిప్రార్థనలలో నమ్మకమా అనిగానీ, ఆయనమతం భక్తిజ్ఞానమూలమా లేక కర్మమూలమా అనిగానీ, యెవ్వరూ ప్రశ్నించనక్కరలేదు. ఆయనజ్ఞానం భక్తిగా పరిణామంపొందింది. ఆయనభక్తి కర్మగా

ఘనీభవించింది. ఈ సమన్వయమే గాంధీ లక్షణానికి సహజత్వం కల్పించి దానిని అత్యంతాదరపాత్రంగా చేసింది.

ఈ విషయంలో జాన్ మార్లే ఇలా అన్నాడు:

"మానవ స్వభావముయొక్క విజ్ఞాన నైతిక లౌకిక భాగముల సమన్వయమును-బుద్ధి, ప్రేమ, ఇచ్ఛ ఈ మూడింటియొక్క అచంచల సహకారమును-సూచిస్తుందది. ప్రేమకు విరుద్ధమైన పనిని దేనినీ బుద్ధి సూచించదు. అది కావలెనన్న యేపనినీ బుద్ధి కాదనదు. ఇచ్ఛ తక్కిన రెండుశక్తుల సమష్టి కోరికలను మన్నిస్తూంటుంది.

గాంధీకి దాపరికమనేది లేదు. ఆయనచేసే ప్రతిపనిలోనూ ఆయనఆడే ప్రతిమాటలోనూ, ఆయనమతం ప్రతిఫలిస్తూంటుంది. ఆయన తన మతమని దేనినీ, యెక్కడా వేదంవలె, కొరాన్‌వలె, వ్రాసిపెట్టలేదు. కాని ఆయన ఉపదేశం ఆయన సమకాలికులకే కాక భావి సంతానానికికూడా అందుబాటులో ఉన్నది. ఆ స్థితిని త్యజించిన జితేంద్రియుడు, బాహ్యాశత్రువులనేకాక అంతశ్శత్రువులనుకూడా జయించినట్లే. జితేంద్రియునకు కోరికఉండదు. కోరికలేనివానికి భయముకూడా ఉండదు. కోరిక - భయమూ ఈ రెండూ ఇంద్రియవికారమనే బొమ్మకు రెండువైపులు. గాంధీ ఇతరులకోసం జీవిస్తున్నాడు. సంఘం గాంధీకి కోవెల. సేవ ఆయన పూజావిధానం. మానవసంతానంపైననే ఆయన ఉత్కంఠ. ఆయనదైవం సత్యమొక్కటే. అహింసద్వారానే దానిని చేరనిచ్ఛగించును. ఆయన ప్రార్థన లోకంలోని ప్రాణులతో భిన్నముకాని విశ్వాత్మకు.

గాంధీ మతమంటే కొన్ని సూత్రాలూ, సిద్ధాంతాలూ, నియమాలూ, మర్యాదలూ, విధులూ, నిషేధాలూ కాదు. అది ఒక జీవిత విధానం. అది మన జీవితసమస్యలకు కొత్త దృక్పథాన్ని సూచిస్తుంది; లేదా పాత వైఖరినే పునరుద్ఘాటిస్తుంది; అంతేకాదు "ఆధునికసమస్యలకు సనాతన పరిష్కారములను తెలియజేస్తుంది."

సర్ రాధాకృష్ణ ఈ సందర్భంలో ఇలా వ్రాస్తున్నారు:

"జాతీయ స్థైర్యమునకూ ప్రపంచవ్యవస్థకూ కూడా నూతనజీవిత విధానమొకటి మూలము కావాలి. అది అన్నితరగతుల, అన్నిజాతుల, అన్నిదేశముల ప్రజల ప్రయోజనములనూ కాపాడగలిగి ఉండాలి. ఎవరైతే స్వార్థమనే అవిద్యాంధకారమునుండితప్పించుకొని బయటపడ్డారో, వారే ప్రపంచశాంతికోసం పాటుపడి దానిని స్థాపించగలవారు. ప్రపంచశాంతి అంటే మానవకోటియొక్క జీవితంలోనూ, ప్రవర్తనలోనూ, కొన్ని సార్వలౌకికసిద్ధాంతాలూ, ఆదర్శాలూ రూపం దాల్చడమే. అందుకోసం నీతిని వికృతముచేయని, మానవజీవితమును వినాశనము చేయని, ఆయుధములద్వారా మనము పోరాడాలి. ఈ ప్రయత్నంలో మనకెట్టి కష్టనష్టాలు తటస్థించినా, మనము ఓర్చుకోడానికి సంసిద్ధంగా ఉండాలి."

అయితే మనమిక గాంధీ తత్వాన్ని పరిశీలించాలంటే ఏమి చేయాలి? గాంధీ జీవితమును, ఆయన మహాత్కార్యములనూ, ఆయన సంశయములనూ, చిక్కులనూ, దృక్పథమునూ అర్థంచేసుకోవడమే ఆయన తత్వాన్ని పరిశీలించడం. "శాఠ్యేన శఠం జయేత్" చెడుగును చెడుగువలననే జయించవలెననడం తగదు. "చెడుగును మంచిచే జయించాలి." నీకపకారం చేసినవారికి ఉపకారం చెయ్యి. నిన్ను తప్పుపట్టేవారెవరూ లేరని ఇతరులను

తప్పిపట్టుకో. నిన్ను అవమానం చేసినవారిని మన్నించు.” అని క్రీస్తు సందేశం. మన ఇతిహాసాలు కూడా ఈవిషయంలో ఇంత గట్టిగానూ చెప్పినయి చూడండి “నీకుజరిగిన అపకారానికి ప్రత్యపకారం చేయకూడదు. కాని ఆ అపకారియెడల ఎప్పుడూ మంచిగా, దయగా ప్రవర్తించాలి. ఎందుకంటావా, ఎవరికైనా ఏదైనా అపకారం చేయతలచుకొన్న దుర్మార్గుడు తనంతట తానే నాశనమైపోతాడు. ♦

ఈ ప్రధానసూత్రాలు హిందువులకూ క్రైస్తవులకూ కూడా దేశకాల పాత్రావస్థలతో నిమిత్తం లేకుండా సమంగా వర్తిస్తవి. గాంధీజీ మాటలూ చేతలూ, ఆయన ఇతరుల మాటలనూ చేతలనూగూర్చి చేసిన విమర్శలూ, ఈ అన్నీ గాంధీ తత్వాన్ని పరిశీలించడానికి మార్గదర్శకాలు.

> “ఈ మతాలన్నీ తమ తీవ్రవాదాన్ని తగ్గించుకొని, కొంచెం నిజమైన మత తత్వాన్ని, కొన్ని ఆధ్యాత్మికసిద్ధాంతాలతో చేర్చుకొన్నట్లయితే, పరస్పర ప్రేమాలింగనం చేసుకొని ఉండేవి. ఈ మతసిద్ధాంతా లన్నింటిలోనూ, ఉంచుకోదగిన మహత్తర విషయాలూ ఉన్నవి, తీసివేయదగిన మహాపరాధ విషయాలూ ఉన్నవి.”

౪

ఇంతవరకు మనము గాంధీని స్థూలంగా ఆలోచించాము. ఇప్పుడిక గాంధీ తత్వమును సూక్ష్మంగా పరిశీలించాలి. ఇజం అంటే పేరు. కాబట్టి గాంధీజం అనగా గాంధీపేరు అన్నమాట.

♦ మహాభారతం, వనపర్వం 206-42, 3

గాంధీ, ఆయన పేరూ, కొన్ని ప్రధాన సూత్రాలకూ విధానాలకూ సంబంధించి ఉండకపోతే వాని ప్రయోజనమే లేదు. గాంధీ తత్వశాస్త్రం అంటే, ఆ ఉపదేశాలూ విధానాలే. అదే గాంధీ జీవితాన్ని ప్రవర్తననూ తీర్చిదిద్దింది. అదే ఆయన సుభాషితాలకూ ఉపదేశాలకూ, మహాత్కార్యాలకూ కారణభూతమౌతుంది.

గాంధీజం అనేమాట దాదాపు అందరికీ సుపరిచితమైనదే. ఈ మాటను గాంధీ మొదటిసారి, గాంధీ-ఇర్విన్ ఒడంబడిక జరిగినపిదప, కరాచీలో కాంగ్రెసు జరిగేముందు ఒక బహిరంగ సభలో ఉపయోగించాడు. "గాంధీ మరణించవచ్చును కాని గాంధీజం మాత్రం శాశ్వతంగా ఉంటుంది" అన్నాడు. ఈ మాటను బహుశా, ఆయన అప్పటికప్పుడే సత్యాహింసల మూలమైన తన సిద్ధాంతమంతకూ సూత్రప్రాయమగు సంగ్రహనామంగా కల్పించి ఉంటాడు.

1936 మార్చిలో సవోలీలో గాంధీ సేవాసంఘ సభ్యులకు గాంధీయే ఈ విధంగా చెప్పినాడు.

"'గాంధీమతో' మన్నేది (Gandhism) ఎక్కడా లేదు. నా అనంతరం అటువంటి మతస్థులు ఉండవలెనని కూడా నేనుకోరను. నేనొక కొత్త సిద్ధాంతాన్నో మతాన్నో స్వయంగా సృష్టించినట్లుగా చెప్పుకోవడం లేదు. మన నిత్యజీవితంలోని సమస్యలకు శాశ్వతసత్యములను అనువర్తింపచేయడానికి మాత్రమే నేను ప్రయత్నించాను ... నా అభిప్రాయాలు కానీ, నా నిర్ణయాలు కానీ, మారవడానికి వీలు లేదు. రేపు వాటిని నేను మార్చుకోవచ్చును. నేను ప్రపంచాని కుపదేశించవలసిన కొత్త సంగతి యేమీ లేదు. సత్యాహింసలు కొండలు పుట్టిననాడు పుట్టినవి. నా సాధ్య-

మైనంత పెద్ద యెత్తులో వాటిని ప్రయోగించి చూడడమే నేను చేసిన దంతా. ఈ నా ప్రయోగాలలో నేను కొన్నిసార్లు పొరపాటు చేశాను. ఆ పొరపాట్ల మూలాన నేను చాలా నేర్చుకొన్నాను. సత్యాహింసలను ఆచరణలో పెట్టడంలో జీవితమూ అందుకు సంబంధించిన సమస్యలూ నాకు పరీక్షలుగా పరిణమించినవి. స్వతస్సిద్ధంగా నేను సత్యవాదినే కాని హింసా తత్పరుడను కాను. నిజానికి నా సత్యాన్వేషణ ప్రయత్నంలో నేను అహింసను తెలుసుకోగలిగినాను... నేను చెప్పినదాని లోనే నా సిద్ధాంతమంతా—ఈ పెద్దపేరే ఉండనీయండి-ఇమిడిఉంది. దానిని గాంధీ మతమని పిలవకండి! దానిలో మతమేమీ లేదు."

గాంధీ సిద్ధాంత ధోరణులను తెలుసుకోవలెనని కోరేవారు, గాంధీ సేవా సంఘాధ్యక్షులు శ్రీ కిశోరీలాల్ మశ్రూవాలా, దేశ స్వాతంత్ర్యవాంఛ కలవారంతా అవలంబించవలసినదని సంగ్రహంగానూ సమగ్రంగానూ వర్ణించిన, ఈ క్రింది ముఖ్యసిద్ధాంతాలను గమనింపవలెను.

౧ జీవితమును సేవకొఱకు అర్పించడం,

౨ మంచిప్రవర్తనా ఆదర్శమూ కలిగిఉండడం,

౩ ఆత్మనిగ్రహమూ, నియతీ కలిగిఉండడం. వ్యర్థ కాలక్షేపమునకూ భోగపరాయణతకూ విముఖుడుగా ఉండడం.

౪ అత్యంత నిరాడంబరత్వమూ, పేదరికమూ, కష్టసహిష్ణుతా కలిగి ఉండడం.

గాంధీ యెప్పుడూ తాను గురుపీఠంలో కూర్చొని శిష్యులకు బోధించలేదు. "నాకు శిష్యులు లేరు. నేనే శిష్యుణ్నిగా ఉండగోరి గురువుకోసం వెతుక్కొంటూన్నాను" అన్నాడు. కాని య్యేగొప్ప

ప్రవక్తా తాను గురువునని చెప్పుకోలేదు. గాంధీ తాను చెప్పుకొన్నా, చెప్పుకోకపోయినా, ఆయన నూతన ప్రపంచవ్యవస్థకు మూలపురుషుడనేమాట కాదనడానికి వీలులేదు. గాంధీ, గాంధీ సిద్ధాంతమూ, మానవాభ్యుదయమునకు అనంతశక్తిని ప్రసాదించిన సంగతి ప్రపంచం విస్మరింపజాలదు.

గాంధీమహోపదేశాలన్నీ సత్యాహింసలకు సంబంధించినవే. "దౌర్జన్యం చేయడానికి తగినంత కోపకారణం కలిగినప్పుడుకూడా, మనసా వాచా కర్మణా హింస లేకుండా ఉండడమే అహింసకు ఒరిపిడి రాయి. మంచితనమూ మార్దవమూ కలచోట సౌమ్యంగా ఉండడం గొప్పతనంకాదు. ప్రపంచంలో ఏటువంటి వ్యామోహాన్నయినాసరే నిగ్రహించగల మహత్తమశక్తి కలది అహింస. జీసస్ క్రీస్తు విశ్వాసఘాతుకులను ఎఱుగును. వారికీపేరు పెట్టడంలోకూడా ఆయన ఏమీ సందేహించలేదు. కాని ఆయన దేవునియెదుట, వారియెడల దయచూపుమని కోరినాడు. 'వారు చేస్తూండిన పని వారు తెలుసుకోలే' దన్నాడు. నేనుచెప్పిన ప్రతిమాటకూ తగిన ఉదాహరణాలను చూపించాను. నేను క్రైస్తవమత ప్రచారకులకు మిత్రుణ్నిగా భావిస్తూన్నాను. వారిలో అనేకులతో నాకుసంతోషకరములైన సంబంధాలున్నవి. కాని నామిత్రత్వము, నా స్నేహితుల పరిమితులనుకానీ, వారు ప్రోత్సాహపరిచే పద్ధతులనూ, సంస్థలనుకానీ తెలుసుకోజాలనిది కాదు. ఔచిత్యమును గూర్చిన తప్పు అభిప్రాయాలవల్లా, ఇతరుల మనస్సులను నొప్పిస్తామేమోననే భయంవల్లా, తఱచుగా చాలామంది వారిభావమును విప్పిచెప్పక తుట్టతుదకు కాపట్యమునకుకూడా గురి అవుతున్నారు. కాని వ్యక్తులలోగాని, సంఘాలలోగాని, జాతులలోగాని, అహింసాభావం అభివృద్ధి పొందవలెనంటే, తాత్కాలికంగా ఎంత అప్రియంగానూ కఠినంగానూ కనిపిం

చినా, సత్యమే చెప్పితీరాలి. అహింసా భావంలేని అహింసాకర్మ, నిష్ప్రయోజనం. అది ఎప్పుడూ వ్యాపకంకాదు. మాటలకంటెనూ క్రియలకంటెనూ కూడా, భావానికి ఎంతో ఎక్కువశక్తి ఉందని మనకు తెలియనే తెలియదు. భావము, పలుకు, పని, ఈ మూటినీ పోల్చిచూస్తే మొదటిదానికి పరిమితిలేదనీ తక్కిన రెంటికీ పరిమితి ఉందనీ తెలుస్తుంది. నేను 'భావము' అన్నప్పుడు పలుకులోకీ పనిలోకీ మారనున్న సజీవ భావమని మాత్రమే అర్థం చేసుకోవలెనని వేరుగా చెప్పనక్కరలేదు. శక్తిలేని ఊహలు గాలిలో మేడలు. వట్టి పొగ."—గాంధీ.

సర్వమత సమన్వయం

అన్నిమతాలూ పరస్పర వైషమ్యాలతో మనిషినీ మనిషిని, జాతినీ జాతిని, వేరుచేస్తున్న సమయంలో గాంధీజం, యాదృచ్ఛికంగా వాటిలో తటస్థించే ఆ పోరాటాలను సమన్వయం చేయడానికి సహాయపడుతూ, సోషలిజం, కమ్యూనిజం, ఫాసిజం, యూనివర్సలిజములలోని ముఖ్యసూత్రాలకు సమాధానం కుదర్చడానికి ప్రయత్నించిందని మా అభిప్రాయం. ఈ సమాధాన ప్రయత్నంలో గాంధీ ఇరవైయేండ్లు సాచివ్యం వహించి, శ్లాఘింపదగిన ఫలితములను పొందినాడు. ఏమత ప్రవక్తగానీ, యే తత్వవేత్తగానీ ఇంతకుముందు తాను జీవించియుండగానే, తనకళ్ళ యెదుట, గాంధీ గడించినంతమంది అనుచరవర్గాన్ని గడించి యుండలేదు. ఈమతాలనూ ఈసిద్ధాంతాలనూ, మేము స్థూలంగా ప్రాచ్య పాశ్చాత్య మతములనిగానీ, ఆధునిక సనాతన మతములనిగానీ వ్యవహరిస్తూంటాము.

కాని అవి సాధారణముగా రెంటి మిశ్రమముగానూ ఉంటవి. కేవలం యే ఒకటో అయియుండదు. ప్రతి నూతనసిద్ధాంతమూ కూడ పూర్వుల అడుగుజాడలను కొంతవరకైనా అనుసరించడం చేత, ఆకలయిక తప్పనిసరి అవుతుంది. మఱొకమాటలో చెప్ప వలెనంటే ప్రతిసిద్ధాంతానికీ ఒక కేంద్రమూ, ఒక కైవారమూ ఉంటుంది. ఆలాగే గాంధీసిద్ధాంతానికికూడా. ఆయన కేంద్రము భారతీయము. ఆయన కైవారం పాశ్చాత్యము లేక సార్వలౌకికము. గాంధీజం కొత్త మతంకాదు. హిందూ ధర్మమునకు ప్రధానములైన ఆధ్యాత్మిక, నైతిక సూత్రముల కనుగుణముగా శతాబ్దాలకిందట రూపందాల్చిన ఆర్థిక, సాంఘిక నిర్మాణమే అది. దాని సంపూర్ణ స్వరూపాన్ని, ఆధునిక పరిస్థితులలో అది పనిచేసే విధానాన్ని తిరిగీ ఆయన దివ్యదృష్టితో చూచినట్లు చూడగలిగినాడు. గాంధీజం కొత్తది కాకపోవచ్చును, కాని మౌలికం. మౌలికమంటే లేనిది సృష్టించడంకానీ, ఉన్నది కను కోవడంకానీ. కనుక గాంధీజం మౌలికమని అంటున్నాము. అనగా కొత్త భావాన్ని వ్యాపకం చేయడంకానీ, లేదా పాత భావాన్నే కొత్తరూపంలో చెప్పడంకానీ అవుతుంది. మితపానాన్ని, మద్య నిషేధాన్ని బోధించినవారనేకమంది ఉన్నారు. స్వదేశీవస్తు స్వీకరణము విదేశవస్తు బహిష్కరణమునుగూర్చి కూడా చాలామంది ఉపదేశించారు. "తిరిగీ భూమి దున్నుకోండి" అనీ "గ్రామాలకు పొండి" అనీ చెప్పిన నాయకులు వందలాది కలరు. కులవైషమ్యాలనూ, సాంఘిక పోరాటాలనూ, అంటరానితనమునూ నిరసించిన మతప్రచారకులసంఖ్యాకులు. కాని

భారతజాతీయ సౌధనిర్మాణాన్ని సంపూర్ణంగా ఈయనవలె మనోనేత్రంతో చిత్రించుకొని చూచిన శిల్పిమాత్ర మెక్కడా లేడు. ఈయన జ్ఞానచక్షువులో ప్రతిఫలించిన జాతీయ భవనములో సమస్తమానవకోటికీ మతి తగ్గించడానికి వీలులేని సమాన హక్కులూ, సమానావకాశాలూ, సమానస్థానమూ, సమాన స్థితీ యేర్పాటు చేయబడ్డది. దానికి పునాది భారతీయగ్రామం. అది స్వయంశక్తీ, స్వయంసంపూర్ణతా, స్వయంప్రతిభా కలిగి, పరస్పర భ్రాతృభావంతో, ప్రశాంతంగా జీవించే ప్రజలతో నిండి ఉంటుంది. యేసుక్రీస్తు మహానుభావుని సుభాషితాలు బైబిలులో ఉన్నవి. అవి వారం వారం ప్రపంచంలోని క్రైస్తవు లందరికీ ఉపదేశింప బడుతూనే ఉన్నవి. కాని ఆ క్రైస్తవజాతులే నేడు ఆధునిక విజ్ఞాన శాస్త్రము కనిపెట్టగలిగిన మారణయంత్ర సాధనములతో పరస్పర హత్యాకాండకు దిగి, తమ కోసం పరాయిదేశముల నాక్రమించుకొంటూ, తక్కిన ప్రజలను పసులు చేయుస్తూన్నారు. మతమంటే ఆదివారపు ఆర్భాటం కాదనీ, అది ప్రతిక్షణమూ మానవుని ప్రతిపనికీ మార్గదర్శకంగా ఉండి, ఆతని తత్వంలో ఇమిడిపోవాలనీ ఉపదేశించడం గాంధీ పని అయింది.

స్వదేశీ, వంగరాష్ట్ర విభజనకు ప్రతిక్రియగా ప్రబోధింపబడ్డప్పుడు, మాతృదేశ ప్రేమా విదేశీయులయెడ ద్వేషమూ ఆ ఉద్యమానికి పునాదులయినవి. కాని దానివలన మాతృదేశస్వరూపం సరిగా ప్రస్ఫుటం కాలేదు. ఆంగ్ల విద్యాధికులు ప్రజాసామాన్యంతో కలసి మెలసి ఉండడమనేది అప్పుడూహింపబడ్డ లేదు.

అనగా పట్టణాలు, గ్రామ సౌభాగ్యంకోసం పాటుపడే ప్రణాళిక వారిదృష్టిలో లేదు. స్వదేశీ సిద్ధాంతప్రకారం నేతగానికి లాభం చేకూరిందికాని, వడికే మనిషినిగూర్చి ఆలోచనే లేకపోయింది. చేతిపరిశ్రమను అభివృద్ధి చేయడానికి ప్రయత్నం జరిగినా, పనిబాగులవాండ్ల పనితనమునూ, పరికరములనూ భగ్నంచేయ పూనుకొన్న యంత్రముల దౌష్ట్యమునకు ప్రతిక్రియ యేమీ చేయబడలేదు. పైపెచ్చు గ్రామప్రజల అవసరాలకు భిన్నంగా కూడా అది కొనసాగింది. బ్రిటనుతో మనకుగల విరోధము బ్రిటిషు వస్తువుల బహిష్కరణముగూర్చి ఎలుగెత్తి చాటడంతో బాగా వెల్లడిఅయింది. అందువల్ల బ్రిటనుకు ఆర్థికంగా నష్టము కలిగింది. బ్రిటనుపైన ద్వేషం పుట్టించడం వరకే మనకుకలిగిన లాభం. కాబట్టి స్వదేశీ ఆందోళనలో నిర్మాణశక్తికంటె నిర్మూలనశక్తి యెక్కువ ప్రస్ఫుటంగా కనిపించింది. తరతరాలనాటి సిద్ధాంతాలతోనూ, సంప్రదాయాలతోనూ పునర్నిర్మితములైన నిజాదర్శములుగల జాతి అప్పటిప్రజల దృష్టిలో లేనేలేదు. వంగరాష్ట్ర విభజనాందోళనము ప్రారంభమయిన తరువాతకూడా ప్రజలలో ఉత్తమోత్తములయినవారు పాశ్చాత్య విజ్ఞాన వ్యామోహితులై బహిరంగంగా చెప్పకపోయినా, రహస్యంగానైనా మనస్సులో విదేశీయుల ఆశ్రయంకింద ఉద్యోగాలూ బిరుదులూ సంపాదించవలెననే కోరికతో ఉండేవారు. కాబట్టి గాంధీ 1915 లో ఇండియాకు వచ్చేసరికి ఇండియాప్రజలూ కాంగ్రెసువాదులూ కూడా రెండుపక్షాలుగా విడి ఉన్నారు. గోక్లే నాయకత్వంకింద బ్రిటిష్ రాజభక్తులూ, తిలక్ నాయకత్వంకింద

"ప్రభువుపైనా, ప్రజలపైనా కూడా అభిమానంగా ఉండే వారూ" పనిచేస్తూన్నారు. ఈ రెండూకాక, బసెంటు ప్రేరేపణతో బ్రిటిషు సామ్రాజ్యాధికారానికి లోబడి ఇండియా స్వతంత్రం కావాలనే మఱియొక పక్షంబయలుదేరింది. వీరెవ్వరూ కూడా పాతవడ్డ బ్రిటిష్ పారతంత్ర్యాన్ని మూలముట్టుగా నిర్మూలంచేసి, ప్రతివానికీ చాలినంత అన్నం, వస్త్రం, ఇల్లూ లభించేటట్టు ప్రాచ్యదేశీయ భావానుగుణమైన నూతన సాంఘిక ఆర్థిక నిర్మాణం చేయాలని ఎక్కడా చెప్పిఉండలేదు. నాటి విద్యాధికులకీ భావం కొత్త. వారిఘనత ఎంతవరకూ పరీక్షలలో ఉత్తీర్ణత పొందడంమీద ఉండేది. వారిదృష్టిలో సంస్కారమంటే యూనివర్సిటీ డిగ్రీ. ఆధిక్యత అంటే గవర్నమెంటు ఉద్యోగాలూ, బాగా డబ్బు సంపాదించే వృత్తులూ, ప్రభుత్వాశయంవల్ల లభించే గౌరవపదవులూ, రాజభక్తి చిహ్నంగా ఆరోపింపబడిన బిరుదులూ అలంకారాలూను. ఇటువంటిస్థితిలో మన సమస్యలను నూతన దృక్పథంతో పరిశీలన చేసినవాడు గాంధీ.

పెన్సిల్వేనియన్ విశ్వవిద్యాలయోపన్యాసకుడు అమెరికన్ జీవితాన్ని వ్యాఖ్యానం చేసినట్లుగా) గాంధీ మానవజీవితముయొక్క ఈ నూతన కథనాన్ని ఈ విధంగా వ్యాఖ్యానిస్తూన్నాడు.

"మానవజీవితము ఉత్తేజకరమైన ఒక గీతమువంటిది కాదు, ఒక దార్శనిక మహాకావ్యం వంటిదీ కాదు. సర్వతోముఖమైన స్వార్థానికీ, ఒక న్యాయం కోసమో ఒక సముద్యమంకోసమో ఒక ఆదర్శంకోసమో నిలబడి ఉండవలెననే కోరికకూ, మానవ హృదయములో నిరంతరమూ నడిచే

సంగ్రామ నాటకమే అది. అనేకమంది, ఆదర్శాలకాలం అంతరించిందనీ, నైతికసిద్ధాంతాలను నెమ్మదిగా జారవిడిచి, వివిధవిధానాలూ మన స్వప్రయోజనాల కేవిధంగా ఉపకరిస్తవో జాగ్రత్తగా చూచుకొంటూ, అవసరాల కనుగుణంగా ప్రవర్తించవలసిన తరుణ మాసన్నమైనదనీ, చెప్పితే చెప్పుదురుగాక. మానవహక్కులనేవి కావ్య కల్పితములనీ, మన వ్యక్తిసౌఖ్యమూ, సౌభాగ్యమూ చేకూర్చని ప్రజాపాలనములో మనకు అభిమానపాత్రమైన దేదీ లేదనీ, తనపక్షంతో కలసి వోటుచేసి తనకో, తనవారికో యేదో ఒకఉద్యోగం సంపాదించుకోవడమే, పౌరుని పరమ ధర్మమనీ చెప్పేవారుకూడా ఉంటే ఉండవచ్చును. ధనం సంపాదించడమే పరమావధి అనీ, ధనముంటే అన్ని మంచిపనులనూ చేయవచ్చుననీ కూడా కొందరనవచ్చును. 'మనము భాగస్వాములుగా నున్న పరిశ్రమలనుకానీ, వ్యాపారాన్నికానీ, కంపెనీనికానీ పెంపొందించడమే మనం చేయవలసినపని. ప్రపంచంలో బలవత్తముడే బ్రతుకతగినవాడనే న్యాయాన్ని వ్యాపారం ప్రతిపాదిస్తుంది. కాబట్టి మన వ్యాపారం నిలిస్తే మనం బ్రతకతగినవాళ్ళ మన్నమాట ఋజువవుతుంది.' అని కొందరుచెప్పవచ్చును. ఈ లోకంలో బ్రతుకుతెరువు తెలిసిఉండడంతప్ప తక్కినదంతా ఏమీలేదనీ- వట్టి మాయ, స్వప్నం, వేదాంతం అనీ-మనం చావదగిన సముద్యమ మేమీ లేదనీ ఆ ఆదర్శాలకాల మిదివరకే అంతరించిందనీ మరికొందరనవచ్చును.

"ఎవరైతే ఈ క్రూరసిద్ధాంతాన్ని ఉద్ఘాటిస్తారో, జపిస్తారో, హృదయాలలో విశ్వసిస్తారో వారి జీవితాల కనువర్తింపచేస్తారో వారికినిజంగా ఈ ఆదర్శాలకాలం అంతరించింది. అయితే ఇకవచ్చే దేమికాలము? ఒక వర్గానికీ మరొక వర్గానికీమధ్య పెరిగిపోయే ఘోరమైన అసూయాయుగమా? ఉన్నవాళ్ళకూ లేనివాళ్ళకూ మధ్య కలిగే ద్వేష పోరాటాలయుగమా? పెద్దపెద్ద పేర్లుమాత్రం తగిలించుకొని సిద్ధాంతాలను విషది

పెట్టి "డొల్లు బుచ్చక్కాయ పక్షాలు" యెన్నికలలో వ్యర్థంగా పోటీచేసే యుగమా? ఒకపక్క భోగలాలసత్వమూ, మఱొకపక్క దరిద్రదేవతా తాండవమాడే యుగమా? ఒకపక్క మేడలూ మఱొకపక్క పాడు గోడలూ ఉండే యుగమా? ఒకడు అష్టైశ్వర్యాలతో తులతూగుతూంటే మఱొకడు చూపోపమితో సృక్కిపోయే యుగమా? ఏవోవిధంగా వెల్లడిలోకి రావాలనే బడాయితో కోతులకు విందులు చేసి, సంభావన లిచ్చి, వ్యర్థకాలక్షేపం చేసిన 400 మంది ధనమదాంధులైన బుద్ధిహీనుల బొమ్మలనూ వార్తలనూ పత్రికలలో విస్తుపోయిచూచి ఆనందించిన 40 లక్షలమంది కబుర్లరాయళ్ళుండేయుగమా? ప్రజాపరిపాలకుల భీతినుండి రక్షణనుకోనుక్కొని జీవించే సంస్థానాధిపతులయుగమా? పేదవాళ్ళభీమా ధనములకు రక్షకులమని చెప్పుకొంటూ, వాటిని లాభాలకింద ధనవంతుల భోగ్యాలకోసం పంచి యిచ్చేవారి యుగమా? బంగారు నిచ్చెనలమీదుగా పక్కనున్నవాళ్ళ పైకెక్కి తమగుట్టు బయట పెట్టుతామని బెదిరించే వారి కొరడావిదల్పు వినగానే కాళ్ళువణికి, బూతులుతిట్టే పత్రికలకు భయపడి, వెంటనే కిందికి దిగివచ్చేవారి యుగమా? రాజకీయ దుర్వృత్తమనే కొండచిలువ, రాజ్యాలనూ రాజధానులనూ పెనవేసి చుట్టుకొని, ఋజువర్తనమునూ స్వాతంత్ర్యమునూ కుత్తుకనులిమి లాగదీసుకొనే యుగమా? పూర్వ విజ్ఞాన దీపముల వెలుతురును వెదజల్లే దేవాలామందిరముల దిక్కుకు పోని నాస్తికులకూ అవహేళనపరులకూ ప్రత్యేకమయ్యే యుగమా? కలుషీభూతమయిన, అనర్థదాయకమయిన, లజ్జాకరమైన యుగమా? పురాతన మహాత్ములనుండీ వారి అనుయాత్రికులనుండీ పరంపరాగతంగా సంక్రమించిన జీవిత మార్గంగల మాకు, స్వాతంత్ర్య ఛాయల కింద మానవత్వమంటే యేమిటో తెలుసుకొన్న మాకు, ఆ యుగం రానక్కరలేదు. మతాన్ని దేవుణ్ణి విడిచిపెట్టిన ఆ దురదృష్టపు రోజులు మా దేశాని కసలేవద్దు. పురాతన భారతీయాదర్శ దేవత్వాప్రతిమ-

న్యాయ్యదృష్టితో, నిష్కళంకహృదయంతో, సమబాహువులతో, మాకు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నది. నేటి పోరాటంలోకూడ పక్షాభిమానులు కాక సర్వమానవ సౌభాగ్యంకోరే ధైర్యసంపన్నులూ ఋజుప్రవర్తకులూ అయిన యోధులు మాకు కనబడుతూన్నారు. మన పురాణ యోధులు నెత్తురు ధారపోసి సంపాదించిన హక్కులను మనం కష్టపడి రక్షించుకొని తీరవలెనని మా తాత్పర్యం. ("నిజమైన భవిష్యద్దృష్టితో మన పితరులు చేసిన పనిఅంతా మనం కాపాడుకొని తీరాలి.")

"భావిగతి తెలిసి పితరు లేవి చేసి
రవియ రక్షింప బడవలె నందు మేము"

వీటికి భంగము తీసికొనివచ్చే యే అధికారమునూ సహించకూడదు. వీటి కపాయముచేసే యే శాసన వ్యతిరేక కల్లోలమునూ అంగీకరించకూడదు. వీటిని గౌరవించని లేక వీటి కెదురుతిరిగే యే వర్గమునూ మన్నించకూడదు. పూర్వమే అకలుషిత జీవితంకోసం మనపెద్దలు జీవిస్తూ ఉండేవారో మనంకూడా అందుకే జీవించాలి. మనము పోరాడదగిన పోరాటమొకటి ఉన్నది. ప్రజల ప్రాథమిక హక్కులకోసం, అన్నవస్త్రాలకోసం పోరే పోరాటం. మన ప్రజలను నిజమైన స్వతంత్రులనుగా చేయడం, మనస్వేచ్ఛను బంధించే పాశాలను త్రెంచివేయడం, రాజకీయార్థిక సాంఘిక దుర్వృత్తమునుండి మన జాతీయ జీవితమును నిర్మలంగా ఉంచడం, ఉపదేశంవల్లా ఉదాహరణవల్లా కూడా భారతీయ యువతీ యువకులకు హిందూస్థానమును సేవించే ఉత్కృష్ట ధర్మాన్ని ప్రబోధించడం, ఇవన్నీ భారత స్త్రీ పురుషులలో ఉత్తమోత్తములైన వారు చేయవలసిన పనులు. యెవరీపని చేయడానికి జన్మించారో వారిజన్మ ధన్యమయినది. యెవరీపని చేయడానికి గర్వపడుతూ పెరిగినారో వారి పెంపు పావనమయినది. ఈ పనియొక్క అర్థాన్నీ, అవసరాన్నీ యెవరు గ్రహించారో వారివిద్య కృతకృత్యమయినది. వారి త్యాగం

కానీ వారి కార్యదీక్షగానీ యెన్నటికీ వ్యర్థంకాదు. మానవ భాగధేయ మనే ఉన్నతాకాశములో, ప్రజావిశ్వాసము, స్వార్థరహిత ధైర్యము, ఆదర్శనిష్ఠ అనే మంచుచుక్కలు వెలుగుతూన్నంతవరకూ మహర్షుల యొక్కయు వారి అనుయాత్రికుల యొక్కయూ ఆశాజ్యోతి యెన్నటికీ చల్లారనే చల్లారదు.'

౫

గాంధీ ఉపదేశా లెక్కడా సూత్రప్రాయంగా వ్రాయబడలేదు. కాని ఆయన వ్రాతలలోనుండీ మాటలలోనుండి గ్రహించి కొంత వరకు "స్టీవెన్ హాబ్ హశాన్" ఈ దిగువ ప్రకారం వ్రాశాడు.

౧ అహింస (నిరపకారం లేక దౌర్జన్య రాహిత్యం) అంటే అత్యుత్కృష్ట మైన ప్రేమ. అది ఉత్తమోత్తమమైన ధర్మం. అది ఒక్కటే మానవ సంతానానికి క్షేమం చేకూరుస్తుంది.

౨ అహింసలో నమ్మకం కలవాడు, చైతన్యంగల దేవునిలో నమ్మకం కలిగి ఉంటాడు.

3 అహింస కేవలం నోటితో ఉపదేశింప బడేదికాదు. మనఃపూర్వక ప్రార్థనా ఫలితంగా దైవానుగ్రహంవలన అది మన హృదయంలోనే చిగురిస్తుంది.

౪ అత్యంత ధైర్యమూ అత్యంత బలమూ కలవారికే అహింస ఆయుధం. నిజమైన దేవుని మనిషికి కత్తిని ఉపయోగించడానికి తగినబలం ఉంటుంది. కాని ప్రతిమనిషీ దేవుని రూపమేనని తెలుసుకొని దానిని ఉపయోగించడు.

౫ నెత్తురే చిందవలసివస్తే 'మన నెత్తురే చిందనీ! చంపకుండా చచ్చి పోయేటందుకు, నిమ్మళంగా నీ కత్తినట్లు నిలబడగల ధైర్యాన్ని అలవాటు చేసుకో!

౬ ప్రేమ ఇతరులను దహించదు. కాని సంక్షోభంగా ఆమరణాంతం బాధపడుతూ తనను తాను దహించుకొంటుంది. మనసా వాచా కర్మణా అది ఇంగ్లీషువానికికూడా ఉద్దేశపూర్వకంగా ఏవిధమైన హానీ చేయదు.

౭ ఇండియా విజేత లనబడేవారిని హిందూదేశం ప్రేమతో జయించాలి. సర్వమానవప్రేమ అన్నా, దేశభక్తి అన్నా మనకు ఒకటే అర్థం. హిందూదేశాన్ని సేవించడానికి నేను ఇంగ్లండుకు గానీ జర్మనీకి గానీ హానిచేయను.

౮ సత్యానికీ అహింసకూ అవినాభావ సంబంధం.

౯ సత్యాన్నిమించిన దేవుడులేడు. సత్యాన్వేషణమే ప్రధానము.

౧౦ దేవునిచే నడపబడుతూన్న మన పవిత్ర యుద్ధములో దాపరికమేమీ లేదు. మాయకు సావకాశం లేదు. అసత్యానికి స్థానంలేదు. ప్రతిదీ శత్రువు కళ్లెదుట జరుగవలసినదే.

౧౧ సత్యాగ్రహ (సత్యశక్తి లేక ఆత్మశక్తి) మనకు, ఆత్మనిగ్రహం అవసరం. అందుకు ప్రార్థన చేయాలి.

౧౨ తాను చేసిన ప్రతిపనిలోనూ సత్యాగ్రహి తన ప్రత్యర్థి అవసరాలను గమనించాలి. ఆయన ప్రత్యర్థియెడల యెప్పుడూ సౌమ్యంగానూ దాక్షిణ్యంతోనూ ప్రవర్తిస్తాడు. కాని అన్యాయమైన చట్టాలను గానీ ఆజ్ఞలనుగానీ మన్నించడు.

౧౩ సత్యాగ్రహి న్యాయ్యపథమునుండి ఒక్క అడుగైనా తొలగడు. కాని శాంతికోసం తహతహలాడుతూంటాడు. అతనివిశ్వాసం అచంచలం, అతని సహన మనంతం. అతనిఆశ అమోఘం.

౧౪ మొత్తముపైన మానవస్వభావమంతా ఒకతీరుగానే ఉంటుంది. కాబట్టి దౌర్జన్యపరుడు చివరకు తప్పకుండా ప్రేమకు బదులు తీర్చక తప్పదు.

౧౫ శాంతవృత్తమూ, అచంచల సంకల్పమూ, దైవభీతీ గల యే జాతినీ ప్రపంచంలో యేశక్తీ అడ్డగించలేదు. అవనిపైగల అంత ఆయుధ సామగ్రికంటెనూకూడా, అహింస యెక్కువ శక్తివంతము.

౧౬ దైవభీతి గలవాండ్లను మృత్యువు భయపెట్టలేదు.

౧౭ యుద్ధరంగంలోని ధైర్యం మనకు సాధ్యమైన పనికాదు. శరీరక్షతిని గూర్చిన భయం, రోగభయం, మృత్యుభయం, కుటుంబప్రతిష్ఠ, ఆస్తిపాస్తులూ పోతవనే భయం-ఇవి లేకపోవడం అత్యావసరం. ఈ ప్రపంచంలో ఏదీ మనది కాదు.

౧౮ అహింసకు నిజమైన వినయం కావాలి. యెందువల్లననగా దానివలన మనము మనపైనకాక దైవముపైన ఆధారపడవలసి యున్నదిగనుక.

అధ్యాయము ౨

అహింస

౧

ప్రతి నూతనసృష్టి(Invention)ఆవిష్కరణమూ (Discovery) కూడా వెల్లడి చేసినతరువాత చాలా తేలికగా కనిపిస్తుంది. బురదను బురద కడిగివేయలేదనిగానీ, సైతాను సైతానును సంస్కరించలేడనిగానీ, హింసను హింస తొలగించలేదనిగానీ చెప్పడం చాలా తేలిక. హింసయొక్క చిత్రగతులను నిరోధించవలెనంటే అహింసయే మార్గం. హింసను హింసయే నిరోధించగలదనే సూత్రము నవలంబించినట్లయితే, మానవ సంఘంలోని చెడుగులను తొలగించడానికి రోజురోజుకూ యెక్కువ హింస చేయవలసి వస్తుంది. ఎందువల్లననగా తక్కువహింసను నిరోధించడానికంతకన్న ఎక్కువహింస చేయకతప్పదు. ఈ విధంగా హింస నానాటికి పైమెట్టులోకి పోతూ ఉంటుందేకాని ఎన్నడూ తొలగిపోదు. హింసను తొలగించడానికి ప్రయత్నించిన వారిలో గాంధీయే మొట్టమొదటివాడు కాదు. జీసస్ సంఘమునకు చెందిన ఇగ్నాటియస్ లొయోలా వంటివారనేకమంది, బ్రహ్మచర్య మవలంబించి, కామ మమకారములకు దూరులై హింసాపథము నడ్డగించి ఉండిరి.

ప్రపంచాభ్యుదయమునకూ సత్యస్థాపనకూ శ్రమచేసిన మహానుభావులెందరో కలరు. వారంతా ప్రత్యక్షంగానో పరోక్షంగానో అహింసా సిద్ధాంతము నుపదేశించినవారే. పార్శ్వుడు

(Parsva), బుద్ధుడు, మహావీరుడు లాట్సు (Lautsu), జీసస్ క్రైస్తు, పాల్ ఆఫ్ టార్సస్ (Paul of Tarsus), పీటర్ వాల్డో, వైక్లిఫ్, హస్ (Huss), సైనన్సు, జార్జి ఫాక్సు, జాన్ వూల్‌మన్, విలియంపెన్, తోరే (Thoreau), టాల్‌స్టాయి-వీరందరూ కూడా మంచి దైవభక్తులు, అహింసా ప్రవక్తలూ ప్రమాణ పురుషులూను. రష్యాలో అహింసా సిద్ధాంతమునకు మూల పురుషులైన టాల్‌స్టాయి, క్రోప్ట్కిన్‌లున్నూ, రస్కిన్, తోరే, ఎడ్వర్డు కార్పెంటరులున్నూ ఇండియాలో చాలామందికి చిరపరిచితులైన వారే. బ్రదర్ గైల్సు, జాన్‌వూల్‌మన్, మైకేల్‌కోట్సు ది క్వేకర్, ఈశ్వరనిందకు శిక్షింపబడిన 17 వ శతాబ్దపునాటి జేమ్సు నేలర్, అరణ్యరోదనం చేసిన గూఢ తత్త్వవిదుడు జాకబ్ బెహ్మె, ఆయన ఆంగ్లశిష్యుడు విల్లియంలా, టాల్‌స్టాయికి ముందువాడైన 15 వ శతాబ్దపు పీటర్ షెల్ షికీ (Chelchizki), ధర్మంకోసం ప్రాణాలర్పించిన సోక్రిటీస్, గియార్డినో బ్రూనో, సర్వీటస్ మొదలయిన మృతజీవులూ కూడా చాలామందికి తెలిసినవారే. టాల్‌స్టాయి, క్రోప్ట్కిన్‌ల మార్గాన పనిచేసినవా రెంతమందో జర్మనీలో కలరు. వారు కుర్టు ఈస్నర్ (Kurt Eisner), గుస్టవ్ లాండర్ (Gustow Landauer), కార్ వాన్ ఒస్సీట్జ్కీ, ఈరిచ్ మిహ్సాన్, థియోడర్ లెస్సింగ్. వీరుగాక ఆల్ఫ్రెడ్ వాలెస్, వాషింగ్టన్ కోషిన్‌స్కో (Washington Koscinsko) లఫయెట్టీ, క్లార్క్సన్, విల్బర్‌ఫోర్సు, డేవిడ్ లాయడ్ గ్యారిసన్, అబ్రాహాం లింకన్‌లు ఉన్నారు. వీరికి మకుటాయమానంగా ఇంకా కొందరు ప్రపంచ విఖ్యాతపురుషు లున్నారు. వారు

"సృష్టి కనుగుణంగా నిరాడంబరమైన నిరుపేదజీవితమును గడపిన" సెంటు ఫ్రాంసిస్ ఆఫ్ అస్సీసి, తత్వజ్ఞానీ భావుకుడూ అయిన సెంటు థామస్ ఎక్వినాస్. ఈ యోగులయొక్కయు దివ్యజ్ఞానులయొక్కయూ జాబితాకు గాంధీ పేరుకూడా మేము చేరుస్తున్నాము.

ప్రయోగాలకు అవకాశం

పరాధీనమయిన భారత దేశపు వింతపరిస్థితులు, గాంధీ తనప్రయోగములను, ఇదివర కేమతగురువులకూ సాధ్యంకానంత విరివిగానూ స్థిమితంగానూ సాగించడానికి సావకాశం గలిగించినవి. ఏది ఎలా ఉన్నప్పటికీ ఈ యుగంలో అహింసాభావం కొంత ఉన్నత స్థాయికి చేరినదనిమాత్రం చెప్పకతప్పదు. అందువల్లనే ఉన్మాదాశ్రయాలు (Lunatic asylums) మానసిక చికిత్సాలయములూ (Mental hospitals), కారాగారాలు (Jails) పశ్చాత్తాప మందిరాలూ (Pentientiaries) అయినవి. మైనరు నేరస్తులు సంస్కార మందిరములకు (Reformatories) పంపబడుతూన్నారు. శిక్షకు బదులుగా నిరోధమే ఉపయోగింపబడుతూన్నది. రోగచికిత్సకు బదులుగా ప్రజారోగ్యసూత్రాలు పరిపాలింపబడుతూన్నవి. నేరాలుచేసే గుంపులకు విద్యాబుద్ధులు చెప్పి, కొత్తగా మళ్ళీ సెటిల్మెంటులలోకి తీసికొని వస్తూన్నారు. నేరం చేసిన తరువాత నేరస్తుణ్ని శిక్షించడంకంటే ప్రేమపూర్వకమైన ప్రయత్నంవలన నేరం చేయకుండానే చూడవచ్చునని నిరూపించడానికివి సకృతుగా అక్కడక్కడా చేయబడే ప్రయ

త్నాలు. పిచ్చివాణ్ణీ, నేరస్తుణ్ణీ విద్యాబుద్ధులు చెప్పి సంస్కరించినట్లుగానే, యుద్ధక్రియులనూ దురాశాపూరితులైన రాజులనూ ప్రజాపీడితులైన పాలకులనూ, కోపిష్ఠియైన సోదరుణ్ణి, కసిపట్టిన భర్తనూ, పెంకెబిడ్డనూ-వీరందరినీకూడా మనము సంస్కరించవలసి యున్నది. గాంధీ వీరందరినీ ఒకే గుంపులో చేర్చి, ప్రేమ అనే నూతన చట్టప్రయోగమునూ అహింస అనే నూతన సిద్ధాంతాచరణమునూ అనువర్తింప చేశాడు.

నిజమైన మతము బుద్ధిచేత గాక హృదయముచేతనే గ్రహింపబడ దగినదైతే, యెవరికీ అది కొత్తగా ఉండడానికి వీలులేదు. ప్రతివాడూ అటువంటి మతమును తన హృదయమునుండియే వికసింప చేసుకోవచ్చును. సత్యమూ అహింసా ఆత్మనిగ్రహమూ, ఇవి గాంధీ అనుయాయులలో ప్రతివ్వాడూ అవలంబించవలసిన ముఖ్య సిద్ధాంతాలు. అహింస కేవలం నిషేధాత్మక మైనది కాదు. విధియుక్తమైనది కూడా. "కుక్కకాటుకు చెప్పుదెబ్బ" వలె అపకారం చేసినవానికి ప్రత్యపకారం చేయకపోవడమే అహింస కాదు. చెడుగును మంచితో జయించడం అహింస. నీకపకారం చేసినవారి కుపకారం చేయడం అహింస. నీపైకి వచ్చినవాండ్లను క్షమించడం అహింస. ధోవతీ దొంగిలించిన వాడికి ఉత్తరీయం బహుమతీచేయడం అహింస. అంటే అహింసా సిద్ధాంతంలో ప్రత్యపకారం చేయడమనేది లేదు. మనస్సులో రోషం పెట్టుకోవడం తగదు. కసిపట్టుకోరాదు. రహస్యంగా చేసే ఖూనీ గానీ బహిరంగంగా చేసే యుద్ధంగానీ పనికిరాదు. మనస్సులో, మాటలో, క్రియలో, హింస కూడదు. కోపం తప్పు.

ఇదంతా మానవాతీతమయిన విషయంగా కనిపించవచ్చును. కాని శారీరకంగానూ మానసికంగానూ చేసే కొన్ని కష్టములైన అభ్యాసాలు (**exercises**) నీకు ఆత్మవిశ్వాసాన్ని గలిగించి, సంతోషమునూ ఆధ్యాత్మిక శక్తినీ పెంపొందింప చేస్తవి. ఇవి చేయడంలో ఎప్పుడు నీవు తప్పిపోయినా సిగ్గూ విచారమూ కలుగుతయి. ఎప్పుడు నీవు జయంపొందినా విశ్వాసమూ ఉత్సాహమూ కలుగుతయి. కాబట్టి ఈ సందర్భంలో జయం వలె జయం పొందేదికానీ, అపజయంవలె అపజయం పొందేది కానీ మఱొకటి లేదని నిశ్చయంగా చెప్పవచ్చును.

మానసిక ప్రవృత్తులను ప్రకోపింపచేసే చర్యగానీ, ఉద్దేశం కానీ, ఊహకానీ హింసకిందకే వస్తుంది. అనగా గర్వము, అవహేళనము, అసహ్యత, కోపం, అసహనం, గునియడం, కసి, క్రోధం, చంపడం, గాయపరచడం, భయపెట్టడం, దుర్వినియోగం చేయడం, మోసగించడం, విషంపెట్టడం, చెడుగును ప్రేరేపించడం, ముఖస్తుతిచేయడం, బుద్ధిపూర్వకంగా శీలాన్ని పాడుచేసుకోవడం-ఇవన్ని హింసారూపాలే. సాత్విక నిరోధకుడు నిరంతరమూ మంచి పరిసరములనూ మంచి పరిస్థితులను కల్పించుకుంటూ ఉంటాడు. అది పవిత్రీకరణం.

అహింస అచేతనమైన, అనాచరణ యోగ్యమైన, ఆదర్శ వాక్యం కాదు. ఊహాజన్యమైన చిత్త ప్రవృత్తి కాదు. అది మానవుల నైతిక స్వభావములో సజీవమైన, క్రియారూపకమైన ఒక సుగుణము. అది ఎటువంటి మందాత్మునైనా, ఉదాత్త మానసిక శక్తులతోనూ, నిస్వార్థ నిష్ఠగలిగిన ఆదర్శంతోనూ ఉజ్జీవింప

చేస్తుంది. అది నీచమైన స్వప్రయోజనమునుండి మానవులను విముక్తులనుగా చేస్తుంది. అటువంటివారి సహవాసం ఉదార భావహేతువు కాగలదు.

అహింస శాస్త్రమూ శిల్పమూ కూడాను. అన్నిశాస్త్రాల వలెనే దీనివెనుక కూడా ఒకచరిత్ర, ఒక సిద్ధాంతమూ ఉన్నది. ఇది కాలానుగుణమైన నూతన కల్పనకాదు. శతాబ్దాల కొలదీ స్పర్ధా ద్వేషములతో, కామక్రోధములతో, భౌతిక వాంఛలతో, దౌర్జన్యంతో, పూడిపోయియున్న శకలరాసిలోనుండి పునరుద్ధరింపబడి ప్రత్యక్షం చేయబడ్డది. పురాతన నాగరికతావశేషమైన ఈ గనిని త్రవ్వి పైకి దీయడానికి, మహర్షులూ యోగులూ అప్పుడప్పుడు ఉద్భవించారు. కాని దానిని కనుగొని తేజోవంతంగాచేసి, దురాశా క్రోధములతోనూ స్పర్ధా ద్వేషములతోనూ కుంగి కృశించిపోతూన్న మానవజాతికి వెలుగువలె ప్రసాదించే భాగ్యం గాంధీకి దక్కినది.

అహింసలో మొదటిపాఠాలు

అన్నిశాస్త్రాలకూ శిల్పములకూ వలెనే, అహింసకుకూడా మొదటి పాఠాలున్నాయి. నీ తల్లి దండ్రులు విశ్వవిద్యాలయ పరీక్షలలో ఉత్తీర్ణులయినంత మాత్రాన నీవు ప్రాథమిక పరీక్షలో కూడా ఉత్తీర్ణుడవు కాలేవు. ఒకొక్కప్పుడు పరంపరాగతంగా పితరులనుండి కొంత శిల్పజ్ఞానం కలిగితే కలగవచ్చును. ఒక గాయకుని కుమారుడు స్వతస్సిద్ధంగా, మూడోయేటనుండి కొన్ని కొత్త సంగతులు విసురుతూ పాడితే పాడవచ్చును. కాని శాస్త్ర

మటువంటిది గాదు. అది బాగా అధ్యయనం చేస్తేనేగాని అంటదు. సంగీతానికి చెవిలేనివాడు దానిలోని మార్దవం గ్రహించలేక వట్టి ధ్వని అంటాడు. ఆలాగే చిత్రకళాజ్ఞానం లేనివానికి యేబొమ్మ చూపినా వట్టిరంగులూ గీతలూ కనిపిస్తవి. కవిత్వంలో సారస్యం గ్రహించలేనివాడు వ్యాకరణపు తప్పులు చూస్తాడు. వాక్యరచన తలక్రిందులుగా ఉన్నదంటాడు. అంతకు తప్ప భావంలోనూ లయలోనూ ఉన్న సౌందర్యాన్ని అనుభవించలేడు. కాబట్టి అటువంటివాళ్ళ విమర్శలకు విలువలేదు. ముక్కు జబ్బున్నవాళ్ళకు పన్నీటి పరిమళమూ, కటికి చెమిటి వాళ్ళకు ఫిరంగిచప్పుడూ, పుట్టు గుడ్డివాళ్ళకు వస్తుసౌందర్యమూ తెలియనట్లుగానే కళాభిజ్ఞత లేనివాళ్ళ కాయా కళలలోని శిల్పము తెలియరాదు. పుట్టుకతో వచ్చిన లోపాలుగానీ తెచ్చిపెట్టుకొన్న వికారాలుగానీ అలా ఉన్నప్పటికీ, ప్రతిమనిషికీ, సంస్కృతియొక్క కళలను ప్రశంశించదగిన ఒకవిధమైన గ్రహణశక్తి అతని ప్రకృతిలోనే నిహితమై ఉంటుంది. అది పెరిగి పెద్దది కావడానికి శిక్షణమూ సంస్కరణమూ అవసరం. రైతు పొలంలో ఎక్కువపంట పండించాలంటే అతనందుకు చేసే కృషిపైన ఆధారపడి ఉంటుందది. అహింసనుగూర్చి అనేకమంది అదిరిపోయే విమర్శలు చేశారు. వట్టి విమర్శలేకాదు; అవాకులూ చవాకులూ మాట్లాడారు. దానికి కారణం వాళ్ళ శిక్షణ వాళ్ళ వాతావరణం కేవలం అందుకు భిన్నమైనవిగా ఉండడమే.

భయం తెలియని పసిబిడ్డ తేలుకొండె పట్టుకొని లాగుతుంది. ఎగిరే కప్పమీదా పాకే చీమమీదా చేతులు వేస్తుంది. ఆబిడ్డ

అన్న, దానిని కొడితేనో విసిగిస్తేనో వాణ్ని కొట్టినట్లుగా నటించి మనం పసిబిడ్డకు అప్పుడప్పుడే కలుగుతూన్న కసి దీర్చుకోవాలనే కోర్కెను సంతృప్తి పరుస్తాము. ఇద్దరుపిల్లల కైదైనా రోడ్డుమీద పేచీవస్తే వాళ్ళు తమ బలాబలాలను చూపించుకొంటారు. క్లాసులో అల్లరిచేసినా, పాఠశాలకు ఆలస్యంగా వెళ్ళినా పిల్లవాణ్ని ఉపాధ్యాయుడు బెత్తంతో కొడతాడు. పరీక్ష తప్పిన కొడుకును తండ్రి శిక్షిస్తాడు. వంట ఆలస్యమైతే మొగుడు పెళ్ళాన్ని తిట్టి కొడతాడు. ఆమె పిల్లలను కొడుతుంది. పిల్లలు దాసీదానిపైకి పోతారు. దాసీది యజమానిపైన కోపం తెచ్చుకొంటుంది. ఈవిధంగా కోపం కొంపంతా చుట్టుకొంటుంది. మ్యాజిస్ట్రేటు చిన్న జేబుదొంగను శిక్షిస్తాడు. వాడు జైలులోనుండి పెద్దవాడై వచ్చి మేజిస్ట్రేటు ఇంటికే కన్నంవేసి దొంగిలిస్తాడు. అంతటితో వాడు గజదొంగయిపోతాడు. పురుషులనూ స్త్రీలనూ గుంపులు గుంపులుగా నేరాలుచేసే అనాగరిక జాతులకింద లెక్కవేసి వాళ్ళందఱిపైనా ప్రభుత్వంవారు కాపలా పెడతారు. వాళ్ళు రాత్రిళ్ళు తప్పించుకొనిపోతే కనుక్కొని పట్టుకొని వచ్చి పోలీసులు ఖైదులో పెడతారు. వాళ్ళు చాలా కాలం ఖైదులో ఉండడంవల్ల మఱింత గట్టిపడి "నల్లటోపీ" ల సహవాసంతో కొత్త గుంపులను కట్టుకొని రాజధాని మొత్తం మీదనే నేరాలు సాగిస్తారు. చివరకీ మామూలు నేరాలు ఖూనీల కిందకు మారి ఖూనీలు ఉరిశిక్షలకు కారణాలవుతయి. ఈవిధంగా నేరమూ శిక్షా, ఒకటితరువాత ఒకటి అంతులేని గొలుసువలే

సాగుతూనే ఉంటుంది. అందువల్లనే శాంతిభద్రతలు కాపాడే టందుకు బలప్రయోగం అవసరమనే సిద్ధాంతం అంగీకరించబడ్డది.

౨

హింసాహింసల విభేదం ఋగ్వేద అధర్వ వేదాల కాలంనాటి నుండీ వస్తూన్నది. ఎప్పటినుండో మన మెఱుగనప్పటినుండీకూడా యజ్ఞాలు జరుగుతూనే ఉన్నప్పటికీ శ్రీరామచంద్రుడుకూడా జీవ బలికి సంబంధించిన యజ్ఞాలు చేసినప్పటికీ, పశుబలికి వ్యతిరేకంగా అప్పటికే కొంత ప్రబలమైన అభిప్రాయం కలదు. అందువల్లనే పిష్ట మృగబలిని అప్పటి మహర్షులు కొందరు ఉపదేశించారు. ఉపనిషత్తులనాటి కథ ఒకటి ఉంది. నాచికేతుడనే బ్రాహ్మణబాలునితో యముడీవిధంగా అంటాడు "సృష్టి అంతలోనూ ఒకే ఆత్మ వ్యాపించిఉంది. సృష్టిలోఉన్న ప్రతిజీవి హృదయమూ దానికి నివాసస్థానమే. హింస అనగా ఏమిటో ఎప్పుడూ ఎఱుగనివాళ్ళకు మాత్రమే అటువంటి ఆత్మ ప్రత్యక్షమవుతుంది." సత్యాహింసలను ప్రధానములుగా ఉద్ఘాటించిన అనేకమంది మహర్షులు యజ్ఞాలలో పశుబలిని పూర్తిగా నిరసించారు. సత్యమూ సత్ప్రవర్తనములను ఆధారములుగా చేసికొని ఉద్ధాహరింపబడిన నియమావళియే ధర్మంగా వ్యవహరింపబడి ప్రపంచమునకు మార్గదర్శకముగా నున్నది. వేదాలూ ఉపనిషత్తులనిండా విశ్వప్రేమకు సంబంధించిన కథలూ ఉపాఖ్యానాలే. యజ్ఞాలలో జీవబలి లేకుండా చేయవలసిందని ప్రజలక్కు చాలా నచ్చచెప్పినవాళ్ళు మహర్షులు. జైను సాహిత్యంలో

ఇటువంటి ఉదాహరణాలింకా ఎక్కువగా ఉన్నవి. నేమిందుడనే 22 వ తీర్థంకరుడు శ్రీకృష్ణుడనేవానికి అహింసా ప్రబోధము చేయగా ఆయన యజ్ఞాలలో పశుబలిని మాన్పించడానికి తన పలుకుబడిని వినియోగించాడు. విశ్వామిత్రుడు రాజ్యపరిత్యాగం చేసి హిమాలయములకు తపస్సుకోసం పోయిన కారణం ఆయన సైనికబలం వశిష్ఠుని మంత్రబలంముందు ఎందుకూ కొఱగాకుండా పోవడమేకదా! విశ్వామిత్రుడు మహర్షి యైనతరువాత అహింసా గుణాన్ని అభినందిస్తూ ఆయన మెన్నో ప్రాణాలను రక్షించి నట్లుకూడా అనేక కథలున్నవి. ఈ పురాతన పుట్టు పూర్వోత్తరాలు కలిగిన అహింసను తమ ప్రధాన సిద్ధాంతంగా చేసికొని జైనులు ఎంతో పెంపొందించారు.

ఈ అహింసా జ్యోతిని మూలమూలలకు తీసికొని వెళ్ళినవాడు బుద్ధుడు. అహింసను శిల్పంగానూ శాస్త్రంగానూ కూడా పరమావధికి తీసికొని వచ్చినవాడు గాంధీ. దాని నాయన జీవితం లోని అన్నివిషయాలకూ అనువర్తించేటంత విశాలంగా చేయగలిగినాడు. తాను దానిని అడుగడుగుకూ ఆచరణలో పెట్టి స్థితప్రజ్ఞునిస్థాన మధిష్ఠించాడు. స్థితప్రజ్ఞుడనగా కామాన్ని జయించినవాడు; ఉద్వేగం లేనివాడు; సుఖదుఃఖాలను సమంగా చూచుకొనేవాడు; భయక్రోధాలు లేనివాడు; రాగద్వేషములను జయించిన సర్వసంగ పరిత్యాగి; అహింస వైదికులకు సన్న్యాసులకు, బౌద్ధ భిక్షుకులకు, జైనమునులకు-వీరందఱికీ సమంగా అనువర్తించే పరమధర్మం. ఉద్దేశంలోనూ (**Intention**) వాక్కులోనూ క్రియలోనూ అహింస ఉండవలసిందే నని శాస్త్రాలు

చెపుతూన్నట్లు, మనస్సు (Thought) విషయం చెప్పినట్లూ, ముసల్మాను ఉలేమాలు 1922 లో బాగా ఆలోచించి తమ అభి ప్రాయాన్ని వెల్లడిచేశారు. అహింసను ఆచరణలోకి తెస్తే అన్ని అవగుణాలూ కోపం, అహంకారం, భోగాసక్తి, ఆశ, చేయరాని సంభాషణలు చేయడంవల్ల వచ్చే విషాదభావాలూ నశిస్తాయి. ఈ గుణాలన్నీ మానవునికి ఉన్మాదావస్థను కల్పించి హింసాతత్వాన్ని పెంపొందింప చేస్తవని జైనుల విశ్వాసం. ప్రేమకు పరమావధియైన అహింసను ఆచరణలో పెట్టినందు వలననే జీవితములోని వివిధశక్తులూ వాటికి సంబంధించిన ఆయా రంగాలలో ఆయాపనులను సక్రమంగా నిర్వర్తిస్తవి. అలా నడవ కుండా ఆయా శక్తులను నిరోధించడమే హింస అవుతుంది. అహింసా కీర్తిని గానంచేసిన కథలు బౌద్ధ సాహిత్యంలో చాలా ఉన్నవి. "నాగానందం" లో చెప్పబడిన త్యాగకథ కొంతవరకు ఉన్నతభావాలను కలిగిస్తుంది. ఇతిహాసాలలోనూ మనుస్మృతి లోనూ కూడా అహింస పరమధర్మమని పదేపదే చెప్పబడడమే కాక అనేక ఉదాహరణాలతో ఋజువుచేయబడ్డది. "అహింస పరమధర్మ మని అంటారుకదా అయితే యజ్ఞములలో మాంసమును వేల్చడం వలన పితరులు తరిస్తారని చెప్పే ధర్మంతో, అహింసాధర్మాన్ని ఎలా సమన్వయం చేస్తారు?" అని ధర్మరాజు భీష్మాచార్యులవారిని ప్రశ్నించాడు. "మాంసాన్ని యజ్ఞాలలో వేల్చడం మానినవాళ్ళకే అహింస పరమధర్మం. వాళ్ళకు పుణ్యంవస్తుంది. నెలనెలకూ అశ్వమేధయాగంచేస్తే వచ్చే అన్నిఫలితాలూ వాళ్ళకు కలుగుతవి. అందువలన వాళ్ళకే అది

ముఖ్యం" అని భీష్మాచార్యులవారు కచ్చితంగా జవాబిచ్చారు. మనకు పాఠశాలలో చెప్పిన ఈ పురాణగాథలను ఒకదాని తరువాత ఒకటి చెప్పుతూండడం ఇక అనవసరం. అయినా "గోవ్యాఘ్ర సంవాదమనే" పేరుతో వ్యవహరింపబడుతూన్న ఒక అద్భుతమైన ఉపాఖ్యానమును చెప్పి ఈ భాగాన్ని ముగిస్తాము.

గోవ్యాఘ్ర సంవాదం

ఒక బ్రాహ్మణునికి మంచి సాధువైన పాడిఆవు ఉంది. అది కేవలమూ సాధుత్వంయొక్క అవతారమే. ఒకరోజున అది అడవిలో మేస్తూండగా అనుకోకుండా అమాంతంగా ఒక పెద్దపులి వచ్చి పైకురికి పట్టుకొంది. అప్పుడాగోవు "ఆగు: నీవు నన్ను తిందువుకాని; నాకోచిన్న కోరికఉంది తీర్చు" అన్నది. పులి "ఏమిటదని" ఆశ్చర్యంతో ప్రశ్నించింది. "నాకొక బిడ్డపుట్టి ఎనిమిది రోజులయింది. అది ఇంకా మేత పట్టలేదు. నీకు కావలసింది నా మాంసమేకదా. నేనుపోయి చివరసారి నాబిడ్డకు పాలిచ్చుకొని వస్తాను. నీవిందు కంగీకరిస్తే నీకుచాలా పుణ్యముంటుంది" అని రానున్న తనబిడ్డ నిస్సహాయతనుగూర్చి ఆవు కళ్ళనీళ్ళు పెట్టుకొన్నది. "బలవన్మరణమునుండి తప్పించుకొన్న యేజంతువూ కూడా చచ్చిపోయేటందుకు ఎన్నడూ తిరిగిరాదు. ఇది ప్రపంచానుభవంలో ఎక్కడాలేదు. ఎన్ని ప్రమాణాలు చేసినప్పటికీ ఈ మాటమాత్రం నమ్మడానికి వీలులేదు. నేను నిన్ను నమ్మను" అంటూ పులి అంతటితో ఊరుకోక "ఒక బ్రాహ్మణుడు పంది రూపాన్ని పొంది కూడా పూర్వ వాగ్దానప్రకారం ఆ జీవాన్ని

వదిలిపెట్టలేక పోయినాడు. ఎవరికైనా ప్రాణమంటే అంతతీపి" అని ఉదాహరణంగా ఒక కథకూడా చెప్పింది. అందుకు బదులుగా ఆవు లోకం సత్యంమీదనే నిలిచిఉందని, మదనలేఖ అనే రాజకుమార్తె తన మానసంరక్షణం చేసుకొని యేవిధంగా తన వాగ్దానాన్ని చెల్లించుకొన్నదో వివరించింది. మదనలేఖ రాక్షసునికి ఆహారంగా తనను అర్పించుకొన్నప్పుడు రాక్షసుడు సత్యాహింసల నేవిధంగా గ్రహించాడో ఆవు వర్ణించింది. అప్పుడు మనస్సు కఱిగి ఆవుతో "నీమాట చెల్లించుకొంటావా?" అన్నది పులి. ఆవు చండాలుడంటే అబద్ధం చెప్పినవాడేనని జవాబు చెప్పింది. అప్పుడావును విడిచిపెట్టింది పులి. అప్పుడావింటికి వెళ్ళి సావకాశంగా దూడకు పాలిచ్చుకొని మిగిలిన పాలను బ్రాహ్మణుణ్ని పిదుక్కోనిచ్చి, దూడకు చెడు సహవాసాలకు పోవద్దనీ అజాగ్రత్తగా ఉండవద్దనీ బుద్ధులుచెప్పి తిరిగీ అడవికి పోయింది. ఈలోగా ఆవు రాలేదని పులి అరుస్తూ అటూ ఇటూ పరవళ్ళు తొక్కుతూఉంది. సరిగా ఆ సమయంలోనే ఆవు పులిదగ్గరకు పోయి "ఇదుగో నేను వచ్చా! నన్ను తిని నాకు పుణ్యమియ్యి" అంటూ తన తలను పులి నోటిదగ్గరకు చాచింది. కాని పులి తెల్లపోయింది. ఇటువంటి దృశ్య మెన్నడూ అది తన జీవితంలో ఇదివరకు చూచిఉండలేదు. దాని హృదయం కఱిగింది. దాని చిత్తవృత్తి మారింది. "సృష్టిలో ఎప్పుడూ ఇటువంటిసంగతి నేను చూచిఉండలేదు. అటువంటిప్రాణికి నేనెలా హానిచేయగలను. ఆపాపం నేను భరించలేను. సత్యధర్మాలు నిన్ను రక్షించినయి. నిన్ను తినడానికి నాకు బుద్ధిపుట్టడంలేదు. వెళ్ళు" అన్నది పులి.

తనను ఇంటికి వెళ్ళనిచ్చి కొంత సేపుండి రావడానికి వీలు కలిగించి నందుకు కృతజ్ఞతను తెలియచేస్తూ ఆవు తనను తినవలసిందని పులిని తిరిగి కోరింది. అది వినినంతనే పులి మనస్సు తిరిగి పోయింది. ఈ కథ స్వర్గంలో దేవతలకుకూడా ఆనందం కలిగించింది. పులి తినడానికి వస్తే ఆవేమిచేయాలని ఒకవిద్యార్థి ప్రశ్నించినప్పు డీగ్రంథకర్త పూనాలోని ఫెర్గూసన్ కళాశాలలో ఇదేకథను చెప్పగా విద్యార్థి "బ్రిటిష్‌పులి ఈ కథలోని పులి అంత సాధువుగా మెత్తనిమనస్సు కలిగి ఉంటుందా" అని తెలివైనప్రశ్న వేశాడు. "ఆవును రక్షించింది పులి సాధుత్వంకాదు. ఆవు మనఃపూర్వకమైన అహింసావలంబనముతో చేసుకొన్న ఆత్మార్పణమే పులికి సాధుత్వం కలిగించింది. మన త్యాగమూ, ఆత్మార్పణబుద్ధీ కూడా ఆ ఆవువంటి నిష్కళంకములైనవే అయితే బ్రిటిష్‌వారి మనసుకూడా కఱిగిపోతుందనడానికేమి సందేహంలేదు" అని తిన్నని జవాబీయబడింది. అక్కడి 2,000 మంది విద్యార్థులూ అధ్యాపకులూ కూడా ఈ అభిప్రాయంతో ఏకీభవించారని వేఱుగా యిక్కడ వ్రాయవలెనా?

3

కాంగ్రెసు వాదులకు కాంగ్రెసు తత్వంలో విశ్వాసమును నిలుపుకోవడానికి అహింస ఒక మంత్రమయింది. తదితరులకది వశం చేసుకోవడానికి వీలులేనిది సరికదా అభ్యసించేటందుకు ప్రయత్నించడానికి కూడా సాధ్యంకాని ఒక మానవాతీత శక్తిగా తలపబడుతూన్నది. ఏ విషయంలోనైనా అభివృద్ధి పొందవలె

నంటే మంచి విశ్వాసంతో పని ప్రారంభించాలి. సంశయంతో ప్రారంభించిన పని విజయం పొందదు. సంశయం మనిషిని నిరుత్సాహ పరుస్తుంది. నిరుత్సాహం అపజయానికి దారి తీస్తుంది. అన్ని లోక వ్యవహారాలనూ మన మొక్కవ విశ్వాసంతోనే ప్రారంభం చేస్తాము. ఒక పిల్లవాణ్ని విశ్వ విద్యాలయానికి పంపితే కొన్నియేండ్లయిన తరువాత పట్టపరీక్షలో ఉత్తీర్ణుడై వస్తాడని మనకు గట్టిగా తెలుసు. అహింసా పట్టపరీక్ష కూడా అటువంటిదే. దీనికి కూడా బాగా కష్టపడి శిక్షణ పొందాలి. ఇల్లే పాఠశాల. పాఠం తానే. నీ వాచరణలో పెట్టని యే పాఠాన్నీ ఇతరులకు నచ్చచెప్ప లేవు. సత్యాగ్రహ సిద్ధాంతం నీవు చేసి మఱీ చెప్పవలసిందని ఆదేశిస్తుంది. నీవు మాటి మాటికీ కోపంతో మండిపోతూ ఇతరులను సహనం కలిగి ఉండవలసిందని చెప్పజాలవు. తాను అభివృద్ధి పొందవలెననే నిజమైన కోర్కెతో తనకు తాను పశ్చాత్తాపపడి, తనను తాను మందలించుకోవడమే ఆత్మ సంస్కారానికి ఆవశ్యకం. మొట్టమొదట మనకు కోపం వచ్చిన సంగతి మనం గ్రహించాలి. తన తప్పును తాను తెలుసుకొన్నప్పుడే తిరిగి తెప్పరిల్లడానికి వీలు కలుగుతుంది. నీ వెన్నిసార్లు తప్పు చేశావో లెక్క పెట్టుకో-ఎన్ని పర్యాయాలు నీవు నీ పిచ్చికోపాన్ని చూపించావో ఆలోచించుకో. కోపం వచ్చినప్పుడు నీ కుమారుణ్ని నీకు జ్ఞాపకం చేయమను. తరువాత నీకా అబ్బాయి కనిపిస్తే చాలు నీతప్పు నీకు తెలిసిపోతుంది. ఇంకా కోపం చల్లారకపోతే నీ భార్య వచ్చి నీముందు నిలబడితే అప్పుడైనా గుక్క తిప్పుకోవడానికి వీలు కలుగుతుంది. అదికూడా

చాలకపోతే అటువంటి సందర్భాలలో నీ ఎదురుగా అద్దం తెచ్చి చూపించ వలసిందని ముందుగానే ఎవరికైనా చెప్పిఉంచు. అద్దంలో కోపంతో ఉన్న నీమొగం ఎంత వికారంగా ఉంటుందో నీవు చూచుకోగలవు. కోపంతో ఉన్న మనిషి ముఖమంతా నుడ్డ తలుపడి అచ్చంగా కోతివలే ఉంటాడు. అద్దం చూడడంతోనే నిన్ను గురించి నీవు సిగ్గుపడతావు. ఈ కోప నివారణోపాయాలను ఎంత వృద్ధులైనా అవలంబించవచ్చు. మన ప్రవర్తనలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించవలెనంటే వయస్సు వచ్చినంత మాత్రాన సమయం మించిపోయినట్లుగా భావించకూడదు. ముసలితన మయినప్పటికీ తక్కిన లోకనీతిని మన్నిస్తూ ఉన్నట్లే కోపాన్ని ఆపుకోవడం కూడా విధిగా భావించాలి. నీకీ ఆత్మనిగ్రహం అలవడిన తరువాత ఈ సూత్రాలనే నీ ఇల్లాలికీ బిడ్డలికీ అనువర్తింపచేయి. అనేకసార్లు మనం మన భార్యాబిడ్డల యెడల చాలా పిచ్చిగా ప్రవర్తిస్తాము. అటువంటి సందర్భాలలో పాపమామె యోగ్యతవల్లా వాళ్ల నిస్సహాయతవల్లా మాత్రమే మనం మర్యాదగా బతికి బయట పడుతూ ఉంటాము. ఒక్కొక్కప్పుడు తనను కొట్టవద్దనీ, తనకు వచ్చిన కోపాన్ని మనస్సులో ఉన్న కళ్లెములను లాగిపట్టి అపుకొన్నాననీ ఆ రేళ్ళ బిడ్డకూడా మనకు అర్థమయ్యేటట్లు చెప్పే అదృష్టం తటస్థిస్తుంది. అటువంటి అనుభవాలు మన జీవితాలకు చాలా మార్పును కలిగిస్తాయి. సత్యాగ్రహి ఇటువంటి ప్రయత్నాలను ముందు తనకూ, తరువాత తన కుటుంబానికీ, చిట్టచివరకు సంఘానికి అనువర్తింప చేయాలి. ఈ విధంగా వ్యక్తుల యొక్కయూ సంఘము యొక్కయూ చిత్త

వృత్తిలోనూ, శీలములోనూ, ప్రవర్తనలోనూ కలిగిన నూతన వికాసమువల్ల ప్రభుత్వ నీతిలోనే కొత్త ఆదర్శాలు ఆచరణలోకి వస్తవి. జే. హెచ్. హొమ్సు సంగ్రహంగా ఇలా అన్నాడు:

ఇతరులు వ్యక్తినీతిగా చెప్పినదానినే గాంధీ ప్రపంచోద్ధరణ కోసం సంఘ కార్యక్రమంగా పరిణమింప చేశాడు.

బీజము - వృక్షము.

మొక్క చిగురించి పూచి కాయాలంటే చాలాకాలం క్రిందటనే విత్తనం నాటబడి ఉండాలి. కొత్త ఉద్యమాలన్నింటికీ ఈ ఉదాహరణం సరిపోతుంది. అంటుమామిడి చెట్టుయొక్క మొదటి కాయలను ఊరికే తుంచివేస్తారు. వాటిని పండనిస్తే చెట్టుకే ముప్పు కలుగుతుంది. ప్రతి చెట్టుకూ దానికి కావలసిన ఆహారాన్ని వేళ్లద్వారా కింద భూమిలోనుండీ, ఆకులద్వారా పైన వాతావరణం నుండి తీసికొని బలిష్ఠమవడానికి సావకాశమియ్యాలి. అప్పుడే అది యజమానికి తగిన ఫలితాన్ని చేకూరుస్తుంది. విత్తనం నాటిన తర్వాత ఫలం చేతికి వచ్చేసరికి ఎంతో కాలం పడుతుంది. పనసచెట్టు పన్నెండేండ్లకుగాని ఫలితానికి రాదు. అటువంటప్పుడు అహింసవంటి నైతికోద్యమం సరియైన రూపం దాల్చి మానవసంస్థలకు ఒరవడి పెట్టగల యోగ్యతను సంపాదించాలంటే 25 సంవత్సరములు పట్టడం ఒక అబ్బురం కాదు. ప్రతి చరిత్రాత్మక సంఘటనమూ మనకు ప్రత్యక్షంగా కనిపించడానికి ఇరవై అయిదు సరివత్సరాలు పడుతుందని కౌంటు హర్మాన్ కీసర్లింగు (**Count Hermann Keyserling**) చెప్పిన మాటకిదే అర్థము. అంతేకాదు ఉద్యమోద్దేశా

లకూ కార్యక్రమాలకూ కూడా తండ్రికీ కొడుకుకూ పోలిక లోనూ ప్రవర్తనలోనూ ఎంత భేద ముంటుందో అంత భేద ముంటుంది. ప్రతి కొత్త ఉద్యమమూ అదివరకు ప్రచారంలో ఉన్న నమ్మకానికి విరుద్ధంగా బయలుదేరుతుంది. అభివృద్ధి అనే త్రాసుముల్లు ఒక వైపునుండి మఱొక వైపుకు మొగ్గడం స్వభావ గుణం. కాబట్టి గాంధీ సత్యాహింసలపైన ఆధారపడి శాస నోల్లంఘన సత్యాగ్రహాద్యమాలను బోధించినా, అహింస అంటే హింస లేకపోవడమే కాక బాధా సహిష్ణుత, త్యాగ బుద్ధితో కూడిన కార్యశూరత్వము కూడా కలిగి ఉండడమని ఆయన వివరించినా, దేశంలో పోలీసునూ సైన్యమునూ లేకుండా చేసి ఒక విధమైన ఆధ్యాత్మిక అరాచక తత్వాన్ని స్థాపించ నూహించినా ఇదంతా ఆయన కలియుగాన్ని సాధ్యమైనంత త్వరగా కృతయుగంగా మార్చివేయవలెనని చేసే ప్రయత్నమే తప్ప భారతీయ చిత్తవృత్తి కర్థంకాని కొత్తపని యేదీకాదు. "సాంఘిక నైతిక వివర్తనాలు (Evolutions) ఆకస్మికంగా వెంటవెంటనే సర్ రాధాకృష్ణ చెప్పినట్లు రాకపోవచ్చును. కాని వివర్తనం నెమ్మదిగా జరిగినకొద్దీ విప్లవం రావడానికి వీలు న్నది. విప్లవం రాకుండా ఆపాలంటే వివర్తనం (evolution) తొందరగా జరిగేటట్టు చూడాలి." గాంధీ తన సన్నిహిత పరి సరములకంటె చాలా ముందు పరుగెత్తడానికి ఒకే అర్థం చెప్ప వలసి ఉంది. అదేమంటే సంఘం నిమ్నోన్నతాలను సరిచేసు కోవడానికి ప్రయత్నిస్తుంది గనుక తాను పరుగిడినకొద్దీ తనవెంట సంఘం వస్తుందనీ, సంఘం వెనుకపడ్డప్పుడు తాను అప్పుడే వెను

కను తగ్గవచ్చుననీ ఆయన ఉద్దేశమైనట్లు అర్థం చెప్పుకోవాలి. అందువల్లనే గాంధీ సలహా ప్రకారం కాంగ్రెసు కేంద్రప్రభుత్వం నుండి సైన్యమును తీసివేయడానికి సందేహించింది. రాష్ట్రాలలో పోలీసును ఉంచడానికి గాంధీ అయిష్టంగానైనా అంగీకరించాడు.

౪

అహింస ఒక సమిష్టి పదం. ఒక సమగ్ర సిద్ధాంతం. ఒక సత్కార్యం చేయడమో, ఒక ఉపకారం చేయడమో మాత్రమే అహింస కాజాలదు. దానిలో ప్రేమవల్ల కలిగే అన్ని సుగుణాలూ ఇమిడి ఉన్నవి. "ప్రేమ అనగా ఎడతెగని బాధ" అన్నాడు ఏసుక్రీస్తు. ఈ "ఎడతెగని బాధ" లోనే సత్య సహన క్షమా గుణాలు ఇమిడి ఉన్నవి. అందులోనే ఎవరూ ఇతరుల యెడ చెడ్డతలంపులను కలిగి ఉండకూడదని అర్థమున్నది. చెడ్డ తలంపే కోపానికీ, కక్షకూ, కసికీ కారణం. తన అనుచరుడు తానన్న మాటనే తప్పిపోయినప్పుడు, తన ఆశ్రమవాసి ఆశ్రమ నియమాలకు విరుద్ధంగా నడచుకొన్నప్పుడు, శాసనసభాసభ్యుడు గాంధీ సిద్ధాంతంలో అవిశ్వాసాన్ని ప్రకటించినప్పుడు, దాని సత్యం నుండి తప్పించుకోవాలని కోరే జాతియొక్క ఆత్మను లొంగదీసుకోవాలని ప్రభుత్వం నిర్బంధచర్యల నవలంబించినప్పుడు-ఇంకా ఇటువంటి అనేక సందర్భాలలో గాంధీ చూపించే సహనశక్తి అద్భుతం. ఇందులో ఒక్కొక్కటి ఒక్కొక్కసారి తటస్థించినా, అన్నీ ఒక్కసారిగా తటస్థించినా ఆయన మేమీ క్షోభ పడడు, కాని కార్యజన్యమైన ఆయన

కోపం తక్షణం కారణజన్యమైన విషాదంగా మారుతుంది. ఒక మనిషి తన ప్రతికక్షిపైన చూపించిన ప్రేమ ఫలవంతమై ప్రతికక్షిని మార్చజాలక పోయినందుకే ఆయన విషాదం. అసహనం దౌర్జన్యంయొక్క రూపమే. గాంధీ సహనమూర్తి గనుక తొందరపడి యేపనీ చేయడు. కాని దాని పరిణామం మాత్రం శరీరంమీద ఉండకపోదు. ఆయన మనోద్వేగాన్ని అనేకసార్లు అణచుకోగలిగినప్పటికీ అది ఆయనహృదయంపైనా రక్తనాళాల పైనా విపరీత పరివర్తనములను కలిగించి "రక్తత్వర" ను (Blood Pressure) అప్పుడప్పుడూ భయంకరంగా ఎక్కువ చేస్తూ ఉంటుందంటే ఆశ్చర్యం లేదు. యుద్ధవిజయాలకంటె శాంతి విజయాలు ఎక్కువ సన్నుతింప దగ్గవని చాలామంది అంటారు. కాని మరింత రక్తపాత హేతువై నూతన యుద్ధానికి బీజంగా పరిణమించి యుద్ధాన్ని ముగించిన సంధియైన వర్సెలీస్ నాటి శాంతివంటి శాంతి యుద్ధాలను తుదముట్టింప చాలవు. ప్రపంచంలో "సౌహార్దమూ సౌభ్రాతృత్వమూ" పెంపొందించే శాంతియే శాంతి. గాంధి ఇండియా సరిహద్దు రాష్ట్రాలలో పొందిన అఖండ విజయమే ఆయన కటువంటి శాంతిలోగల విశ్వాసమునకు తార్కాణం. అక్కడి వీరజాతులలో వ్యాపించిన అహింసా తత్వాన్ని ఆయన ఇలా వర్ణిస్తున్నాడు.

> ఆ దృశ్యం నేను చూస్తానని అనుకోలేదు. వాళ్ళందరూ అందులోగూర్చి చాలా శ్రద్ధగా ఉన్నారు. వారి హృదయాలలో దానియందు విశ్వాసం బాగా నాటుకొనిపోయింది. అహింసలో ఆశాజ్యోతిని వారంతటు వారు

చూస్తూన్నారు...ఇంతకుపూర్వం అంతా అంధకారం. అక్కడ రక్త ప్రవాహాలతో కూడిన కుల కలహాలు తప్ప కుటుంబాలు లేవు. గుహాలో పులులవలె జీవిస్తూ ఉండేవారు. పఠాను లెప్పుడూ కత్తులూ తుపాకులూ బల్లెములూ పుచ్చుకొని తిరుగుతూన్నప్పటికీ వాళ్ళు పై ఉద్యోగులను చూస్తే తమ నౌకరీలు పోతయ్యేమోనని భయపడుతూ ఉండేవారు. ఇప్పు డనేక వేలమందిలో ఈ చిత్తవృత్తి మారిపోయింది. ఒకళ్ళ నొకళ్ళు ఖూనీలు చేసుకొనే కులకలహా లిప్పు డంతరించి పోయినయి. ఇదంతా ఖాన్‌సాహెబు యొక్క అహింసోద్యమ ప్రభావం. పఠాను లిప్పుడా చిల్లర నౌకరీలమీద ఆధారపడి లేరు. వారు పొలం దున్ను కొనే దృష్టిలో ఉన్నారు. ముందు ముందు పరిశ్రమల వైపునకు కూడా వారి చూపు వెళ్ళగలదని వారి మాటలనుబట్టి తెలుస్తుంది.

గాంధీకి అహింసయందుగల విశ్వాసాన్ని గమనించవలెనంటే ఆయన మ్యూనిచ్ రోజులలో వ్రాసిన వ్రాతలనుబట్టి చూస్తే తెలుస్తుంది. ఆయన కందులో ఎంత నమ్మకమున్నదో వ్రాత అంత శక్తివంతంగా ఉన్నది.

ఇండియా దేశపు అరిష్టాలను తొలగించేటందుకు, అహింస అనే ఔషధ ప్రయోగంకోసం దేవుడు నన్ను తన పరికరంగా చేసుకొన్నాడు. అహింసలో నాకు అచంచల విశ్వాసం. అది మన దేశమునకు కావలసిన కోరికలను నెరవేర్చడమేకాక, దానిని సరిగా అనువర్తింప చేసేయెడల భారత దేశ మునకు వెలుపల జరిగే రక్తపాతాన్ని నిలిపి పాశ్చాత్య దేశములను కూడా రానున్న ఆపత్తులనుండి రక్షించగలదు.

ఒక సందర్భములో గాంధీజీ అహింసను ఈ విధంగా వివరించారు.

నా అభిప్రాయంలో అహింస అంటే యేవిధంగానూ ఉదాసీనత కాదు. అది అత్యంత కార్యోత్సాహ శక్తి అని నేననుకొంటున్నాను. అహింస ఉత్కృష్ట ధర్మం.

గాంధీ అహింస - ఉదాసీనత్వమూ కాదు. పిరికి తనమూ కాదు.

హింసాస్థానము తనకు జరుగుతూన్న అవమానాన్ని నిస్సహాయ స్థితిలో గుడ్లు మిటకరించుకొని పిరికి తనంతో చూస్తూ ఊరుకోవడం కంటె తన మాన సంరక్షణార్థం ఆయుధ బలప్రయోగం జేయడంకూడా నాకిష్టమే. (గాంధీ.)

కాని ఈ సలహా - అన్ని ప్రయత్నాలు విఫలమైనప్పుడు చిట్టచివరి ప్రయత్నంగా మాత్రమే - అనుసరించ తగినదని మాత్రం మనం జ్ఞాపక ముంచుకోవాలి. గాంధికి శాంతి ప్రధాన మన్న మాట సత్యమే. కాని అశాంతి మనుష్యత్వాని కవమానం గలిగించే శాంతిగా ఉండకూడదు.

అహింసా శక్తి.

తన అహింసా సిద్ధాంతం వలన గాంధీజీకి నిస్సహాయస్థితి యెన్నడూ కలగలేదు.

ఎంత గట్టి లోహమైనా తగినంత వేడిఉంటే కఱుగుతుంది. అదే విధంగా ఎంత కఠినహృదయమైనా తగినంత వేడిగల అహింసవల్లన కఱిగి తీరుతుంది. అహింస పుట్టించ గలిగిన వేడికి అంతు ఉండదు. నా యాభై సంవత్సరాల అనుభవంలోనూ ఫలానా సందర్భంలో అహింస పనికిరాకుండా పోయింది. అందువల్ల నేను నిస్సహాయుడనైనాను అని చెప్పుకోదగిన స్థితి యెన్నడూ నాకు కలుగలేదు.

అహింసయొక్క అతి విస్తృతమైన అద్భుత శక్తి కాకపోతే జనరల్ స్మట్సు ఎన్నడూ ఈ విధంగా చెప్పి ఉండడు.

మీ ప్రజలంటే నా కయిష్టం. మీ వాళ్ళకు సహాయం చేయాలనే కోరిక యెన్నడూ నాకు లేదు. కాని నేనేమి చేయగలను? మా కవసరమైనప్పుడు మీరు సహాయ పడుతూన్నారు. అటువంటప్పుడు మిమ్మ నేమైనా చేయ డానికి మాకు చేతులెలా వస్తయి? ఇంగ్లీషువాళ్ళ వలెనే మీరుకూడా దౌర్జన్యంలోకి దిగితే బాగుండుననని చాలాసార్లు నే ననుకొంటూ ఉంటా. అప్పుడు మాకు మిమ్మల్ని సాగనంపడం తేలిక. కాని మీరు శత్రువు కైనా హాని చేయరు. సొంతంగా బాధ పడడం వల్లనే జయం పొందవలె నని మీ కోరిక. మీ అంతట మీ రేర్పరచుకొన్న మర్యాదలైన దాక్షి ణ్యాముసుండి గానీ క్షాత్రధర్మమునుండి కానీ ఒక్క అడుగైనా అటూ ఇటూ తొలగిపోరాయె. అందువల్ల మే మేమీ చేయలేని నిస్సహాయ స్థితి లోకి వచ్చాము.

గాంధీ "ప్రతి బ్రిటిష్ వానికీ" అని వ్రాసిన ఉత్తరం ఆయన ధైర్యాన్ని తెలియచేస్తుంది. కాని అందులో ఆయన వ్రాసిన మాటలు క్రొత్తవికావు. 1939 మార్చిలోని సంకట స్థితిలో ప్రపం చాని కేదైనా సందేశం పంపవలసిందని న్యూయార్కు పత్రికా విలేఖకుడు కోరినప్పుడు కూడా ఇవే అభిప్రాయాలు వెల్లడించాడు. నాటి సమస్యా పరిష్కారానికి ప్రజాపాలక ప్రభుత్వాలు వెంటనే ఒక్కసారిగా ఆయుధ విసర్జనం చేయడం మంచిదని సలహా యిచ్చాడు. రివరెండ్ విన్‌స్లో యూదుల కిలా సలహా యిచ్చాడు:

రానున్న మహా విలయమును రోజు రోజుకూ గ్రహిస్తూన్న ప్రపంచం ఉన్మాద బంధనాలయమునుండి తప్పించుకొని శాంతి స్వాతంత్ర్యము లనే సూర్య రశ్మిని చూడవలెనంటే సత్యాగ్రహం ఒక్కటే ఉపాయం.

"యుద్ధ ప్రయత్నాలతోనూ యుద్ధ భయంతోనూ నిండి ఉన్న ప్రపంచాన్ని తృణీకరించే గాంధీ నాయకత్వంలో ఆశా కిరణం అగుపిస్తూన్నది" అని డాక్టర్ ఉడ్ అన్న మాటలు తూచినట్లు సరిపోతున్నవి.

౫

అసహాయోద్యమం ప్రారంభ మైనప్పటినుండీ దాని లక్షణం అహింసా పూర్వక మైనదని వివరింప బడుతూనే ఉన్నది. ఒక్కొక్కప్పుడు "అహింసాయుత అసహాయోద్యమం" అనే సమాసంలోని విశేషణాన్ని విడచిపెట్టి నామవాచకాన్నే కొంతమంది పలుకుతూన్నప్పటికీ ఉద్యమ లక్షణంలో విశేషణం యొక్క ప్రాముఖ్యత కేమీ లోటు రాలేదు. కాంగ్రెసు వాదులు మొత్తం మీద అహింసా నియమాని కంగీకరించారు-కాని మతసిద్ధాంతంగా మాత్రం దాని నందఱూ అంగీకరించలేదు. అప్పుడే రాజనీతి (Policy) అనేమాట వ్యాపకంలోకి వచ్చింది. అహింస అప్పటినుండీ ఒకొక్కప్పుడు మత సిద్ధాంతం గానూ మఱొకప్పుడు "రాజనీతి" గానూ వ్యవహరింప బడుతున్నది. ఈ అంతర్భేదం కాంగ్రెసు అధికారం లోకి రానంత వరకూ ప్రత్యక్షంగా కనిపించలేదు. 1937 జులైలో రాష్ట్రీయ మంత్రివర్గ నిర్మాణములు జరిగిన తరువాత పోలీసువా రనేక పర్యాయములు తుపాకులు కాల్చవలసి వచ్చింది. ఒక్క సంయుక్త రాష్ట్రాల లోనే కాంగ్రెసు మంత్రివర్గాలున్న రెండున్నర సంవత్సరాల స్వల్పకాలం లోనూ 47 పర్యాయములు సైనికులను సహాయం కోసం పిలువవలసి వచ్చింది. ఇందుకు తోడు యుద్ధం జరుగు-

తూండగానే కేంద్ర ప్రభుత్వంలోకి సభ్యులను పంపవలసి వస్తుందేమో ననే ఆలోచన ఒకటి- అందుకు తగిన సావకాశా లప్పటికి వెంటనే లేకపోయినా-కాంగ్రెసు హృదయంలో పని చేస్తూన్నది. సైనిక వ్యవహారాలన్నీ కేంద్ర ప్రభుత్వానికి సంబంధించినవే అవడంచేత కాంగ్రెసు మంత్రివర్గాలు, ఇతర ప్రపంచంతో పాటు, ఇండియాలో అంతవరకూ నడుపబడు తూన్న పద్ధతి ప్రకారం తాముకూడా పోలీసు మిలిటరీ పరి పాలన నడుపవలసిందేనా అనే ప్రశ్న ప్రధాన సమస్య అయింది. అప్పుడు కాంగ్రెసు భిన్న మార్గాలలో పోక తప్పదా అన్నంత స్థితి వచ్చింది. గాంధీ శాంతి సైన్యాన్ని స్థాపించి క్రమేణా బల ప్రయోగాన్ని తొలగించాలన్నాడు. కాంగ్రెసు కార్యవర్గంలో నున్న ఆయన సహచరులు రెండు పక్షాలుగా చీలిపోయినారు. అహింసను రాజనీతిగా గానీ, మతసిద్ధాంతంగా గానీ అవలంబించడం వల్ల కలిగే వేరువేరు ఫలితాలు అప్పుడు స్పష్టమైనవి. మొదటిది బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసే స్వరాజ్య పోరాటానికి మాత్రమే బాగా పనికి వస్తుంది. రెండోది సత్యాహింసల పునాదిగా గలిగిన నూతన సంఘ నిర్మాణమునకు శక్తివంతమైన పరికరముగా ఉపయోగ పడుతుంది. నీతి అయినా సిద్ధాంతమైనా కాంగ్రెసు వాదు లొక్కసారి అహింసా నియమాన్ని అంగీకరించిన తరువాత దానిని తమ యిష్టం వచ్చినట్లు మార్చుకోజాలరనే మాట మాత్రం సత్యం. ఈ సందర్భంలో గాంధీ "రాజనీతులకు కూడా మనసా వాచా కర్మణా కట్టుబడి ఉండవలసిన అవసరం

ఉన్నది. కాని అహింసను జాతీయ నీతిగా మన మవలంబించే యెడల మనము దాని భావాన్ని భాషనూ అక్షరాలా అనుష్ఠించాలి" అని అన్నాడు.

గాంధీ ఈ సందిగ్ధ సమయంలో కొంచెంగా పేర్లను మార్చాడు. కాని ఆ మార్పు చాలా అర్థవంత మయింది. రాజనీతిగా అవలంబించే వాళ్ళ అహింస దుర్బలుల అహింస అనీ, సిద్ధాంతంగా అవలంబించే వాళ్ళ అహింస బలిష్ఠుల అహింస అని పేరు పెట్టినాడు. మొదటి దానిలో మాకు హింస చేయడానికి తగిన శక్తి సామర్థ్యాలు లేవు గనుక అహింసను నీతిగా అవలంబించక తప్పింది కాదనే అర్థం ఇమిడి ఉంది. రెండవ దానిలో మాకు హింస చేయగలిగిన శక్తి సామర్థ్యాలు ఉన్నప్పటికీ మేము దానిని బుద్ధిపూర్వకంగా విడచి పెట్టినాము. అన్ని పరిస్థితులలోనూ మేము అహింసనే అవలంబిస్తాము అనే అర్థం ఇమిడి ఉంది. ఈ రెండింటికీ "నిర్బంధాహింస" "స్వచ్ఛందాహింస" అని కూడా పేర్లు పెట్టవచ్చు. 1940 జూన్, జులైలలో జరిగిన కాంగ్రెసు కార్యవర్గ సమావేశాలలో గాంధీ "పౌర రక్షక" సంఘ నిర్మాణమును గూర్చి మొట్టమొదటి సారి చర్చకు తెచ్చాడు. అప్పుడు వారి కాయుధాలుండవలెనా లేదా అనే విషయమున్నూ, కాంగ్రెసు కేంద్ర ప్రభుత్వములో మంత్రి వర్గాలను ఒప్పుకొంటే సైన్యమును గూర్చి ఏ వైఖరి అవలంబించాలనే విషయమున్నూ వర్కింగు కమిటీవారు సంపూర్ణంగా విచారణ చేశారు.

గాంధీ తన మనస్సులో ఉన్నదంతా వలపోసుకోవడం ప్రారంభించాడు. కాంగ్రెసు కార్యవర్గం వెంటనే నిర్ణయానికి రాలేక సందిగ్ధ స్థితిలో బడ్డది. కాలం పరుగెత్తి పోతూన్నది. పత్రికా విలేఖకులూ ప్రజలూ ఓపిక పట్టలేకుండా ఉన్నారు. ఇంత జాగ్రత్తగా కాపాడ దగిన రహస్యమేమిటి? రాజకీయ రహస్యాలు కూడా ప్రియుల రహస్యాల వంటివి. ఒకప్పుడు వాటిని చాలా జాగ్రత్తగా కాపాడ వలసినట్లు కనిపిస్తుంది. కాని కొద్ది కాలంలోనే అవి అందరికీ తెలిసిపోయి ఈ సంగతి ఎందు కింతకాలం పెట్టెలో పెట్టి తాళం వేసుకొన్నారో అని పిస్తుంది యితరులకు. జులై 17-21 తేదీలమధ్య పత్రికలకు తెలియకుండా ఎంతో కష్టంమీద కాపాడిన రహస్యం తరువాత ప్రజలందరికీ తెలిసిపోయింది. అప్పటి వర్కింగు కమిటీ సమావేశంలో ఆంతరంగిక కల్లోలములనుండీ, విదేశీయుల దండయాత్రల నుండీ దేశాన్ని రక్షించే విషయంలో తాము చేసిన నిర్ణయాలతో గాంధీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. కాబట్టి గాంధీజీ తననా బాధ్యతనుండి తొలగించ వలసిందని కోరిన కోరికయే ఇన్నాళ్ళనుండీ వర్కింగు కమిటీవారు దాచిపెట్టుకొన్న రహస్యమని ప్రజలు గ్రహించడానికి వీలయింది. అహింసను అన్ని సందర్భాల లోనూ అవలంబించి తీరాలని గాంధీ స్పష్టంగా వివరించాడు. వర్కింగు కమిటీ చేసిన వార్ధా తీర్మానము నేడు చరిత్రలో ఒక అధ్యాయం అవడమే కాక నాటి సంకట సమయంలో నాలుగు వారాల వరమే వాద ప్రతివాదాలకు మూలమయింది.

బలవంతుల ఆయుధం

హింసా పంకంలో పడి దొర్లుతూన్న ఐరోపా ఖండానికి, అంతర్జాతీయ వివాదాలను పరిష్కరించేటందుకు పశుబల ప్రయోగానికి బదులుగా మరొక ఆయుధాన్ని కాంగ్రెసు ప్రసాదించ గలిగిందని వార్ధాలో గాంధీజీ అన్నాడు. అహింస, బలాఢ్యులకూ బలహీనులకూ కూడా తగిన ఆయుధంగా ఉపయోగపడుతుంది. ఇంతవరకు కాంగ్రెసు అహింసను దుర్బలుల ఆయుధంగా వాడుతూన్నది. కాని ఇప్పుడు దండెత్తి వచ్చిన పరాయి సైన్యాల కనుకూలముగా ఆంతరంగిక కల్లోలములు కలిగించే బలవత్తర శక్తులకు వ్యతిరేకంగా కూడా అహింసా ఆయుధాన్ని ప్రయోగించడానికి అవకాశం కలిగిందని ఆయన తాత్పర్యం. "బ్రిటనుకు వ్యతిరేకమైన పోరాటంలో కాంగ్రెసు అహింస యొక్క శక్తి సామర్థ్యాలను పరీక్షించి ప్రజా. సామాన్యంలో ఎక్కడలేని చైతన్యమునూ కలిగించి నప్పుడు ఆంతరంగిక కల్లోలములను గాని, పరస్పర వినాశకర పోరాటములను గానీ కాంగ్రెసు, అహింస ద్వారా నిర్మూలించ లేకపోయినట్లయితే ఆ తప్పు కాంగ్రెసు దవుతుంది కాని, అహింసది కాదు. అయితే ఈ సందర్భాలలో ప్రయోగించ వలసిన అహింస బలవంతుల అహింస" అని గాంధీజీ వాదం. ఇందుకే గాంధీ వర్కింగు కమిటీల పంథాలు వేరు కావలసి వచ్చింది. వర్కింగు కమిటీ ఇటువంటి సందిగ్ధ సమయంలో బాధ్యత వహించక ప్రజా సామాన్యం తమయందుంచిన విశ్వాసానికి ద్రోహకరంగా ప్రవర్తిస్తుందా లేక ఇంతకాలం నుంచీ తాము నేర్చిన మహా

త్కార్యముల కనుగుణంగా గాంధీజీ సలహా నంగీకరించి కష్టము లనూ అపాయ పరంపరలనూ ఎదుర్కొంటుందా? మంత్రిత్వ స్వీకరణమూ అహింసావలంబనమూ ఈ రెండూ అవినాభావ సంబంధము కలవనీ, కాంగ్రెసుకు ప్రజా సామాన్యంపైన అహింసా యుతమైన పలుకుబడి కలిగేటంత వరకూ ప్రభుత్వం లోకి పోరాదనీ గాంధీ తలంపు. కాబట్టి విదేశీయుల దండ యాత్రలను అరికట్టడానికి కూడా కాంగ్రెసు ఆయుధముల నుప యోగించకుండా, "ప్రాణం గలిగిన ప్రాకారంగా" ఉండే శాంతి దళములను నిర్మించవలెనని తెలిసింది. ఇది గాంధీ చూపిన త్రోవ. వార్ధాలో ఆయన యిచ్చిన ప్రణాళిక ఇదే. వర్కింగు కమిటీలోకి ఇటువంటి గడ్డు సమస్య విచారణకు రావడ మిదే మొదటిసారి. అందువల్ల చాలా సంచలనం కలిగించింది. పై పెచ్చు తక్షణం నిర్ణయించ వలసి వచ్చింది.

గాంధీ ఇంతవరకూ తన అహింసా సత్యాగ్రహములను పరాధీన దేశం విషయంలోనే ప్రయోగించి చూచాడు. కాని స్వతంత్ర దేశాలలో కూడా వీటి ప్రయోగ వైశాల్యానికి వీలున్నదని ఆయన మనస్సులో లేకపోలేదు. బ్రిటిష్ సామ్రాజ్యం వంటి బలిష్ఠమైన సంస్థతో పోరాడి స్వాతంత్ర్యం సంపా దించుకో గలిగిన దేశం, ఆ పద్ధతులతోనే తన స్వతంత్రను కాపాడుకో గలదని గాంధీజీ అనేకసార్లు చెబుతూ వచ్చారు. అంటే అహింసతో సంపాదించుకో గలిగిన స్వాతంత్ర్యాన్ని అహింసతోనే కాపాడుకో వచ్చునని ఆయన విశ్వాసం. దౌర్జన్యం పైనా రక్తపాతం పైనా ఆధారపడే సంగ్రామ సైన్యముల

కంటె, శత్రుసైన్యాల్లకూ మాతృదేశానికీ మధ్య నిలచి ఆహుతి కాగలిగిన శాంతి సైన్యాలు ఉండడం అవసరమని ఆయన తలంపు.

జెక్కులకు సందేశం

1938 అక్టోబరు నెలలో జెక్కులు శత్రువులకు లోబడి పోవడము గూర్చి గాంధీ చెప్పిన మాటలీ సందర్భంలో పాఠకులకు జ్ఞాపకం చేయడం ఉచితం.

జెక్కుల దుస్థితి నాకు శరీర వ్యథనూ మనో వ్యథనూ కూడా కలిగిస్తూన్నది. కాబట్టి నాకు జెక్కులతో మాట్లాడవలెననే కోరిక కలిగింది. నా మనస్సులో కలిగిన అభిప్రాయాలు వారికి చెప్పకపోవడం పిటికి తనమేమో అనిపించింది. చిన్న దేశాలు, యూరోపియన్ నియంతల సంరక్షణ కిందకు రానైనా రావాలి లేక రావడానికి సంసిద్ధంగానైనా ఉండాలి. కాని పక్షంలో యూరోపులో అశాంతి తప్పదు. ఇంగ్లాండు, ఫ్రాన్సు దేశాలకా చిన్నదేశాల యెడల యెంత సుహృద్భావమున్నప్పటికీ అవి వాటిని సంరక్షించ లేవు. అవి జోక్యం కలిగించుకొంటే అపూర్వమైన రక్తపాతమూ వినాశనమూ తటస్థించడం తప్ప మరేమీ ప్రయోజనం లేదు. నేనే జెక్కునయినట్లయితే ముందుగా ఆ రెండు దేశాలకు మమ్మలను రక్షించే బాధ్యత లేకుండా చేసేవాణ్ని. కాని నేను జీవించి తీరాలి. నేనొక దేశానికి గానీ వ్యక్తికి గానీ లోబడి ఉండజాలను. నేను సంపూర్ణ స్వతంత్రుడనుగానైనా ఉండాలి. మరణించనైనా మరణించాలి. ఆయుధ బలంతో గెలుస్తాననడం వట్టి బడాయి. నా స్వాతంత్ర్యాన్ని అపహరింపపూనుకొన్నవారి నెదిరించి వారి యిష్టప్రకారం ప్రవర్తించక ఆ ప్రయత్నంలో నిరాయుధుడను గానే చచ్చిపోవ నిశ్చయించుకొన్న

ట్లయితే అది బడాయి అనిపించుకోదు. అటువంటి ప్రయత్నంలో నా శరీరం నశించ వచ్చును; కాని ఆత్మ నశించదు. అనగా నా గౌరవం నశించదని అర్థం. ఇటువంటి అకీర్తి ప్రదమైన శాంతిని నేనొక మహదవకాశంగా గ్రహిస్తాను. నేను అవమానమును తప్పించుకొని నిజమైన స్వాతంత్ర్యాన్ని సంపాదిస్తాను. కాని నా క్షేమం కోరే వారేమంటారంటే "హిట్లరుకు దయలేదు. ఆయనముందు నీ ఆధ్యాత్మిక ప్రయత్నాలేవీ అక్కరకు రావంటారు". "మీరు చెప్పింది నిజం కావచ్చు. అహింసా నిరోధ మవలంబించిన జాతిని గూర్చి చరిత్రలో ఎక్కడా లేదు. హిట్లరు నేను పడే బాధవల్ల మారకపోతే మరేమీ పరవాలేదు. అందువల్ల నాకు పోయేది కూడా యేమీ లేదు. నా గౌరవం నాకు ఉంటే చాలు. అది హిట్లరు దయమీద ఆధారపడి లేదుకదా? కాని అహింసలో నమ్మకం కలిగిన నేను దాని శక్తికి మేర ఉండదని అనుకోకపోవచ్చు. ఇంతవరకూ హిట్లరూ, హిట్లరువంటి వాళ్ళు, ప్రజలు దౌర్జన్యానికి లోబడి పోతారనే ఒక్క అనుభవం తోనే ప్రవర్తిస్తూన్నారు. నిరాయుధులైన అనేకమంది స్త్రీలు పురుషులు పిల్లలూ వారి దౌర్జన్యాన్ని అహింసా యుతంగా అరికట్టడం వారికి నూతనానుభవం కావచ్చును. ఉదార తరములునూ, సూక్ష్మతరములునూ అయిన ఈ శక్తులకు వారు దాసీనులుగా ఉంటారని యెవరు ధైర్యంగా చెప్పగలరు? నావంటి ఆత్మయే వారిదీని అంటాను నేను." "నీవు చెప్పేదంతా నీవిషయంలో నిజమే. కాని యిన్నడూ యెవ్వరూ యెఱుగని ఈ పనికి మీవాళ్ళు అందరూ అనుకూలిస్తారని నీవెలా అనుకొంటావు? వాళ్ళు యుద్ధం నేర్చినవాళ్ళు. ధైర్యంలో, ప్రపంచంలో, యెవరకీ వారు తీసిపోరు. ఇప్పుడీను వాళ్ళ నందరినీ ఆయుధా లవతల పారవేసి, కొత్తగా అహింసా నిరోధాన్ని నేర్చుకోమనడం వ్యర్థ ప్రయత్నముగా కనిపిస్తుంది నాకు" అని మఱొకమిత్రుడంట్టాడు. "నీవు చెప్పినది నిజమే కావచ్చును. కాని నాకు చెప్పాలని

బుద్ధి పుట్టింది చెప్పి తీరాలి. నా ప్రజలకు నా సందేశం ఇచ్చి తీర్తాను. ఏటు పోవడానికి వీలు లేక ఈ అవమానం నా మనస్సులో జీర్ణించి పోయింది. నాకు కనిపిస్తూన్న ఈ వెలుగును బట్టి అధమము నేనైనా నడచుకోవాలి" అని నేను జెక్కునయితే చెప్పి, ఆ ప్రకారం నడచు కొంటాను. నేను మొట్టమొదట సత్యాగ్రహం ప్రారంభించినప్పుడు నాకు సహచరుడే లేడు. స్త్రీలూ పురుషులూ పిల్లలూ అంతాకలసి మేము పదమూడువేల మందిమి ఉన్నాము. అవతలవారో మమ్ముల నందరినీ కలిపి నాశనం చేయగలిగినంత పెద్దప్రజ. నామాట యెవరూ వింటా రని నే ననుకోలేదు. అదంతా ఒక మెఱుపు మెఱసినట్లయింది. 13,000 మంది పోరాటంలోకి దిగలేదు. అనేకమంది వెనుక పడిపోయినారు. కాని జాతియొక్క గౌరవం కాపాడబడ్డది. దక్షిణ ఆఫ్రికా సత్యాగ్రహంవల్ల నూతన చరిత్ర రచించబడ్డది.

డాక్టరు బీనున్నకు ఇప్పుడు నేను బహుమతి చేసే ఆయుధం బలిష్ఠు లవలంబించ తగినది కాని దుర్బలులది కాదు. ఏవిధమైన దౌర్జన్య చింతా లేకుండా, ఆత్మ తప్ప తక్కినవన్నీ అశాశ్వతాలనే సంపూర్ణ విశ్వా సంలో, ప్రపంచంలో యెటువంటి అధికారాన్నికైనా సరే తల వొగ్గ కుండా యెదురు తిరుగ నిశ్చయించుకోవడం కంటె, ధైర్యతరమైన పని యేమీ లేదు. (గాంధీ.)

1938 అక్టోబరు 8 వ తేదీని అనగా మ్యూనిచ్ సంధి అయిన తరువాత గాంధీ ఇలా వ్రాశాడు :

తమ బలవంతులైన ఇద్దరు మిత్రులూ తమ్మును జారవిడిచిన తరువాత జెక్కులింతకంటే చేయగలిగిన పని యేమీ లేదు. కాని వారికి అహింస ఆయుధ ప్రయోగమే తెలిసి ఉన్నట్లయితే జర్మనీయే కాదు. ఇటలీ కూడా వచ్చినప్పటికీ వారిద్దరి బలాలనీ యెదిరించి జాతీయ గౌరవాన్ని

కాపాడుకో గలిగే వారని చెప్పే ధైర్యం నాకిప్పటికీ ఉంది. కాంగ్రెసు వాదులు నమ్ముతున్నట్లుగా హిందూదేశం అహింసద్వారా స్వాతంత్ర్యాన్ని సంపాదించుకో గలిగితే, దానిద్వారానే దాన్ని నిలబెట్టు కొంటుంది. జెకోస్లోవకియా వంటి చిన్న దేశం కూడా అదే విధంగా చేసుకోగలదు. అనేక ప్రతికూల సందర్భాలలో పోరాడి చచ్చిపోవడం ధైర్యం మాట నిజమే. ఆక్రమణ దారుతో పోరాడడం మాని తల ఒగ్గ నిరాకరించడం అంతకంటె యెక్కువ ధైర్యం కాదా? బల ప్రయోగానికి ప్రజలు లోబడి పోతారని ప్రభుత్వాలకు తెలుసు. కాని నిరాయుధులైన స్త్రీలు, పురుషులు, పిల్లలూ బలాధిక్యతకు లోబడకుండా తమపైన జరిగే దౌర్జన్య ప్రయోగాన్ని ద్వేషరహితమైన ఆనందంతో భరించడం, ప్రభుత్వాలకు కొత్త అనుభవం కలిగించడ మవుతుంది.

జీవితంలో వచ్చే దుఃఖాలెప్పుడూ మనకు చెప్పిరావు. గాంధీ వార్ధాలో, స్వతంత్ర భారతదేశం కూడా 'అహింసా సిద్ధాంతంతో స్వసంరక్షణ చేసుకోవాలనే ప్రతిపాదన చేసినప్పుడాయన తన జీవితంలో ఒక పెద్ద దుఃఖాన్ని చేతులారా తెచ్చిపెట్టుకొన్నట్లు తోస్తుంది-అంటే ఈ దుఃఖభారం కింద ఆయన నలిగిపోతాడని మా అభిప్రాయం కాదు. కాని ఈ పరిస్థితి రాకుండా చూచుకొని ఉండవలసిం దాయన. అయితే కష్టాలను గానీ చిట్టచివరకు మహాపదలను గానీ తప్పించుకొని పోయే స్వభావం లేదాయనకు. తన ఉపదేశం సజీవమైన శక్తియో లేక మృతసిద్ధాంతమో తన సహచరులను గట్టిగా ఒరిసి చూడమన్నాడు. ఒక్కొక్కప్పు డాయా సంస్థలలో ప్రాముఖ్యంగా కనిపించిన మతాలు కానీ అభిప్రాయాలు కానీ

సిద్ధాంతాలు కాని కొంతకాలానికి పనికిరాక పోవడం నిజంగా సహజం. మొట్టమొదట్లో అభిప్రాయాలు ఘనీభవించి సంఘ నిర్మాణం జరిగేటప్పుడు పనిచేసిన ముఖ్యసూత్రం, తరువాత కొన్నాళ్ళకు నిరుపయోగం కావచ్చు. తాము లోకంలో ఉన్నంతవరకు కళ్ళయెదుట కనిపిస్తూన్న లోక వ్యవహారాలను కాదనడానికి వీలు లేదని గాంధీ సహచరులు గట్టిగా అభిప్రాయ పడ్డారు. వారి రాజకీయ ధర్మాలకూ వారి ఆధ్యాత్మగురుని యెడల వారికి గల భక్తికీ తగవు వచ్చింది. వారికి గాంధీ యెడ గల భక్తికి కారణం కేవలం విశ్వాసం-ఒకవిధమైన మూఢ విశ్వాసమని కూడా అనవచ్చు. కాని ఇప్పుడు తమ ముందున్న సమస్యను జాగ్రత్తగా పరిశీలించి ఆచరణయోగ్యము కాదా అని నిర్ణయించ వలసిన అవసరం వారికి వచ్చింది. తన సహచరులు తమ నమ్మకాని కనుగుణంగా నిలబడడం గాంధీకి సంతోషమయింది కాని, వారు చేసిన తప్పు నిర్ణయాలను గూర్చి వారంత పట్టుదల వహించడం ఆయనకు విచారం వేసింది. ఇప్పుడు వారు బ్రిటిష్ ప్రభుత్వమునకు కేవలం నైతిక సహాయమే కాక సైనిక సహాయం కూడా చేస్తామని నిర్ణయించి నందువల్ల భారత దేశపు దృక్పథం పూర్తిగా మారిపోయిందని అర్థం. భారత దేశపు చిత్తవృత్తి ఇక ముందునుండీ సైనిక శిక్షణ సైనిక సన్నాహాల వంకకు ప్రసరించక తీరదని వారు వెల్లడి చేశారు. ఇదీ ఆయన విచారానికి కారణం. ఆయన ప్రశాంతంగానూ గంభీరంగానూ కనిపించాడు గాని, ఆయన హృదయంలో అగ్నిపర్వతం వంటి దుఃఖాన్ని సహజ మందహాసాలమధ్య దాచి

పెట్టుకొన్నాడని ఊహించడం అంత కష్టంకాదు. లాంగ్ స్టన్ హ్యూస్ (**Longston Hughes**) అనే నీగ్రో కవి పాడిన హృదయ విదారకమైన ఈ పాట ఆయన కనుకోకుండా నోటికి వచ్చి ఉంటుంది.

నోటినిండా నవ్వినందున
గొంతు విప్పి పాడి నందున
ఇంత కాలము నేను పొందే
చింత లేదని యెంతు వోయీ!

*　　*

నోటి నిండా నవ్వినందున
అంత రంగపు గొంతు వినవో?
కదను తొక్కే కాళ్ళ గలగల
మరణ బాధ గ్రహింప లేవో!

౬

గాంధీజముకు మూలాధారమైన అహింసను గూర్చి విచారించే టప్పుడు, దానికీ విస్తృతావకాశమునకూ, విశాలార్థమునకూ, చెప్పబడిన అభ్యంతరాలను కూడా ఆలోచించడం యుక్తం. అహింస ఒక మతమై మనము ధైర్యవంతులంగా ఉండాలనీ, ఉన్నతాత్ములంగా ఉండాలనీ, అందటియందూ ప్రేమగలిగి ఉండాలనీ బోధిస్తూన్నట్లయితే, లోక వ్యవహారాలకు సంబంధించక "విశ్వప్రేమ" అనే మాటకు సంక్షిప్తమైన పర్యాయ పదముగా ఉండేది. కాని అహింసాయోధుడు "తనను బాధించే వాళ్ళయెడ దుశ్చింత లేకుండా మరణించడానికి సంసిద్ధంగా

ఉండాలి" అన్నాడు గాంధీ. శత్రువున్నాడనేమాట గాంధీ గమనించనే గమనించడు. కాని శత్రువని పిలవబడేవాణ్ని కూడా సత్యాగ్రహి స్నేహితుల్ని చూచినట్లుగానే ప్రేమతో చూడాలని ఆదేశిస్తాడు. అందువల్లనే తాను సత్యాగ్రహిగా అహింసావలంబకుడుగా "ఇంగ్లాండు క్షేమం కోరుతూంటా" నని గాంధీ పదే పదే చెప్పుతూండడం. గాంధీజంలో "అహింస అంటే ప్రేమ. అది ఎన్నడూ ప్రతిపక్షుల యెడల స్థూల పరికరాల నుపయోగించదు." ఇది వ్యక్తుల సందర్భంలో ఉండవలసిన ఒక సుగుణమైతే కావచ్చును గాని దీనిని రాజకీయ పరికరంగా ఎప్పుడూ ఉపయోగించ వచ్చుననే మాట మాత్రం ఒక క్షణం కూడా ఒప్పుకోవడానికి వీలు లేదని విమర్శకుల వాదం. ఈ సందర్భంలో భగవద్గీత హింసను అంగీకరించిందనీ హింస చేసినవారి ఉద్దేశం మనకు ప్రధానం కాని, హింస చేశాడా లేదా అనే విషయం ప్రధానం కాదనీ చాలామంది వాదిస్తారు. ఇంకా కొందరేమి చెబుతారంటే భగవద్గీత ప్రకారం, విశ్వప్రేమ కలవాడు కూడా తన నైతిక ఆధ్యాత్మిక ఆదర్శాలకు భంగం లేకుండానే శత్రు సంహారం చేయవచ్చునని "మంచి పనులు మంచివాణ్ని చేయవు; అయితే మంచివాడు మంచిపనులు చేస్తాడు. చెడ్డపనులు చెడ్డవాణ్ని చేయవు. కాని చెడ్డవాడు చెడ్డపనులు చేస్తూంటాడు." అని మార్టిన్ లూథర్ చెప్పిన మాటలను కూడా కొందరు విమర్శకు లుదాహరిస్తూ ఉంటారు. పూర్వ హిందూ ఋషులూ యోగులూ అహింస, వైరాగ్యాలు అవలంబించవలసిన ధర్మంగా చెప్పి ఉంటే, గాంధీ అందరికీ అవలం

బించ మంటాడని మరికొందరు విమర్శకు లాక్షేపిస్తారు. అయితే గాంధీ పిరికివాళ్ళ విషయంలో మాత్రం అహింసావలంబనమును మినహాయింపు చేశాడు. ఆయన సిద్ధాంత ప్రకారము పిరికితనం కంటె హింస మంచిది. "ఇతరులను చంపకుండా ధైర్యంగా చచ్చిపోలేని వానికి అపాయకర స్థలమునుండి సిగ్గువిడిచి పారిపోవడం కంటె చంపి చావమని నా సలహా" అన్నాడు గాంధీ. అవసరాన్ని బట్టి సిద్ధాంతాన్ని మార్చుకోవడం గానీ త్యజించడం గానీ గాంధీ స్వభావం కాదు. ఆయన మహర్షి. ఆయన ఊహలుగానీ చర్యలుగానీ ఈ భౌతిక ప్రపంచంలోని సామాన్య మానవు డందుకోవడానికి వీలులేనివి. సాయుధ దండయాత్రలను ఎదుర్కోవడానికి అహింసా సైన్యాన్ని చేకూర్చే విషయంలో కాంగ్రెస్సు గాంధీ స్థితికి రాజాలక పోయిందని విమర్శకుడు నిరూపిస్తాడు. గాంధీ "అది విషాదకరం" అంటాడు. గాంధీ ఒకసారి కాదు; అనేకసార్లు హిందూదేశ రక్షణ అహింసాత్మకంగా ఉండాలని ఉద్ఘాటించాడు. భారత "రాజ్య తంత్రంపైన గ్రంథాలు వ్రాసిన పూర్వ స్మృతికారు లనేకమంది బలప్రయోగమును హింస అనలేదని నిర్ధారణ చేస్తారు కూడా అనేకులు. హిందూమతం తన మత, నైతిక, సాహిత్యంలో అహింసా సిద్ధాంతాన్ని అంగీకరిస్తూన్నదని ఋజువు చేయడానికి చరిత్రను ఉదాహరణంగా తీసుకోన్నందువల్ల యేమీ ప్రయోజనం లేదు. అయిదు వేల సంవత్సరాలకిందట దానికి కొన్ని మినహాయింపులూ, కొన్ని షరతులూ, కొన్ని హద్దులూ అప్పటి పరిస్థితుల ననుసరించి యేర్పాటు చేయబడి ఉండవచ్చును. హిందూరాజ్యతంత్ర

నీతి శాస్త్రాలు, శాంతి, భద్రతల రక్షణ నిమిత్తమూ, పరాయి రాజుల దండయాత్రల నెదుర్కొనేటందుకూ, బలప్రయోగం ధర్మ సమ్మతమే నని స్పష్టంగా చెప్పినవి. కాబట్టిన్నీ, హిందూ రాజనీతి గ్రంథాలు ఇతర దేశాలనూ రాజ్యాలనూ జయించ వల సిందని కూడా ప్రోత్సహించినవి కనుకనూ, యాభై శతాబ్దాలు గడచిన తరువాత నేటి పండితులూ విద్వాంసులూ కూడా, వాటినే ఉదాహరణాలుగా తీసికొని వాటిలోని విధి నిషేధాల ప్రకారం నడుచుకొందా మనడం న్యాయ్యమా? మే మెన్నడూ దండయాత్రకూ దౌర్జన్యానికీ లోబడి పొమ్మని చెప్పలేదే! కాని వాటి నరికట్టే విధానం అహింసగా ఉండాలని ఈ ఇరవయ్యో శతాబ్దంలో మా ప్రయత్నం. ఇంతవర కెన్నడూ అకలంక మైన అహింస ఆచరణలో పెట్టబడలేదు కనుక ఇకముందు ఆచరణలోకి తీసికొని రాకూడదనడం న్యాయ్యమా? మన పూర్వు లెన్నడూ విమాన ప్రయాణాలు చేయలేదు గనుక మనం చేయ లేము-చేయకూడదు అంటే ఒప్పుకొంటామా? హింసా విష యంలో ఇంత పూర్వాచార పరాయణులుగా ఉన్న వీరే, సైన్సువల్ల మనిషి ప్రకృతిని జయించి ప్రపంచ మంతకూ యంత్ర యుగాన్ని తీసికొని రావలెనని విశ్వసిస్తూన్న అతి నవీనులు. ఈ విమర్శకులలో చాలామంది సంఘ వ్యవస్థాపకులైన పెద్దలు కూడా ఉన్నారు. వారందరికీ వినయపూర్వకమైన మా మనవి యేమంటే, ప్రపంచంలో నైసర్గికాభివృద్ధి ఆగిపోనట్లే నైతికాభి వృద్ధి కూడా ఆగిపోలేదని; ఇంతవరకున్నూ మనిషి ఆత్మ, శరీరంలో బంధింపబడి పోయింది. శరీరమూ మనస్సూ కలిసి ఆత్మపైన

అధికారం చేస్తున్నాయి. కొత్త యుగంలో ఆత్మ శరీరాన్ని వాహనంగా చేసికొని నడిపిస్తుంది. అంతేకాని యజమానిగా చేసుకోదు.

అహింసను ఆధ్యాత్మిక సిద్ధాంత ప్రకారం విమర్శించేవారు కూడా ఉన్నారు. వారిలో ఒకడు శబసాగరుని ఉదాహరిస్తూ "చంపడం, కొట్టడం, బాధ పెట్టడం, విసిగించడం, జీవులకు నష్టం కలిగించడం ఇదంతా హింసగా చెప్పి, పరాధీన జాతి విదేశీ ప్రభుత్వానికి పన్నులు చెల్లించక పోవడం, ఆ ప్రభుత్వ చట్టాలను ధిక్కరించడం, ఉద్యోగస్థులను విసిగించడమే గనుక ఈ కార్య క్రమానికి సంబంధించినంతవరకు సత్యాగ్రహం అహింసా సిద్ధాంతానికి అనుగుణంగా లేదని వాదిస్తాడు. శబసాగరుని ప్రకారం అహింసావలంబకుడు "ఏ జీవికీ మనస్సుచే గానీ మాటచే గానీ క్రియచే గానీ యే విధమైన బాధా కలిగించకూడదని" కూడా ఆ విమర్శకు డంటాడు. బార్డోలీ పన్నుల నిరాకరణ సందర్భంలో ప్రభుత్వానికి నష్టం కలగడమే కాక, ఎంతమంది రైతులకో ఎన్ని రైతు కుటుంబాలకో చాలా బాధ కూడా కలగ లేదా అని ప్రశ్నిస్తారు కొందరు. అహింసా ధర్మాన్ని ఆదే శించిన మహర్షులే అనేకసార్లు అయిన దానికీ కానిదానికీ అనేక మందికి శాపాలు పెడుతూ దానిని అనుష్ఠించలేక పోయినారు. వారహింసాపరులు కారు సరికదా హింసాపరు లంటారు కొంతమంది. ఇందు కుదాహరణాలుగా ఇతిహాసాలలో నుండి పరశురామ విశ్వామిత్రులను చూపిస్తారు. నారదుడు సరా సరి మహావిష్ణువునే శపించాడు చూడమంటారు. ఆశా శాపా

లన్నీ పైపెచ్చు నైజాలయినయి యింతకంటే అన్యాయ్య మున్నదా అంటారు. ఓషధులూ, లతలూ, మృగాలూ, పక్షులూ, లేళ్ళు ఈ అన్నీ మనుష్యుల ఆహారాలు కాబట్టి ఇవి తింటే పాపం లేదని వేదాలలో ఉన్నట్లుగా, ధర్మవ్యాధుడు కౌశికునికి చెప్పిన మాట లుదాహరించి, హింస, అహింస అనే మాటలు పరస్పరమూ మారడానికి వీలున్న మాటలు. వేటకోసం జంతువును చంపడం హింస; ఆహారంకోసం చంపడం అహింస, అని కొందరు వ్యాఖ్యానం చేయడం మాకు తెలుసును.

విమర్శలకు జవాబు.

ఈ విమర్శ లన్నిటికీ పూర్తిగానూ సంతృప్తికరంగానూ జవాబులు చెప్పవలసి ఉన్నది. కురుక్షేత్ర సంగ్రామంనాడు, ఏ కారణంవల్ల హింస అంగీకరింపబడి సంగ్రామ ఫలితాల కది హేతువుగా పరిణమించి నప్పటికీ తరువాత సంఘటనలనుబట్టి అది వ్యర్థమని తేలిపోయింది. కౌరవులంతా నశించారు. పాండవులు వారితో ఉన్న కుక్క మాత్రమే మహాప్రస్థానము చేయగా అంత రాజ్యాని కొక్క పసికూన ఔరసుడైనాడు. పాండవ జయచిహ్నంగా ధర్మరాజు చేసిన అశ్వమేధ యాగంలో, ఒక బంగారు ముంగిస అతడు చేసిన హింసను పురస్కరించుకొని హేళన చేసింది. గాంధీ సిద్ధాంతంలో మఠంలో ఉండే బైరాగులకు ప్రాపంచక భోగాలను త్యజించిన సన్న్యాసులకు' లోకంలో ఉండి పౌర ధర్మాలను నిర్వర్తించ వలసిన గృహస్థులకు అందరికీ ఒకటే ధర్మం ఉపదేశింప బడ్డది. సాంఘిక, ఆర్థిక,

రాజకీయ, భౌతిక, ఆధ్యాత్మిక విభేదాల్లను తొలగించడానికే గాంధీ ఈ నూతన సిద్ధాంతాన్ని నిర్మించాడు. సమగ్ర మానవ జీవితంలో, భావంలో గాని ప్రవర్తనలో గాని వేలువేలు అరలు మరలూ ఉన్నవని ఆయన మతం అంగీకరించదు. ప్రాపంచక వ్యవహారా లన్నిటికీ తన సిద్ధాంతాలను అనువర్తింప చేయవచ్చు నని ఆయన విశ్వాసం. అందఱూ కూడా ఇంత ఉన్నతాశయం తోనూ, ఇంత ఉన్నత దృక్పథం తోనూ ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరిక.

రెండవ విమర్శకుడు ముఖ్యంగా మన జీవితాలకు సంబంధించిన ఒక విషయాన్ని తీసికొని తార్కిక దృష్టితో విమర్శ చేస్తూ న్నాడు. ఒకొక్కప్పుడు తర్కం చాలా బాగా ఉన్నట్లు తోచినా, దాని పర్యవసానం మాత్రం అన్యాయంగానూ అనర్థదాయకం గానూ ఉంటుంది. అనేక సందర్భాలలో మన జీవిత సూత్రాలు తర్కానికి పూర్తిగా వ్యతిరేకంగా ఉంటయి. ఓషధులకు ప్రాణమున్నది. జపాను దేశీయులు ఆత్మకూడా ఉందని నమ్ముతారు. కాబట్టి శాకాహారి యైనవాడు ఈ ఓషధులను కోసినందువల్ల జీవహత్యయే కాకుండా ఆత్మహత్య కూడా చేస్తూన్నాడు. కనుక మనుష్యులను చంపే వానికి, ఈ శాకాహారికి లేకపోతే సత్యాగ్రహికి యేమీ భేదంలేదని వాదించే వాదన బాగుండవచ్చు కాని అది జీవితానికి మంచిదికాదు. పూర్వ ఋషులకు కోపం వచ్చిన వారి మీద శాపాలు పెట్టడానికి వారి తపోబలం వల్ల వారు సమర్థులైనంత మాత్రాన వారు చేసిన పనులన్నీ సత్యాగ్రహ నియమములకు అనుగుణంగా ఉన్నదని

ఎవ్వరూ తప్పజాలరు, ఋషులు పూర్వ మండినమాట నిజమే. ఋషులలో కూడా ఋషులున్నారు. విశ్వామిత్ర దుర్వాసులకూ, వసిష్ఠునకూ గల భేదం గమనిస్తే ఆ సంగతి తెలుస్తుంది. ఋషులకు కూడా కొందఱికి కొన్ని దౌర్బల్యాలున్నాయి. మన పూర్వులందఱూ నిష్కళంక ప్రవర్తన గలవారని గానీ అహింసను అక్షరాలా ఆచరణలో పెట్టినారని గానీ భావించకూడదు.

అహింసకు వ్యతిరేకంగా మూడో అభిప్రాయం కూడా ఉంది. ఈ తరగతివారు అహింస కేవలం మర్యాదస్థుల యొద్ద తప్ప జయం పొందదనీ, ఈ అహింసా వ్రతావలంబకు లెంత గొప్పవారైనా వట్టి మూర్ఖుల దగ్గర వీరి ఉపదేశాలు ఎందుకూ పనికిరావనీ ఒక్కొక్కప్పుడు వీ రటువంటివారికి లొంగిపోవలసి కూడా వస్తుందనీ వాదిస్తారు. సత్యాగ్రహం కానీ అహింస కానీ జయం పొందదగినవే అయితే అసత్యాన్నీ హింసనూ ఆరాధించే అజ్ఞానుల దగ్గర కూడా అవి జయంపొంది తీరాలి. అంతేకాక మర్యాదస్థుల దగ్గర తప్ప అహింస జయం పొందదనే వాదమే సరియైనది కాదు. ఎందువల్ల నంటారా మర్యాదస్థు లెప్పుడూ అహింసా తత్పరుడుగానే ఉంటాడు. కాబట్టి వానికి వ్యతిరేకంగా అహింసను ఉపయోగించనే అక్కరలేదు. అహింసా తత్పరులైన ఇరువురు వ్యక్తుల కెప్పుడూ తగాదాయే రాదు. అహింస పోరాడవలసింది హింసతో; ఈ సందర్భంలో పూర్వపు ఉపనిషద్వాక్య మొకటి ఉదాహరిస్తాం.

"అసతో మా సద్గమయ
తమసో మా జ్యోతిర్గమయ
మృత్యో ర్మా! మృతంగమయ"

"నన్ను అసత్తునుండి సత్తుకు, చీకటినుండి వెలుతురుకూ, మృత్యువు నుండి అమృతత్వమునకు కొనిపో" అని పై వాక్యానికి అర్థం.

శ్రీరామ చంద్రుణ్ని గానీ, హిందూ సంప్రదాయ ప్రకారం జీవన్ముక్తుడని పేరొందిన జనక మహారాజును గానీ, వసిష్ఠ మహర్షిని గానీ జయించడానికి సత్యాగ్రహం చేయవలసినదని యెవ్వరూ గట్టిగా వాదించరు. ఈ ముగ్గురు మహాపురుషులూ ఎన్నడూ చెడుతలంపులను మనస్సులకు రానీయరు. చెడుమాటలు అనరు. చెడుపనులు చేయరు. కాబట్టి వీరిపైన సత్యాగ్రహమే అనవసరం. సత్యాగ్రహం కేవలం దుష్టులకు, దుర్మార్గులకు వ్యతిరేకంగా ఉపయోగించ వలసిన ఆయుధం. ప్రతిపక్షి ఎక్కువ దుర్మార్గుడని మీరు ఋజువు చేసిన కొద్దీ వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం చేయడం ఎక్కువ అవసరమని ఋజువు చేస్తూన్నా రన్నమాట.

కొన్ని సందర్భాలలో హింస కూడా మంచి పని చేసిందని కొందఱు వాదిస్తారు. ఆ మంచిపని హింసవలన కాదు జరిగింది. అహింసకు పరిహారంగా జరిగిన అహింసా కృత్యముల వలననే, ఆ మంచి కలగిందని అంటూ, అందు కుదాహరణంగా ఇండియాలో బ్రిటను చేసిన పనిని, గాలులో రోము చేసిన పనిని పేర్కొన్నాడు ఆల్డస్ హక్స్లే (Aldous Huxley). కాని

ఆయనే "ఈ విజయాభివృద్ధికి దారి తీసినవనీ చెప్పడం చాలా కష్టము" అని కూడా అన్నాడు. హిందూ సంఘం హింసను ప్రత్యేకించింది. క్షత్రియులను మాత్రమే శాంతి భద్రతలు కాపాడే నిమిత్తం ఆయుధాలను ఉపయోగించ వచ్చునని ఆదేశించింది. బౌద్ధమతం, ఆయుధాలను తయారుచేయడం, అమ్మడం విషాలను మత్తు పదార్థాలను చేయడం, సిపాయీపని చేయడం, జంతువులను చంపడం ఈ అన్నిటినీ నిషేధించింది. హిందూ బౌద్ధ సంస్కృతులు మత యుద్ధాలద్వారా వ్యాప్తి కాలేదు. కేవలం శాంతి బోధలవల్లనే ఆ మతాల కంత ప్రచారం కలిగింది. హిందూ బౌద్ధ మతస్థుల జీవిత పద్ధతులలోనూ ప్రభుత్వ నిర్మాణంలోనూ మాత్రమే హింస ఈ విధంగా దూరంగా ఉంచబడ్డదని భావింపనక్కరలేదు. సంగ్రామ రాక్షసి హాహాకారాలు చేస్తూన్న యూరపులో కూడా వయస్సును బట్టీ, కుటుంబ బాధ్యతలను బట్టీ సోపానక్రమంగా మాత్రమే యోధులాహ్వానింప బడుతూన్నారు. కాబట్టి అనాదినుండీ ప్రపంచం హింసను ఆక్షేపణీయంగానే పరిగణిస్తూన్నది.

సత్యాగ్రహ భావము.

మీ రేమైనా చెప్పండి అహింసను పిఱికితనమని తప్పుగా అర్థం చేసుకొనే మిత్రులు కొంతమంది ఉన్నారు. తన ఆస్తినీ అధికారాన్ని తన బలంచేత-భౌతిక బలంచేత కాపాడుకో గలుగుతూన్నాడా లేదా అనే విషయంమీద. మనిషియొక్క, శౌర్యం, దర్పం, ప్రతిష్ఠా, ప్రాముఖ్యతా-ఈ అన్నీ ఆధారపడి ఉంటవి.

తన ప్రతిష్ఠ, తన దేశ గౌరవము, తన మతముయొక్క ఉత్కృష్టతా, తన మత స్వాతంత్ర్యమూ తన స్థిర చరాస్తుల రక్షణౌ, తన స్త్రీల శీల గౌరవాలూ, తన సంఘ శ్రేయస్సూ, తన మాతృదేశ స్వాతంత్ర్యమూ ఈ అన్నిటిని గూర్చి సత్యాగ్రహికూడా తక్కిన అందఱివలెనే చాలా శ్రద్ధ వహిస్తాడు. ఇండియాలో గాంధీ ఉపదేశములవలన సత్యాగ్రహి యెంతెంత త్యాగాలు చేశాడో మనకు తెలిసిన విషయమే. వాటినన్నిటినీ ఇక్కడ ఉదాహరించడం అనవసర కాలహరణమే కాక వ్యర్థాడంబరమనిపించుకోవచ్చును కూడా. సత్యాగ్రహ నాయకుడు పోరాటానికి మొనలో ఉండి తన అనుచరు లందఱికీ మార్గదర్శకుడుగా ఉన్నాడే కాని ఎన్నడూ వెనుకపీటీని నిలుచుండి యెఱుగడనే మాట ఒక్కటి చెప్పితే చాలు. సామ్రాజ్య దర్పితుడు కూడా సైనికులను సమకూరుస్తాడు. కాని వాండ్ల నందఱనూ ముందుగా ఫిరంగిగుండ్లకు గుఱి చేస్తాడు. అందులో ఆయన కుమాళ్ళు కూడా ఉంటారు. వీరికీ సత్యాగ్రహికీ మఱొక ముఖ్యభేద మేమిటంటే సత్యాగ్రహి పెద్దపెద్ద మాటలు చెప్పడు. యిరోపా మహా సంగ్రామం జరిగిన ప్రెసిడెంటు విల్సను కాలంలో (1914-17-18) ప్రతివారినోట "వెనుకపడి ఉన్న సంఘాల ఉద్ధరణము-చిన్నజాతుల మోక్షము" అనే నినాదాలు వినపడేవి. తరువాత సంఘటనలను బట్టి అవి ఎలా గాలి కెగిరిపోయినవో అందఱికీ తెలుసు. నిరుపేదలకు గానీ నిస్సహాయులకు గానీ ఉపకారం చేయవలెనంటే ఒక్కొక్క దేశాన్ని గానీ, ప్రపంచాన్ని గానీ కేంద్రంగా పెట్టుకొంటే జరుగదు. చిన్నచిన్న ప్రదే

శాలను కేంద్రాలుగా చేసికొని పనిచేస్తూ వాటినన్నిటినీ ఏకీకృత చేస్తే అది నిజమైన "ప్రజోపకార" మవుతుంది. అంటే ఆ పని గృహపరిశ్రమల నిర్మాణం వంటిది కాని యంత్రాగార నిర్మాణం వంటిది కాదు. ఒకజాతిని దుష్టశక్తులనుండి విముక్తి చేస్తామనే పేరుతో గుణ పరిమాణాలలో అంతకంటెను ఎక్కువ దుష్టశక్తుల నవలంబించి లక్షలాది ప్రజలను నాశనము చేసినందువల్ల ప్రయోజనం లేదు.

ఇంకా కొంతమంది మనిషి చేస్తూన్న పనినిబట్టి గాదు. అతని గొప్పతనాన్ని నిర్ణయించ వలసింది, కలుగుతూన్న ఫలితాన్ని బట్టి నిర్ణయించ వలెనని వాదిస్తారు. ఆమాట నిజమే. కాని చాలా సార్లు మనము సదుద్దేశాలతో చేసిన పనులకు దుష్ఫలితాలు కలుగుతూంటాయి. అయితే దురుద్దేశంతో చేసిన పనికెక్కడా సత్ఫలితం కలగడం జరుగదు. నీవు బలప్రయోగం చేసిన ప్రతి సారీ నీకు మనస్సులో కసి లేకపోయి ఉండవచ్చు. బల ముపయోగించినంత మాత్రాన పాపంలేదు. తల్లి బిడ్డను సరియైన దోవలో పెట్టడానికి శిక్షిస్తుంది. అప్పుడామెకు కసి ఉందా? అలాగే ఒక జాతిని తప్పుదోవనుండి తప్పించడానికి బలప్రయోగం చేయవలసి వస్తుంది. అది తప్పా? అని కూడా వాదిస్తారు కొందరు. ఖద్దరెందుకు కట్టరయ్యా అని కొందరిని ప్రశ్నిస్తే మాకున్న దేశాభిమానాన్ని ప్రదర్శించడం మా కిష్టంలేదు. కాని మా హృదయాలనుచీల్చి చూడండి; మా మాతృదేశప్రేమ రక్తాక్షరాలలో మీకు ప్రత్యక్షమౌతుందంటారు. ఇటువంటి వన్నీ తప్పులు పోవడానికి చెప్పే మాటలయినా కావాలి లేదా

కుతర్క మైనా కావాలి. తల్లి తన బిడ్డను చెయి చేసుకొన్న కొంత సేపటికి తప్పు చేశానని పశ్చాత్తాప పడుతుంది. పోలీసువాడు లాఠీ చార్జి చేసేటప్పుడు తన మానవత్వం మఱచిపోయేటందుకు అడవి మృగంవలే అరుస్తాడు. అంటే వీరికి ఒకప్పుడు కాకపోతే మరొకప్పుడైనా తప్పు చేస్తూన్నామనే జ్ఞానం కలుగుతూన్నది. కాని యుద్ధాలకు పోయే సేనానులు గానీ వాళ్ళను యుద్ధరంగాలకు పంపే రాజకీయ ధురంధరులు గానీ ఎన్నడూ తాము తప్పు చేస్తూన్నామనే సంగతి ఒప్పుకొనే ఒప్పుకోరు. వీరందఱికీ భిన్న మైనవాడు సత్యాగ్రహి. అతనెన్నడూ తన మనస్సులో ఉద్దేశానికీ తాను చేసే పనికీ భేదం ఉంటుందనేమాట అంగీకరించనే అంగీకరించడు. అంతేకాదు అవలంబించే పద్ధతులకూ కలిగే ఫలితాలకూ కూడా భేదముంటుందని గుర్తించడు. అతను, హృదయంలో ఏమీ దాపరిక ముండదు. ఒక తప్పుపనికి వెనుక చాలా సదుద్దేశ ముండి ఉంటుందనే మాట ఆయన విశ్వసించడు.

ఫాసిస్టులు చూడండి: యుద్ధాన్ని ఎలా శ్లాఘిస్తారో, మనుష్యుల దేశభక్తినీ, ధైర్యాన్నీ, పౌరుషాన్నీ చూపించడానికది మంచి అవకాశం కల్పిస్తుందంటారు. కత్తిని వాడకపోతే తుప్పు పడుతుంది. వాడుతూంటే పదునెక్కుతుంది. కాబట్టి మనుష్యులలో ఉన్న శౌర్య సాహసాలు కూడా అంతేనంటారు. కాని ఒక కత్తి తన పదునును కాపాడు కోవడానికి రెండోకత్తి నుపయోగించదు. ఆలాగే తన శౌర్య ధైర్య సాహసాలను కాపాడు కోవడానికి ఒక యోధుడు మఱియొక యోధుడి ప్రాణాలను తీయకూడదనే మాట ఫాసిస్టు గమనించడు. యోధలక్షణం

చెడిపోకుండా ఉండాలంటే యోధుడు తన ప్రాణాల నర్పించడ మునకు సత్యాగ్రహి ఏమీ అభ్యంతర పెట్టడు. యోధలక్షణాలు ఇతరుల ప్రాణాలు తీయడంలోకంటె తన ప్రాణాలను ధైర్యంగా సమర్పించటంలో ఎక్కువ ఉన్నతస్థితికి వస్తవని సత్యాగ్రహి తలంపు. శాంతిమార్గం నెత్తురుతో తడిసి ఉండదు. పరుల రక్తంతో తడియని పాదాలే ప్రపంచంలోని శాంతి సుక్షేత్రాలను చేరగలవు.

హింసా స్పర్థలపైన ఆధారపడియున్న ఈ ప్రపంచంలో ఈ సహకార సిద్ధాంతం, ఈ ప్రేమసూత్రం, ఈ ఆత్మార్పణబుద్ధి, ఇవన్నీ అక్కరకు వస్తవా? అసలు రావడానికి వీలున్నదా? అని కొందరు హేళనగానూ మరికొందరు నిజంగానూ అడుగుతారు. ఈ మిత్రులకు మానవ ప్రకృతి స్వతస్సిద్ధంగా సరళంగా ఉంటుందనే విషయంలో యేమాత్రమూ సందేహం లేదు. కాని వారు తమ చుట్టూ వున్న అవినీతినీ కల్మషాన్నీ చూచి నిరుత్సాహపడి, సంస్కారులమని చెప్పుకొనే వారే ఈ విధంగా ఉంటే తక్కిన అశిక్షితుల విషయ మేమను కోవాలని ఆశ్చర్యంతో ఇటువంటి ప్రశ్న లడుగుతూంటారు. కాని ఈ అశిక్షితులైన అనేకమందికి తర్కం గానీ సూక్ష్మాంశ విమర్శన గానీ తెలియక పోయినప్పటికీ స్వతస్సిద్ధమైన గ్రహణశక్తితో వారి సహజ సరళ లక్షణాలను కాపాడుకొంటూంటారనే మాట ఈ మిత్రులు గమనించడం లేదు. ఇప్పుడు మనకు కావలసినది అహింసా తత్వముయొక్క ఆచరణ సిద్ధాంతములను గూర్చిన మానసిక పరిశోధనా కాదు, దాని శక్తి సామర్థ్యములను గూర్చిన అంచ

నాయూ కాదు. అహింసలో అచంచలమైన విశ్వాసమే కావాలి మనకు. అది సంప్రదాయాన్ని అభివృద్ధి చేస్తుంది. విశ్వాసమూ-సంప్రదాయమూ ఇవి రెండూ తగిన వాతావరణాన్ని సృష్టిస్తాయి. శాకాహారులుగా పుట్టి సరియైన వాతావరణంలో పెరుగుతూన్న పిల్లలున్నారుకదా. వాళ్ళలో రెండేళ్ళ బిడ్డలకు ఉల్లిపాయలు, చేపలు, మాంసం అంటే యేమి తెలుసు? అయినప్పటికీ వాటిని వాళ్ళు చీదరించుకొంటారు. వాళ్ళు అమాంసాహారులుగా పెరిగి పానమనే దుర్వ్యసనానికి దూరంగా ఉంటారు. అదేవిధంగా అపశ్రుతులతోనూ అపనిందలతోనూ, దౌర్జన్యంతోనూ, యుద్ధాలతోనూ, కసితోనూ, రక్తపాతంతోనూ నిండి ఉన్న ఈ సంసారాన్ని సంస్కరించడానికి, క్షమా, దయా, ప్రేమా అనే విత్తనాలను వెదజల్లి, పశుశక్తితో గాక ఆత్మశక్తితో బలపఋపబడే నూతన ప్రపంచానికి మనం దారి తీయాలి. అహింస నూటిన్నొక్క సూక్ష్మమైన బలవత్తమమైన ఆయుధం.

ప్రొఫెసరు మేస్ అహింసనుగూర్చి ఇలా అన్నారు :

అహింసయొక్క ఆధిక్యతను గూర్చి నా కెంతమాత్రమూ సందేహం లేదు. కాని దానిని ఉచ్చశ్రేణిలో ఆచరణలోకి తీసికొని రావడమెలాగా అనేదే నన్ను బాధిస్తూన్న విషయం. జనసామాన్యము యొక్క మనస్సుకు ప్రేమ సూత్రమును అర్థమయ్యేటట్లు అనువదించడం కష్టమని నా తలంపు. వ్యక్తులకు తగిన శిక్షణ నీయడం సులభం. వాళ్ళు మన శిక్షణకు భిన్నంగా ప్రవర్తించినప్పుడు మనమేమి చేయాలి? తిరిగి రావాలా? లేక ముందుకు సాగాలా?

గాంధీజీ ఇలా అన్నాడు :

ఇక్కడ మా ఉద్యమ సందర్భంలో నా కనుభవం కలిగింది. ఉపదేశం వల్ల ప్రజలు శిక్షణ పొందరు. అహింస ఆచరించ వలసినదే కాని ఉపదేపదేశించ వలసింది కాదు. బహిరంగ చిహ్నములతో హింసను అభ్యసించే విధానమును బోధించవచ్చును. ముందు యెదురుగా ఉన్న పలకలను, తరువాత యేవో కొన్ని లక్ష్యాలనూ, పిమ్మట మృగాలనూ తుపాకితో కొట్టడం నేర్వవచ్చును. అప్పుడు నీవు చంపే చదువులో సామర్థ్యం సంపాదించి నట్లవుతుంది. అహింసా తత్పరునికి బయటకు కనపడే ఆయుధమేమీ లేదు. అందువల్ల అతని మాటలేకాక చేష్టలుకూడా యేమీ ప్రయోజన కరములుగా కనుపించవు. నేను ఉద్దేశించకుండానే నీకు చాలా తీయనిమాటలు చెప్పవచ్చు. ఒకప్పుడు నాకు నీపైన నిజమైన ప్రేమ ఉంటే కూడా దానిని బహిరంగ పరచడానికి సావకాశం లేక పోవచ్చు. ఈ రెండు సందర్భాలలోనూ బయటకు నేను చేసే పని ఒక తీరుగానే ఉండవచ్చు. కాని ఫలితంలో మాత్రం వేరు కావచ్చు. మనం చేసే పని బయటకు బాగా తెలియక పోయినప్పుడు ఫలితం యెక్కువ శక్తివంతంగా ఉంటుంది. కాబట్టి అనుద్దేశ పూర్వకంగా నీవు నాపైన కలిగించే పరివర్తనం నాకు తెలియకనే పోవచ్చు. కాని అది బుద్ధిపూర్వకంగా కలిగించే పరివర్తనం కంటె అనేకరెట్లు గొప్పది. హింసలో కనుపించని దేదీ లేదు. అహింస మూడుపాళ్ళు కనిపించనే కనిపించదు. కాబట్టి అది యెంత కనుపించదో దాని ఫలిత మంత యెక్కువగా ఉంటుంది. అహింస కార్యరూపంలోకి వచ్చినప్పుడు అత్యంత వేగంతో ప్రయాణిస్తుంది. అప్పుడది లోకోత్తర విషయంగా పరిణమిస్తుంది. కాబట్టి ప్రజా హృదయం, ముందు తెలియకుండానూ తరువాత తెలిసీ మార్పు పొందుతుంది. తెలిసి మార్పు పొందినప్పుడు గొప్ప విజయం కలుగుతుంది. ప్రజలు జారిపోతూన్నట్లుగా కనిపించినప్పుడు, నా అను

భవములో నే నపజయం పొందినట్లు అనుకోలేదు. 1922 లో నేను శాసనోల్లంఘనమును నిలిపివేసినప్పుడు కూడా అహింసయొక్క శక్తి సామర్థ్యాలలో నాకు సంపూర్ణ విశ్వాస ముండెను. నేను కూడా నేనా ఆశాపూరిత చిత్తవృత్తితోనే ఉన్నాను. అహింస కేవల మొక ఉద్రేక విషయం కాదు. ఒకవేళ నా కేమీ వెలుగు కనుపించక పోయినా నేను నిరాశతో కుంగిపోను. ప్రతి పనికీ కాలం కూడా కలిసి రావాలి.

జన్మ వృత్తమూ (Heredity) పరిస్థితి(Environment) ఒక దానిని బట్టి ఒకటి పరివర్తనం చెందే సంఘంలోనూ ప్రపంచం లోనూ మనం జీవిస్తూన్నాము. విశ్వాసంతో నిండి సంప్రదాయంతో ఘనీభవించి ఉన్న జన్మవృత్తం, పరిస్థితి ప్రకోపింప చేసే తర్కవాదముల ఆఘాతములకు గురికాక తప్పదు. అనగా మనిషియొక్క ప్రవర్తనకు దోవతీసే అతని ఆవేశాలు గాని నిశ్చయాలు గాని విజ్ఞాన శాస్త్ర మత విశ్వాసములపైన కలిగించే భావముల ననుసరించి ఉంటవి. మానవ ప్రవర్తనం నిర్దోషంగా ఉండేటందుకు మనపూర్వు లానాటి పరిస్థితులను అనుభవములను వాద ప్రతివాదములను గమనించి భావి సంతానముయొక్క శ్రేయస్సు కొఱకు నిర్మించిన ధర్మ సిద్ధాంతములను భక్తితో అవలంబింప చేయడం కంటె మతమునకు పరమోద్దేశ మేమున్నది? నల్లిని, పేనును, చీమను, ఎలుకను, కప్పను, ఉడతను, తూనీగను, తేలును, పామును-వీ టన్నిటినీ కాలక్షేపం కోసమో, అవసరం కోసమో జనులు చంపుతూంటారు. కాని చిన్నతనంలోనే ప్రేమ తత్వాన్ని పిల్లల మనస్సులలోకి ఎక్కిస్తే ఆ ప్రేమ ఆత్మ లేని పురుగుల విషయంలో గాని ఆత్మ ఉన్న దిక్కులేని జంతువుల

విషయంలో గాని స్వానుభూతితో ఉప్పొంగక తప్పదు. బాధపడుతూన్న జంతువును చూస్తే బిడ్డకు కూడా ఎందుకు జాలి కలగాలి?' ఆ జంతువులో కూడా తనలో ఉన్న ప్రాణమే ఉన్నట్లు బిడ్డకు తెలుసు. తన ప్రాణంపైన తనకెంత తీపో దానికి కూడా అంత తీపి ఉంటుందని బిడ్డ ఊహించుకొంటుంది. ఇటువంటి ఊహ ఎప్పుడూ త్యాగాన్ని ప్రేరేపిస్తుంది. అంతకుతప్ప బోధించి ఊరుకోలేదు. ఈ చిత్తవృత్తిపైన ఆధారపడి ఉన్న నాయకు డెప్పుడు పోరులోకి "రా" అని పిలుస్తాడుకాని "పో" అని చెప్పడు. దేశభక్తిగల అహింసా యోధుడు తాను త్యాగిగా వుంటాడు. పెద్ద విషయాలకోసం చిన్న విషయాలను త్యాగం చేస్తాడు. కాబట్టి అహింస విశాలంగా గ్రహింప దగినది. అగాథమైన ప్రతి ప్రయోజనం గలది. సంపూర్ణ త్యాగభూయిష్ఠమైనది. సత్యాగ్రహి చుట్టరికము స్నేహము అనే మేరలను గమనించకుండా తల్లి బిడ్డకువలె దేశానికీ జాతికీ సేవ చేస్తాడు. తనను ప్రేమించినందుకో, లేక తనకెదురు రానందుకో కాక తనను ద్వేషిస్తూన్నందుకు తనపైన పగ పట్టినందుకు చూపించే ప్రేమ అతి శక్తివంతమైనది. అతి పవిత్రతమ మైనది. అతి స్వచ్ఛందమైనది. అది హృదయంలోనుండి పొంగి పొరలి వస్తుంది. అంతేకాదు. అది తన నిశ్చయాన్ని చక్కగా నిర్వహించ గలదు. ఎందువల్లననగా ఆ నిశ్చయానికది ఒక నూతన చిత్తవృత్తినీ చైతన్యాన్నీ చేకూరుస్తుంది. నిజంగా అది ప్రతికక్షి హృదయంలో విహరిస్తుంది. అనగా ప్రేమ ప్రతిబింబిస్తుంది. ప్రేమ కష్టాలకు జంకదు. కష్టములను కోరి తెచ్చుకొంటుంది.

ప్రేమకు పునాది ఆత్మ అందరికీ ఒకటే అనే సిద్ధాంతం, ప్రేమ గలవాడు తాను బాధ పడడానికి తయారుగా ఉండడమే అందుకు తార్కాణం. వినయము, బాధా సహిష్ణుత-ఇవి ప్రాచ్యదేశ భావాలు. ఇవి రెండూ కూడా మమకారమును తగ్గిస్తవి లేదా నిర్మూలిస్తవి. మొదటిది ఆత్మోన్నతీ మానసికోన్నతీ గలవాళ్ళ మనే అహంకారాన్ని తగ్గిస్తుంది. రెండోది శారీరక సౌఖ్యా వాంఛలను తగ్గిస్తుంది. వినయం ప్రేమ కింకొకరూపం. అది దాని అసలు సారం. ప్రేమతో సేవ చేయవలెనని నిరంతరమూ సంసిద్ధంగా ఉండేస్థితి-ఈ స్థితే సత్యాగ్రహి యొక్క బాధా సహిష్ణుతకు కూడా కారణం. ఒక విషయాన్ని సరిగా గ్రహించ లేక పోవడానికి గాని నిర్ణయించలేక పోవడానికి గానీ హేతువు. బయటి అభ్యంతరాలు కావు. ఆంతరంగికంగా ఉండే అడ్డం కులు, తాను చాలా తెలివిగలవాడననీ నీతివంతుడననీ అనుకోవడం వల్లనే మానవుడు విషయాలను సరిగా గ్రహించి నిర్ణయించలేక పోతాడు. ఇవి రెండూ లోపించిన వానిలో ప్రేమతత్వం జనిం చనేజనించదు. అహంకారమనే"ఇంజను"కు వినయమనేది "బ్రేకు." ఒకప్పుడు గర్వం కూడా వినయాన్ని ప్రేరేపించవచ్చు. కాని ఆ వినయానికి సేవాతత్వం మూలం కాదు. కష్ట సంసిద్ధత దానికి ఆధారం కానీ పోషణకానీ కాదు. గర్వం, దౌష్ట్యం, భయం, ఇవన్నీ ఒక వర్గంలోవి. ప్రేమ, ఐకమత్యం, సేవా పరత్వం, వినయం, కష్టసహిష్ణుత-ఇవన్నీ వాటి ప్రతికక్షి వర్గం లోనివి.

సరియైన సత్యాగ్రహి ఒక్కడైనప్పటికీ అసలు ఉద్దేశాన్ని నెరవేర్చగలడని 1940 లో గాంధీ అన్నమాట కొత్తగా ఆనాడు చెప్పినదికాదు. 1908 ప్రథమ భాగంలో దక్షిణ ఆఫ్రికా సత్యాగ్రహం ముగింపబడగానే జోహాన్సు బర్గుకు దగ్గరగానున్న ఒక పేటలో, యూరోపియనుల సభలో, గాంధీ అప్పటి పరిస్థితిని వివరించాడు. అప్పుడు ఆ సభకు అధ్యక్షత వహించిన సాను భూతిపరుడు హాస్‌కిన్ (Hoskin) అనే ధనవంతుడు గాంధీ ఆత్మ గౌరవానికీ, ప్రతిష్ఠకూ భంగకరమైన ఒకమాట అన్నాడట. "ఇంగ్లాండులో చర్చి సాంప్రదాయాలకు కట్టుబడి ఉండము అని చెప్పే (Non Conformists) వర్గంవారు, వోటుకోసం ఆందోళన చేసేవారు (Suffragists) లేవదీసిన ఉద్యమము వంటిదే దక్షిణ ఆఫ్రికాలో భారతీయుల సాత్విక నిరోధోద్యమం కూడా. అది దుర్బలుల సాధనం" అని అన్నాడట ఆయన ఆనాడే. గాంధీ, మానసికం గానూ నైతికం గానూ బలవంతుడైన ఏకైక సత్యాగ్రహి, యే ఉద్దేశాన్ని నిర్వహించడానికైనా సమర్థుడు కాగలడనే విషయాన్ని భావించాడు. ఆ సభలో సత్యాగ్రహం "ఆత్మశక్తి" యుతమైనదని చక్కగా సమర్థించాడు. దాని పొలిమేర సాత్విక నిరోధము నతిక్రమించి కూడా చాలా దూరం ఉందని వ్యక్తం చేశాడు.

ఇటీవల గాంధీ దేశాన్ని అహింసా శిక్షణమునందు ఆరితేరేటట్లుగా చేయాలని తలంచాడు. 1938 వ సంవత్సరంలో శాంతి సైన్య ప్రణాళికను తయారు చేశాడు. 1938 జూన్ 18 వ తేదీని ఈ ప్రణాళికను వివరిస్తూ శాంతి సైనికుల కుండవలసిన లక్షణా

లను నిర్ణయించాడు. దొమ్మీలు ముఖ్యంగా మత విషయికమైన దొమ్మీలు జరిగేటప్పుడు వాటిని ఆపివేయడానికి శాంతి సైనికులు తమ ప్రాణ సమర్పణం చేయడానికి కూడా సిద్ధంగా ఉండాలని ఆ ప్రణాళిక ఉద్దేశం. అనగా పోలీసువారి యొక్కయు మిలిటరీ యొక్కయు సహాయంతో నిమిత్తం లేకుండా శాంతి సైనికులు శాంతి భద్రతలను కాపాడగలిగి ఉండాలన్నమాట.

ఈ ప్రణాళికయొక్క కోరిక చాలా పెద్దదనీ నిర్వహణం అసాధ్యమని తోచవచ్చును. కాని కాంగ్రెసు తన అహింసా పోరాటంలో జయం పొందాలంటే పైన వివరింపబడిన పరిస్థితులను శాంత పద్ధతులతో ఎదుర్కొనదగిన శక్తి నది సంపాదించాలి. అందుకొఱకు,

౧ శాంతి దళంలో చేరిన ప్రతిసభ్యుడు అహింసలో అచంచల విశ్వాసం కలిగి ఉండాలి.

౨ ఈ శాంతిదూత ప్రపంచంలోని అన్ని మతములయందు సమాన గౌరవం కలిగి ఉండాలి.

౩ స్థానికంగా ఉన్న మనుష్యులే ఎక్కువగా తమ ప్రదేశాలలో ఉండి పని చేయాలి.

౪ వారు ఒంటరిగా గానీ, సమూహంగా గానీ పని చేయవచ్చు.

౫ స్థానికంగా తాను స్వయంగా చేసే సేవను బట్టి స్థానిక ప్రజలతో సన్నిహిత సంబంధం కలిగి ఉండాలి. అందువల్ల సంకట సమయాలలో శాంతి సైనికుని రాక వారి కయిష్టంగా గానీ అనుమానాస్పదంగా గానీ ఉండదు.

౬ వేలుపెట్టి చూపడానికి వీలులేని శీలమూ, నిష్పక్షపాతబుద్ధీ ఉండాలి శాంతి సైనికునకు.

౭ తుపాను వచ్చే సూచనలు ముందుగా కనుపించినప్పుడు శాంతిదళం కల్లోలం కలిగేదాకా వేచి ఉండకూడదు.

ఆ వాళ్ళ ప్రాంతాలలో ఉన్న ప్రజలతో సన్నిహిత సంబంధం కలిగించు
కోవడానికి తగిన విరామం కూడా ఉండాలి శాంతి దళ సభ్యులకు.

F కష్టం లేకుండా గుర్తించడానికి తగినట్లుగా వారికి ప్రత్యేక దుస్తు
లుండాలి. —గాంధీ.

ఇక్కడ ఉదాహరింప బడిన ఆదర్శం వెంటనే ఆచరణలోకి రావడానికి వీలు లేనిదనీ, యేసుక్రీస్తు సిద్ధాంతాల ననుసరించి ఒక భూఖండాన్ని పరిపాలించడానికి చేసే ప్రయత్నమనీ కొంతమంది ఆక్షేపణ. నిరాడంబరమూ, శాంతియుతమూ అయిన ఈ ప్రతిపాదనను చూచి యెవ్వరూ భయపడనక్కర లేదని గాంధీ వివరించాడు. శాంతిదళ సభ్యులు దేశంలోని అన్ని నేరాల విషయంలోనూ పోలీసువారి పనిని యావత్తూ తామే నిర్వహించ పూనుకొంటారని అనుకోవద్దు. కొన్ని సమయాలలో మతోద్రేకాలు ప్రబలి ప్రమాదకరమైన పరిస్థితు లేర్పడవచ్చును. అప్పుడు ప్రజామిత్రులుగా శాంతిదళ సభ్యులు జోక్యం కలిగించుకొని, వారి మర్యాదనూ ఆ ప్రాంతాలలో వారి కున్న ప్రతిష్ఠనూ పలుకుబడినీ వినియోగించి అక్కడ శాంతి వాతావరణము నేర్పాటు చేయవలెను.

1937 లో అండమాను రాజకీయ ఖైదీలు నిరశన వ్రతమునకు దిగినప్పుడు గాంధీ జోక్యం కలిగించుకొని వారిని విరమింపచేయ గలిగినాడు. అప్పుడు ఇండియాలో అహింసకు క్రొత్త ప్రోత్సాహం కలిగింది.

తరువాత కూడా ఆయన రాజకీయ ఖైదీల విడుదల విషయం లోనూ, బెంగాలులోనూ, ఇతర రాష్ట్రములలోనూ స్వేచ్ఛకు

భంగకరంగా అనేక మందిమీద జారీ చేయబడిన నిర్బంధపు టుత్తరువులను రద్దు చేయించడం విషయాలలోనూ శ్రద్ధ తీసుకొన్నాడు. దాని ఫలితంగా బెంగాలు గవర్నమెంటువారు వెంటనే ఒక్కసారిగా 1100 మంది ఖైదీలను విడచిపెట్టినారు. తరువాత డిటెన్యూలను విడచిపెట్టి ఇతరుల పైనున్న నిర్బంధపు టుత్తరువులను రద్దు చేశారు. వంగరాష్ట్ర ప్రభుత్వంవారి నిర్ణయమునకు గాంధీ అభినందించాడు. అప్పుడు కలిగిన వాతావరణం వల్ల తక్కిన రాష్ట్రాలలో కూడా అహింసా వ్రతులైన ఖైదీలను వదలిపెట్టక తప్పిందికాదు. బీహారు సంయుక్త రాష్ట్రాల ప్రభుత్వాలు, అందరు రాజకీయ ఖైదీలనూ విడచిపెట్ట వలెనని నిర్ణయించారు. కాని ఇండియాప్రభుత్వ చట్టం వారి కాటంకమయింది. అందువల్ల బీహారు సంయుక్త రాష్ట్రాల మంత్రులు రాజకీయ ఖైదీల పక్షాన పోరాడ నిశ్చయించుకొని 1938 లో హరిపుర కాంగ్రెసు జరిగే రోజులలో తమ పదవులకు రాజీనామాలు పంపినారు. ఇండియా ప్రభుత్వం కొంత బిగువు సడలించింది. కనుక అందరు ఖైదీలు విడచిపెట్టబడ్డారు. విడుదలైన ఖైదీలు, దాదాపు అందరూ హింసలో తమకు విశ్వాసం లేదని ప్రకటించారు. అహింసా చరిత్రలో ఆనాటినుండీ ఒక నూతనశకం ప్రారంభ మయింది.

అహింసా వ్రతాన్ని ద్విగుణీకృత శక్తితో ప్రచారం చేయడానికి ప్రపంచ సంగ్రామం నూతనావకాశాలను కల్పించింది. యూరోపియన్ జాతులకు గాంధీ పోపులు పంపిన సందేశాలు తాత్కాలికంగా ఫలప్రదములు కాకపోయినప్పటికీ అహింస

స్థిరభావం పొందుతూన్నదనడాని కెంతమాత్రమూ సందేహం లేదు. అహింస వట్టి గాలిమూట కాదు. ఒక స్పర్శవేది కాదు. ఒక రక్షరేకు కాదు. ఒక తాయత్తు కాదు. అది మానవలోకానికి పొరపాటు పడని శిశువుని వంటిది; ఆత్మ పరిశోధనా దీపం. జీవలోకంపైన ప్రేమను ప్రసరింపచేసే అంతర్జ్యోతి.

అహింస, సంఘాన్ని ఒకటిగా కూర్చే దారం. ఆకాశం మీదనున్న గ్రహ నక్షత్రాలు పరస్పరమూ సంబంధించి ఉన్న సంగతి, నక్షత్ర శాస్త్రజ్ఞులు కనిపెట్టేటంతవరకూ మనకెలా తెలియలేదో, అహింసతో సంఘం సంబంధించి ఉన్న సంగతి కూడా ఆలాగే తెలియలేదు. కాబట్టి అహింస ప్రజాతంత్రమునకు పునాది. అందువలన ప్రజా తంత్రముకింద ఉన్నవాళ్ళందరూ దాని పునాదికి భంగంవచ్చే యుద్ధాలలోకి దిగరు. యుద్ధాలలోకి దిగిన ఇరుతెగలవారిని ప్రజాతంత్ర పాలకులని చెప్పడానికి వీలులేదు. వారిలో ఒకడు అందరికీ తెలిసిన ఫాసిస్టుగానూ రెండవవాడు గుర్తించదగిన సామ్రాజ్య వాదిగానూ ఉంటాడు. సంపూర్ణ స్వాతంత్ర్యం ప్రతి జాతికీ ఆదర్శంగానూ, దాన్ని సంపాదించడానికి అహింస సాధనంగానూ ఉండాలని గాంధీ అభిప్రాయం. సత్యాహింసలు ప్రేమకు వ్యాకరణం వంటివి. వ్యాకరణ శాస్త్ర రచయితలు తమ సూత్రములను వ్రాయడానికి ముందెంత కాలంనుండో భాష ప్రచారంలో ఉన్నట్లుగానే సత్యాగ్రహి వాటి ఉపయోగాన్ని కనిపెట్టడానికి ముందెంతో కాలం క్రిందటనే సత్యాహింసలు జన్మించి ఉన్నవి.

అధ్యాయము 3

సత్యాగ్రహం

౧

దాని సిద్ధాంతం

జీవిత సమస్యలను పరిష్కరించుకోవడానికి సత్యాగ్రహ మొక దోషరహితమైన సిద్ధాంతమని, అధమము శాస్త్ర దృష్టితో నయినా ఇప్పటి కంగీకరింప గలుగుతూన్నాము. సాధారణ మానవబుద్ధికి దీనిని అర్థం చేసుకోవడం లోనూ ఆచరించడం లోనూ కొన్ని కష్టా లున్నందువలన యే కొద్దిమందో మాత్రమే దీనినిగూర్చి ప్రచారం చేస్తూన్నారు. ఇది వాడుకలోకి రావడానికి కూడా అదే కారణంతో జాగవుతూన్నది. సత్యం గ్రహించ తగినది (Abstract) అహింస కనిపించేది (Concrete). సత్యం జగత్తు కాధారం. అహింస జగత్తుకు రక్షణ. సత్యం జీవకణంలోని జీవద్రవ్యం. అహింస జీవబిందు రచనకూ స్థితికీ తోడ్పడే పదార్థం. జీవబిందువులు ఒకప్పు డస్థిమయంగానూ, మఱొకప్పుడు స్నాయుమయంగానూ, ఇంకొకప్పుడు నాడీమయంగానూ, వేఱొకప్పుడు రక్త సంబంధిగానూ, త్వక్సంబంధిగానూ, మేదోసంబంధిగానూ ఉండవచ్చును. కాని ఎక్కడ ఉన్నా జీవబిందు రచనను నిర్మిస్తాయి. అట్లే సత్యం అనేక రూపాలలో ఉండవచ్చును. కాని ప్రతి రూపంలోనూ కూడా సమన్వయ సూత్రంగా ఉంటుంది. అహింసా సహాయంతో అధునాతన పురాతన సమస్యలను పరిష్కరించడానికి సత్యం అత్యవసరం. సత్యాహింసల సంయోగ మనేక రూపాలలో

ప్రత్యక్షం కావచ్చును. కాని జీవిత సమస్యా పరిష్కారమున కుపయోగపడే ఏ మిశ్రమము లోనూ ఈ రెంటినీ వేఱువేఱుగా ఉపయోగించడానికి వీలులేదు.

సత్యమునుగూర్చి గాంధీ భావం

సత్యాగ్రహ కళకు సత్యాహింసలు అంగాంగీ భూతములు. అవి కేవలం ఉదాసీన శక్తులుకానీ ప్రతిషేధక శక్తులుకానీ కావు. అవి క్రియాశక్తులు. విజృంభణ శక్తులు. హింసా పద్ధతిలో జరిగే యుద్ధానికి యేయే గుణాలు కలవో ఆ గుణాలన్నీ కూడా ఈ సత్యాగ్రహ సమరకళకు ఆపాదించవచ్చు. శత్రువుల కేమీ లోచకుండా భయభ్రాంతులనుగా చేసి వారిలో మార్పు తెచ్చి వారిని జయించడంలో నేమి, స్వసైనికుల ఉద్రేకోత్సాహాలను పెంచి, వారికి త్యాగబుద్ధీ ధైర్యమూ సహనశక్తీ కలిగించి, వారి మనస్సులలో నియమబద్ధ బుద్ధిని కల్పించి, తక్కువ ద్రవ్యం తోనూ అంతకంటెనూ తక్కువ వినాశకర పరికరములతోనూ విశాల దేశంపైన పోరాటం సాగించడానికేమి సత్యాగ్రహం అప్రతిహతమైన క్రియాశక్తిగా పరిణమించిన సంగతి దాని సామర్థ్యాన్ని చవిచూచిన వారికి తెలియనిది కాదు.

రెండు వైపులు

సత్యాహింసలను గూర్చిన గాంధీ భావం చాలా తక్కువ మందికి తెలుసు. వీటిలో ప్రతి ఒక్కదానికి రెండు వైపు లున్నవి. మొదటిది విధి. రెండోది నిషేధం." చాంపరాన్ జిల్లాకలెక్టరు గాంధీజీ కొక కఠినమైన ఉత్తరం వ్రాసి తరువాత దానిని ఉప

సంహరించుకొని ఆ ఉత్తరం తిరిగి పంపవలసిందని గాంధీని కోరినాడు. అప్పుడు గాంధీ అనుచరులలో యువకులు కొందరు దాని నకలును తీసుకోవడానికి ప్రయత్నించారు. గాంధీ వారిని మందలించి ఆ ఉత్తరం నకలు మీదగ్గర ఉంచుకొన్నట్లయితే అది ఉపసంహరించుకోబడ్డట్లు కానేకాదు అన్నాడు గాంధీ. ఇర్విన్ సంధి సందర్భంలో కూడా సరిగా ఇంతే జరిగింది. హోమ్ శక్రటరీ అయిన ఎమర్సన్ అమర్యాదగా వ్రాసిన ఉత్తరాన్ని పునరాలోచన చేసి ఇండియా ప్రభుత్వంవారు ఉపసంహరించుకొన్నారు. దాని నకలిప్పుడు కాంగ్రెసు రికార్డులలో లేదు. ఉపసంహరించుకోబడ్డ ఉత్తరానికి నకలుంచుకోవడమంటే ఆ ఉత్తరంలోని విషయాలను మన ఫైలులో ఉంచుకోవడమే గాక హృదయంలో ఉంచుకోవడం కూడా అవుతుంది. అది సత్య విరోధమే కాదు; అహింసా విరోధం కూడాను అని గాంధీ వివరించాడు.

సత్యం - ప్రాక్పశ్చిమ దేశాలలో

తూర్పు దేశాలలో గాని పడమర దేశాలలో గాని సత్యమును గూర్చి ఒకేరీతి సిద్ధాంతా లుపదేశింపబడ్డవి. జాన్ మార్లే ఇలా అన్నాడు:

> మిన్ను విరిగి మీద పడ్డాసరే నిజానికీ న్యాయానికీ నిలబడి ఉండడం ప్రధాన ధర్మంగా ప్రజ లాదేశింప బడుతూన్నారు. కాని ఆచరణలో ఆ నిజాన్ని నిలబెట్టడం కోసమే కొంత రాజీ అవసరమవుతుందని అన్ని మతాలవారూ అంగీకరిస్తూన్న సంగతి మనకు తెలుసు. అయితే తాత్కాలికావసరములను ముందుగా గమనించి సత్యం విషయం

తరువాత విచారిద్దామనే భావం వల్ల జాతీయ జీవితం నీచస్థితికి వస్తుంది; ప్రజాభిప్రాయాన్ని అంతగా లెక్కగొనక పోవడం అలవాటవుతుంది; ఉదాత్తములైన, ఆధ్యాత్మికములైన, దూరప్రయోజనములు గలిగిన, ఆదర్శముల కంటె ఐహిక భౌతిక స్వార్థములపైన బుద్ధి యెక్కువగా ప్రసరిస్తుంది; విషయ నిర్ణయశక్తి విపరీతంగా మందగిస్తుంది; నైతిక వికాసం క్షీణిస్తుంది; ఆత్మ గౌరవబలం తగ్గిపోతుంది; ఇవన్నీ ప్రత్యక్షంగా కనిపిస్తవి.

సామాన్య జనాలను సత్యముయొక్క సంకుచిత భావాలకు ఒప్పచెప్పి ఊరుకోలేము. అది కేవలమూ అసత్యం అవుతుంది. మోర్లే మళ్ళీ ఇలా అంటున్నాడు:

> అంతేకాదు. సత్యాన్ని కాలానుగుణంగా అవలంబించాలని చెప్పే మాటను సత్యం పరిపూర్ణమైనది; నిష్కళంకమైనది; ప్రమాదరహితమైనది; దైవప్రేరితమైనది; పరమోత్కృష్టమైనది; అటువంటి పరిపూర్ణ సత్యానికి మేము పరిపాలకులమూ; యజమానులము. అని నమ్మే కులస్థులు విని ఆదరిస్తారని అనుకోవడం కంటె పిచ్చి ఊహ మరొకటి ఉండదు.

౨

దాని మూలము

మొట్టమొదటి మహాపురుషులకీ సత్యచింత కలగడానికి మూలమేమిటా అనే సంగతి విద్వాంసులూ విమర్శకులూ పరిశోధించవలసిన విషయం. గాంధీ విషయంలో అలాకాదు. మేము ఆయన వ్రాతలను బట్టీ, ఆయన చేసిన మొట్టమొదటి సత్య పరిశోధనలలో ఆయనతో సన్నిహితంగా ఉన్న మిత్రులు చెప్పిన విషయాలను బట్టీ చాలా సంగతులు తెలుసుకొన్నాము. సాధార్

ణంగా అనుచరులు చేసే ప్రచారంకంటె ప్రత్యర్థుల పొగడ్త మన ఉద్యమాలకు ఎక్కువ బలం చేకూరుస్తుంది. కాబట్టి స్మట్సు సేనాని, గౌ. జాన్. హెచ్. హొఫ్‌మియర్ (Hon Jan. H. Hofmeyer) చెప్పిన మాటలు మనకీ విషయంలో అమూల్యములైన ప్రత్యక్షసాక్ష్యాలు.

హొఫ్ మియర్ ఇలా అంటున్నాడు:

> సాధారణంగా చరిత్ర చేసే పనిలో కొంత న్యాయ్యం కనిపిస్తుంది. హిందూదేశం, అబుద్ధిపూర్వకంగా తన అతికష్టమైన సమస్యలలో నొక దానిని దక్షిణ ఆఫ్రికాకు సంక్రమింపచేసింది. దక్షిణ ఆఫ్రికా కూడా అబుద్ధి పూర్వకంగానే భారత దేశానికి శాసనోల్లంఘన సిద్ధాంతాన్ని ప్రసాదించింది.

సత్యాగ్రహం పీడాకరుణ్ని పీడితుణ్ని కూడా దేవుని సన్నిధానానికి తీసుకొని పోగలిగిన అమోఘ శక్తులు కలిగినదని అంగీకరింపబడిన పిమ్మట, హిందువులూ క్రైస్తవులూ కూడా తమ మతములలోని ప్రధాన సిద్ధాంతాలిందులో ఇమిడి ఉన్నవని చెప్పకొన సాగినారు. అయితే గాంధీజీ స్వయంగా చెప్పిన విషయాలివి :

> జరిగిన ముప్పై సంవత్సరాలనుండి నేను సత్యాగ్రహాన్ని బోధిస్తూనూ ఆచరిస్తూనూ ఉన్నాను. నేడు నాకు తెలిసిన సత్యాగ్రహ సిద్ధాంతాలు క్రమాభివృద్ధి పొందుతూ వచ్చినవే. దక్షిణ ఆఫ్రికాలోని భారతీయులు దానిమిదియేళ్ళు ఆచరణలో పెట్టిన తరువాత దానిశక్తిని స్పష్టపరచేటందుకు నేనే ఆ ఉద్యమానికి 'సత్యాగ్రహం' అని నామకరణం చేశాను. అప్పుడు దక్షిణ ఆఫ్రికాలోనూ, యునైటెడ్ కింగ్‌డంలోనూ నడపబడుతూన్న "సాత్విక నిరోధమ్మునకు" భిన్నమైనదని తెలియచేయడానికే నేనీ పేరు కల్పించింది. దాని వ్యుత్పత్త్యర్థం "నిజానికి నిలబడమని"

కాబట్టి అది సత్యశక్తి! నేను దాన్ని ప్రేమశక్తి, ఆత్మశక్తి అనికూడా అంటూవచ్చాను. సత్యాన్వేషణం ప్రత్యర్థిపైన హింస చేయడానికి ఒప్పుకోదని సత్యాగ్రహాన్ని ఆచరణలో పెట్టేటప్పుడు నాకు తెలిసింది. కాని ప్రత్యర్థిని తప్పుతోవనుండి సరియైన దోవలో మాత్రం పెట్టాలి. కాబట్టి ప్రత్యర్థిని బాధపెట్టి నందువలన సత్యాన్ని నిలబెట్టలేమనీ మనం బాధపడడానికి ఒప్పుకొన్నందువలననే సత్య నిర్ధారణ జరుగగలదనీ ఈ సిద్ధాంతము యొక్క తాత్పర్యం. సాత్విక నిరోధానికి సత్యాగ్రహానికి ఉత్తర ధ్రువానికీ దక్షిణ ధ్రువానికీ ఉన్నంత భేదముంది. మొదటిది దుర్బలుల ఆయుధంగా ఉద్దేశింపబడ్డది. అంతేకాదు; తన ఉద్దేశాన్ని నెరవేర్చుకోవడానికి సాత్విక నిరోధం శరీర బలాన్ని ఉపయోగించడం కానీ దౌర్జన్యం చేయడం గానీ తప్పుగా పరిగణించదు. ఇక రెండవదయిన సత్యాగ్రహం బలిష్ఠుల ఆయుధంగా ఉపయోగపడడమే గాక హింసను ఏ రూపంలోనూ అంగీకరించదు.

*　　　*　　　*

తన అంతరాత్మను బాధించిన మీడస్ల యొక్కయు, పారశీకుల యొక్కయు చట్టములను ధిక్కరించి అందుకు వేయబడిన శిక్ష కిక్కురు మనకుండా అనుభవించిన డానియల్ అతి పవిత్రమైన సత్యాగ్రహాన్ని అవలంబించాడన్నమాట. ఎథీనియన్ యువక బృందానికి, సోక్రటీస్ తనకు తెలిసిన సత్యాన్ని జంకకుండా ఉపదేశించి మరణశిక్షకు గురియైనాడు. ఈ సందర్భంలో ఆయన సత్యాగ్రహి. తన అంతరాత్మకు తండ్రి ఉత్తరువులు తగనివిగా తోచినప్పుడు వాటిని ప్రహ్లాదుడు ఉల్లంఘించాడు. తండ్రి అందు కతన్ని పెట్టిన హింసను యెవరితో చెప్పుకోకుండా సంతోషంగా భరించాడు. తన అంతరాత్మకు తోచిన విధాన నడచుకొన్న మీరాబాయి, భర్త కపచారం చేసినట్లుగా భావింపబడి ఆయనకు దూరంగా ఉండవలసి వచ్చి, ఆయన తనను లోబరచుకోవడానికి పెట్టిన అన్నిబాధ

లను గంభీరంగానూ క్షమాబుద్ధితోనూ భరించింది. మీరాబాయి ప్రహ్లాదు లిరువురూ సత్యాగ్రహాన్ని ఆచరణలోకి తెచ్చారు. డానియల్, సోక్రటీసులకు గాని, ప్రహ్లాద మీరాబాయీలకు గాని, తమను హింసించిన వారిపైన యేవిధమైన చెడ్డతలంపూ లేదనేమాట మనం జ్ఞాపకముంచుకోవాలి. డానియల్, సోక్రటీసు లిరువురూ వారి రాజ్యాలలో ఆదర్శ పౌరులుగా భావింపబడ్డారు. మీరాబాయి ఆదర్శ గృహిణిగానూ, ప్రహ్లాదుడు ఆదర్శ పుత్రుడుగానూ కూడా భావింపబడుతూన్నారు.

* * *

ఈ సత్యాగ్రహ సిద్ధాంతం క్రొత్తది కాదు. గృహ జీవితంలో అవలంబింపబడుతూన్న ఈ సూత్రం రాజకీయ జీవితంలోకి కూడా విస్తరింప చేయబడ్డది. కుటుంబ కలహాలు కానీ కుటుంబంలోని భిన్నాభిప్రాయాలు కానీ ప్రేమ వల్లనే సాధారణంగా పరిష్కరింప బడుతూంటవి. అపకారం పొందిన మనిషి కుటుంబంలో తనతో భేదాభిప్రాయం కలవారిపైన కోపం పెట్టుకోవడం గాని ప్రత్యపకారం చేయడంగానీ తలపెట్టక పైగా వారిపైన గౌరవంతో తానే ఓర్చుకొని ఉంటాడు. కోపాన్ని అణచుకోవడం కానీ బాధను ఓర్చుకోవడం గానీ చాలా కష్టమైన పనులు కావడంచేత, అముఖ్య విషయాలన్నిటిలోనూ అతడు కుటుంబంలోని తక్కిన వారితో వెంటనే ఏకీభవిస్తూ ఉంటాడు. అందువల్ల అతనికి శాంతి కలగడమే కాక తక్కినవారి శాంతికి కూడా భంగంరాదు. కాబట్టి అతను అవునన్నా కాదన్నా యెప్పుడూ అతను చేసే పని మొత్తం మీద కుటుంబ క్షేమానికి అనుగుణంగానే ఉంటుంది. ఈ ప్రేమ సిద్ధాంతమే నాగరిక ప్రపంచంలోని యెక్కువ భాగంలో కుటుంబశాంతిని చేకూరుస్తూన్నది. ఈ కుటుంబ ప్రేమ సిద్ధాంతాన్ని జాతీయాంతర్జాతీయ విషయాలలో కూడా ప్రత్యక్షంగా అంగీకరిస్తేనే తప్ప, జాతులకు నిజ

మైన ఐక్యత కుదరజాలదనీ, వారి చర్యలు ప్రపంచ మానవ క్షేమానికనుగుణంగా ఉండజాలవనీ నా విశ్వాసం—అనగా ఈ సిద్ధాంతం రాజకీయ జీవితంలో ఆచరణలోకి రావాలి. ఎంతవరకైతే ఈ సూత్రాన్ని జాతు లంగీకరిస్తవో అంతవరకే అవి నాగరికము లైనట్లుగా భావించాలి.

* * *

ఈ ప్రేమ సిద్ధాంతమే సత్య సిద్ధాంతము. సత్యం లేకుండా ప్రేమ లేదు. సత్యం లేకుండా మమత ఉండవచ్చు. అది ఇతరులకు అపకారం కలిగినా తన దేశంపైన అనురాగం కలిగి ఉండడం లాంటిది; యువకుడికి యువతి మీద వలె మోహం కూడా ఉండవచ్చు. అజ్ఞానులైన తల్లి దండ్రులకు బిడ్డలమీద వలె అకారణమైన గుడ్డి మమకారం కూడా ఉండవచ్చు. ప్రేమ జంతు తత్వాన్ని అతిక్రమించి నిష్పాక్షికంగా ఉంటుంది. అందువల్లనే సత్యాగ్రహం, రెండువైపులు గల నాణెమని చెప్పబడినది. దానికి ముందువైపు ప్రేమ, వెనుకవైపు సత్యము. ఆ నాణెము యెక్కడైనా చలామణీ అవుతుంది. దాని విలువ ఇంత అని చెప్పడానికి వీలు లేదు.

* * *

సత్యాగ్రహం తన కాళ్ళమీద తాను నిలబడగలది. అది ఆచరణలోకి రావడానికి ప్రత్యర్థి అంగీకార మనవసరం. ప్రత్యర్థి యెదుర్కొన్నకొద్దీ అది మరింత మెఱుగెక్కుతుంది. కాబట్టి దాని కెదురులేదు. సత్యాగ్రహి అపజయ మనేది యెఱుగడు. అతడు అలసిపోకుండా సత్యం కోసం నిరంతరమూ పోరాడుతూంటాడు. పోరాటంలో మరణం మోక్షం; కారాగారం స్వాతంత్ర్యం సింహద్వారం.

* * *

మరణంతో పోరాటం అంతమైనట్లుగా కాక పరమావధికి పోయినట్లుగా భావించే సత్యాగ్రహి తన అంతరంగంలో ఆత్మ ఒకటి ఉందని నమ్మకం కలిగి ఉండాలి. అందువల్లనే సత్యాగ్రహం ఆత్మశక్తి అని కూడా పిలవ

బడుతూన్నది. తనను తాను వ్యక్తం చేసుకోవడానికి సత్యాగ్రహికి శరీరం ఒక ఉపాధి మాత్రమే. తనలోని సత్యాన్ని ప్రత్యర్థి చూడగలగడానికి శరీరం అడ్డంకుగా నున్నప్పుడు దానిని సత్యాగ్రహి సంతోషంతో త్యజిస్తాడు. తన ప్రత్యర్థిలో మార్పు కలిగించ గలిగిన దేదైనా ఉన్నట్లయితే అది తాను బుద్ధిపూర్వకంగా చేసే శరీరార్పణమే నని గట్టిగా విశ్వసించినప్పుడే సత్యాగ్రహి అందుకు సంసిద్ధమౌతాడు. శరీరం నశించిన తరువాత కూడా ఆత్మ జీవించి ఉంటుందనే నమ్మకం గలిగి ప్రస్తుత శరీరంతోనే సత్య విజయాన్ని చూడవలెనని అతడాత్ర పడడు. సత్యాగ్రహి తానుద్ఘాటిస్తూన్న సత్యాన్ని ప్రత్యర్థికి కనిపించేటట్టు చేసే ప్రయత్నంలో చావడానికి శక్తి కలిగి ఉండడమే అతని విజయానికి మూలం.

* * *

సత్యాగ్రహి యెన్నడూ తన ప్రత్యర్థికి హాని కలిగించడు. సాధువాదంతో అతని బుద్ధికి నచ్చేటట్టు చేయ ప్రయత్నిస్తాడు; లేదా తన త్యాగం వల్ల అతని హృదయాన్ని కరిగింప చూస్తాడు. అందువల్ల సత్యాగ్రహం యొక్క ప్రయోజనం ద్విగుణీకృతం. అది ప్రయోగించిన వారికీ వ్యతిరేకంగా ప్రయోగింప బడినవారికీ కూడా ఉపకారి అవుతుంది

* * *

కాని ఇటువంటి సత్యాగ్రహం యేరి కోరి తెచ్చుకొన్న ఏ కొద్దిమందో ఆచరించ తగినది కాని యెక్కువమందికి సాధ్యం కాదని ఒక ఆక్షేపణ ఉంది. నా అనుభవం అందుకు వ్యతిరేకం. సత్యానికి కట్టుబడి అందుకు బాధ పడడానికి సంసిద్ధంగా ఉండడమనే ఈ చిన్ని సూత్రాన్ని అంగీకరిస్తే ప్రతివానికీ అది ఆచరణయోగ్యమే. ఏ మంచి విషయాన్నయినా సరే అవలంబించి ఆచరించడంలో యెంత సుఖమూ కష్టమూ ఉన్నదో దీని విషయంలో కూడా అంతే సుఖమూ అంతే కష్టమూ ఉన్నది.

త్రాగుడు పూర్తిగా మానివేయవలెనంటే అందుకు తగిన కారణాలన్నీ తెలుసుకోవలసిన అవసరం లేనట్లే, దీనిని ఆచరించవలెనంటే కూడా దీని సిద్ధాంతమంతా పూర్తిగా తెలుసుకోవలసిన అవసరం లేదు.

* * *

ఇంతా అయితే తనకు తెలిసిన నిజంమీద నిలబడి ఉండవలెననే విషయాన్ని యెవరు కాదంటారు! తాను నిజమని నమ్మినదానిని ప్రత్యర్థిని కూడా నమ్మించడానికి దేహబలం ఉపయోగిస్తే మొరటుతనమవుతుందని గ్రహించడం చాలా తేలిక. కాని తప్పుకు లోబడిపోవడం మర్యాద కాదు. వాదంతో ఒప్పించలేక పోయినప్పుడు ప్రాణాలు త్యజించడానికైనా సిద్ధమై దానికి లోబడకుండా ఉండాలి. అప్పుడే ప్రపంచంలో తప్పనేది లేకుండా పోతుంది. ప్రధాన ధర్మాలకు భంగం కలిగించేటప్పుడు తప్పును చూచీ చూడనట్లు పోకూడదు.

* * *

రాజకీయ రంగంలో, ప్రజల పక్షాన, అన్యాయ్య చట్టాలలోని అపభ్రంశాలను యెదుర్కొనడానికే సత్యాగ్రహం అవలంబించాలసి వస్తుంది. అర్జీల ద్వారానూ తదితర ప్రయత్నాల వల్లనూ చట్టంలోని తప్పు తొలగింపబడక పోయినప్పుడు నీవా చట్టానికి లోబడ కూడదని అనుకొంటే, దానిని తృణీకరించి అందుకు వచ్చే శిక్షను అనుభవించడానికి తయారుగా ఉండడమే నీవు చేయదగిన పని. కాబట్టి సత్యాగ్రహం చాలా వరకు శాసనోల్లంఘనం వలెనో, సాత్విక నిరోధం వలెనో కనిపిస్తుంది. అది సంఘ క్షేమం కోసం చేయబడిన చట్టాలను తిరస్కరించదు గనుక "సివిల్ డిస్ ఒబీడి యన్సు" అని పిలువబడుతూన్నది.

* * *

నేరాలు చేసేవాడు యెప్పుడూ మంచి చట్టాలను రహస్యంగా ఉల్లంఘించి శిక్షను తప్పించుకోవాలని చూస్తాడు. కాని సాత్విక నిరోధి అలా

కాదు. ఆయన ప్రభుత్వ చట్టాలకు యెప్పుడూ విధేయుడుగానే ఉంటాడు. అది భయంచేత కాదు; అవి సంఘ క్షేమం కోసం చేయ బడ్డ వనే నమ్మకంతో. కాని చాలా సకృతుగా అప్పుడప్పుడూ ఆయన కూడా కొన్ని చట్టాలను ఉల్లంఘించ వలసిన అవసరం వస్తుంది. ఆయన వాటికి విధేయత చూపించడం ఆత్మగౌరవానికి భంగకరమని తలచి నప్పుడు బహిరంగంగానూ సామ్యంగానూ వాటిని తృణీకరిస్తాడు. అందుకు వేయబడిన శిక్షను మాట్లాడకుండా అనుభవిస్తాడు. అంతే కాదు-శాసన నిర్మాణసభల చర్యలకు అసమ్మతి చూపడానికి కూడా ఒక్కొక్కప్పుడు, యే చట్టములను తిరస్కరించడం నీతిబాహ్యం కాదో అటువంటి చట్టములను ఏరి తిరస్కరిస్తాడు. సత్యాగ్రహం పిల్లలకుకూడా తెలిసేటట్లు చెప్పడానికి వీలయినంత సులువైనదీ, అంత గొప్ప శక్తి సౌందర్యములు కలదీ, అని నా అభిప్రాయం. దీనిని దక్షిణ ఆఫ్రికా లోని వేలకొలదీ భారతీయ స్త్రీలకూ పురుషులకూ పిల్లలకూ నేనుపదే శించినప్పుడు మంచి ఫలితాలు కలిగినవి.

* * *

రౌలట్టు బిల్లు ప్రకటింప బడినప్పు డందులోని నియమాలు మానవ స్వాతంత్ర్యానికి చాలా భంగకరంగా ఉన్నవనే తలంపుతో వాటిని శక్తివంచన లేకుండా అడ్డగించ వలెనని అభిప్రాయ పడ్డాను. అవి భార తీయు లందరికీ అయిష్టంగా ఉండడం కూడా నేను గ్రహించాను. ప్రజలందరికీ అసహ్యంగా ఉండే చట్టాలను చేయడానికి యెంత నిరం కుశ ప్రభుత్వానికైనా అధికారం లేదనీ ముఖ్యంగా పూర్వోత్తర రాజ్యాలగ నియతి ననుసరించి పోయే ఇండియా ప్రభుత్వానికసలే అధి కారం లేదనీ నా విశ్వాసం. ఆ రాబోయే ఆందోళన భగ్నం కాకుండా ఉండవలెనన్నా, దౌర్జన్య మార్గములను పట్టకుండా ఉండవలెనన్నా, సరి యైన తోవ ప్రజలకు చూపడం అవసర మనుకొని దేశానికి సాత్విక

నిరోధ రూపంలో సత్యాగ్రహాన్ని ఉపదేశించాను. అది కేవలం మన మనస్సులను పరిశుద్ధం చేసుకోవడాని కుద్దేశింప బడిన ఉద్యమం కావడంచేత, ఒకరోజు పనులన్నీ మానివేసి ఉపవాసం, ప్రార్థనా చేయ వలసిందని సూచించాను. ఆరోజు ఏప్రిల్ 6.

శాస్త్రము - పనితనము

గాంధీకి సత్యాగ్రహం పైనగల దృఢ విశ్వాసానికీ, ఆయన అప్పు డప్పుడూ అందు కనుగుణమైన ప్రత్యక్ష చర్యను చతురతతో ప్రోత్సహించేటందుకూ తగినకారణం లేకపోలేదు. "హేతువాదం బుద్ధిపైన పనిచేస్తుందనీ, సత్యాగ్రహి పడే బాధ ప్రత్యర్థి హృదయంమీద పనిచేస్తుందనీ" ఆయన నమ్మకం. అందువల్ల సత్యాగ్రహి యొక్క ప్రత్యక్ష చర్యలో మంచి పనితన మున్న దంటాడు. అది మనుష్యుల ఆంతరంగిక జ్ఞానాన్ని వికసింప చేస్తుంది. కసి కలిగించదు. అంతకు పూర్వం ప్రత్యర్థులుగా ఉన్నవారిని మరుక్షణం సహచరులుగా చేయగల శక్తి దాని కున్నది. సత్యాగ్రహంలో సంఖ్యలకు స్థానం లేదు. అధిక సంఖ్యాకుల కంటె దానికి అల్పసంఖ్యాకులే జయకారకు లవు తారు. శరీర బలంకంటె నైతిక బలమే అందులో ప్రాముఖ్య స్థానం వహిస్తుంది. కొన్ని రోగాలు కుదిరేముందు బాగా ఎక్కు వగా ప్రకోపించి ప్రమాదకరంగా ఉన్నట్లు కనిపిస్తాయి. అలాగే సత్యాగ్రహోద్యమంలో కూడా ఆకస్మికంగా అనుకోనంత మహా సంకట సమయాలు తటస్థించి మరుక్షణంలో మంచి ఫలాలు వస్తాయి. యుద్ధం భౌతిక మార్గాలద్వారా జాతులను సరియైన త్రోవలో పెట్టడానికి ఉద్దేశింప బడ్డది. ఈ అహింసా

పోరాటం ప్రజలకు భావోద్రేకం కలిగించి వారి అభిప్రాయాల లోనూ చిత్తవృత్తుల లోనూ ఉదార పరివర్తనాలను కలిగించడాని కుద్దేశింప బడినది. పెద్ద పెద్ద అన్యాయాలు శాసనోల్లంఘనం ద్వారానే తప్ప సరిచేయ బడవని గాంధీ చాలాకాలం కిందటనే అన్నాడు. ఈ మాట చెప్పిన ఎనిమిది ఏండ్లకు ఆయన ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించాడు. భౌతిక యుద్ధంలో, బాధ కలిగించినందువల్ల సంఘంయొక్క భౌతికశక్తులు విజృంభిస్తాయి. కాని అహింసా యుద్ధంలో బాధ పడడంవల్ల సాంఘిక ఆధ్యాత్మిక శక్తులు విజృంభిస్తాయి. బాధను కోరి తెచ్చుకొన్నవానికి హాని కలగడమంటూ లేదు. పూర్వకాలంలో గొప్పవాళ్ళు చాలామంది సంగ్రామాలను శ్లాఘించారు. కాని వారు అహింసాయుధాల శక్తి సామర్థ్యాలను ఎన్నడూ చవిచూచిన వారు కారు. అబ్దుల్ గఫూరుఖాన్‌వంటి యోగపురుషుడు ఒక లక్షమంది సాంగ్రామిక చిత్తవృత్తి గల పఠాను యోధులను అహింసా యుద్ధ సేవకులు గానూ సేనానులు గానూ చేయడం తన జీవితంలోనే చూడగలిగినందుకు గాంధీ చాలా ఆనందపడుతూంటాడు.

యుద్ధవ్యతిరేకోద్యమము - సత్యాగ్రహోద్యమము

ఈ అహింసా పరిశీలనా సందర్భంలోనే యెక్కడో ఒకచోట యూరపు అమెరికా ఖండములలోని యుద్ధ వ్యతిరేకోద్యమానికీ ఇండియాలోని సత్యాగ్రహోద్యమానికీ గల భేదాన్ని విచారించడం అవసరం. 1940 లో గాంధీ నాయకత్వమున నడచిన

కాంగ్రెసు కార్యక్రమాన్ని గూర్చి హిందూదేశ రాజ్యాంగ కార్యదర్శి అమెరీ ఇలా అన్నాడు:

ఈ ఉద్యమం యుద్ధ వ్యతిరేక సిద్ధాంత ప్రచారం కోసం మాత్రమే ఉద్దేశింప బడలేదని నేను స్పష్టంగా చెప్పవలసి ఉంది. ఇంగ్లాండు దేశములో వలెనే యుద్ధాలకు వ్యతిరేకమైన అంతరాత్మ అభ్యంతరాలను వెల్లడించేటందుకు, గాంధీకి ఆయన అనుచరులకు వైస్రాయి అవకాశమీయడానికి అంగీకరించాడు.

గాంధీ తనకోసం తన అనుచరుల కోసమేకాక, భారతజాతి అంతటికీ కూడా హిందూదేశం యుద్ధంలో చేరవలెనా అక్కర లేదా అని నిర్ణయించడానికిన్నీ, యుద్ధ సహాయానికి వ్యతిరేకంగా బోధించడానికిన్నీ హక్కు కావాలన్నాడు. అంతకు పూర్వమే ఇండియన్ నేషనల్ కాంగ్రెసు, హిందూదేశ స్వరాజ్య సంపాదనానంతరం కూడా, స్వరాజ్య వ్యవహారా లన్నిటిలోనూ అహింసా కార్యవిధానమే అవలంబింప వలెనని చేసిన తీర్మానం, గాంధీయొక్క ఈ వైఖరికి యెక్కువ కారణభూత మయింది. “న్యాయ సమ్మతమూ క్రమబద్ధమూ అయిన పద్ధతులతో స్వరాజ్యం సంపాదించడం భారతీయుల ఆశయమని” కాంగ్రెసులోని ప్రథమసూత్రం. దీనినిబట్టి స్వరాజ్య సంపాదనకు మాత్రమే అహింసా పద్ధతిని అవలంబింప వలెనని ఒక హద్దు కలదు. కాని 1940 సెప్టెంబరు 15, 16 తేదీలలో చేయబడిన బొంబాయి తీర్మానంలో స్వరాజ్య సంపాదనానంతరంకూడా అహింసా పద్ధతులతోనే ఇండియా ప్రభుత్వం వ్యవహరించవలెనని వ్రాయబడ్డది. ఈ సందర్భంలోనే 1940 జూన్, జులై,

ఆగస్టు నెలలలో గాంధీ కాంగ్రెసు కార్యవర్గముల మధ్య అభిప్రాయ భేదములు కలిగినవి. బ్రిటను భారతదేశ స్వాతంత్ర్యాన్ని అంగీకరించి, సంతృప్తికరమైన పద్ధతులమీద కేంద్రంలో జాతీయ ప్రభుత్వాన్ని యేర్పాటుచేస్తే బ్రిటనుకు సైనిక సహాయం చేయడానికి కాంగ్రెసు కార్యవర్గం ఆ రోజులలో అంగీకరించింది. గాంధీ అందుకు వ్యతిరేకం. అందువల్ల గాంధీకి ఈ తీర్మానంతో సంబంధం లేదనీ, ఇందువల్ల కాంగ్రెసు అవలంబింప పోతూన్న రాజనీతికి గాంధీ జవాబుదారీ యేమీ లేదని స్పష్టం చేయబడ్డది. తరువాత బొంబాయిలో, అంతకు పూర్వం పూనాలో అఖిలభారత కాంగ్రెసు కమిటీ (జులై 1940 లో) ఆమోదించిన పై తీర్మానముయొక్క అభిప్రాయాన్ని తలక్రిందులు చేస్తూ, భారతదేశం స్వరాజ్య స్థాపనా నంతరం కూడా కేంద్రప్రభుత్వంలో అహింసా పూర్వకంగానే వ్యవహరించవలెనని అఖిలభారత కాంగ్రెసు కమిటీ మఱొక తీర్మానం చేసింది. కాని ఆ తీర్మానంలోని ఆయుధ విసర్జనమునకు సంబంధించిన వాక్యం, అహింసా సిద్ధాంత బలాన్ని కొంత తగ్గిస్తూన్న మాట నిజమే. యుద్ధ వ్యతిరేకోద్యమానికీ సత్యాగ్రహానికీ యెంత భేదమున్నదో, ఆయుధ విసర్జనకూ అహింసకూ అంత భేద మున్నదనేమాట అంగీకరించాలి. ఆయుధ విసర్జనంలో యుద్ధ వ్యతిరేకోద్యమపు చిహ్నాలు కొన్ని కనబడతవి.

పాశ్చాత్య యుద్ధ వ్యతిరేకులు (Pacifists)

ప్రవక్త జెరేమియా నాటినుండీ కూడా యుద్ధ వ్యతిరేకాందోళన జరుగుతూనే ఉన్నది. ఆయన మొట్టమొదటి యుద్ధవ్యతిరేకి.

ప్రఖ్యాత యుద్ధ వ్యతిరేకియైన జోడ్సు 1940 బి. బి. సి. ఉప న్యాసంలో యుద్ధాన్ని సమర్థించాడు. యుద్ధ వ్యతిరేకులు అన్నివిధాలా యుద్ధానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తూంటారు. కాని యుద్ధం ప్రారంభ మయిందంటే దాన్ని సమర్థిస్తారు. ఈపని అందఱు యుద్ధ వ్యతిరేకులూ చేయకపోవచ్చు. యుద్ధ ఘోరకృత్యములనుండి తమ జాతిని సంరక్షించు కోవడానికి తమ శక్తినంతనూ వినియోగించడం తమ ధర్మమని యుద్ధవ్యతిరేకు లంటారు. కాని యుద్ధం రాగానే వారి ప్రభుత్వాలను వారు సమర్థిస్తూంటారు. బ్రియాన్ ఆలాగే చేశాడు. బ్రియాను, జోడ్సు వంటివాళ్ళు యుద్ధంలో చేరితే, యుద్ధం తప్పనిసరి అనీ, ధర్మసమ్మతమనీ సామాన్య జనంలో అభిప్రాయం కలుగు తుంది. యుద్ధ వ్యతిరేకి తన ప్రభుత్వంపైన తప్పు పెడతాడు. ఆయుధ విసర్జనం కావాలనేవారు ఇతర ప్రభుత్వాలను తప్పు పడతారు. అహింస ఇతరుల నిమిత్తం లేకుండా వ్యవహరిస్తుంది. భావి సాంఘిక వ్యవస్థకు పునాది కావలసిన అహింసా కార్య క్రమం, ముందు వ్యక్తిగతంగా ప్రారంభమై, పిదప కుటుం బానికీ, తరువాత సంఘానికీ, చిట్టచివరకు ప్రభుత్వముల జాతీయ అంతర్జాతీయ వ్యవహారములలోకీ వ్యాపిస్తుంది. ఇటువంటి కార్య క్రమంలో గొప్పగొప్పవాళ్ళకు వరవడి పెట్టగలవాడు సామాన్య పౌరుడు. సాధారణంగా ఈ గొప్పవాళ్ళనబడే అందఱూ ప్రభుత్వ యంత్రాలలో చిక్కుకొని బయట పడడానికి వీలులేని వాళ్ళుగా ఉంటారు. అందువల్ల నూతన దృక్పథంనుండి వారు విషయాలను చూడజాలరు. అయితే ఒక కుటుంబానికీ సంఘా

నికీ ఉపకరించిన కార్యక్రమం అంతర్జాతీయ వ్యవహారాలలో అనువర్తింప చేస్తే ఉపకరించక పోవచ్చునని చాలామంది అంటారు. అది సరియైన మాటకాదు. ప్రతి జాతియొక్క ప్రధాన నాయకులూ తమ ప్రజలకు ఈ నూతన పద్ధతులమీద శిక్షణ యిస్తే ఈ సిద్ధాంతాన్ని పెద్ద వ్యవహారాలలో ప్రవర్తింప చేయడానికి అడ్డంకులు తగ్గిపోతవి. వట్టి సిద్ధాంతంగా గాక జయప్రదంగా ఆచరింపబడిన అనుభవంగా, ప్రజలముందీ కార్యవిధానాన్ని ప్రత్యక్షం చేయగలిగి ఉండాలి. అప్పుడిది సందేహాస్పదమైన సమస్యగా గాక సంభవనీయమైన సత్యంగా భావింప బడుతుంది.

గాంధీ సత్యాగ్రహంలో ఉన్న విజృంభణశక్తి పాశ్చాత్య యుద్ధ వ్యతిరేకతలో లేదు. అదికూడా ఈ రెంటికీ గల ముఖ్య భేదం. అందువల్లనే దానిని గూర్చి ఇలాంటి అభిప్రాయం.

> ప్రపంచంలో దీనికి యెక్కువ ప్రోత్సాహం లేదు. కారణం దీని ఆదర్శాలు చాలా పెద్దవైనందున కాదు; చాలా చిన్నవైనందున.

రివరెండు జాన్ సి. విన్‌స్లో ఈ విధంగా వ్రాస్తూన్నాడు:

> యుద్ధ వ్యతిరేకి నైతిక దోషాలను గూర్చి చూపే నిర్లక్ష్యత, ప్రేమ, న్యాయబుద్ధి అనే ఉత్తమోత్తమ గుణాలను అతనిలో లోపింప చేస్తూన్నదని చాలామంది క్రైస్తవుల అభిప్రాయం. చెడుగు అనేదానికి దైవం గట్టిగా వ్యతిరేకమనే సంగతి, స్పష్టంగా తోచేటట్లు వ్యవహరించవలెనని వారి కోరిక.

గాంధీ సత్యాగ్రహం ఇంకాముందుకు పోతూన్నది చూడండి:

ప్రత్యర్థిని హింసించక పోవడమేకాదు. అతనిపైన యేవిధమైన కసి కానీ దుశ్చింత కానీ కలిగి ఉండకూడదు. ప్రేమవల్లా, బాధ పడడంవల్లా అతని మనస్సు కరిగేటట్టు చేయాలి. అదే సత్యాగ్రహ సారం.

గాంధీ ఉద్దేశంలో సత్యాగ్రహం "డైనమో" నుండి పగిలి వచ్చే శక్తివంటి శక్తి కలదని. అయితే ఈ శక్తి "డైనమో" నుండి వస్తుందా? రాదు.

డైనమో తనంతట తాను శక్తిని సృజించదు. కాని శక్తిని తనలోనుండి బయటకు వచ్చేటట్టు చేస్తుంది. సన్నగా బక్కగా దేహంపైకి కనిపిస్తూన్నప్పటికీ, మనిషియొక్క ఆత్మశక్తి కూడా అటువంటిదే. మనిషి యొక్క ఆత్మ, అతని విశాల జీవితమనే సరోవరంలోకి, ప్రేమ, సత్యమూ, వివేకమూ, అనే నిరంతర స్రవంతులను ప్రవహింపజేసి, తిరిగీ సవ్యమార్గములలో వాటిని బయటకు జాలువారేటట్టు చేస్తుంది. గాంధీ జీవితమంతా ఒక పెద్ద యుద్ధం. యంత్ర యుగానికి వ్యతిరేకంగా యుద్ధం; మనిషి పైనా మృగంపైనా చూపబడే క్రూరత్వానికి వ్యతిరేకంగా యుద్ధం; నిరంకుశాధికార తత్వానికి వ్యతిరేకంగా యుద్ధం;- ఈ యుద్ధాలన్నిటిలో తన అహింస అనే ఆయుధాన్నే ఆయన ప్రయోగించాడు. "అహింస శత్రువుల కత్తులను మొద్దుపాఱేటట్టు చేస్తుంది. వారి ఊహలను వమ్ము చేస్తుంది. శత్రువు మొట్టమొదట నిర్ఘాంతపోతాడు. తరువాత మార్పు పొందుతాడు." ఇవి అహింసనుగూర్చి గాంధీజీ చెప్పిన మాటలు.

సత్యాగ్రహాన్ని గూర్చి 1919 లో గిల్బర్టు ముర్రే ఇలా వివరించాడు:

అత్యంతమైన భౌతిక శక్తికి వ్యతిరేకంగా నిస్సహాయంగా ఆత్మశక్తి చేసే పోరాటమే సత్యాగ్రహం. భౌతికశక్తి చిట్టచివరకు తన సన్నాహాల నన్నిటినీ వదలించుకొని ఆత్మను ఆశ్రయించుకోవడంతో సత్యాగ్రహ సమరం పూర్తి అవుతుంది.

తరువాత ఇరవై యేండ్లకు 1939 లో కూడా ఆయన ఇలా వ్రాశాడు :

శత్రువులోని ఆధ్యాత్మిక గుణాన్ని సత్యాగ్రహం నిగూఢంగా రేకెత్తిం చేస్తుంది. శత్రు వప్పు డెంత పశుబలం కోసం ప్రయత్నించినా తన మానుషభావం నుండి పూర్తిగా తప్పించుకొని పోలేడు. అందువల్ల సత్యాగ్రహం విజయం పొందుతుంది.

వేదాంతులూ యోగులూ విరాగులూ సత్యాగ్రహాన్ని నిరంతరమూ శ్లాఘిస్తే శ్లాఘిస్తూండవచ్చు. కాని ఎక్కడబడితే అక్కడ దౌర్జన్యమూ యుద్ధమూ చెలరేగుతూన్న ఈ రోజులలో సామాన్య మానవుడి కది నచ్చదు. దాన్ని ఉపయోగించ మనడం తాతలనాటి మొండికత్తిని ఉపయోగించ మనడంగా ఉంటుంది. జనులు దాన్ని అర్థం చేసుకోరు; నమ్మరు; దానివంక చూడనైనా చూడరు; అటువంటి సామాన్య జనమే సత్యాగ్రహ సిద్ధాంతాన్ని అవగతం చేసుకొని దాని సూత్రాలకు కట్టుబడి ఉంటూన్నారు.

ప్రపంచ శాంతి స్వతంత్రములను రక్షించేటందుకు అహింసా నిరోధమును ఉపకరణంగా మార్చడంలోనే గాంధీయొక్క కళా కౌశలము కనబడుతూన్నది. ఈసందర్భంలో ఆర్.యఫ్.ఆల్ఫ్రెడ్ హెూర్లే ఇలావిశదంగా వ్రాశాడు :

ఆయనపైన ఆయనకు గల అధికారమే ఇతరులపైన కూడా ఆయన కధికారం కలుగచేస్తూన్నది. ఆయన ప్రదర్శించిన నిగ్రహశక్తివలన, మాటకు మాటా దెబ్బకు దెబ్బా తగిలి తీరవలెననే ప్రపంచంలో పెరిగిన వాళ్ళందరికీ కూడా ఆయన ఉపదేశాలు మానవస్వభావాని కను

గుణమైనవే నని తెలిసిపోయింది. ప్రకాశవంతంగా కనిపిస్తూన్న ఆయన ఉదాహరణ మొక్కటే అన్ని సందేహాలనూ తొలగించగలదు.

సత్యాగ్రహం యేవిధంగా ప్రత్యర్థిపైన విజయం పొందగలదో ఆల్‌ఫ్రెడ్ హెక్స్లే ఈ క్రిందిమాటలలో ఉదాహరించాడు:

> భౌతిక ఆయుధంగా కాక నైతిక ఆయుధంగా అది రాజకీయ పోరాటాన్ని ఉచ్ఛస్థాయికి తీసికొని పోతుంది. రాజకీయబలం కానీ సైనికబలం కానీ లేనివారు ఈ ఆయుధాన్ని ఉపయోగించ వచ్చును. ఇందులో ఆత్మనిగ్రహము, సంకల్పబలము, బాధాసహిష్ణుత, వినయమూ-అన్నీ ఇమిడి ఉన్నవి. ఇది ప్రత్యర్థుల అంతరాత్మపైన బాగా పనిచేస్తుంది. వాళ్ళదే న్యాయ్యం అనే ఆత్మ విశ్వాసాన్ని వాళ్ళ హృదయాలనుండి పిండివేస్తుంది; వాళ్ళ శరీర బలాన్ని ఎందుకూ కొఱగాకుండా చేస్తుంది; తాము పెడుతూన్న బాధవల్ల తామే అపరాధం చేస్తూన్నామనే భావాన్ని వాళ్ళ మనస్సులలో కలిగించి వారి నిశ్చయాన్ని బలహీనం చేస్తుంది. ఈ అన్ని కారణాలవల్ల సత్యాగ్రహం తుదకు విజయం పొందుతుంది.

పాశ్చాత్య పండితుల ప్రామాణ్యం

గాంధీకి మనుష్యులమీద గల వశీకరణ శక్తికి ఉదాహరణంగా చెప్పవలెనంటే "క్రైస్తును ఇంతకంటె ఎక్కువగా సేవించటమెలా అనే విషయాన్ని గాంధీ పాదాలకడ గ్రహించడానికి" ప్రపంచంలోని క్రైస్తవ రాజకీయ చతురులు కొందఱాయన కడకు వార్ధాకు యాత్రికులుగా వచ్చారన్న సంగతి చెప్పితే చాలు. అప్పుడా ఉపదేశకుడు వారితో "మీరు ధనాన్నీ దైవాన్నీ ఒక్కసారిగా సేవించ జాలరు. ధనం ఇండియాను సేవించడానికి

పంపబడింది. దేవుడు వెనుక చిక్కిపోయిన్నాడని అదీ నా భయం" అని వారిని ఉపాలంభించాడు. డబ్బుతో మునిగి తేలుతూన్న మతసంస్థలను గాంధీ ఏవగించుకొంటాడు. 1930 లో ఉప్పు సత్యాగ్రహం ప్రారంభింప బోయేటప్పుడు గాంధీ కాంగ్రెసు వర్కింగుకమిటీ యెదుట ఉపన్యసిస్తూ తాను దక్షిణ ఆఫ్రికాలో సత్యాగ్రహం ప్రారంభించిన సమయంలో తనకు వెనుక మూడువేల సిబ్బందీ ఉన్నప్పటికీ జేబులో ఒక్క రాగిడబ్బైనా లేకుండా ఎంతో హాయిగా తానప్పుడా ఉద్యమాన్ని నడప గలిగితిననీ, తాను వద్దన్నకొద్దీ గోఖ్లే, సర్ రతన్ తాతా దగర నుండి రు 25000లకు చెక్కు పంపినప్పటినుండీ తనకష్టాలు ప్రారంభమై చివరకు సత్యాగ్రహం కూడా విరమించవలసి వచ్చిందనీ చెప్పినాడు. ప్రత్యర్థి బలాన్ని చూచి కంగారుపడే స్వభావం గాంధీకి లేనేలేదు.

బందిపోటు దొంగల హృదయాలను కూడా మనం కటిగించ కలమనే ధైర్యం కలిగి ఉండాలి; మనను చూచి ఇతరులు తాతిగోడను వేసి మన తలలు పగులకొట్టు కొంటున్నామని అనుకొంటే అనుకోనీయండి, అది తాత్కాలికం. అన్నాడు గాంధీ.

సత్యాగ్రహం చేసి తమ హక్కులను రక్షించుకో వలసిందని జర్మన్ యూదులను ప్రోత్సహించడం తన నూతన సిద్ధాంతాన్ని సముద్రాలను దాటించి ప్రవేశ పెట్టడానికి గాంధీ చూపిన ధైర్య సాహసాలకు మొదటి తార్కాణం. ఆయన వారికిలా సలహా యిచ్చాడు :

అహింసా మార్గాన్ని అవలంబిస్తే యూదుడైన వాడెవడూ నిస్సహాయత ను అనుభవించ వలసిన అవసరం లేదు. "ఇంతకన్న బాగా ప్రవ

ర్తించడం తెలియనివాళ్ళ చేతులలో మేము బాధలు పడడానికి సంసి ద్ధంగా ఉన్నాము. అయితే వాళ్ళు మమ్మల్ని ఏవిధంగా బాధ పడవల సిందని కోరుతూన్నారో ఆవిధంగా మాత్రం మేము బాధపడ దలచుకో లేదు" అని చెప్పగలిగిన ఒక్క యూదుడైనా ఉంటే అతడు తన ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవడమే కాకుండా ఆ తత్వముయొక్క వ్యాపకం వల్ల యూదుల నందరినీ కాపాడి మానవలోకాని కొక అమూల్య గుణాన్ని సమర్పించిన వాడవుతాడు.

40 కోట్ల ప్రజలుగల చైనాదేశం కూడా జపాను దురాక్ర మణను ఆపడానికి జపాన్ అవలంబించిన హింసా పద్ధతులనే అవలంబింపవలసి రావడం అన్యాయ్యమంటాడు గాంధీ. జెక్కుల ఖనిజ సంపదనూ పారిశ్రామి కాలయాలనూ జర్మను లాక్రమించి నప్పుడు కూడా జెక్కులకు గాంధీ చెప్పిన సలహా ఇదే. ఆయ నకు చర్చిలు అమెరీలలో ఎంత విశ్వాస మున్నదో- హిట్లరు ముసోలినీలలోకూడా అంతే విశ్వాస ముంది. అహింస జయం పొందవలెనంటే మనం మన పవిత్రతను సామ్రాజ్య వాదులకూ, బ్రిటిష్‌వారు ఫాసిస్టులకూ ప్రదర్శింప గలిగి ఉండవలెనని ఆయన తలంపు.

ఆయన 1940 జూన్‌లో "ప్రతీ బ్రిటిష్ దేశీయునకు" అని ఒక లేఖ వ్రాశాడు. అది ఫ్రాన్సు పడిపోకముందే వ్రాయబడ్డది. కాని ఫ్రాన్సు పతనానంతరం ప్రచురింప బడ్డది. ఆయన దానిలో ఉద్దేశించిన ప్రణాళికనూ, దానిని ఆచరించవలసిన విధానాన్ని గమనించినట్లయితే అంత ధైర్య సాహసాలు భూత భవిష్య ద్వర్తమానకాల చరిత్రలో ఎక్కడా ఉండవని అర్థ

మవుతుంది. బ్రిటను తన సలహా తీసికొన్నట్లయితే జర్మనీని అహింసా పూర్వకంగా ఆపే విధానం తాను చూపిస్తానని గాంధీ ఆ ఉత్తరంలో వాగ్దానం చేశాడు. అదంతా అహంకారంగా కనపడితే కనపడవచ్చు. కాని రెవరెండు జాక్ సి. విన్స్లో గాంధీనిగూర్చి వ్రాసినప్పుడు ఆయనను కోరిన కోరిక అదే. ఆయన వ్రాసింది ఇది:

> అస్త్ర సన్న్యాసం చేసి ప్రశాంతంగా ముక్తిమార్గం చూచుకోవడానికి తగిన ఈ చివర రోజులలో కూడా మహాత్మా గాంధీ తన జీవిత చరిత్రకు మకుటాయమానంగా ఉండే ఈ అంతిమ మహత్కార్యం ఎందుకు నిర్వర్తించి పోకూడదా అని ఆశ్చర్యం కలుగుతూంటుంది నాకప్పుడప్పుడు! ఇక్కడ, ఈ పడమరదిక్కున ద్వేష పోరాటాలు లేని నిరంతర శాంతి భద్రతలను కోరే అనాథులైన ఐరోపా దేశపు లక్షలాది ప్రజలకు నాయకత్వం వహించి మా భూమిలో అటువంటి న్యాయ్య ధర్మాలను స్థాపించడానికి మే మేమి త్యాగాలు చేయవలెనో, యేమేమి బాధలను అనుభవించవలెనో, మా కాయన యేల ఉపదేశించరాదు?

సత్యాగ్రహం తన దేశానికి ఐకమత్యమూ స్వతంత్రమూ సంపాదించడానికి గానీ లేక సాంగ్రామిక తత్వాన్ని నిర్మూలించడానికి గానీ, సాంఘిక ఆర్థిక లోపాలను సంస్కరించడానికి గానీ ఉద్దేశింపబడిన ఉపాయం మాత్రమే కాదు. దాని సంగతి ఇంకా చాలా ఉన్నది. "క్రైస్తు బాధను నేను ముగింపు చేస్తాను" అని చెప్పిన సెంటు పాల్ సిద్ధాంతం అందులో ఇమిడి ఉంది. సత్యాగ్రహ తత్వాన్ని సరిగా అర్థం చేసుకొన్నవాళ్ళు వెనకటి చరిత్రను పరిశీలించి, క్రమానుగతంగా అభివృద్ధి పొందుతూ ఇప్పటికి నిలచిఉన్న, ఇంకనూ నిలవదగిన జాతుల ఉచ్ఛస్థితి, అసంఖ్యాకులైన ప్రజల అనంత త్యాగ బలము వలననే తటస్థించినదని గ్రహింపగలరు.

మొదలు గృహములో ప్రారంభమైన తల్లిదండ్రుల ప్రేమ అంతకంతకు దృఢపడి సంఘంలోకి వ్యాపిస్తుంది. బిడ్డకోసం త్యాగం చేసినతండ్రి తరువాత సంఘంకోసం త్యాగం చేయడం నేర్చుకొంటాడు.

సత్యాగ్రహము - దాని పరాక్రమము

చెడుగును మంచిచే జయించడానికి సత్యాగ్రహమొక శాస్త్రం; ఒక కళ. తప్పు తప్పువల్లనూ దౌర్జన్యం దౌర్జన్యం వల్లనూ రూపు మాయదు. గనుక మనను ఇతరులు తిట్టినా కొట్టినా మన మా బాధను ఓపికతో సహించుకొన్న యెడల ప్రత్యర్థి మనస్సు పరివర్తనం చెంది సంస్కరింప బడతాడని సత్యాగ్రహంలో ఇమిడిఉన్న ఉద్దేశం. మన మనస్సులలోని సుహృద్భావమే ఇతరులలో కూడా ప్రతిబింబిస్తుంది. దానిని కార్యరూపంలో పెట్టేటందు కెంత త్యాగమునకైన సంసిద్ధంగా నుండవలెను. మన గృహములలోని స్త్రీలూ పిల్లలూ అనేకసారులు కోపం వచ్చి అన్నం మానివేసినప్పుడు మన మొక్కొక్కప్పుడు వారిపైన దౌర్జన్యం చేస్తూటాం. దీనికి కారణ మేమిటి? వారు పడుతూన్న బాధ నిష్కళంకమైనది కాదు. వారి బాధకు కారణం లోపల ఉన్న కసి. అందువల్లనే అది మనకు దయ పుట్టించడానికి బదులుగా క్రోధం కలుగచేస్తూన్నది. పవిత్ర హృదయంతో స్వచ్ఛందంగానూ సంతోషంగానూ పొందుతూన్న బాధ ప్రత్యర్థి మనస్సులోని చీకాకును నిమిషంలో తొలగించ గలదు. మానవలోక మీసంగతులు తెలుసుకొనేటందుకు తిరిగి కొత్తగా శిక్షణ పొందాలి. అక్షరాభ్యాసం నుండి సాంగోపాంగంగా

సంపూర్తి అయ్యేవరకూ కూడా సత్యాగ్రహ పాఠక్రమం క్రొత్తగా బోధించవలసిందే. క్రైస్తవుడు, నాస్తికుడు, ప్రకృతి శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త, మతప్రచారకుడు, మామూలుమనిషి, యోధుడు, రాజకీయ ధురంధరుడు- ఈ అందఱూ కూడా హింసా సిద్ధాంతంతో మైకం కప్పి ఉన్న దురదృష్టపు రోజులివి. అందరూ దౌర్జన్య దేవతను పూజించేవారే. వారిదివరకు గ్రంథాలయాలలో చదివిన చదువు, పరిశోధనాలయాలలో చేసిన పరిశీలనలు, మానవ సంభాషణలలో నేర్చుకొన్న నీతులు. అనుభవ విశ్వ విద్యాలయాలలో అలవరచుకొన్న పాండిత్యం- ఇదంతా ఎటువంటి దైనప్పటికీ అంతర్జాతీయ పోరాటాలను పరిష్కరించడానికి పటాలాలు తప్ప పనికిరావని వారి అభిప్రాయం. బ్రిటను జర్మనీ దేశాల ఆర్చి బిషప్పు లిరువురూ కూడా వారి మామూలు మతాచారాల ప్రకారం, ఒకే ప్రకారం ఒకేపద్ధతిని ఒకే క్రైస్తును తమ తమ సామ్రాజ్య ఫాసిస్టు తత్వాలకు జయం చేకూర్చ వలసిందని ప్రార్థిస్తూన్న కాలమిది. నైతిక శక్తి వట్టి మాటలలో చర్చియందే ఉండిపోయింది. నిస్సంగత్వం వల్ల ఉద్భవించే అద్భుత నైతికశక్తిని వారు గ్రహించినట్లు లేదు. మనిషియొక్క శరీరమే ఎంతో భౌతికశక్తిని విజృంభింపచేయగలిగి ఉండగా, అతని ఆత్మ ఇంకెంతో నైతికశక్తిని విజృంభింప చేయగలదు. రక్త మాంసములతో కూడిన ఈ శరీర పోషణకోసం పుష్టికరమూ జీర్ణకారీ అయిన ఆహార మెంత అవసరమో, కొన్ని సిద్ధాంతముల తోనూ, కొన్ని సత్యముల తోనూ సంస్కరింపబడి పోషింపబడడం మనస్సుకు కూడా అంత

అవసరం. అన్ని నైతిక సంభాషణల లోనూ ఈ సిద్ధాంతా లను అందరూ చర్చిస్తూనే ఉంటారు కాని పౌరుల ప్రకృతిలో అవి తగినంతగా ఇమిడిపోవడం మాత్రం చాలా అరుదు. కాబట్టి బాల్య యౌవన కౌమార దశలలో కూడా ఈ సిద్ధాం తాలను మానవ హృదయాలలో ప్రవేశింప చేయగల నూతన విద్యా విధానమును మనం కనిపెట్టవలెను. అటువంటి విద్యవలన మనిషి పెరిగి పెద్దవాడైన తరువాత మోహ పరాయణుడుగా ఉండక ప్రతివానికీ కావలసిన స్వేచ్ఛకోసం న్యాయ్యంకోసం శాంతికోసం ప్రయత్నిస్తాడు.

గాంధీపైన నేరాలు

కేవలం తప్పు పట్టవలెననే మిధ్యాపవాదులు గాక కొందరు నిజ మైన మిత్రులే, గాంధీ బహు వేగంగా తన వైఖరిని మార్చు కొంటూ ఉంటాడనీ, నిష్కపటంగానూ, రహస్యమనేది లేకుం డానూ వ్యవహరించవలెనని బోధించే తానే ఎన్నోసార్లు అందుకు విరుద్ధంగా బహు సూక్ష్మబుద్ధిని ప్రదర్శిస్తూంటాడని విమర్శిస్తూంటారు. ఈ విమర్శ కేవలం తోసివేయదగినది కాదు. కాని పరస్పర విరుద్ధాలవలె కనపడే ఈ విషయాలను అర్థం చేసుకోవాలంటే సత్యాగ్రహ శిల్పకళను అర్థం చేసుకోవాలి. అహింసా సూత్రములకు బద్ధమై యున్న సత్యాగ్రహుల పద్ధ తికీ పర్యవసానానికీ వ్యత్యాసము గమనింపబడదు. అనగా మన మొక పనిని సాధించడానికి ప్రయోగించే పద్ధతీ, అందువలన కలిగే పర్యవసానము- ఈ రెండూ కూడా గౌరవప్రద మైనవి

గానే ఉండాలి. కాని సత్యాగ్రహి యెప్పుడూ సహకారానికీ సంధికీ సంసిద్ధంగా ఉంటాడు. కాబట్టి ఎప్పుడయినా ఉన్నత రాజకీయాలలో పోరాటాన్ని చాలించవలసి వచ్చినా, రాయ బారాలలో లొంగిపోవలసి వచ్చినా గాంధీ యెంతమాత్రమూ ప్రతిష్ఠకోసం పాకులాడడు. ఇదే గాంధీజీ నిజమైన బలం. ఈ విధంగా మహోన్నతమైన మతాదర్శాన్ని అద్భుతమైన లౌకిక దృష్టితో సమన్వయం చేయగలిగి ఉండడం, ఋషిగానూ రాజకీయ ధురంధరుడు గానూ కూడా వ్యవహరిస్తూండడం గ్రహించనివాళ్ళకు పరస్పర విరుద్ధభావంగా కనిపిస్తుంది. సత్యాగ్రహం పరిస్థితులను బట్టీ, జరిగే సంఘటనలను బట్టీ శత్రువు వైఖరిని బట్టీ అనువర్తింప చేయతగిన ఉద్యమం. గాంధీ "ఇస్తే అంతా ఇవ్వు. లేకపోతే ఏమీ వద్దనే బాపతు", కాదు. సగమిచ్చినా పుచ్చుకోవడానికి అనేకసార్లు ఒప్పుకొన్నాడు. కాని అంతటితో సరిపెట్టుకోలేదు. తక్కిన సగం కోసం ఆయన పోరాటం పెట్టుకోవడానికి తగిన అవకాశానికీ సమయానికీ ఎదురుచూస్తూంటాడు. ఎప్పుడు దెబ్బ కొట్టాలో ఆయనకే తెలుసు. అందువల్లనే ఆయన రణాంగణంలోనూ రాజకీయ రంగంలోనూ కూడా రాణిస్తున్నాడు. సత్యాగ్రహమనే రైలుకు ఆయన సాధుత్వ, రాజకీయ చాతుర్యములలో యేది "ఇంజను" యేది "బ్రేకు" తెలుసుకోవడం కష్టం. సాధారణంగా మనం మొదటిది బ్రేకుగాను రెండోది ఇంజన్ గానూ లెక్కవేస్తూంటాం. గాంధీ విషయంలో కేవలం అది వ్యతిరేకం. అందువలననే ఆయన అనుచరులకూ విమర్శకులకూ కూడా

ఆపోహలు కలుగుతూండడం. అసలు వాళ్లు ఆలోచించే పద్ధతే వేరు. ప్రత్యర్థి చిక్కులలో ఉన్నప్పుడు దెబ్బ కొట్టడానికి మంచి అవకాశమని సాధారణంగా రాజకీయవేత్త లందరూ అనుకొనే విషయం. గాంధీ అది తప్పంటాడు. గాంధీ ఉపవాసాలు చేస్తాడు; రాయబారాలు నడుపుతాడు; ఉపవాసం మాని వేస్తాడు;- గాంధీ జైలుకు వెళ్ళుతాడు; మళ్ళీ బయటకు వస్తాడు; రాజీకోసం ప్రయత్నాలు చేస్తాడు. కొత్తగా సత్యాగ్రహ మతం పుచ్చుకొన్నవాడి కిదంతా తన నాయకుడు లోబడి పోతూన్నట్లు కనిపిస్తుంది. ఇక దూరంగా ఉండి ఎప్పుడూ ప్రతి విషయంలోనూ తప్పులు వెతుకుతూ ఉండేవాళ్ల మాట సరేసరి. వాళ్ళ విమర్శ దయా దాక్షిణ్యాలు లేకుండా నడుస్తూనే ఉంటుంది. కాబట్టి గాంధీ విమర్శకులు ముఖ్యంగా గమనించ వలసిం దేమంటే ప్రతి సత్యాగ్రహీ కూడా గాంధీ వలెనే తన శత్రువులకు స్నేహితుడుగా ఉండవలెనని. ఈ మాట పరస్పర విరుద్ధమైనదిగా కనపడవచ్చు- మన జీవితంలో ఒక సూత్రానికీ ఒక తర్కానికీ నిలవడానికి వీలులేని పరస్పర విరుద్ధ విషయా లనేకం జరుగుతూంట వనేమాట జ్ఞాపక ముంచుకోవడం మంచిది.

అనేక ముఖ్య సందర్భాలలో గాంధీ తన వైఖరిని మార్చు కొన్నమాట నిజమే. గాంధీ ఇర్విన్ రాయబారాలు జరిగేటప్పుడు, ప్రస్తుతం నడుస్తూన్న రెండవ ఐరోపా సంగ్రామమును గూర్చి కాంగ్రెసు దృక్పథాన్ని వెల్లడించ వలసినప్పుడు- ఈ రెండు ముఖ్య సందర్భాలలోను గాంధీ తన వైఖరిని మార్చుకొంటూ

వచ్చాడు. ఆయనలో కలిగిన ఈ పరివర్తనాలు కొన్ని ఆయనకు పరమ భక్తులుగా నుండే అనుచరులకు కూడా ఆశ్చర్యం కలుగచేసినవి. కాని చక్కగా పరిశీలించి చూస్తే ఆయనను విమర్శించేవాళ్ళు- పరాయివాళ్ళు కానీయండి, సన్నిహితులు కానీయండి, మిత్రులు కానీయండి, విరోధులు కానీయండి- వీరెవ్వరూ కూడా సత్యాగ్రహంలోని సూక్ష్మాంశములను గ్రహించి, సత్యాగ్రహులపైన అది ఎటువంటి నైతిక ధర్మాలను ఆరోపిస్తూన్నదో సరిగా తెలుసుకొన్నట్లు కనిపించదు. 1930 లోని గాంధీ ఇర్విన్ ఒడంబడిక సందర్భంలో పోలీసు అత్యాచారాలను గూర్చిన విచారణ జరిగి తీరాలని పట్టుపట్టవద్దని ఇర్విన్ కోరినప్పుడు కాంగ్రెసు వర్కింగు కమిటీ, ప్రజలూ కూడా అందు కయిష్టంగా ఉన్నారు. వైస్రాయి, కాంగ్రెసు తనను అవమానపరచ కోరుతూన్నదా అనేసరికి గాంధీ మెత్తపడ్డాడు.అంతటితో అన్ని చిక్కులూ సందేహాలూ తీరిపోయినవి. కాంగ్రెసు కార్యవర్గం పూర్వోత్తర సందర్భాలన్ని ఆలోచించి గాంధీ నిర్ణయాన్ని అంగీకరించింది. కాని ప్రజలు మనస్సు కుదుర్చుకొని సంతృప్తి పడడానికి చాలాకాలం పట్టింది. ఎందువల్లనంటే పోలీసు అత్యాచారాలు, వైస్రాయి ఎఱుకతోనూ బాధ్యతతోనూ జరిగినవని ప్రజలకు తెలుసు. ఆసంగతి రాజప్రతినిధియే గాంధీ దగ్గర అంగీకరించాడు కూడాను. కనుక వైస్రాయిని చిన్నపుచ్చితే ప్రజలకు లెక్కలేదు.

కాని ప్రధాన సిద్ధాంతాలలోని ముఖ్య సూత్రాలలో గాంధీ యెప్పుడూ ఒకే తీరుగా ఉంటాడు. 1914-1918 యుద్ధాన్ని

గ్రాచ్చి ఆయన వైఖరిని పరిశీలించండి! 1906 లో జరిగిన జూలూ తిరుగుబాటులో తాను వలసరాజ్య ప్రభుత్వానికి వ్యతిరేకంగా నడుపుతూన్న సత్యాగ్రహోద్యమాన్ని చాలించి వ్రణచికిత్సా దళాలను (Ambulance Corps) నిర్మించాడు. 1914-18 లో జరిగిన యుద్ధ సందర్భంలో "నా చేతనైతే మా ప్రజలందరి చేతా కాంగ్రెసు తీర్మానములను ఉపసంహరింప చేయించి, యుద్ధానంతరం వరకూ "హోమురూలు" "బాధ్యతాయుత ప్రభుత్వము" అనే మాటల ఉచ్ఛ్వాసం కూడా బయటికి రాకుండా చేయాలని ఉంది నాకు" అన్నాడు. ప్రస్తుత యుద్ధంలో కూడా శత్రువు కష్టంలో ఉండగా మనం శాసనోల్లంఘనం ప్రారంభించడం సత్యాగ్రహ ధర్మాలకు విరుద్ధమని చెప్పి ఆ ప్రకారమే ప్రవర్తించాడు. న్యూయార్క్ టైమ్సు పత్రికా విలేఖరి ప్రపంచానికి కేదైనా సందేశ మీయవలసిందని అడిగినప్పుడు కూడా తాను "ప్రతి బ్రిటిష్ వానికి" అని వ్రాసిన ఉత్తరంలోని విషయమే గాంధీ పునరుద్ఘాటించాడు. ప్రజాపాలిత రాజ్యాలన్నీ ఏకకాలమందు అస్త్ర సన్న్యాసం చేసినట్లయితే :

"అది హిట్లరు కన్నులను తెరిపించి అతనిచేత కూడా అస్త్ర సన్న్యాసం చేయిస్తుందని ఈ కూర్చున్నపాటున నేను నిశ్చయంగా చెప్పగలను." అన్నాడు గాంధీజీ.

ఆయన మాటలలో అటువంటి పొందికా, మర్యాదా ధైర్యమూ ఉండబట్టేకదా "ప్రతి బ్రిటిష్ వానికి" అని ఆయన

వ్రాసిన ఉత్తరాన్ని వైస్రాయి బ్రిటిష్ ప్రభుత్వానికి పంపి వారి ప్రత్యుత్తరం తెప్పించింది. అయితే వారి ప్రత్యుత్తరం ఆశా భంగకరంగా ఉంటుందని అందరమూ అనుకొన్న విషయమే.

సత్యాగ్రహ తార్కాణాలు

ఈ నూతన సిద్ధాంతమును గూర్చి అనేకమంది గ్రంథకర్తలు తమ పుస్తకాలలో తార్కాణములను చూపి ఉన్నారు. 1920 లో సహాయ నిరాకరణోద్యమం ప్రారంభింప బడ్డప్పుడే హంగేరీ దేశస్థుడైన ఫ్రాన్సిస్ డీక్, ఆస్ట్రియా దేశపు ఆఘాతముల నెదుర్కొన్న విధానము చాలా గొప్పగా చెప్పబడుతూండేది. డీకు జాతీయాభ్యుదయ విధానము కూడా ఇంచుమించు గాంధీ విధానంతో సరిపోతూన్నది. ఆయన కార్యక్రమంలో సైతము జాతీయ విద్య, జాతీయ పరిశ్రమలు, ప్రధానస్థాన మాక్రమిస్తూన్నవి. అందువల్ల హంగేరీపైన ఆస్ట్రియనులు సంపాదింప దలచుకొన్న నైతిక విజయాన్ని ఆయన అరికట్ట కలిగినాడు. ఇండియాలో వలెనే అక్కడ కూడా జైలు కార్యక్రమం ఆచరణలోకి వచ్చింది. అక్కడ సైతం బహిష్కరణ విధాన మవలంబింప బడ్డది. ఆస్ట్రియన్ శాసనసభలలో స్థానాలు హంగేరియను లక్కర లేదన్నారు. ఆస్ట్రియా కసిపట్టి హంగేరియనులను సైన్యంలో చేరవలెనని నిర్బంధించింది. హంగేరియనులు దానిని కూడా నిరోధించారు. చివరకు ఆస్ట్రియాకు లొంగిపోక తప్పిందికాదు. 1867 ప్రాంతాలలో హంగేరీకి నూతన రాజ్యాంగ ప్రణాళిక ప్రసాదింపబడ్డది.

మహాత్మా గాంధీకి సంబంధించిన మఱియొక సుప్రసిద్ధ ఉదాహరణాన్ని ఇచట జ్ఞాపకం చేస్తూన్నాము. 1906 లో నేటాలు భారతీయులందఱూ వేలుముద్రలు వేయవలెననీ, పోలీసు ఉద్యోగి కోరినప్పుడు రిజిస్ట్రేషన్ సర్టిఫికేటు తనికి చూపవలెననీ చేయబడిన శాసనాన్ని నిరోధించడానికి 13000 మంది భారతీయులు నేటాలు సరిహద్దులను దాటి ట్రాన్సువాలుకు పోయిన సంగతి అందఱకూ తెలిసినదే. తరువాత 1913 లో మనిషి 1 కి మూడు పౌనులు తలపన్ను వేసినప్పుడూ, ట్రాన్సువాలులోకి ఎక్కువ మంది జనాన్ని వలస తీసికొని రావడానికి ప్రయత్నించినప్పుడూ, వాటి నిరోధమునకై మఱొక ఉద్యమం నడపబడ్డది. హారింజి ప్రభువు కాలంలో, దక్షిణ ఆఫ్రికా భారతీయుల రిజిస్ట్రేషన్ సందర్భంలో నేమి, పోలుటాక్సు సందర్భంలో నేమి, భారతీయ విద్యార్థికులు దక్షిణ ఆఫ్రికాలోని అన్ని భాగములకూ పోవడానికి అధికారమును సంపాదించడంలో నేమి- దాదాపు ఈ అన్ని విషయాలలో భారతీయులకే అనుకూలంగా పరిష్కారం జరిగిన సంగతి ఇండియాలో తెలిసిన విషయమే. చాంపరాన్‌లోని జనులు, యూరోపియన్ తోట యజమానులకు చెల్లించవలసిన 64 రకాల పన్నులను నిరోధించడానికి నడపబడిన ఉద్యమం తరువాతి తార్కాణం.

ప్రపంచంలోని అన్ని మహోద్యమాల వలెనే గాంధీ సత్యాగ్రహోద్యమం కూడా ముందు చాలా చిన్నగా ప్రారంభ మవుతుంది. గాంధీ మొట్టమొదటనే ఉద్యమ పూర్ణ స్వరూపాన్ని ఊహించి యుండినప్పటికీ కూడా ముందు బుద్ధి

పూర్వకంగా చాలా చిన్నగా ప్రారంభం చేస్తాడు. ఆయన ఇండియాలో తన కృషిని ప్రారంభించింది 1917. అప్పుడు దక్షిణ ఆఫ్రికాకు కొన్ని షరతులతో ఇండియానుండి కూలీలను పోగు చేసే పద్ధతిని రద్దుచేయించాడు. తరువాత వీరంగం దిగుమతి పన్నులను రద్దు చేయించాడు. అయితే ఈ సందర్భంలో ఆయన సత్యాగ్రహం ప్రారంభిస్తానని చెప్పినా ప్రారంభించ కుండానే పని జరిగింది. తరువాతిది చాంపరాన్ విజయం—ఈ విషయం ప్రత్యేకంగా మరొకచోట ఉదాహరింప బడ్డది. చాంపరాన్ విజయ మాయనకు కొత్త ఉద్యమాలను ప్రారంభించ డానికి ప్రోత్సాహం కలిగించింది. కాని ఆ ఉద్యమాలన్నీ కొన్ని చిన్నిచిన్ని గ్రామాల అభివృద్ధికి సంబంధించినవి. పాఠశాలలను స్థాపించడం, ప్రజల ఆరోగ్యాభివృద్ధిని ప్రోత్సహించడం, వైద్య సహాయం, గో సంరక్షణ మొదలైన ఉద్యమాలవి. ఖేరా ఉద్యమం మొట్టమొదట ఆయన ఇండియాలో ప్రారంభించిన ప్రజా సమూహోద్యమం. అది పన్నులను మూజరా యిప్పించ డానికి ప్రారంభించ బడ్డది. అందులో ఆయనకు కలిగిన అను భవం వలన ప్రజా ఉద్యమాలంత తేలికగా ప్రారంభించ తగి నవి కావనీ, అటువంటి ఉద్యమాలను ప్రారంభించేముందు ప్రజ లకు ముందుగా సత్యాగ్రహ సిద్ధాంతాలను గూర్చి తగిన శిక్షణ యిచ్చి వారెంతవరకూ గ్రహించారో పరిసి చూస్తేనే తప్ప ప్రారంభించ కూడదనీ స్పష్టమయింది. ఈ ఉద్యమం ప్రజలు తగినంత త్యాగం చేయజాలనందున జయప్రదం కాలేదు. కాని వారికి కొన్ని హక్కులు కలవనేమాట మాత్రం వారికి తెలిసి

వచ్చింది. అంతేకాదు రాజకీయ జ్ఞానమును జనసమూహంలో వ్యాపింప చేయడానికి తగిన కార్యప్రణాళికను కూడా ఈ ఉద్యమం మూలకారణ మయింది. ఖైరా ఉద్యమ ఫలితంగా శక్తివంతులు పన్నులు తక్షణం చెల్లించవలెనని, శక్తిలేనివారు కొంతకాలం ఆగవచ్చునని ఉత్తరువులు చేయబడ్డవి. సత్యాగ్రహము నందలి ఈ ఆరంభ ప్రయత్నాలే 1916 లక్నో కాంగ్రెసులో గాంధీని ఇండియా రాజకీయాలలోకి రావడానికి ప్రేరేపించినవి. 1918 లో అహమ్మదాబాదు మిల్లు కూలీలకు జీతాలు ఎక్కువ చేయించే పెద్దపనికి గాంధీ పూనుకొన్నాడు. అప్పుడు వాళ్ళు ఓర్పుగా, శాంతిగా, స్వశక్తిపైన ఆధారపడి తమతోపాటు సమ్మెకట్టని కూలీలపైన దౌర్జన్యం చేయకుండా బహు మర్యాదగా ప్రవర్తించారు. అందువల్లనే గాంధీ మిల్లు యజమానులతో రాయబారాలు నడిపి సమ్మెదారుల కూలి యెక్కువ చేయించ గలిగినాడు. ఈ సందర్భంలో ఏ కొద్ది మందో చేసిన దౌర్జన్యానికి ప్రాయశ్చిత్తంగా ఆయన ఉపవాసం చేశాడు. ఈ విషయాన్ని గూర్చి "ఉపవాసాలు" అనే అధ్యాయంలో విపులంగా ఉదాహరింప బడ్డది. తరువాత రౌలట్ చట్టానికి వ్యతిరేకంగా 1919 లోని సత్యాగ్రహం, జలియన్‌వాలాబాగ్ హత్యాకాండ, ఖిలాఫతు దుర్ణయము, స్వరాజ్య పోరాటము జరిగినవి.

కార్మిక కర్షకుల శ్రేయస్సు కోసమున్నూ, సాంఘిక సంస్కరణం కోసమున్నూ ఇటువంటివే. అనేక ఉద్యమాలు గాంధీ నాయకత్వంకింద నడిచినవి. గాంధీ యొక్కయు ఆయన అను

చరుల యొక్కయు ప్రయత్న ఫలితంగా, కలిగిన విజయపరం పరే, ఇండియాలో అహింసా ఉద్యమ నూతనశక ప్రారంభము నకు కారణము లైనవి. చాంపరాన్, ఖైరా, బోర్సాదు సత్యాగ్రహోద్యమాలను గుఱించి కాంగ్రెసు చరిత్రలో పూర్తిగా వివరింపబడ్డది. తిరువాన్కూరులో ఒక దేవాలయానికి సమీపంలో ఉన్న వీధిలోనుండీ, మఱికొన్ని బ్రాహ్మణ వీధులలోనుండీ "అంటరానివాళ్లు" నడవకూడదనే ఆచారం పరంపరాగతమైన నిషేధపు టుత్తరువు ఎప్పటినుండో వస్తూన్నది. ఆ సందర్భంలో సత్యాగ్రహం ప్రారంభించగా పదహారు మాసములు కడచిన తరువాత, ఆ ఉత్తరువు రద్దయి, అందరూ ఆ త్రోవలను నడవ వచ్చునని అంగీకరింప బడినది. ఈ సంస్కరణం చాలా చిన్నదిగా దూరాన ఉన్నవాళ్ళకు కనిపించ వచ్చును. కాని మలబారులో అంటరానితనమును గూర్చిన అప్పటి స్థితీ ఇప్పటిస్థితీ ఎఱిగిఉన్న వాళ్ళకు మాత్రం ఈ మార్పుయొక్క ఔదార్యమూ, శ్రేష్ఠత్వమూ అర్థముకాక తీరదు. మఱొక ముఖ్యమైన విషయంకూడా పాఠకులు తెలుసుకోవలసి యున్నది. సిమ్లాదగ్గఱి కొండ జిల్లాలలోని కొండజాతులచేత గవర్నమెంటు ఉద్యోగస్థులు కానీ, యూరోపియనులు గానీ కూలి యివ్వకుండానో, పేరున కేదో కొద్దిగా యిచ్చో వాళ్ళ సామానులూ ఉత్తరాలూ మోయించుకొంటూ ఉండేవాళ్ళు. ఇండియాలోని సంస్థానాలలో ప్రతిచోటా ఉన్న "వెట్టి" పద్ధతిని సిమ్లా కొండల ఉద్యోగస్థులు కూడా అమలు జరుపుతూండిరి. తీవ్రమైన సత్యాగ్రహం కొన్ని నెలలు జరిగిన తరువాత ఆపద్ధతి రద్దుచేయబడ్డది. సత్యాగ్రహ

లన్నిటిలోకీ ఎక్కువ ప్రసిద్ధమైనది 1928 లో బార్డోలీ చెర్యాడా తాలూకాలలో వల్లభాయి పటేలు నాయకత్వంకింద జరిగిన రైతుల పన్నుల నిరాకరణ సత్యాగ్రహం- అప్పుడా జిల్లాలలో రీసెటిల్‌మెంటు చేసి నూటికి 25 వంతున ప్రభుత్వంవారు భూమి పన్నును హెచ్చించారు. ఈ హెచ్చించడం న్యాయ్యపద్ధతి మీద జరుగలేదని రైతులు సత్యాగ్రహం ప్రారంభించారు. తరువాత ప్రభుత్వం రాజీకి వచ్చి మధ్యవర్తి తీర్పు కంగీకరించింది. సత్యాగ్రహం ఆపివేయబడ్డది. ఆ మధ్యవర్తుల తీర్పు ప్రకారం నూటికి $6\frac{1}{4}$ వంతున మాత్రమే పన్ను హెచ్చింపబడ్డది. నేటి ఈ బార్డోలీ ఉదంతం భారత భావి సంతానము కోసం సువర్ణాక్షరాలలో చరిత్రయందు లిఖింప బడింది. 1923 లోని నాగపూరు సత్యాగ్రహం భారత దేశాన్నంతటినీ ఆకర్షించింది. అది నాగపూరు సివిల్ లైన్సులోనుండి జాతీయ పతాకాన్ని తీసికొనిపోయే హక్కుకోసం చేయబడింది. గుర్కాబాద్ సత్యాగ్రహం, ఎల్లప్పుడూ కృపాణమును వీడని సిక్కులవంటి మహాయోధులు కూడా ఎంత శారీరకబాధ కలిగినప్పటికీ ఎంతో కాలం దౌర్జన్యానికి దిగక ఏవిధంగా అహింసను తు-చ-తప్పకుండా ఆచరించ గలిగినారో వెల్లడి చేస్తుంది. పిదప 1930 లోని ఉప్పుసత్యాగ్రహం, ఆధునిక చరిత్రలో ఒక ప్రత్యేక ఘట్టం. అందులోని సంఘటనలు పురాణములలోని ఉదంతములవలె భారత స్త్రీ పురుషుల హృదయాలలో మహోదార భావాలను రేకెత్తించగలిగి, వారిని సత్యాహింస లనే గగనవీధులలోకి తీసికొని పోగలుగుతూన్నవి.

సత్యాగ్రహ మనఃప్రవృత్తి

సాంఘిక, కర్షక, నైతిక సంస్కరణల నిమిత్తం అప్పుడప్పుడూ నడపబడిన వివిధ సత్యాగ్రహోద్యమాలకు వెనుకనున్న మనః ప్రవృత్తినీ, పరిణామ క్రమాన్నీ మనం ఆలోచించాలి. సత్యాగ్రహ ప్రధానోద్దేశం మానవుని సున్నిత భావాలను రేకెత్తించడం. మానవుడు తన తప్పిదాలకు తానే సిగ్గుపడేటట్లు చేసి అతని కొక విధమైన నైతిక చిత్త వికాసాన్ని కలిగించాలి. హాని పొందినవాడు ప్రత్యపకారం చేయక పోవడమేకాక పైపెచ్చు మఱింత ఆనందంగా కనపడితే అపకారం చేసినవాడాశ్చర్య పడతాడు. ఏదైనా ఒక విషయంలో పరిహారం పొందాలంటే దౌర్జన్యం కాక తక్కిన మార్గాలు లేవా అని మొదటిసారి అతనికి ఆలోచన కలుగుతుంది. సాధారణంగా హింసింప బడిన వానికే గాక హింస పెట్టిన వానికి కూడా కొంత వ్యథ కలుగుతుంది. మనం కోపంలో బిడ్డను కానీ మఱొకరిని కానీ కొట్టిన తరువాత మనలో మనకే ఎంతో చిన్నతనం వేస్తూంటుంది. ఎవరి మనస్సు పూర్తిగా మొద్దుబారలేదో ఎవరిలో ఇంకను నైతిక సున్నిత భావాలు నాశనం కాలేదో, వారు కోపం కానీ, ఉద్రేకం గానీ ప్రదర్శించిన వెంటనే కొంత కాలం వరకూ ఏపనీ చేయలేని అలసత్వమూ, నిరుత్సాహమూ పొందుతూంటారు. తప్పు పని మాటి మాటికీ జ్ఞాపకం వస్తూండడం వల్ల విచారం కలుగుతూంటుంది. మనకు సంతోషకరమైన విషయము కూడా పదే పదే తలపునకు వస్తూంటే చిత్తస్థిమితం ఉండదు. పగలు ప్రశాంతంగా ఉండలేము; రాత్రులు

నిద్రపట్టదు; ఇక మన తప్పు పనిని తలుచుకొంటూంటే కలిగే మనోవ్యథ, ఎంతగా ఉంటుందో చూడండి. కనుక అపరాధి యైనవాడు, తాను అపరాధం చేసిన వానికి క్షమాపణ చెప్పే వరకూ గాని, లేక కాలక్రమేణా తాను చేసిన తప్పును తాను మఱిచిపోయేటంత వరకూ గాని మనస్సిమితం కలిగి ఉండడు. ఈ రెండూ కూడా తప్పు చేసినవాడు పొందే సిగ్గును సూచిస్తవి. కాని వాడు మొదటి పద్ధతిని అవలంబించి నందువల్ల నిజమైన చిత్త సంస్కారం పొందడానికి వీలవుతుంది. రెండోపద్ధతి వల్ల క్రమక్రమంగా అతని మనస్సు మొద్దుబాఱి పోవచ్చును. బాధితుడు ప్రదర్శించే సహజ మందహాస సహన భావాలే కాక, చుట్టూ చేరిన ప్రజలు- వాళ్ళ వైఖరి, వాళ్ళ మందలింపు, వాళ్ల ధిక్కారం- ఇవన్నీ కూడా బాధ పెట్టినవాని కళ్లు తెఱిపించి అహింసయొక్క సర్వతోముఖ వ్యాపకత్వాన్ని చూచేటట్టు చేస్తవి. అహింసా పోరాటంలో బాధ పొందేవానికంటె బాధ పెట్టేవాడే క్రమక్రమంగా దుర్బలుడై పోతాడని కూడా ప్రతీతి. అతని దౌర్జన్యం అంతకంతకు తగ్గిపోతూన్న కొద్దీ అతనిలోని సున్నిత భావా లంతకంత కెక్కువగా రేకెత్తుతూంటయి. అందువల్ల అతనికి అంతర్దృష్టి వికాసం కలుగుతుంది. మారు చెప్పకుండా ప్రతిక్రియ చేయకుండా సహన భావంతోనూ క్షమాబుద్ధితోనూ బాధ పడేవాని నైతికశక్తి యొక్క ఆధిక్యత, బాధపెట్టేవాని మనస్సులో నాటుకోకుండా ఉండడానికి వీలులేదు. హింసాపరు డిటువంటి దృశ్యాన్ని గూర్చి తాను చదివి గాని, భావించి గాని, ఊహించి గాని, విని గాని

ఉండక పోవడం చేత బాధితుణ్ని చూస్తే మఱింత గౌరవం హెచ్చుతుంది. తన చర్యను యుక్తి ప్రయుక్తుల వల్ల గాని, వాద ప్రతివాదములవల్ల గాని, న్యాయ్యాన్యాయ్య విచక్షణవల్ల గాని, సమర్థించు కోవడానికి వీలు లేదని తోచి తన శత్రువు గెలిచి పోతాడేమోననే పిఱికితనం కలిగినప్పుడే యెవడైనా కసితో దౌర్జన్యానికి దిగుతాడు. భయము, పిఱికితనము, కసి, యివన్నీ ఒకదాని చుట్టూ ఒకటి సుళ్ళు తిరుగుతూంటవి. అటు వంటి వాతావరణంలో ఉదారబుద్ధీ న్యాయ్యదృష్టీ వర్ధిల్లవు. కుత్సిత బుద్ధీ, ద్వేష భావమూ ప్రబలుతూంటయి. మనస్సునూ హృదయాన్నీ నిష్కళంకంగా ఉంచుకో కలిగితే సద్భావం కల గడం సహజమే. కాని అలా కాకపోయినా సహజ సత్స్వభా వాలను, సమయంలో నొక్కిపెట్టకుండా ఉంటే ఒకప్పుడు ద్వేష క్రోధాలు కూడా మనిషి నడతలో పరివర్తనం కలిగించ డానికి తోడ్పడతయి. విశాల హృదయమూ, విశ్వ ప్రేమా కలవానికి సహజమైన సంస్కృతియే తన ప్రవర్తనను దిద్దుకోవలెననీ తనను లోబఱచుకొన్న చెడు ప్రభావముల నుండి తాను తప్పించుకో వలెననీ ప్రయత్నించే వాని విషయంలో కృత్రిమ సంస్కృతి కావచ్చును. కాని ఈ రెండవరకం మనిషి, తన నైతిక శక్తి మీద తనకు విశ్వాసం కలిగినప్పుడు, తనకు కూడా మంచి ఆలోచనా శక్తి కలదనీ, తానూ న్యాయ్యం కోసం నిలబడ గలననీ తోచి నప్పుడు, తన ప్రకృతిలో దాగి ఉన్న శుభలక్షణాలను సద్విని యోగం చేసుకో గలడు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యము లనే అరిషడ్వర్గాలను జయించ వలెనని ప్రతి మనిషికీ

స్వతస్సిద్ధంగా కోరిక ఉంటుంది. వీటిని వాటి ఇష్టం వచ్చినట్లు చెలరేగనిస్తే మనిషి వీటికి బానిస అయిపోతాడు; కాని కొంచెం ప్రయత్నిస్తే వీటిని మనో బుద్ధులచేత పూర్తిగా లోబఱచుకో గలడు. కాబట్టి కోపాన్ని జయించ దలచుకొంటే శాంతం అల వాటు చేసుకోవాలి. అప్పుడు దయా దాక్షిణ్యా క్షమా గుణాలు రేకెత్తి దానికి తగిన మనఃప్రవృత్తి కలుగుతుంది. అనేకసార్లు మనకు చెడ్డపని చేయాలని బుద్ధి పుట్టినప్పుడే కూడదని కూడా కోరిక కలుగుతుంది. మంచి చెడ్డలు మన కందఱికీ తెలిసినవే. కాని మన కోరికలు మన నిగ్రహాన్ని నిలవనీయవు. గుణవంతు డుగా, సత్య సంధుడుగా, నీతి పరుడుగా, ధైర్య శాలిగా, ఉదారుడుగా, క్షమా నిరతుడుగా, సేవా సక్తుడుగా, పర శ్రేయోభిలాషిగా, స్వార్థ రహితుడుగా ఉండాలనే ప్రతివానికీ సహజమైన కోరిక ఉండడం ఒక సుగుణం. ఈ సుగుణం పైననే సత్యాగ్రహ సిద్ధాంత మంతా ఆధారపడి ఉంది. ఈ పైన పేర్కొన బడిన గుణాలు వీటికి వ్యతిరేక గుణాలైన, అసత్యము, దౌర్జన్యము, కోపము, ద్వేషముల వలె విజృంభితములు కాకపో వచ్చును. బాధక బాధితుల మధ్య ఒక విధమైన నైతిక మోహ నాస్త్రం సంచరిస్తూంటుంది. సత్యాగ్రహం దాని వాయిని మొక్కవోకుండా చూడాలి. హింసా పరుని ఉద్రేకం కొండ మీదనుంచి దూకే జలప్రపాతం వంటిది. అతని మాటలూ చేతలూ అన్నీ కూడా అతని ఆవేశాన్ని పరవశత్వాన్ని ప్రద ర్శిస్తూంటాయి. ఉచితజ్ఞత, ప్రసన్నత, సహనశీలత, క్షమా పరత గల అహింసా యోధుని మనోభావాలు వానలన్నూ వర్ధ

లను, సెలయేళ్ళనూ, జలపాతాలనూ భరిస్తూ అతి విశాలంగానూ బహు గంభీరంగానూ ప్రవహిస్తూన్న వాహినీ గర్భ సలిలములవలె, దురాగ్రహ శాప ప్రహారాలను భరిస్తూ ఉంటవి. ఇట్టి చిత్తశాంతి కలిగి ఉన్నప్పుడే మన జీవిత సమస్యలు పరిష్కరింప బడడానికి వీలు కలుగుతుంది. మానవులు కోపంతో ఉన్నప్పుడు, వారికి ఉచితజ్ఞత, మర్యాదా, ఆలోచనా లోపించినప్పుడు మన సమస్యలు సరిగా పరిష్కరింప బడవు. కొంచెం ఓర్పు వహిస్తే విషయం సరిగా గ్రాహ్యమై నిజమైన నిర్ణయానికి రా వీలవుతుంది. మనిషిలోని సున్నిత భావాలు ప్రేమ వాతావరణంలో వికసించినట్లు క్రోధ పరిస్థితులలో వికసించవు. అంతకంతకు అందఱి యందూ ప్రేమభావం వర్ధిలుతూన్న కొద్దీ, ఆచరణ ఆదర్శాన్ని సమీపిస్తూన్నకొద్దీ, బుద్ధి మనో వైకల్యాన్ని లోబఱచుకో గలిగినకొద్దీ, మనిషి ప్రవర్తన తర్కానికి అతీతంగా ఉంటుంది; పూర్వాపర సందర్భాలను బట్టి గానీ లాభాలను బట్టి గానీ ఉండదు; తర్కానికీ హేతువాదానికీ దూరంగా ఉండే అంతః ప్రవృత్తిని బట్టి నడుస్తుందది. ఆలోచించకుండా అకస్మాత్తుగా ఒక్కొక్కప్పుడు కొన్ని విషయాలు మన మనస్సుకు స్పష్టంగా తడతయి. దానినే అంతర్వాణి అనీ, అంతః ప్రవృత్తి అనీ అంటారు. తర్కం వల్లను ఆలోచన వల్లనూ కూడా అంత స్పష్టంగా విషయాలు తట్టవు. అందువల్లనే గాంధీ తన అనుచరులకు తన నిర్ణయాలను చెప్పివేస్తాడు. వాటికి తగిన తర్కము, హేతువాదమూ కనిపెట్టు, తగిన పని ఆయన అనుచరులది. భయము, రాగము, క్రోధము, ద్వేషము, స్వార్థము, కాపట్యము,

లను విడిచిపెట్టిన సత్యాగ్రహి హేతువాదం పైన ఆధార పడడు. అంతఃకరణ ప్రవృత్తి మీద ఆధార పడతాడు; అవసరం కోసం చూడడు; సిద్ధాంతం కోసం నిలబడతాడు; రాజకీయాల కంటె నీతిని ఎక్కువగా పాటిస్తాడు.

అంతఃకరణ ప్రవృత్తి

అహింసా పోరాటంలోనే కాదు నాయకులు అంతఃకరణ ప్రవృత్తిని బట్టి నడచుకొనేది. హింసా యుద్ధాలలో కూడా దానికి స్థానముంది. ఫీల్డు మార్షల్ రాబర్ట్సు, హేగ్ సేనానికి 1914-18 యుద్ధంలో వ్రాసిన ఉత్తరాన్ని చర్చిల్ ఈ విధంగా ఉదాహరిస్తూన్నాడు. "పడమర దిశను దండయాత్ర సాగించ వలసిందే. ఈ ఉద్దేశాన్ని బల పరచడానికి తగిన మంచి కారణాలు నే నేమి చెప్పలేను. కాని నా అంతఃకరణ మాత్రం అది మంచి పని అని నన్ను ప్రేరేపిస్తూన్నది." దీన్నిబట్టి రాబర్ట్సు తన నిర్ణయానికి తగిన కారణాలు చూపించలేక పోయినాడన్న మాట జ్ఞాపకముంచుకోండి. కాని అతని సిబ్బందీ అంతా అతని అంతఃకరణ ప్రేరేపించిన నిర్ణయాలకు కారణాలు కల్పించుకొని అనుసరించి తీరాలి. శిల్పి భవన నిర్మాణం ఎలా ఉండాలో ఊహించి నిర్ణయిస్తాడు. ఇంజనీయరు ప్లానులు, అంచనాలు తయారు చేస్తాడు. తాపీమనిషి కడతాడు. అదేవిధంగా, ఫీల్డు మార్షల్ నిర్ణయించిన పనిని కెప్టెన్ అమలు జరుపుతాడు. నిజానికి అంతఃకరణ ప్రవృత్తి సూక్ష్మాతి సూక్ష్మమైన హేతువాదం; ప్రజ్ఞా పరమావధి; కార్యరూపం దాల్చిన ప్రతిభ.

సత్యాగ్రహం ఏ కొందఱి గొప్పవాళ్ల సొమ్మో కాదు. అశిక్షితులైన అనేక మందికి దానిని అవలంబించడాని కధికార ముంది. ఈ సందర్భంలో ధర్మరాజుకు నారదుడు చెప్పిన మాటల నుదాహరించడం ఉచితం. బదరి కాశ్రమంలో తపస్సు చేసుకొంటూన్న దాక్షాయణి బిడ్డయైన నారాయణు నుండి తా నభ్యసించిన సనాతన ధర్మాన్ని నారదుడు ధర్మరాజు కిలా ఉపదేశించాడు :

> కుల భేదంతో నిమిత్తం లేకుండా ప్రతి వానికీ ఈ ముప్పై సుగుణాలూ ఉండి తీరాలి:— సత్యం, దయా, సహోపవాస తపస్సు, శౌచం, క్షమా, యుక్తాయుక్త విచక్షణ, శమము, దమము, అహింస, బ్రహ్మచర్యం, ఔదార్యం, ఉచితధ్యానం, ఆనందం, సౌమ్యత, సదాచారం, ప్రజా సేవ, ప్రాకృత వాంఛా విసర్జనం, ప్రయోజనం లేని పనులను చేయ కుండా ఉండడం, వాఙ్నియమనము, పరమాత్మను చింతనం, అఖిల భూతములకూ అన్న పానాదులను పంచిపెట్టడం, ప్రతి జంతువును పరమాత్మ స్వరూపంగా భావించడం, అంతరాత్మకు అనుకూలంగా నడచుకోవడం, శ్రీమన్నారాయణునిగూర్చి స్మరణం, సంకీర్తనం, శ్రవణం, వందనం, అర్చనం, దాసత్వం, సఖ్యం, ఆత్మజ్ఞానం అనే భక్తిమార్గాల నవలంబించడం.

ధర్మం

సత్యాగ్రహ మొక నూతన ధర్మశాస్త్రం కానీ నీతి సంగ్రహం కానీ కాదని, ఇప్పటికి బోధపడి ఉంటుంది. కులంతోనూ వృత్తి తోనూ నిమిత్తం లేకుండా ప్రతి మనిషీ అవలంబించ తగిన ధర్మమది. ప్రత్యేక కులాలకు ప్రత్యేక ధర్మాలు నిర్ణయింప

బడ్డవి. కాని నారదుడు చెప్పిన ఈ ధర్మాలు అందఱూ అవలంబింప దగినవి. అక్షరాలు రావడంతోనే మనం చిన్నప్పుడు చదువుకొన్న, చిన్ని చిన్ని పుస్తకాలలోని పద్యాలు జ్ఞాపకం చేసుకోవడం మంచిది. వాటిలో సత్యాగ్రహ ముఖ్యసూత్రాలిమిడి ఉన్నవి.

దౌర్జన్యం భయ క్రోధముల నుండి ప్రారంభిస్తుంది. అహింస క్షమాగుణం నుండి ఆరంభ మవుతుంది. భయం మానసిక కల్పనం. కోపం వాస్తవికం. క్రోధికి, తన కోపానికి గుఱి కావలసిన మనిషి అవతల మఱొకడు ఉండాలి. భయస్థుడు తన భయాన్ని లో లోపలనే మింగుకొని ఊరుకుంటాడు. వాడు తన కన్న బలమైన విషయాన్ని చూచి భయపడుతాడు. కోపం కల వాడు తనకన్న బలహీనుడిపైన తన ఆవేశాన్ని ప్రదర్శిస్తాడు. అనగా నీవొక శత్రువును చూచినప్పుడు నీకు కలిగే భయం కానీ, కోపం కానీ, నీ ప్రత్యర్థి కంటె నీవు బలహీనుడ వనుకొంటున్నావో లేక బలవంతుడ వనుకొంటున్నావో అనే విషయంపైన ఆధారపడి ఉంటుంది. “అనుభవమును బట్టీ తర్కమును బట్టీ మనుష్యుల మనః ప్రవృత్తులను మీరు చర్చిస్తున్నారు బాగానే ఉంది. కాని ఒక పోరాటంలోకి ఎఱిగిఉండీ బుద్ధిపూర్వకంగా ఆత్మ సమర్పణం కోసం జనం రావడము మాత్రం అంత తేలికైన పని కాదు సుమా. యుద్ధానికీ దోపిడీకీ బయలుదేరిన సిపాయీలు గుంపుకు, సాహస కార్యాల మీద ఉత్సాహం ఉంటుంది; ఏదైనా ప్రయోజనమూ లాభమూ కలుగవచ్చు ననే ఆశ ఉంటుంది; అందులో ఉన్న ప్రతి ఒక్కడూ, ఇంతమంది

ఉండగా తనకే దెబ్బ తగలవచ్చిందా అనుకొంటూండవచ్చు. ఈ అనుకోవడం వల్లనే ప్రతి వానికీ రక్షణ ఉన్నట్టుగా ప్రతి వాడూ భావించు కొంటూంటాడు. సత్యాగ్రహం విషయంలో అలా కాదే. తాను కావాలని అపాయాన్ని కొని తెచ్చుకోవడం; తనకు తప్పకుండా పెద్ద బాధ కలుగుతుందని తెలుసుకొని వెళ్ళడం; కాబట్టి సత్యాగ్రహంలోకి వలంటీర్లను చేర్చడం కంటె యుద్ధం లోకి సైన్యాలను చేర్చడం తేలిక” అని వాదించవచ్చును. అయితే సత్యాగ్రహంలో ఏ లోప మున్నదని మీ రంటూన్నారో సరిగా అదే దానిబలం. తన ముందు అపాయం ఉందని ఎఱిగి ఉండి, రాబోయే కష్టాలను బుద్ధి పూర్వకంగా ఎదుర్కోవడానికి మంచి ధైర్యముండాలి. తాను చేయబోయే పని మంచిదని విశ్వాస మున్నప్పుడే ధైర్యం ఇంకా ఎక్కువవుతుంది. ధైర్యానికి వ్యాపకశక్తి ఉంది. నీ ధైర్యం నీ పక్కను వాళ్లకు కూడా వ్యాపిస్తుంది. సైన్యం లోనో అలాకాదు; అనుకోకుండా యెవరికైనా ఒక సిపాయికి కలిగిన ఆపత్తు, పక్కను వాళ్ళకు భయం కలుగచేసి అందఱి స్థైర్యాన్ని కూడా చెడగొట్టవచ్చును. సత్యాగ్రహ సందర్భంలో బుద్ధి పూర్వకంగా తెలిసి ఉండి చేసే ప్రతిపనీ, ఇతరులలో కూడా త్యాగబుద్ధిని పురికొల్ప. దాని కుపయోగ పడుతుంది. బొంబాయి అజద్ మైదానంలో 1930-32, 33 లలో సత్యాగ్రహ పటాలాలు ఒకటి తరువాత ఒకటి వ్యూహాలుగా వచ్చిన దృశ్య మిందుకు తార్కాణం. నెత్తురు చూచినంత మాత్రాన వారి పట్టుదల సన్నగిల్ల లేదు.

దెబ్బ తగులుతుందనే భయంవల్ల వారు రంగంనుండి పారిపోలేదు. అజద్ మైదానం లోని ఉద్యమాన్ని నిర్మూలం చేయడానికి బొంబాయికి క్రొత్త కమీషనరును నియమించారు గవర్నమెంటువారు. ఆయన బుద్ధిపూర్వకంగా సత్యాగ్రహుల ఒంటి మీదనే కాక నెత్తి మీద కూడా లాఠీతో కొట్టించాడు. ఆ దెబ్బల వల్ల తలలు పగిలి నెత్తురు జడివాన కురిసినట్లు కురిసింది; సత్యాగ్రహుల శరీరాల నుండి, సెలయేళ్ళవలె ప్రవహించింది. ఆ దృశ్యాన్ని చూడడానికి వేలకొలదీ ప్రజలు వచ్చారు. ధైర్యశాలికి నెత్తురు చూచిన కొద్దీ ఇంకా ఎక్కువ ధైర్యం వస్తుంది. పిఱికి వాడికి గుండె జాఱిపోతుంది. ఈ క్రొత్త ఉద్యోగస్థుడు సత్యాగ్రహాన్ని చంపడానికి ప్రయోగించిన ఉపాయాల వల్ల అది చావక పోగా, పైపెచ్చు ఆ దృశ్యాన్ని చూడడానికి అదివరకు 5,000 మందే వచ్చేవారు. ఇప్పుడు 25000 మంది వస్తూన్నారు. రంగంలోకి వచ్చి సిపాయీల దౌర్జన్యానికి గుఱియైన ప్రతి సత్యాగ్రహ పటాలమూ తమ తరువాత వచ్చే పటాలంలో తమకంటె కూడా ఎక్కువ ధైర్యోత్సాహాలను ప్రదర్శించ వలెననే కోరికను కలిగించింది. ఈ ప్రకారం 1930 లో సత్యాగ్రహం అడ్డులేని ఆయుధంగా పరిణమించింది.

ఇక సత్యాగ్రహిని ఎదుర్కొంటూన్న సిపాయి యొక్కయు, పోలీసువాని యొక్కయు దృక్పథమునుండి ఈ విషయాన్ని పరిశీలన చేదాం. యుద్ధరంగానికి వెనుకనే ఇరవై మైళ్ళ దూరానో ఒక్కొక్కప్పుడు నూరుమైళ్ళ దూరానకూడా ఉండి, సిపాయీలను ఫలానా దృక్కోణంలో నుండి మర ఫిరంగులను

కాల్చవలసిందని సేనానాయకు డాజ్ఞాపిస్తూంటాడు. సిపాయీలకు కూడా తమ శత్రుసైన్యాలు కనిపించవు. దూరదృష్టి యంత్రాలతో యుద్ధ శాస్త్ర నిపుణులు పైనుండి కాని, లేక నేల మీదనుండి కాని ఆ కాలుపు ప్రయోజనకారిగా ఉందో లేదో చూస్తూ ఉంటారు. ఎప్పుడో కర్మంచాలక రెండు వైపుల సైనికులకూ ముష్టాముష్టి యుద్ధం జరిగితేతప్ప, లేకుంటే సైనికులు నిజమైన యుద్ధం చూడనే చూడరు. కాని సత్యాగ్రహులను పోలీసు కాని సిపాయిలుకాని కొట్టేటప్పుడు వారు ప్రత్యక్షంగా అంతా కళ్ళారా చూస్తూ కొట్టవలసి ఉంది. సత్యాగ్రహి అన్ని మంచి చట్టాలనూ నియమాలను శిరసావహిస్తాడు. వారు కొట్టే దెబ్బలకు మారు పలుకకుండా భరిస్తాడు. కొట్టినంత సేపూ యేవిధమైన ఉద్రేకమూ చూపించడు. ఇది చూచి తాను చేసిన పనికి సిపాయికి మనస్సులో సిగ్గు, ఆశ్చర్యం, విచారమూ కలుగుతాయి. నిరపరాధులు, నిరాయుధులు, నిరుద్రేక పరులూ అయిన వీళ్ళను కొట్టడానికి తానెందుకు లజ్ఞాపింప బడ్డాడా అని ఆలోచన కలుగుతుం దతనికి. సరిగా ఇదే కారణంవల్ల, ఘరియా వాలా సిపాయీలు, 1930-32 సత్యాగ్రహోద్యమంలో తుపాకులు కాల్చడానికి నిరాకరించారు. వారికి 14 సంవత్సరాలు ఖైదు విధింప బడ్డది. జైళ్ళలో ఖైదీలపైన లాఠీ ప్రయోగం చేయవలసి వస్తే పెండ్లాం బిడ్డలు కల వార్డర్లు కాక, అన్నదమ్ములను ఖూనీ చేసినవాళ్ళో, అంతకంటెనూ ఎక్కువ అవినీతి కరమైన నేరాలు చేసినందువల్ల ఎక్కువ కాలం శిక్షకు గురియైన వాళ్ళో కాన్విక్టు వార్డర్లుగా నియమింప బడినవాళ్ళో ఆ పనికి తయారవుతారు,

వార్డరు కంటె తప్పొప్పుల సంగతి తక్కువ తెలిసినవాళ్ళు కాన్విక్కు వార్డర్లు. అదే విధంగా సిపాయీల కంటె భార్యా బిడ్డలుగల పోలీసు వాళ్ళలో ఎక్కువ మానవత్వం ఉంటుందని విశ్వసింప బడుతూన్నది. మాతృదేశం కోసం పోరాడుతూన్న సత్యాగ్రహులను అకారణంగా కొట్టవలసిందని ఆజ్ఞాపింప బడిన పోలీసులకు తమ మాతృదేశమే సత్యాగ్రహుల మాతృదేశ మనే మాట గ్రహింపుకు వచ్చి, ఉదార బుద్ధితో వారా పని నుండి తొలగి పోతూంటారు. కాబట్టి మామూలు హింసాయుత యుద్ధంలో వలెనే, సత్యాగ్రహ యుద్ధంలో కూడా ప్రత్యర్థి యొక్క ధైర్య స్థైర్య శక్తి సామర్థ్యాలను పటాపంచలు చేసే ఉపాయాలు కలవు. పోలీసు మనిషికి కానీ సిపాయీకి కానీ తాను నిర్వర్తిస్తూన్న పనిలోని ధర్మాన్ని గూర్చి కొంచెం సందేహం తోచిందంటే చాలు, అతను నిర్వీర్యుడై పోయినా డన్న మాటే. ఇక సత్యాగ్రహి స్థితి యెలా ఉంటుందో ఆలోచిద్దాం. తాను దెబ్బలు తిని, మూర్ఛపోయి, తేరుకొని, మళ్ళీ దెబ్బలు తిని, మళ్ళీ పడిపోయి, మళ్ళీ లేచినప్పుడల్లా, తనలో ఎంత ధైర్యం కలదో, తా నెంత సహన శక్తిని ప్రదర్శిస్తూ న్నాడో, తనను చూస్తూన్న జనంలో యెంత ధైర్యం వ్యాపిస్తూందో అతనికి తెలుస్తూంటుంది. అందువల్ల అంతకంతకు తన ఉద్యమం బలమవుతూన్నట్లు, తనకు విజయం సమీపిస్తూ న్నట్లు అభిప్రాయం కలుగుతుంది. సత్యాగ్రహికి స్థైర్యమూ సంతృప్తి కలిగిన కొద్దీ పోలీసువానికి కంపమూ, నిరాశా కలుగు

తవి. తన పై అధికారులు చెప్పినట్లు తాను, యుక్తా యుక్త విచక్షణ లేకుండా ఈ పని చేయడం న్యాయ్యమా అని అతనికి తోస్తుంది. అదే సత్యాగ్రహ విజయ ప్రారంభ దశ. అప్పుడే సత్యాగ్రహి ఇంకనూ ఎక్కువ నియమబద్ధంగా ఉండాలి.

సామాన్యజనం నియమ బద్ధంగా ఉండరని కొంతమంది నమ్మకం. అది సత్యం కాదు. యుక్తి ప్రయుక్తులు తెలిసిన ఆంగ్ల విద్యాధికుల కంటె, సామాన్య జనులే ఎక్కువ నియమ బద్ధులుగా ఉంటారు. విద్యాధికులు సత్యాగ్రహ కార్య క్రమాన్ని గూర్చి తర్క వితర్కాలు చేస్తారు; పూర్వ చరిత్రతో పోల్చి చూస్తారు; జయం పొందే అవకాశాలను లెక్క వేస్తారు; దెబ్బకు దెబ్బ కొట్టడమంటే అందరికీ అర్థమవుతుంది కాని సత్యాగ్రహం ఎవరి కర్థమవుతుం దంటారు; అందరూ సత్యాహింసలు పాటించ గలరా అని సందేహిస్తారు. అందు వల్ల వారి విశ్వాసం అంతకంతకు జారి పోతూంటుంది. మామూలు మనిషి విషయంలో అలా కాదు. చెప్పగానే నమ్ము తాడు. ఆచరణలో పెడతాడు. విద్యాధికులకు తోచిన తర్క వితర్కా లతనికి తట్టనే తట్టవు. అంతేకాక, అహింసా సంగ్రామం గబగబా ఒక్కసారిగా సాగిపోయేది కాదు. క్రమానుగతంగా నడుస్తూన్న సత్యాగ్రహ నిగ్రహ పరం పరలతో అభివృద్ధి పొందుతూంటుంది. వాటిలోని ప్రతి సమ రమూ రాబోయే పోరాటానికి ప్రోత్సాహ కరంగా ఉంటుంది. సత్యాగ్రహంలో అహింస, ఇంగ్లీషు మందువలె గాక హోమియో మందువలె పని చేస్తుంది. సత్యాగ్రహం

ఎప్పుడూ రాజీతోనే ముగింప బడుతుంది; ఆ రాజీ చిట్టచివరి రాజీ కాకపోవచ్చు; కాని అది ముందు రాబోయే రాజీకొక మెట్టుగా ఉంటుంది. కాబట్టి సత్యాగ్రహి ఇది చివరి యుద్ధమని కానీ, జయం పొందేదాకా ఈ యుద్ధం మానమని కానీ దౌర్జన్యమూ, రక్తపాతమూ చేయడానికి పూనుకొన్నవాళ్ళనే టంత గట్టిగా అనడు. సత్యాగ్రహ సమర ఫలితాలలో ఒక విధమైన అసంపూర్ణత ఉంటుంది. సమయం చూచి తిరిగీ పోరాటం ప్రారంభించి ఆ కొఱతను పూర్తి చేసుకోవాలి. కాని ఈ విధముగా పునరుద్ధరింప బడిన ప్రతి పోరాటమూ మొదటి దానంత తీవ్రంగా ఉండనక్కర లేకపోవచ్చు. చెట్టు మొదలును మూడుపాళ్ళు కొట్టిన తరువాత, నాలుగోపాలు కొట్టడానికి మొదటి పాలు కొట్టేటప్పు డుపయోగించినంత బలం ఉపయోగించ నక్కరలేదు. తాడుకట్టి ఒక్కలాగు లాగితే పడిపోతుంది; ఆలాగే చెడుగును కొట్టివేయ డానికి కూడా మొట్ట మొదట చేసినంత కృషి తరువాత చేయనక్కర లేదు.

సత్యాగ్రహికి గల ప్రయోజనాలు

మామూలు యుద్ధంలో ఉన్న సదుపాయాలన్నీ సత్యాగ్రహంలోనూ ఉన్నాయి. కాని అందులో ఉన్న చిక్కు లిందులో లేవు. ఎందువల్ల నంటారా, పోరాటం ప్రారంభించాలా అక్కరలేదా అనే విషయం మన చేతుల్లో ఉంటుంది. మనం ఎంతవరకు చేయగలిగితే అంతే లాభం- సత్యాగ్రహంలో జయాపజయాలనేవి సంబంధ వాచకాలు. ప్రతి అపజయమూ జయానికి ఒక మెట్టు. ప్రతి విజయమూ అపజయ పరంపరలకు పరమావధి;

అగ్ర మకుటం; మనం చేసుకొన్న ప్రతి రాజీయున్నూ పరస్పర ప్రత్యపకార చింతకు తావలంగా ఉండదు. సుహృద్భావ సదుద్దేశాలను పెంపొందిస్తుంది. కాని హింసా యుద్ధంలో చేసుకొన్న రాజీలు, రాబోవు యుద్ధాలకు అంకురార్పణలుగా పరిణమిస్తవి. దౌర్జన్య యుద్ధంలో వలె, మన సత్యాగ్రహ సమరంలో నీతి భ్రష్టులమూ ధర్మచ్యుతులమూ కాము. పైగా మన ప్రత్యర్థిని కూడా క్రూరత్వమనే బురదలోనుండి, కసి అనే ఊబిలో నుండి పైకి లేవదీయ గలం. ఒకవేళ అతడు ఓడిపోయినప్పటికీ, అతని ప్రత్యర్థియైన సత్యాగ్రహి, అతనిపైన యేమీ దౌర్జన్యం చేయకుండా పై పెచ్చు అన్ని కష్టాలూ తానే అనుభవించి నందువల్ల, అతని హృదయం మార్దవమూ పరిశుద్ధమూ అయి శత్రువుపైన యే విధమైన దుశ్చింతకూ అవకాశ మీయదు.

సత్యాగ్రహానికి అభ్యంతరాలు

సామ్రాజ్య వాదుల దృష్టిలో శాంతి క్రమాలను కాపాడడమంటే, తమకు లోబడి ఉన్న దేశాలన్నూ వెనుకపడి ఉన్న జాతులనూ దోచుకోవడం. కాబట్టి అటువంటి ప్రభుత్వ చట్టాలను అహింసాయుతంగా నిరోధించడం శాంతి క్రమాలను తలక్రిందులు చేయడం కాదు. బలం కలవాడిదే న్యాయ్యమనే సిద్ధాంతం పైన ఆధారపడి ఉన్న ప్రస్తుత సంఘం కంటె, ఉత్తమమైన సంఘాన్ని నిర్మించడానికే అహింసా నిరోధకు డాపని చేస్తూన్నాడు కనుక అది సరియైనదే. కమ్యూనిస్టుల వలె, అహింసా నిరోధకు డెప్పుడూ దౌర్జన్య యుతమైన కార్యక్రమం ద్వారా

కల్లోలం కలిగించాలని చూడడు. అతను బలవంతుల రాజ్యాన్ని లొంగదీయడమే కాకుండా, తిరిగి దేశంలో శాంతి భద్రతలను స్థాపించడానికి కృషి చేస్తాడు. అంతేకాదు, అతని కొక నిర్మాణ కార్యక్రమం కూడా ఉంది. ఆచరణ యోగ్యమగు అతని కార్యక్రమం పైన పునర్నిర్మాణం చేయబడిన రాజ్యం, ఐకమత్యం తోనూ సోదర భావంతోనూ వర్ధిల్లుతుంది. హింస చెడుగు తరువాత చెడుగును కలిగించినట్లే, అహింస మంచి తరువాత మంచిని కలిగిస్తుంది. కొడితే కోపం వస్తుంది, కోపం వస్తే మళ్ళీ కొడతాడు; ఇది హింసాక్రమం. ఉపకారం చేస్తే స్నేహం కలుగుతుంది; స్నేహం కలిగితే ప్రత్యుపకారం చేస్తాడు; ఇది అహింసా క్రమం. దక్షిణ ఆఫ్రికాలో సత్యాగ్రహం రెండవ పర్యాయం జరుగుతూన్నప్పుడు, అక్కడి యూరోపియన్ రైల్వే ఉద్యోగులలో సమ్మె ప్రారంభ మయింది. అప్పుడక్కడి గవర్నమెంటు మంచి చిక్కులలో పడ్డదని గాంధీకి తెలుసు. కాని దాని వల్ల లాభం పొందడానికి బదులుగా ఉదార బుద్ధితో అది ఆగి పోయే టంతవరకూ భారతీయుల పోరాటాన్ని ఆయన నిలిపి వేశాడు. అందువల్ల భారతీయులపైన గౌరవం హెచ్చింది.

అహింసను ఆధారం చేసికొని నిర్మించబడిన రాజ్యంలోని ప్రజలు, సేవా తత్పరత్వమూ త్యాగబుద్ధి గలిగి ఐకమత్యంతో దాని స్థైర్యమునకు సహాయ కారులుగా ఉంటారు. అటువంటి ఫలితమును పొంద దలచుకొంటే, అధమం, అహింసా సత్యములను అవలంబించి తీరాలి. అహింసా సత్యాలలో సంపూర్ణ

విశ్వాసం లేనివాడు, తన ప్రయత్నంలో తా ననుభవించబోయే కష్ట నిష్ఠురాలకు తాళ జాలడు. ఒక్కొక్కప్పు డతడు అతి నీచమైన నేరాలు చేసిన వాళ్ళకంటె కూడా ఎక్కువ అవమానం భరించవలసి వస్తుంది. కాబట్టి అహింసలో అతనికి అత్యంత విశ్వాస ముండాలి. మామూలు మనుష్యులు సత్యాగ్రహ నియమాలను సరిగా ఆచరించ లేరనడం సత్యాగ్రహోద్యమానికి వ్యతిరేకంగా చెప్పదగిన వాదం కాదు. నియమ భంగం జరిగితే యేమి చేయాలో నాయకునకు తెలుసు. 1922 ఫిబ్రవరిలో చౌరీ చౌరా పోలీసు స్టేషను లోపల ఉన్న 21 మంది పోలీసు జవానులూ సబిన్స్పెక్టరుతో సహా తగులబెట్ట బడ్డప్పుడు, అసహయోద్యమం ఆపివేయ బడలేదా! గాంధీ ఉద్యమాలలో చాలా వరకు అహింస యెంత కచ్చితంగా పాటింప బడ్డదో, ఇండియా గవర్నమెంటు హోము మెంబరు సర్ హ్యారీ హేగ్ వంటి ఉద్యోగులూ, డెయిలీ హెరాల్డు విలేఖరుడు జార్జి స్లోకోంబో వంటి పత్రికా రచయితలూ, నిస్సంశయంగా ప్రకటించే ఉన్నారు. ఒక్కొక్కప్పుడు, అహింస అక్షరాలా అవలంబింపబడిన సందర్భాలు వేయి ఉన్నప్పటికీ వాటిని వదిలిపెట్టి, హింసా సందర్భం ఒక్కటైనా వివరంగా పొల్లు పోకుండా వర్ణింపబడ్డ మాట కూడా గమనించాలి. కారెలు చెప్పినట్లు ప్రజ అంటే "అతి వేగంగా అంటుకొనే అంతులేని అగ్ని". కాబట్టి వాళ్ళకు సంబంధించిన ఉద్యమాలలో దౌర్జన్యం పుట్టకుండా చూడడం మరీ అవసరం. కనుక సత్యాగ్రహం గానీ శాసనోల్లంఘనము గానీ ప్రారంభించవలె నంటే ముందుగా, నియమ బద్ధమైన

మానసిక, నైతిక శిక్షణ ఉండాలి. ప్రభుత్వ శాసనాలు నేరాలను ఆపలేవు. నేరస్థులను శిక్షించగలవు. ప్రజాభిప్రాయమూ, వ్యక్తిగత వివేకమూ అభివృద్ధి పొందినట్లయితే, అవి నేరాలను ఆపడానికి పోలీసు కంటె, ప్రభుత్వ శాసనాలకంటె కూడా ఎక్కువపని చేస్తయి. ఈ పద్ధతుల మీద ప్రజలకు శిక్షణ యిస్తే వారికి ఏకీభావం కలగడమే కాక, సేవా పరత్వము, ప్రేమ మొదలైన సుగుణాలు కూడా అలవడతయి.

గాంధీ - సత్యాగ్రహ యంత్రము

గాంధీ సత్యాగ్రహ యంత్రమును బహు వేగం గానూ, తలవని తలంపు గానూ నడుపుతూంటాడు. అంతర్వాణి ప్రబోధమును బట్టియే ఆయన ఆ ఉద్యమాన్ని ప్రారంభిస్తూంటాడు. ఆపి వేయడం కూడా అదే విధంగా చేస్తాడు. 1939 ఏప్రిలు ఒకటో తేదీని ఇండియాలోని రాజకోట, తిరువాన్కూరు, హైదరాబాదు జయపురములలోని- అన్ని సత్యాగ్రహోద్యమాలను నిలిపివేస్తూ ఆయన ఇలా వ్రాశాడు:

> సత్యాగ్రహంలో ఆశాభంగ మనేది కానీ అసంతృప్తి అనేది కానీ లేదు. మన ఆదర్శాన్ని అందుకొనే వరకూ ఏదో విధంగా పోరాటం నడుస్తూనే ఉంటుంది. సత్యాగ్రహి శాసనోల్లంఘనం చేయమన్నా చేస్తాడు; పోరాటానికి సంబంధించిన మఱొక పనిని చేయమన్నా చేస్తాడు. శాసనోల్లంఘనం మధ్యలో అతన్ని ఆపివేసి, ఇంకో పనికి పంపితే దానికీ సరే నంటాడు. అతనికి అదంతా మంచికోసమే ననే విశ్వాసం మాత్రం ఉండాలి. సత్యాగ్రహం ఆపివేసినప్పుడల్లా తరువాతి పోరాటానికి ప్రజలింకా ఎక్కువ సంసిద్ధంగా ఉండడం, దౌర్జన్య భావాలను నిగ్రి

హించుకో గలిగి ఉండడం నా కనుభవంలోని విషయాలే. కాబట్టి నేను ఆపివేయ మనడంవల్ల, సత్యాగ్రహులకు అవిశ్వాసం ప్రబలి, అసలు పాటిపోతారేమో ననే భయం నా కెంతమాత్రమూ లేదు. ఒకవేళ అలా జరిగితే నేను విచార పడను. పాటిపోయిన వాళ్ళకు సత్యాగ్రహ మంటే యేమిటో తెలియు లేదని నా కర్థమవుతుంది. తాము చేస్తూన్న పని యేమో తమకే తెలియని వాళ్ళు ఉద్యమంలో లేకుండా ఉంటే మరీ మంచిది.

తరువాతివారంలో గాంధీ తన మనస్సులోని భావాన్ని ఇలా వెల్లడించాడు. "నేను శాసనోల్లంఘ నోద్యమాలను అతి విశ్వాసంతో తొందరపడి ప్రారంభిస్తూన్నాను. కాని దానివలన దేశానికి నష్టం కలుగుతూన్నట్లు కనుపించదు. నేను ఎప్పటి కప్పుడు దేశముయొక్క నాడి పరీక్ష చేస్తూ యేదైనా అపాయం కలగబోతూన్నదని కాని, యేదో పొరపాటు చేశానని కానీ తోచినప్పుడు, వెంటనే వెనకడుగు వేయడానికి జంకక పోవడమే అందుకు కారణం."

సత్యాగ్రహం ఉపసంహరింప బడడంతోనే జను లెక్కడివా రక్కడ పని లేకుండా ఉండిపోరు. తాము సత్యాగ్రహం చేసే సమయంలో నిర్మాణ కార్యక్రమాన్ని నిర్వహిస్తూన్న మిత్రులతో చేరుకొని, వారు కూడా ఆ పని ప్రారంభిస్తారు. సత్యాగ్రహ కార్యక్రమంలో రెండు శాఖ లున్నవి. నిర్మాణ కార్యక్రమం; నిర్మూలన కార్యక్రమం; పోరాటం జరిగేటప్పుడు నిర్మూలన కార్యక్రమమూ, పోరాటం మానినప్పుడు నిర్మాణ కార్యక్రమమూ ఆచరణలోకి వస్తవి. దీపావళినాడే కాకుండా ఏట్టి

కేడాటీ టపాకాయలు కాల్చాలనే అశిక్షిత హృదయులు చాలా మంది ఈ ఉద్యమం స్థిరమైనది కాదనీ గాంధీ వస్తూ పోతూ ఉంటాడని అనుకొంటూంటారు. ఆయన వచ్చిన తక్షణం విప్లవోద్యమ ఫలితాలు కలిగేమాట నిజమే. కాని ఆయన వెళ్ళిన తరువాత కలిగే ఫలితాలు అంతకంటె కూడా స్థిరమైనవి. వరద వచ్చి, ఒండుమట్టి పేర్చి, ఉప్పు పట్టీలను సారవంతములుగా చేసినట్లు గాంధీ ఉద్యమాలు జనసామాన్యంలో చైతన్య వికాసాన్ని పెంపొందింప చేస్తాయి. గాంధీ కార్యక్రమం ఎప్పుడూ ఒకే తీరుగా విసుగు కలిగించేటట్టు ఉండదు. విద్యుత్కిరణం రాత్రుల యందు విమానాలను నడిపిస్తున్నట్లుగా, ఆయన అంతఃప్రవృత్తి భారత జాతిని నడుపుతూన్నది.

గాంధీ యే శక్తితో వ్యవహారిస్తూన్నాడో, యే శక్తిని ప్రతి వ్యక్తిలోనూ విజృంభింప చేయదలచు కొన్నాడో, ఆ ఆత్మశక్తి అనేక టన్నుల బరువును మోయింప చేస్తూన్న డన్‌లప్ టైరుల చుట్టూ ఉన్న వాతావరణ శక్తివంటిది; పెద్ద పెద్ద విమానాలను గాలిలో యెగిరేట్టు చేయగల శక్తికి సమానమైన శక్తి; మహా వృక్షాలనూ, దివ్య సౌధాలనూ పునాదులతో పెకలించ గలిగిన తుపాను శక్తిని పోలిన శక్తి; సముద్ర తరంగముల వలెను, జలావర్తమునందలి సుడులవలెనూ మహాద్భుత ప్రచండ వేగము గలిగిన శక్తి; ఆ శక్తి ప్రతి మనిషికీ అందుబాటులో ఉన్న శక్తి. కాని అటువంటి శక్తి ఒకటి ఉందని తెలుసుకొని దానిని ఉపయోగించుకో గలిగి ఉండాలి. సైకిలు టైరులో ఉన్న గాలి, బయటిగాలి వలెనే కంటికి కనపడక పోయినా 200 పౌనుల

బరువును గంటకు పండ్రెండు మైళ్ల వేగంతో తీసికొని పోగలిగిన శక్తి గలిగి ఉంటుంది. ఈ శక్తి దానికెలా వచ్చింది? అశిక్షితుడు దానిని భావించలేడు. ప్రత్యక్షంగా చూపిస్తే కూడా గ్రహించలేడు. కాని స్వయంగా అభ్యసిస్తే దానిని గూర్చిన భావనా శక్తీ గ్రహణ శక్తీ కూడా కలుగుతయి. అదే విధంగా ఆత్మశక్తి అనగా ఏమిటో, దాని గుణాలేమిటో, దానిలో ఏమేమి ఇమిడి ఉన్నవో, ఇవన్నీ పరిశీలించి సుశిక్షితులం కావాలి. సుశిక్షితులమే కాదు అందులో పండితులం కావాలి. సత్యాగ్రహం నిరాడంబరమైనది; కాని శక్తివంతమైనది. అత్యుదాత్తమైనది; కాని ఆచరణయోగ్యమైనది. అత్యున్నతమైనది; కాని విశ్వవ్యాప్తమైనది. అది ఒక రహస్య శక్తి కాదు-రహస్యాలను తెలుసుకోవడానికుపయోగపడే శక్తి. అది గారడీ కాదు; అద్భుతం. అది అగోచరమైనది కాదు; ఆశ్చర్యమైనది. అది తంత్రం కాదు; మంత్రం. అది కల్పన కాదు; సత్యావిష్కరణం.

అధ్యాయము ౪

సత్యాగ్రహం - యుద్ధం

జరిగిన ఇరవై సంవత్సరాల నుండీ గాంధీ జీవితమునూ ఆయన కార్య ప్రవృత్తులనూ పరిశీలిస్తే, తాను పౌరుడుగాను, సహకారి గానూ ఉన్న రాజ్యం, యుద్ధంలో చిక్కుకొని ఉన్నప్పుడేమి చేయవలెననే విషయాన్ని గూర్చి, ఆయన భావముల లోనూ, అభిప్రాయముల లోనూ క్రమానుగతంగా కలుగుతూన్న పరివర్తనం అర్థమవుతుంది. దక్షిణ ఆఫ్రికా యుద్ధం లోనూ జూలూ తిరుగుబాటు లోనూ ఆయన చేసిన సహాయం అందఱకూ తెలిసిందే. ఈ రెండో సందర్భంలో ఆయన అప్పుడు నడుపుతూన్న సత్యాగ్రహం కూడా ఆపివేసి ప్రభుత్వ పక్షమున వ్రణ చికిత్సా పటాలాలను సమకూర్చాడు. క్లిష్ట దశలో ప్రభుత్వాన్ని చీకాకు పఱచకూడదనే ఉద్దేశం తోనే ఇలా చేశాడు. 1914-18 యుద్ధంలో ఆయన ఇంగ్లండులో నున్నప్పుడు, సైన్యంలో ఆయన్ని చేరకుండా చేయడం చాలా కష్టమై పోయింది. ఆంగ్ల ప్రజల సద్భావమునందాయన కప్పుడచంచలమైన విశ్వాస ముండేది. 1914 లో కూడా ఆంగ్లేయులు చిక్కులలో నున్నప్పుడు, వారిని మఱింత చీకాకు పఱచడాని కాయన కిష్టం లేకపోయింది. అందువల్ల ఆయన వేమీ రాజకీయ లాభాల కోసం వత్తిడి కలిగించలేదు. ఇండియాలో ఆంగ్లేయులు చేసిన తప్పు పనులకు కారణం కొందఱు వ్యక్తులే కాని, ఆంగ్ల జాతీయ లక్షణము యొక్క భ్రష్టత్వము కాదని

ఆయన అభిప్రాయం. అందువలన ఆయన రెడ్ క్రాస్ సంస్థకు స్వచ్ఛంద సైనికులుగా 80 మంది మిత్రులను చేర్పించినాడు. షేమ్స్ఫర్డు ప్రభువు, 1918 లో ఆయనను సంగ్రామ సభకు పిలచినప్పుడు, యుద్ధానికి సైనికులను చేర్పించడానికి వాగ్దానం చేశాడు. అందుకోసం చాలా ప్రయత్నించాడు. అహింసా తత్వానికి యుద్ధంలో సైన్యాలను చేర్పించడం వ్యతిరేకం కాదా అని, ఆయనను అనేకమంది ప్రశ్నించారు. బ్రిటిష్‌వారి చేత తాను రక్షింప బడుతూన్నంత వరకూ ప్రత్యక్షంగా తాను దౌర్జన్యంలో పాల్గొంటూన్నట్లే గనుక, తానిప్పుడు బ్రిటిష్ వారితో పూర్తిగా సహకారమైనా చేయాలి, లేదా వారికి పూర్తిగా ఎదురైనా తిరగాలి; తన కిప్పుడు ఎదురు తిర్గే శక్తి సామర్థ్యాలు లేవు గనుక సహకారం చేస్తూన్నానని ఆయన బదులు చెప్పినాడు. ఇది ఆయన అనుచరులకు చాలా కష్టం తోచింది. అప్పుడు ఇంగ్లండు లోనూ, ఇండియా లోనూ కూడా మాట్లాడుతూ, యుద్ధంలో పాల్గొనడమే సరియైన పంథా అన్నాడాయన. ఆయన చేసిన ఈ పని, క్షుద్రమైన జాతీయ లాభం కోసం కానీ మరొకందుకు కానీ కాదు. చెడును మంచి చేత నిర్మూలం చేసినందువలన అహింసకు క్షేమం కలుగుతుం దనే నమ్మకంతో ఆయన అలా ప్రవర్తించాడు. ఇంగ్లండు లోని యుద్ధ వ్యతిరేకులకునూ తనకునూ గల భేదాన్ని ఈ విధంగా వివరించాడు :

తమకూ నాకూ గల ప్రధాన భేదాన్ని ఐరోపా యుద్ధ నిరోధకులు గమనించాలి. స్వప్రయోజనాల కోసం పరుల చేత ఉపయోగింప బడు

తూన్న దేశాలకు వారు చెందరు. నేనో అటువంటి దేశాలలో అగ్రస్థాన మలంకరిస్తూన్న దేశానికి చెందినవాణ్ని. వారు పిల్లి వంటివారు. నేనో ఎలుక వంటివాణ్ని. ఎలుకకు హింస చేయకూడదనే ఉద్దేశం ఒకటే ఉంటుందా? యుద్ధ నీతిలో అహింసా సిద్ధాంతం యొక్క ఔన్నత్యాన్నీ, ఔదార్యాన్నీ, విలక్షణతనూ, ఉపదేశించ డానికి ముందు తన బలమునంతా వినియోగించి తనను తాను రక్షించు కోవలెననే స్వతస్సిద్ధమైన కోరిక ఎలుకకు ఉండదా? "ఎలుక జాతి" కి ప్రతినిధి నైన నాకు, దానివలెనే అవిధ్వంసక చర్యల ఔన్నత్యాన్ని ఉపదేశించే నిమిత్తమే విధ్వంసక క్రియ వల్ల స్వసంరక్షణ చేసుకో వలెననే కోరిక ఉండడం అవసరం కాదా?

తరువాత తాను యుద్ధానికి సహాయం చేసి ప్రజాను రంజకత్వాన్ని కూడా కోలుపోవడానికి సంసిద్ధ పడ్డాడు. తాను యుద్ధప్రియత్వాలకు దూరంగా ఉండడానికి అప్పటికి కాలం పరిణతి పొందిన ట్లాయనకు తోచలేదు. కాని కాలం గడచిన కొద్దీ ఆయన అభిప్రాయాలు మారినయి. సత్యాగ్రహ ప్రచారం కానీ, ఉద్యమం కానీ పది సంవత్సరాలు నడచిన తరువాత 1929 లో, అంతకు పూర్వం తాను సిద్ధాంత రూపంలో ఉపదేశిస్తూన్న విషయం ఆచరణలోకి తేగల ననే విశ్వాసం ఆయనకు కలిగింది.

మామూలు పౌరధర్మాల విషయంలో నేను నా నిర్ణయాన్ని విశ్వసిస్తాను. పూర్వానికి ఇప్పటికి నా స్థితిలో చాలా మార్పు కలిగింది. పరిస్థితులను బట్టి నేను అహింసను ఉపదేశించ వలసి వచ్చింది. నేను నా ఉపదేశాలను శక్తివంచన లేకుండా నా జీవితం లోనే ఆచరణలో పెట్టడానికి కోరుతూన్నాను. యుద్ధాన్ని నిరోధించడానికి తగిన శక్తి ఇప్పుడను నాలో ఉన్నట్టుగా నే ననుకొంటూన్నాను.

1929 లో వ్రాసిన ఈ వాక్యాలను బట్టి ఆయన వైఖరి మామూలుగా యుద్ధానికి వ్యతిరేకంగా ఉన్నట్లు స్పష్టమవుతుంది. తన యుద్ధ వ్యతిరేకతను ప్రకటించడానికి తగిన పెద్ద జీకమూ, ఆయనకు ప్రజలలో ఉన్నది. ప్రజలూ, ఈ కొత్తకొత్త అభిప్రాయాలను గ్రహించి ప్రయోజనమును పొందడానికి సంసిద్ధంగా ఉన్నారు. బ్రిటిష్ వారికి యుద్ధంలో సహాయం చేసే షరతుతో ఇండియాకు కొన్ని ప్రయోజనాలు పొందే నిమిత్తం రాయబారాలు నడపడానికి తాను కాంగ్రెసు నాయకత్వం వహించజాలనని 1938 లో మ్యూనిచ్ సంధి జరిగినప్పుడు ఆయన ప్రకటించాడు. 1939-40 లో ఆయన యొక్క ఈ వైఖరి పరిపూర్ణత పొందింది. బ్రిటిష్ ప్రభుత్వము భారత స్వాతంత్ర్య ప్రకటన చేసి, భారత శాసనసభ లోని అన్ని పక్షాలకూ సంతృప్తి కరమైనట్టి వివిధ రాష్ట్రీయ ప్రభుత్వాలకూ అంగీకారమైనట్టీ జాతీయ ప్రభుత్వాన్ని కేంద్రంలో స్థాపించినట్లయితే, తాము యుద్ధానికి అన్ని విధాలా సహాయం చేస్తామని అఖిల భారత కాంగ్రెసు కమిటీ పూనాలో తీర్మానించినప్పుడు, తనను కాంగ్రెసు నాయకత్వపు బాధ్యత నుండి తప్పించవలసిందని గాంధీ కోరినాడు. కాని తరువాత 1940 సెప్టెంబరు 15, 16 తేదీలలో జరిగిన అ.భా.కాం.సం. సభలో ఆ తీర్మానాన్ని రద్దు చేయించి శాసనోల్లంఘనోద్యమాన్ని చాలా చిన్నగా ప్రారంభం చేశాడు. అక్టోబరు 17 వ తేదీని వినోబా భావేను మొదటి సత్యాగ్రహిగా యేర్పాటు చేశాడు.

అహింస - యుద్ధము

డాక్టరు పియరే సిరిసోల్ (Dr. Pierre Ceresole) "ఇంటర్నేషనల్ సర్వీసు సివిలును" నైతికంగా యుద్ధంతో తులతూగేటట్టున్నా, యుద్ధాన్ని చల్లార్చడానికి తగిన శక్తి కలిగిన సంస్థగానూ చేయ గలిగినాడు. ఆయన 1914 లో దక్షిణ ఆఫ్రికాలోనూ, 1934 లో బిహారు భూకంపం లోనూ సేవ చేశాడు. గాంధీని గూర్చి 1936 లో ఆయన చెప్పిన సంగతులివి :

మీ ఉపదేశకుడూ మీనాయకుడూ అయిన గాంధీ కేవలం మీవాడే కాడు; మానవలోకాని కంతటికీ చెందినవాడు. మహాత్ముని పనులలోనూ భావాలలోనూ ప్రపంచ కష్టాలు గట్టెక్కడానికి తగిన మంచిమార్గం మాకు కనబడుతూన్నది. ఆయన జీవితంలోని ఒక సంఘటనము నన్నత్యంతమూ ఆకర్షించింది. దక్షిణ ఆఫ్రికాలో ఆయన భారతీయుల పక్షాన సాత్విక నిరోధము నడుపుతూన్నరోజులలో, అక్కడి తెల్లకూలీలు సమ్మెకట్టినసంగతి మీకు తెలిసేఉంటుంది. ప్రభుత్వానికటువంటి కష్టం రావడం నిజంగా ఆయనకు మంచి అవకాశమే. ఆయన దానిని తేలికగా ఉపయోగించుకో వచ్చును కూడాను. కాని వారికివచ్చినచిక్కువల్ల ఆయన లాభంపొందాలని చూడలేదు. ఆయన తనపోరాటాన్ని తాత్కాలికంగా చాలించాడు. అది మానవాతీత విషయం; ఇరవైరెండు సంవత్సరాల కిందట, నేను ఇండియాను సేవించడానికి రావలసి వస్తుందని కలలోనైనా అనుకోలేదు. నేను ఇంజనీయరును. భౌతిక శాస్త్రజ్ఞుడను. గణిత శాస్త్ర నిపుణుడను. చదువుతూ, వ్రాస్తూ, లెక్కలు వేస్తూ కాలం గడపినాను. జరిగిన మహాసంగ్రామంలో, మే మంతవరకూ మా మనస్సులలో పోషించుకొంటూన్న మా ఉత్తమాదర్శాలు, కాళ్ళకింద నలిగి పోయినయి.

ఆధ్యాత్మిక నైతిక జీవితం నశించి పోయింది. క్రైస్తవ మత ప్రధాన ధర్మం కనిపించకుండా మాయ మయింది. అదీ అప్పుడు మాకు కలిగిన ఘోరానుభవం.

గాంధీలో అనుకోని మార్పు

గాంధీ అవలంబించే పద్ధతు లాయన అనుచరులకు సాధారణంగా తెలుస్తూనే ఉంటయి. కాని "అహింసాత్మక రాజ్యంలో యుద్ధాన్ని గూర్చిన ఆయన వైఖరి ఆచరణ యోగ్యంగా లేదని తలంచి' వా రాయనను అనుసరించలేక పోయినారు. అయితే వా రనుకోకపోయి ఉండవచ్చును గాని, ఆయన వైఖరిలో మాత్రం వ్యత్యాస మేమీ లేదు. యుద్ధం ప్రారంభం కాగానే ఆయన బ్రిటిష్ వారికి స్వయంగా నైతిక సహాయం వాగ్దానం చేశాడు; కాని కాంగ్రెసు పక్షాన మాట్లాడ నిరాకరించాడు. తరువాత 1940 జులైలో, హిందూదేశ స్వాతంత్ర్యాన్ని ప్రకటించి జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించే పక్షాన, బ్రిటిష్ వారికి యుద్ధంలో సహాయం చేస్తామని ఢిల్లీలో కాంగ్రెసు వర్కింగు కమిటీవారు తీర్మానం చేశారు. అప్పుడు గాంధీ, నాయకత్వ బాధ్యత నుండి తొలగి పోవడానికి వర్కింగు కమిటీ అనుజ్ఞ పొందినాడు. నిజానికి ఆయన అంతకు ముందే, అహింసాయుత ప్రభుత్వ స్థాపనను గూర్చి వర్కింగు కమిటీ గట్టిగా నిలబడలేక పోయినప్పుడే, తన నాయకత్వాన్ని వదులుకోవడానికి అనుజ్ఞ పొందినాడు.

గాంధీ అహింసాయుత ప్రభుత్వ స్థాపనను గూర్చి చాలా పట్టుదలగా ఉన్నాడు, ఆయన కది నేడు కేవలం సిద్ధాంత

విషయంగా లేదు; ఆచరించ వలసిన అత్యావసర విషయంగా ఉంది; యుద్ధాలపైన ఆధారపడ్డ బ్రిటను తోకకు, ఇండియాను కట్టి తోలడం ఆయన కెంతమాత్రమూ ఇష్టం లేదు. 1877 లో భారత దేశం నిరాయుధంగా చేయబడ్డది. ఇప్పటి కప్పుడే ఒక తరం దాటిపోయింది; విడిచిపెట్టిన ఆయుధాలను తిరిగీ చేపట్టడ మంటే, భారతీయుల మనస్సు తమ యొక్కయూ తమ శత్రువుల యొక్కయూ రక్తములను చిందించే భవిష్యత్తును మాత్రమే భావించ గలుగుతుంది. కాబట్టి ఇండియా హింసా మార్గము ననుసరించాలా? లేక అహింసా మార్గము ననుసరించాలా? గాంధీ దృష్టికి భారత దేశ స్వాతంత్ర్యం చాలా సమీపంలో కనిపించింది; జాతీయ కేంద్ర ప్రభుత్వం, విశ్వాస పూరితుల ఊహా ప్రపంచం లోని మిధ్యా విషయంగా గాక ప్రత్యక్ష సత్యంగా భావించాడు.

భారత స్వాతంత్ర్యానికి బదులుగా బ్రిటనుకు యుద్ధసహాయం చేయబూనుకోవడమంటే ఏమిటి?హిందూదేశం స్వతంత్ర దేశమైన తరువాత, పూర్వోత్తర సందర్భాలన్నీ ఎఱిగిఉండి, బుద్ధిపూర్వకంగా కళ్ళు తెఱుచుకొని యుద్ధం లోకి దిగడం. బ్రిటను ఇండియానుండి బలవంతంగాతీసుకొన్న సహాయంగానీ,ఇండియాచేత చేయించిన పనులు గాని, ప్రజలు ఇష్టపడి చేసినవి కావు కాబట్టి ఇండియాకు బాధ్యత లేదని తోసివేయ వచ్చు. కాని స్వతంత్ర భారత జాతి చేసిన ప్రతి పనికీ, భవిష్యత్తులో ఇండియాకు బాధ్యత ఉండి తీరుతుంది. గాంధీ ఇంతకాలం నుండీ ఆలోచిస్తూన్నది అధికారాన్ని గురించి కానే కాదు. ఎవరైనా

ఆయన అధికారాన్ని గూర్చి అశ్రద్ధ చేస్తూన్నాడని తలంచి నట్లయితే, అహింసవల్ల కూడా అధికారం రావచ్చుననీ, కాని అది హింసవల్ల నిలువ జాలదనీ ఆయన విశ్వాస మైనట్లుగా తెలుసుకోవాలి. ఆయన కొంత కాలం వరకు పోలీసు ఉండ డానికి ఒప్పుకొన్నాడు. కాని సైన్యం ఉండడానికి బొత్తిగా ఒప్పుకో లేదు. అయినా ఆ విషయాన్ని కూడా ప్రజ లింకా ఆలోచనలో ఉంచడం మంచిదన్నాడు. ప్రజలను అహింసా మార్గంలో శిక్షితులనుగా చేయవలెనని ఆయన నమ్మకం. ఒక్కసారి సైన్యాన్ని ప్రవేశ పెట్టినట్లయితే, సైనిక భాష, సైనిక కళ, సైనిక ప్రతిక్రియల వైపునకే జాతీయ దృక్పథం నడుస్తూంటుంది. ఇది ఇలా ఉండగా సైనికో ద్యోగులను తయారు చేయడానికి ఇరవై యేళ్ళు పడుతుంది. అధమం ఆరువేళ్ళ మంది ఉద్యోగులు కావాలి; వీళ్ళందరూ ఏమి చేయాలి? ఈ ఉద్యోగుల కంటె కూడా, వీరి ఉనికి వలన ప్రజా హృదయంలో కలగ బోయే పరివర్తనాన్ని గుఱించి ఆయన ఎక్కువ బాధ పడ్డాడు.

గాంధీ ఈ సందర్భంలో అప్పటి పరిస్థితులనూ, సంఘటన లనూ వివరిస్తూ చేసిన వాదం అప్రతిహతం. అది ఆయన అను యాయుల విశ్వాసానికి పరీక్షగా పరిణమించింది. అది అలా ఉండగా కాంగ్రెసు అదివరకు, "న్యాయ్యమును ధర్మ సమ్మత మునూ అయిన మార్గాల స్వరాజ్య సంపాదనం చేస్తా" నన్నదే కాని అంతకన్న ఎక్కువ ఏమీ చెప్ప లేదు. కాకపోతే స్వరాజ్యం వచ్చిన తరువాత కూడా కాంగ్రెసు అహింసా సిద్ధాంతాన్ని అంటిపట్టుకొనే ఉంట్లుందా' అని విమర్శకు లడిగే ప్రశ్నలకు,

అహింసతో స్వరాజ్యాన్ని సంపాదించుకో గలిగినప్పుడు దానితోనే రక్షించుకో గలిగి ఉండాలి. అని సంగ్రహంగా జవాబీయ బడుతూండేది. అంతకు మించి కాంగ్రెసెన్నడూ అహింసా ప్రభుత్వమును గూర్చి ఆలోచించనైనా లేదు. అంతే కాక 1934 అక్టోబరులో, కాంగ్రెసు మొదటి నిబంధనలోని "న్యాయ్యమును ధర్మసమ్మతమునూ అయిన మార్గాలతో" అనే మాటలకు బదులుగా "సత్యమును అహింసాయుతమును" అనే మాటలను చేర్చవలసిందనే సూచన చాలా గట్టిగా ఎదిరించ బడ్డది. గాంధీ కాంగ్రెసు సభ్యుడుగా ఉండక మానివేయడాని కదికూడా కొంత కారణం. ఇది జరిగిన ఆ రేండ్లకు విదేశ దండ యాత్రలనూ, ఆంతరంగిక కల్లోలాలనూ కూడా, ఆయుధాలు లేకుండా ఎదుర్కో గలిగిన, సైనిక రహితమైన అహింసా రాజ్య స్థాపనకు, గాంధీ వార్ధా - ఢిల్లీలలో వర్కింగు కమిటీ యొక్క సహాయం పొందడానికి ప్రయత్నించాడు.

1940 సెప్టెంబరులోని కాంగ్రెసు వాగ్దానం

జరిగిన అన్ని సంఘటనలనూ వరుసగా పరిశీలించుకొంటూ రాగా, 1939 సెప్టెంబరు 14 న కొన్ని షరతులతో బ్రిటనుకు సహాయ పడడానికి ఒప్పుకొంటూ, కాంగ్రెసు వర్కింగు కమిటీ వారు తీర్మానం చేసినట్లు తేలుతుంది. ఆ తీర్మానంలో ఉద్దేశింప బడిన సహాయం ఏమిటి? యుద్ధం ప్రారంభం కాగానే గాంధీ, వైస్రాయిని దర్శించినప్పుడు ఏ షరతులూ లేని సహాయాన్ని వాగ్దానం చేయడం, తరువాత అది నైతిక సహాయం కాని

భౌతిక సహాయం కాదు సుమా అని ఆయనే వివరించడం, మనం జ్ఞాపక ముంచుకోవాలి. యుద్ధం ప్రారంభించి పక్షం రోజులైనా కాకమునుపే, 14 సెప్టెంబరు తేదీని కాంగ్రెసు వర్కింగు కమిటీవారు, యుద్ధంపైన తమ చరిత్ర ప్రసిద్ధమైన తీర్మానాన్ని చేసినప్పుడు, గాంధీ యున్నూ వర్కింగు కమిటీ యున్నూ సహకార మనే పదానికి వేరువేరు అర్థాలు చేసుకొని ఉండడానికి చాలా సావకాశ ముంది. ఎందువల్ల ననగా, వర్కింగు కమిటీ తీర్మానం జరిగిన కొంత కాలానికి యేదో ఒక లండను పత్రిక గాంధీని ప్రశ్నించగా, తాను వాగ్దానం చేసిన సహకారం నైతిక సహకారం మాత్రమే నని అప్పుడు వివరించా డాయన.

కాంగ్రెసు తీర్మానం

1939 సెప్టెంబరు 14 వ తేదీ ప్రకటన బహు స్పష్టంగా ఉంది. అది యిది :

> ఒక సదుద్యమం కోసం సహకారాన్ని బలవంతంగానూ, నిర్బంధంగానూ యెవ్వరూ పొందజాలరు. కాబట్టి బయటివారి అధికారానికి లోబడి వారి ఉత్తరువుల ప్రకారం, భారతీయులం ప్రవర్తించడానికి ఈ కమిటీ అంగీకరింప జాలదు. ఉభయులూ ఉత్తమ మైనదని నమ్మిన ఉద్యమ సందర్భంలో, సమాన ప్రతిపత్తి గల ఇరువురి మధ్య, పరస్పరాంగీకారముతో మాత్రమే సహకారం సంభవ మౌతుంది. ఇటీవల భారతీయులు తమ స్వాతంత్ర్య సంపాదన నిమిత్తమున్నూ, భారత దేశములో స్వతంత్ర ప్రజా రాజ్యమును స్థాపించే నిమిత్తమున్నూ, అనేక అపాయములకు గురియై హృదయ పూర్వకముగా మహా త్యాగములను

చేసి ఉన్నారు; కాబట్టి స్వాతంత్ర్య ప్రజా రాజ్యాల పక్షాన పూర్తిగా వారి సానుభూతి ఉంది. కాని ప్రజా రాజ్య స్వాతంత్ర్యం కోసం జరుగుతూన్నదని చెప్పబడే ఈ యుద్ధంలో అటువంటి స్వాతంత్ర్యం భారత దేశానికి నిరాకరింపబడి నప్పుడున్నూ, అంతకు పూర్వమున్న కొంచెం స్వాతంత్ర్యం కూడా లాగివేయబడి నప్పుడున్నూ, భారతీయులు జోక్యం కలిగించుకో జాలరు.

తాను కానీ కాంగ్రెసు కానీ ఈ యుద్ధంలో చేస్తామని చెప్పే సహకారం కేవలం నైతిక సహకారమే నని, ఇప్పటి వరకూ గాంధీ అభిప్రాయమనే మాట స్పష్టం. ఈ విషయం ఫ్రాన్సు పడిపోయిన పిమ్మట, 1940 జూన్ 14 వ తేదీని స్పష్టం చేయబడింది. కాబట్టి వార్ధాలో 17 జూన్ న వర్కింగు కమిటీ సమావేశ మయ్యే నాటికి, వాతావరణం పూర్తిగా మారి పోయింది. అహింసను గూర్చి నిర్ణయించ వలసిన అవసరం అప్పుడు వచ్చింది. ఆ చర్చలోనే అన్ని అభిప్రాయ భేదాలూ బయటికి వచ్చినయి. భారతీయుల కోరికను గూర్చి, వారు బ్రిటనుకు చేయబోయే సహాయమును గూర్చి, ఢిల్లీలో 1940 లో చర్చకు వచ్చినప్పుడీ విషయం మరింత ప్రాముఖ్యత వహించింది. భారత దేశ స్వాతంత్ర్యాన్ని బ్రిటను అప్పటికప్పుడు గుర్తించాలనీ, అందుకు బదులుగా హిందూ దేశం బ్రిటనుకు నైతిక సహాయం చేయాలనీ గాంధీ పట్టు పట్టినాడు. భారత స్వాతంత్ర్యం విషయంలో వర్కింగు కమిటీ పూర్తిగా ఏకీభవించింది; కాని బ్రిటనుకు చేయబోయే సహాయం విషయంలో మాత్రం భేదించింది. ఈ భేదం కేవలం సిద్ధాంతానికి సంబం

ధించింది; అంతేకాని బ్రిటను యెడల ఇండియా చూపవలసిన వైఖరినిగూర్చి గానీ, గాంధీ వర్కింగు కమిటీల వ్యక్తిగత సంబంధమైనది కానీ కాదు. ఫాసిస్టు సామ్రాజ్య తత్వాలను నిరసించడంలో అందరూ ఒకే అభిప్రాయంతో ఉన్నారు. బ్రిటను హిందూదేశ స్వాతంత్ర్యాన్ని ప్రకటించి, తన సామ్రాజ్య తత్వాన్ని వదులుకొన్నట్లయితే, నిష్కళంకంగా స్వతంత్ర భారత దేశపు స్నేహ సహకారాలను పొందేటందుకు రాయబారాలు నడపగలిగిన స్థితిలో ఉంటుంది. గాంధీ "న్యూస్ క్రానికల్" కు 4-12-39 న పంపిన కేబిలులో ఈ భావమే వ్యక్తం చేయబడింది.

> నాకు గల అనేక వ్యక్తిగత సంబంధాల వల్ల బ్రిటను విజయం పొందాలని ఆతురపడుతూన్నాను. కాని ఆ విజయం ఆయుధ బలాధిక్యత వలన కాక నిరంతర ధర్మబుద్ధి వల్లనే కలగాలి.

దీనిని బట్టి, స్వతంత్ర భారత దేశం బ్రిటను ఎడల స్నేహభావం కలిగి ఉండాలనే విషయంలో, గాంధీ ఆయన సహచరులూ కూడా అంగీకరించారు. కాని యేవిధంగా ఆ దేశాన్ని సన్నాహపఱచాలి అనే విషయంలోనే భేదాభిప్రాయాలు కలిగినై. స్వతంత్ర భారతదేశం అహింసా యుతంగా ఉండాలని అంగీకరించేవారు కూడా, దానిని గూర్చి కాంగ్రెసు నిర్ణయం లేనందున శంకిస్తూన్నారు. కాని గాంధీ వలెనే అందరూ కూడా వెంటనే ఈ సమస్య పరిష్కరింప బడవలెననే ఒప్పుకొంటూన్నారు.

1940 ఆగష్టులో అమెరీ ఆడిన నాటకం

కామన్సు సభలో 1940 ఆగష్టు 14 న అమెరీ ఆడిన మాటలు, 12 వ తేదీన బ్లాకు పూలులో తాను చేసిన వాగ్దానానికి ప్రత్యక్ష విరుద్ధంగా ఉండడమే కాక, వైస్రాయి ఆగష్టు 7 న సిమ్లాలో చెప్పిన మాటలకు ప్రతిధ్వనులుగా కూడా ఉన్నాయి. అమెరీకి భారతీయ ఆర్థిక సాంఘిక నిర్మాణాన్ని గూర్చి గానీ భారతీయ రాజకీయ ప్రజా జీవితములను గూర్చి గానీ నిజపరిస్థితు లేమీ తెలియనే తెలియవు. జడ్జీ కేసంతా సమకూర్చి చెప్పిన తరువాత ముద్దాయి శిక్షార్హుడే నని చెప్పే జూరరు వంటివాడు అమెరీ. ఈ కేసులో ఇండియా చాలా తప్పిదాలు చేసిందనీ, కాబట్టి ఆ దేశానికి స్వరాజ్యార్హత లేదనీ అమెరీ తీరుపిచ్చాడు. అయితే ఆయన దృష్టిలో కాంగ్రెసు ఒక్కటే నేరం చేసినట్లు కాదు. ఇంకా చాలామంది తోడి నేరస్తులున్నారు. వారిలో కొందరు నేరాన్ని ప్రోత్సహించిన వారు, కొందరు తరువాత తోడుపడ్డవారు. పాకిస్థానాన్ని కోరుతూన్న ముస్లిం లీగు అసంతృప్తిగా ఉంది. వైస్రాయి వలన 1940 ఆగష్టు 7 న రాజకీయ సంస్థగా గుర్తింపబడి, ముస్లిం లీగుతో సమాన ప్రతిపత్తి గలిగి వ్యవహరింప దలచుకొన్న హిందూ మహాసభ, పాకిస్థానానికి వ్యతిరేకంగా ప్రకటన కోరుతూన్నది. వైస్రాయి గాని, భారత రాజ్యాంగ కార్యదర్శి గానీ చెప్పిన మాటలు చెప్పినట్లుగా మనం నమ్ముదాం. వారిని గూర్చి మన మేమీ అపోహ పడవద్దు. మనిషి యొక్క నిజాయితీ, మాటలలో కంటె చేతలలో తెలుస్తుంది. కాబట్టి ప్రస్తుతం వాదం కోసం,

సంపూర్ణ స్వాతంత్ర్యానికీ అధినివేశ ప్రతిపత్తికీ గల సూక్ష్మ భేధాన్ని వదలివేదాం. ఈ రెండింటిలో ఏ ఒకటి గానీ ఆచరణ లోకి వచ్చే తేదీనిగూర్చి కూడా మనం వివాద పడవద్దు. కాని ఇప్పుడీ అంతటిలోనూ మనకు తేలిన ముఖ్యాంశ మేమంటే జాతీయ ప్రభుత్వ నిర్మాణం దాని లక్షణం, దాని కార్యకలాపం, దాని అధికారం, దాని స్వాతంత్ర్యం. బ్రిటిష్ మంత్రులు కానీ వైస్రాయి కానీ చేసిన వాగ్దానం నిజమైనదని ఋజువు కావా లంటే, ముందుగా సివిలియనులు ప్రభుత్వంలో నుండి తొలగి పోవాలి. యుద్ధం ముగిసిన మేడాదిలో ఇండియాకు అధినివేశ ప్రతిపత్తిని యిస్తామని చెప్పిన వారిమాట నమ్మదగినదే ఐతే, కేంద్ర ప్రభుత్వం లోని ముగ్గురు సివిలియనులనూ తొలగించక, ఇండియనులను వారు నమ్మజాలక పోవడం జరుగనే జరుగదు. అటువంటి సందర్భంలో వారి సూచనను మితవాద వర్గం కూడా విశ్వసించ జాలదు. దేశంలో సివిలియను ప్రభుత్వాన్ని రద్దు చేయించ వలసిందని దేశమంతా ఏకగ్రీవంగా కోరుతూన్నది. రాష్ట్రాలలో అలా జరిగింది. కేంద్రంలో కూడా జరగాలి. దేశం యొక్క రాజ్యాంగ విధానంలో జరుగ వలసిన మార్పుల విషయం అలా ఉండగా, ఇండియాకూ బ్రిటనుకూ ఈ ముగ్గురు సివిలియనుల మాక్స్వెల్, క్లో, బాజ్పాయ్ గార్ల ఉనికిని గూర్చి కూడా తగాదా ఉన్నది. ఈ చివరవారు భారతీయు డైనంత మాత్రాన ఇండియాకు ఒరిగిం దేమీ లేదు. ఇప్పుడు వివాదం, ఇండియనులు ఉండాలా యూరోపియనులు ఉండాలా అని కాదు. సివిలియనులు ఉండాలా సివిలియనులు కానివా రుండాలా అని.

కాంగ్రెసు యాజమాన్యం క్రింద క్రమాభివృద్ధి పొందుతూన్న ఉద్యమానికి వెనుక గల పరిస్థితులను చూపించడానికే, ఈ విషయాలన్నీ వరుసగా మీకు చెప్పవలసి వచ్చింది. యువకులు చేసే ఆక్షేపణలను విమర్శనలను, ప్రభుత్వం చూపే నిరాదరణను నిర్లక్ష్యాన్నీ, కాంగ్రెసు చాలాకాలం తొట్రుపాటు లేకుండా భరించవలసి వచ్చింది. కాని దాని సహనం మితిమీఱిపోయింది. గాంధీ శాస్త్రప్రకారం కాంగ్రెసులో లేకపోయినా, దానితో ఆయనకు సన్నిహిత సంబంధం లేకుండా పోలేదు. యుద్ధ సహాయం కోసం నిర్బంధంగా జరుగుతూన్న డబ్బు వసూళ్ళను గూర్చి ఆయనకు వచ్చే ఉత్తరాలు లెక్కలేకుండా పెఱిగిపోతున్నాయి. గాంధీ కాంగ్రెసు కార్యవిధానంతో సన్నిహిత సంబంధం లేకుండా ఉన్నాడని యెవరైనా అనుకొంటూ ఉంటే అది కేవలం పొరపాటు. గాంధీ యే విషయాన్నీ అశ్రద్ధ చేయడు. ఆయన కాంగ్రెసులో ఉండక పోవచ్చు. కాని ఆయన కాంగ్రెసు సొత్తు. కాంగ్రెసు లోని అన్ని ఆంతరంగిక వ్యవహారాలలోనూ ఆయన సంబంధం కలిగించుకొని, వాటి నిర్వహణమునకు మార్గదర్శకుడుగా ఉంటాడు. తాను స్వయంగా ఆచరించడానికి సిద్ధపడని యే కార్య విధానాన్నీ కూడా ఆయన ఎన్నడూ కాంగ్రెసుకు సూచించలేదు. కాబట్టి మొత్తం మీద కాంగ్రెసు నడప దలచుకొన్న యే పోరాటంలో నైనా సరే ఆయన ఉండి నాయకత్వం వహించి తీరుతాడని నమ్మవచ్చును.

ఇండియాలో వలెనే యూరోపులో కూడా అతి వేగంగా అనేక సంఘటనలు జరుగుతూన్నవి- యూరపులో రక్తపాత

యుతమై వివిధ పరివర్తనములతో కూడిన మహా సంగ్రామం జరుగుతూన్నది. ఏ జాతి అదృష్టం ఏ క్షణంలో ఎలా ఉంటుందో చెప్పడానికి వీలు లేకుండా ఉంది. ఇండియాలో తెల్లవారితే యేమి రానున్నదో తెలియడం లేదు. ప్రతి మనిషి నోటా సత్యాగ్రహ మనే మాట వినబడుతూన్నది. ఉత్సాహ వంతులైన మిత్రులు కాంగ్రెసును తొందర చేస్తూ ఉండగా, ప్రభుత్వాచర్యలంత కంతకు ఆశ్చర్య కరంగా ఉంటూన్నాయి. కాంగ్రెసు వాగ్దానం చేసిన సహకారాన్ని వారు నిరాకరించారు. పూనా తీర్మానం దాదాపు చిత్తుకాగితం కింద పరిణమించింది. ఇటువంటి స్థితిలో బొంబాయిలో అ. భా. కాం. సం. సమావేశం జరిగింది. తాము తిరగటిలోని బియ్యపు గింజవలెను, అడకత్తెర లోని వక్క వలెను నలిగి పోతూన్నామని అ. భా. కాం. సం. సభ్యు లభిప్రాయ పడ్డారు. ఇటువంటి సందిగ్ధ సమయంలో గాంధీ తిరిగి కాంగ్రెసు నాయకత్వం వహించడ మొక్కటే కాంగ్రెసు కనుకూల విషయం. పూనా పతకం ఫలవంతం కాలేదు. కాంగ్రెసులో "ఆలోచనాపరులు అవ్యగ్ర మనస్కులు" అయిన వారు తమ సహకార విధానాన్ని గూర్చి వత్తిడి చేయడం మానుకొన్నారు. కాని గాంధీ వలననే కొంత చిక్కు తటస్థించింది. రాజ ప్రతినిధి హిందూ దేశ రాజ్యాంగ కార్యదర్శి మాట్లాడిన మాటల వల్ల ఆయనకు కోపమూ విచారమూ కలిగి నప్పటికీ, ఆయన ఈ పరిస్థితులల్లో విశాల సత్యాగ్రహోద్యమాన్ని సాగించ దలచుకోక పోవచ్చును. అందుకు మొదటి కారణమది ఆయన సహజ స్వభావానికి వ్యతిరేకం. ఆయన

న్నేన్నడూ మొట్ట మొదటగా సత్యాగ్రహం కావాలని కోర లేదు. ఎప్పుడయినా సరే అది తప్పనిసరి అయినప్పుడు మాత్రమే దానిని ఆరంభించాడు. అయితే యిప్పటి సత్యాగ్రహం తన ఒక్కని వఱకేనని పరిమితి యేర్పాటు చేస్తాడా? లేక అది ప్రజా సామాన్య మంతకూ సంబంధించి ఉంటుందా? మూక సత్యాగ్రహానికి వ్యతిరేకంగా ఆయన అనేక పర్యాయాలు, ప్రత్యక్ష పరోక్ష కారణాలను చూపించాడు. కాబట్టి పూర్వ ప్రస్తుత కాంగ్రెసు కార్య నిర్వాహక సభ్యులు, అఖిల భారత కాంగ్రెసు సభ్యులు, రాష్ట్రీయ కాంగ్రెసు సభ్యులు అందఱు శాసనసభా సభ్యులు మాత్రమే సత్యాగ్రహం చేయ దగిన వారని పరిమితి యేర్పాటు చేయడం మఱొక పద్ధతి. ఈ సంఖ్య గాంధీ మనస్సులోని నైతికోద్దేశాన్ని వ్యక్తం చేయ డానికి తగినంత పెద్దది. హిందూదేశం బ్రిటిష్ యుద్ధ ప్రయత్నాల కనుకూలంగా ఉన్నదా? లోపల అనుమానం తోచినా బయటికి మాత్రం అనుకూలంగా ఉందనే బ్రిటిష్‌వా రంటారు. 1940 సెప్టెంబరు 15 వ తేదీని దీనిని గూర్చి ఇండియా ప్రత్యుత్తర మిచ్చింది. సెప్టెంబరు నెల దగ్గరకు వస్తూన్న కొద్దీ లక్నో అలహాబాదుల లోనూ, నాగపురం గౌహతీల లోనూ కూడా, గాంధీ రాజప్రతినిధుల చివరి సంభాషణల వల్ల చిక్కు వీడిపో వచ్చుననే నమ్మకం- (అది కేవలం మన కోరికవలన కలిగినదే కావచ్చు) వెల్లడింప బడుతూ వచ్చింది. కాంగ్రెసుకు కష్టదశ వచ్చినప్పుడల్లా గాంధీ నాయకత్వం లభిస్తూ ఉండడం ఆ సంస్థ అదృష్టమని చెప్పాలి.

చిట్టచివరకు మేము భయపడుతూన్నట్లుగానే అనుకొన్నంతా జరిగింది. హిందూదేశము యొక్క అంగీకారం గానీ ఎఱుక గానీ లేకుండానే దేశాన్ని యుద్ధంలోకి దింపడమే బ్రిటిష్ వారికీ ఇండియాకూ కలిగిన వివాదానికి మూలం. అసలు యుద్ధమంటేనే అసహ్యించుకొని అహింస విషయం అలా ఉండగా, పైన ఉదాహరించబడిన విషయం కూడా బొంబాయిలో జరిగిన అ. భా. కాం. సం. తీర్మానం లోనూ, గాంధీ రాజప్రతినిధిని కోరిన కోరిక లోనూ స్పష్టం చేయ బడింది. ఇండియా అబుద్ధి పూర్వకంగా యుద్ధంలో చిక్కుకోవడమును గూర్చి గాంధీ అనేక విధాల వివరించాడు. ఇండియాను ప్రజలు అంగీకారం గానీ ఎఱుక గానీ లేకుండానే యుద్ధంలోకి దింపినందువల్లనూ, హిందూదేశం చేసే మనుష్య సహాయం కానీ ఆర్థిక సహాయం గానీ స్వచ్ఛందంగానే చేస్తూన్నదని బ్రిటను ఋజువు చేయ లేనందువల్లనూ, గాంధీ వాదం అప్రతిహతమని చెప్పాలి. నిర్బంధం లేకుండా చేసే సహాయాన్నే స్వచ్ఛంద సహాయమనాలి. యుద్ధ సహాయం చేయాలా అక్కరలేదా అనే స్వాతంత్ర్యం భారత దేశ ప్రజల కుండాలి. అదే గాంధీ కావాలని కోరిన హక్కు. ఆ హక్కే రాజప్రతినిధి చేత నిరాకరింపబడ్డది.

అఖిల భారత కాంగ్రెసు సంఘం బొంబాయిలో 1940 సెప్టెంబరు నెలలో అంగీకరించిన తీర్మానమిది :

1940 జులై 27 వ తేదీని పూనాలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు సంఘ సమావేశానంతరం తటస్థించిన సంఘటనలను గూర్చి, కడచిన

ఆగష్టు నెలలో కాంగ్రెసు కార్యనిర్వాహకులు చేసిన తీర్మానాలను గూర్చి ఈ అ. భా. కాం. సం. జాగ్రత్తగా ఆలోచించింది. ఈ తీర్మానాలను ఈ కమిటీ పరిశీలించి ఆమోదిస్తూన్నది. బ్రిటిష్ ప్రజల సహకారంతో భారతదేశం లోని ప్రతిష్టంభనాన్ని అంతం కావించి, జాతీయ క్షేమాన్ని పెంపొందించే నిమిత్తం, గాంధీ మహాత్ముని సహకారాన్ని కూడా పోగొట్టుకొని జులై 7 వ తేదీని ఢిల్లీలో బ్రిటిష్ ప్రభుత్వానికి కాంగ్రెసు వర్కింగు కమిటీ చేసిన తీర్మానం లోని సూచన, తరువాత పూనాలో అ. భా. కాం. సం. చేత కూడా ఆమోదించ బడ్డది. కాని ఈ సూచన బ్రిటిష్ ప్రభుత్వం చేత నిరాకరింప బడిన విధానమును బట్టి, వారికి భారతదేశ స్వాతంత్ర్యమును గుర్తించే ఉద్దేశం యెంతమాత్రమూ లేదనీ, వారికి చేతనైతే ఈ దేశాన్ని బ్రిటిషు వారి స్వప్రయోజనం నిమిత్తం, శాశ్వతంగా దాస్య బంధనాలలోనే ఉంచ కోరుతున్నారనీ స్పష్టమౌతూన్నది. బ్రిటిష్ ప్రభుత్వంవారి ఈ నిర్ణయం, వారి అభిప్రాయాన్ని హిందూదేశం పైన బలవంతంగా రుద్దదలచు కొన్నట్లు ఋజువు చేస్తూన్నది. ఇంతే కాక ఇటీవల వారవలంబిస్తూన్న పద్ధతివల్ల, భారతదేశ ప్రజలలోని అత్యధిక సంఖ్యాకుల ఇష్టానికి విరుద్ధంగా, ఇండియాను జర్మనీకి వ్యతిరేకంగా యుద్ధంలోకి దింపి, ఈ దేశంయొక్క ప్రజలనూ ద్రవ్యములనూ అందుకు వినియోగిస్తూన్నందుకు నిరసించే ప్రజాభిప్రాయ ప్రకటనమును కూడా వారు సహించ జాలనట్లు విశదమౌతూన్నది. భారత దేశపు సహజాధికారమైన ప్రజాభిప్రాయ ప్రకటనమును నిరాకరించి, భారత ప్రజల నీచస్థితికీ వారి నిరంతర దాస్యమునకూ కారణభూతమైన బ్రిటిష్ రాజనీతికి ఈ అ. భా. కాం. సం. తల ఒగ్గజాలదు. ఇటువంటి రాజనీతిని అవలంబించడం వల్ల బ్రిటిషు ప్రభుత్వం వారు ఇండియాలో సహించరాని పరిస్థితులను కల్పించి, ప్రజల ప్రాథమిక హక్కులనూ గౌర

వాన్ని రక్షించుకొనే నిమిత్తం, కాంగ్రెసుకు పోరాటాన్ని తప్పనిసరి చేస్తూన్నారు. భారత స్వాతంత్ర్య సంపాదనార్థం కాంగ్రెసు గాంధీజీ నాయకత్వం కింద అహింసా తత్వాన్ని ఆధారంగా చేసుకొన్నది. కాబట్టి జాతీయ స్వాతంత్ర్యోద్యమ సందర్భంలో తటస్థించిన ఈ విషమ స్థితియందు, కాంగ్రెసు అవలంబించ వలసిన చర్యను నిర్ధారణ చేయడానికి, ఈ అ. భా. కాం. సం. ఆయననే కోరుతూన్నది. ఇలా చేయడాని కాయనకు అడ్డంకుగా నున్నట్టి, పూనా అ. భా. కాం. సం. లో ఆమోదింప బడినట్టి ఢిల్లీ తీర్మానం ఇక ముందు వర్తించదు. దానికి కాలదోషం పట్టింది.

అఖిల భారత కాంగ్రెసు సంఘం, బ్రిటిష్ ప్రజ యందును, యుద్ధంలో చిక్కుకొన్న తదితర దేశాల ప్రజలయందునూ కూడా సానుభూతి గలిగి యున్నది. అత్యంత మైన అపాయ పరిస్థితులలో బ్రిటిష్ జాతి ప్రదర్శించిన ధైర్య స్థైర్యాలను కాంగ్రెసు శ్లాఘించకుండా ఉండజాలదు. వారిని గూర్చి కాంగ్రెసు కేమీ దుశ్చింత లేదు. వారిని చికాకు పఱచే పనిని దేనిని గానీ కాంగ్రెసు చేయడానికి సత్యాగ్రహ సిద్ధాంతం ఒప్పుకోదు. కాని తనంతట తాను బుద్ధిపూర్వకంగా అవలంబించిన ఈ నిగ్రహం వల్ల కాంగ్రెసు ఉనికికే వినాశనం కలుగకూడదు. అహింసను ఆధారంగా చేసికొనిన తన కార్యక్రమాన్ని అవలంబించే విషయంలో, కాంగ్రెసుకు పూర్ణ స్వాతంత్ర్యం ఉండి తీరాలి. కాని అహింసాయుత నిరోధం తప్పనిసరి యైనయెడల ప్రజల స్వాతంత్ర్య రక్షణకు అవసరమైన దానికంటె యెక్కువగా, దానిని విస్తరింప చేయవలెనని కాంగ్రెసు ప్రస్తుతం కోరడం లేదు.

కాంగ్రెసుయొక్క అహింసాపద్ధతినిగూర్చి కొన్ని అపోహాలు పుట్టినందు వలన, అ.భా.కాం.సం. తిరిగీ ఆ విషయాన్ని కొత్తగా స్పష్టీకరించవలసి వచ్చింది; ఇదివరకు ఈ అపోహాలు కలగడానికి హేతు భూతములైన పూర్వపు తీర్మానములలో యేమి ఉన్నప్పటికీ, కాంగ్రెసు అహింసా

పద్ధతినే కొనసాగిస్తున్నదని తెలుసుకోవలెనని కోరుతూన్నది. స్వరాజ్య పోరాటంలోనే కాకుండా స్వతంత్ర భారత దేశంలో కూడా, ఆచరణ యోగ్యంగా ఉన్నంతవరకు, అహింసా పద్ధతినే అవలంబించవలెనని ఈ కమిటీ గట్టిగా విశ్వసిస్తూన్నది. ప్రస్తుత ప్రపంచం నశించి అనాగరిక స్థితికి పోకుండా ఉండవలెనంటే, అన్ని దేశాలూ, పూర్తిగా అస్త్ర సన్న్యాసం చేసి, ఇంతకంటె ఎక్కువ న్యాయ్యంగా ఉండే నూతన రాజకీయ ఆర్థిక వ్యవస్థను నిర్మించవలెనని నేటి ప్రపంచ సంఘటనలను బట్టి ఈ కమిటీ నమ్ముతూన్నది. కనుక ప్రపంచ ఆయుధ విసర్జనం కోసం స్వతంత్ర భారత దేశం, తన యావచ్ఛక్తినీ వినియోగించి, ఈ సందర్భంలో, ప్రపంచానికి నాయకత్వం వహించేటందుకు కూడా సంసిద్ధ పడాలి. కాని అటువంటి నాయకత్వం బాహ్య పరిస్థితుల పైనా ఆంతరంగిక స్థితిగతుల పైనా ఆధారపడి ఉంటుంది. అయితే ప్రభుత్వం మాత్రం ఈ ఆయుధ విసర్జన పద్ధతికోసం శక్తివంచన లేకుండా పనిచేస్తుంది. నిజమైన అస్త్ర సన్న్యాసం కానీ, ప్రపంచ శాంతి స్థాపనము కానీ, యుద్ధాలకూ, జాతీయ పోరాటాలకూ గల మూల కారణాలను తొలగించడం పైననే ముఖ్యంగా ఆధారపడి ఉంటుంది. ఒక దేశం మఱొక దేశం పైన అధికారాన్ని చలాయించడమూ, ఒక జాతిని మఱొక జాతీ, ఒక సంఘాన్ని మఱొక సంఘం స్వప్రయోజనార్థం వినియోగించుకోవడమూ, అనే మూల కారణాలు కూకటి వేళ్ళతో పెకలింపబడాలి. ఈ ఆదర్శాల కోసం ఇండియా ప్రశాంతంగా పని చేస్తుంది. ఈ ఉద్దేశంతోనే భారత ప్రజలు జాతీయ స్వాతంత్ర్యమును పొందగోరుతూన్నారు. ప్రపంచ శాంతి సౌభాగ్యాల కోసం, పరస్పర స్నేహభావం గల తదితర స్వతంత్ర దేశాలతో సన్నిహిత సంబంధాలను [illegible]గించుకొనేటందుకే స్వాతంత్ర్యం అంకురార్పణ కాగలదు.

ప్రతి చెట్టుకూ వేళ్ళు ఉంటాయి. అందులో ఒకదానిని మనం తల్లి వేరంటాం. ఎన్ని వేళ్ళు తెగ గొట్టినా చెట్టు చావదు. కాని తల్లి వేరును తెగగొడితే చెట్టు చచ్చిపోతుంది. భారత స్వరాజ్యమనే జాతీయతా వృక్షానికి, పౌర స్వాతంత్ర్యం తల్లి వేరు. యుద్ధ సమయంలో కాని యుద్ధంలో పాల్గొనే విషయమును గూర్చి కాని మన వాక్స్వాతంత్ర్యం నిరోధింప బడినట్లయితే, స్వతంత్ర జాతీయ వృక్షము యొక్క తల్లి వేరు నరకబడినట్లే. అప్పుడు చెట్టు ఎండిపోక మానదు. ఆ తల్లి వేరును పునరుజ్జీవింప చేసినందు వల్లనే జాతిలో జీవాన్ని శక్తినీ పునః ప్రతిష్ఠ చేసినవాళ్ళ మవుతాము. బొంబాయిలో జరిగిన అ. భా. కాం. సం. తీర్మానం దీనినే నిరూపిస్తూన్నది. యుద్ధ సన్నాహాలలో పాల్గొనాలా అక్కరలేదా అనే విషయాన్ని చర్చించే టందుకు ప్రజకు స్వాతంత్ర్యం ఉంటే, అది సజీవమైన జాతిగా వ్యవహరిస్తుంది. లేదా తనపని తాను నిర్వహించుకో లేని అనారోగ్య స్థితిలో ఉంటుంది. ఈ ప్రధాన హక్కును ఇండియా తిరిగి సంపాదించుకో గలిగినట్లయితే, ఐర్లండు వలెనే తాను కూడా, యుద్ధ సన్నాహాలకు అవుననో కాదనో చెప్పే సమర్థత గలిగి, ఇంగ్లాండుకు ఐర్లండు వలెనే మిత్రదేశం కాగలదు.

గాంధీకి కావలసింది నైతిక విజయం

గాంధీ యెప్పుడూ నైతిక సమస్యలనే తీసికొని నైతిక విజయాన్నే ఆదర్శంగా చేసుకొంటాడు. జలియనువాలాబాగు సందర్భంలో కూడా ఆయన ఆలాగే చేశాడు. జనరల్ డయ్యారు

తల కాయ కావలెనని, ఆయన కోరలేదు. గాయపడిన వారికి గాని చనిపోయినవారి కుటుంబాలకు గాని నష్ట పరిహార మిమ్మన లేదు. ఇండియా గవర్నమెంటును క్షమాపణ చెప్పమన్నాడు. కానాటు ప్రభు వాపని చేశాడు- కాని ఏమిలాభం!- రాణింపు లేని పని చేశాడు. గాంధీ-ఇర్విను రాయబారాల సందర్భంలో ఆయన పోలీసు అత్యాచారాలను గూర్చిన కొన్ని ముఖ్య ఘట్టాల నైనా విచారణ చేయవలసిందని కోరడం మానేశాడు. కారణం రాజప్రతినిధి, తన కవమానం జరుగుతుందేమోననే భయాన్ని గాంధీకి సూచించడమే. నైతిక విషయ మేమైన ఉంటేనే గాంధీకి నచ్చుతుంది. దానినే రాజ ప్రతినిధితో చర్చిస్తాడు. అవసర మైతే అందుకోసమే ప్రజలను పోరాడ మంటాడు. ప్రధాన సమస్య మైన స్వరాజ్య విజయం కూడా, అటువంటి సమస్యల విజయం లోనే కలసి ఉంటుంది. ఎందువల్ల నంటే, ఆయన మెత్తుకొనే నైతిక సమస్యలు చాలా పెద్ద సమస్యలు. ఇండియా స్వాతంత్ర్యం "ఉండడమా ఊడడమా" అనే సమస్యనే ఇప్పుడు గాంధీ మెత్తుకొన్నది. ఈ చిట్టచివరి సత్యాగ్రహ సమరం సాగించబోయే ముందు, ఆయన రాజప్రతినిధితో చర్చించిన విషయము కూడా అదే.

ఆరవ జార్జి చక్రవర్తి పార్లమెంటులో సంభాషిస్తూ, ఈ యుద్ధం ఆదర్శాలకు సంబంధించిన యుద్ధమని సెలవిచ్చి యున్నారు. మేమూ ఆలాగే అనుకొన్నాము. పూర్వం ధర్మ రాజు రాజసూయ యాగం చేసి తన అశ్వాన్ని దేశాలన్నీ చుట్టి రావడానికి పంపినప్పుడాయన, ఆయా దేశపు రాజులను తనకు

సామంతులు గానూ, తనను సామ్రాట్టు గానూ అంగీకరిస్తే చాలునని ప్రకటించాడు. ఆయన కింతకంటె ధనకాంక్ష గానీ రాజ్యకాంక్ష గానీ లేదు. తరువాత అశోకుడు కళింగ దేశానికి సైన్యాలను పంపినప్పు డాయన, అక్కడ ఒక స్తంభమును కట్టించి దానిపైన తన ౧౪ శాసనాలనూ వ్రాయించడంతో సంతృప్తి పడ్డాడు. అటువంటి స్తంభాలు నేడు పాతఢిల్లీ, కొత్తఢిల్లీ నగరాల మధ్యనూ, ఒరిస్సాలోనూ కనిపిస్తూన్నవి. జునగాడ్ (కతియవాడు) రాజ్యంలో, రోడ్డుకు పది అడుగుల లోపు ఎత్తుగా ఉండే ఒక ఆతిగుమ్మటం పైన, అశోక చక్రవర్తి 14 శాసనాలూ చెక్కబడి ఉన్నవి. అది గాలికీ వానకూ లోనవుతూండేది. దానిపైన కర్జను ప్రభు వొక భవనం కట్టించాడు. అశోకుడు చేసిన యుద్ధాలు సంస్కృతి కొఱకు చేసిన యుద్ధాలు. తరువాత రాజ్యకాంక్షతో చేసిన యుద్ధాలు బయలు దేరినవి. ఆవిరి యంత్రాలను కనిపెట్టిన తరువాతనూ, విద్యుచ్ఛక్తితో నడపబడే పరిశ్రమలు బాగా వ్యాపించిన పిమ్మటనూ, రాజ్యకాంక్షతో కాక వర్తక వాణిజ్య వ్యాప్తి కోసం యుద్ధాలు జరుగుతూన్నవి. “భావి యుద్ధాలు వాణిజ్య యుద్ధాలు” అని రోజ్‌బెరీ ప్రభు వేనాడో అన్నాడు.

పదినాల్గు మాసాలు గడచిన తరువాత, నేటి ప్రపంచ యుద్ధాన్ని ఆదర్శాల కోసం చేసే యుద్ధమని చెప్పగా వినడం మాకు పునరుల్లాస కరంగా ఉంది. అయితే మేము దీనిని- ఫాసిస్టు, ప్రజా స్వామ్యములకు మధ్య జరిగే యుద్ధ మనవచ్చునా? అప్పుడే కింది ప్రశ్నను నిగ్గదీసి అడగడానికి మాకు హక్కుంది.

ప్రజా తంత్రం ఎక్కడుంది? ఇంగ్లండులోనా? దీనిని కాదన డానికి ఇంగ్లండులో పూర్వం అమెరికన్ రాయబారిగా ఉన్న జోసెఫ్ కెన్నెడీని సాక్షిగా వేస్తాము. ఆయన ఇంగ్లాండులో ప్రజాతంత్రం అవసానం పొందిందని ఇటీవలనే అన్నాడు. ఇండియాలో ఉందందామా? అది చక్రవర్తిగారి మంత్రులు ఋజువు చేయవలసిన విషయమే. 1914-18 లో జరిగిన ఐరోపా మహా సంగ్రామం కూడా, ఆదర్శాల కోసం చేసే యుద్ధమని ప్రెసిడెంటు విల్సన్ భావించి, ప్రకటించి, పదేపదే జ్ఞాపకం చేశాడు. కాని దాని ఫలితమే నేటి యుద్ధం. ఆదర్శాల కోసం చేసే యుద్ధం, అన్ని యుద్ధాలనూ పరిసమాప్తి చేస్తుంది. అటువంటి యుద్ధంలో చేసుకొనే సంధులు, గూడుపుఠాణీ చేయ డానికి సావకాశం కలిగించవు. రోష గర్భితాలు గానూ, ప్రత్యపకార బుద్ధి కలవిగానూ, దీర్ఘ క్రోధ భూయిష్టములు గానూ కూడా ఉండవు. నష్టపరిహారం మీయవలసిందని కానీ ఋణాలను తీర్చివేయ వలసిందని కానీ కోరవు. ఆదర్శాలకోసం జరిగే యుద్ధమే అయితే, అందులో రాజ్యాలను కలుపుకోవడం ఉండదు. తమ తమ ప్రయోజనాలూ ప్రతాపాలూ సాగవలసిన ప్రదేశాలని, వివిధ ప్రభుత్వాల వారూ కొన్ని కొన్ని దేశాలను తమలో తాము పంచుకోవడం జరగదు. పెద్ద దేశాలమధ్య గానీ చిన్న దేశాలమధ్య గానీ కపటస్నేహా లుండవు. కుట్రలూ ద్వేషాలూ పెంపొందవు. వీటన్నిటికన్నా కూడా, ఆదర్శం కోసం యుద్ధం చేసే జాతి, ముందు తన తప్పును దిద్దుకొని ఇతరులకు నీతి చెప్పడానికి ప్రయత్నిస్తుంది. ఆదర్శ యుద్ధం పూర్వ

పశ్చిమ దేశాలకూ, తెల్ల జాతులకూ రంగుజాతులకూ, భేదాన్ని గమనించదు. అది "విభజించి పాలించు" అనే మానసిక ప్రవృత్తితో ప్రారంభించి "పాలించి విభజించు" అనే రాజనీతి పైన ప్రబలం గాదు.

యుద్ధ యంత్రాలు - రక్షణ సామగ్రి

అమెరీ దీనిని యంత్రాల యుద్ధమన్నాడు. జనరల్ స్మట్సు సాధనాల యుద్ధమన్నాడు. ఘనత వహించిన బ్రిటిష్ రాజుగారు ఆదర్శాల యుద్ధమని సెలవిచ్చారు. ఆరవజార్జి చక్రవర్తిగారి దృష్టిలో ఇది నైతిక యుద్ధం. భారత రాజ్యాంగ కార్యదర్శి దృష్టిలో వైజ్ఞానిక యుద్ధం. దక్షిణ ఆఫ్రికా ప్రధాని దృష్టిలో కేవలం భౌతిక యుద్ధం. అమెరీ యంత్రాలు, నెత్తురు సముద్రాలను వర్షింప చేసి కడుపారా త్రాగే బ్రహ్మ రాక్షసులు. స్మట్సు సాధనాలలో ఒకరిని మించి ఒకరు పన్నే వ్యూహాలు కూడా యిమిడి ఉన్నవి. ముగ్గురి అభిప్రాయాలూ మూడు ప్రత్యేక లోకాలలో విహరిస్తూన్నప్పటికీ, వీటికెక్కడో ఒకచోట అంతర్వాహినిగా సంగమస్థలం ఉండి ఉంటుంది. లేకపోతే సంవత్సరాల కొలదీ ఈ యుద్ధం నడవదు. బుద్ధి నైపుణ్యంతో ప్రయోగించే ఆయుధ బలంచేత, నైతికాదర్శాలను ఆచరణలోకి తీసికొని రావలెననియా వీరందఱి ఉద్దేశం. అలా అయితే, ఆ ఆదర్శాల లోని నైతికోద్దేశం పోనే పోయింది. చెడుగుకు బదులుగా మంచిని స్థాపించడాన్నే ఆదర్శమని అంటాము. చెడుగును చెడుగుతో గానీ, లేక మంచిని చెడుగుతో

గానీ జయించడానికి తగిన సాధనమే యంత్రం. ఆధ్యాత్మిక ఆదర్శాలను, భౌతిక సాధనంతో సంధానం చేయడానికి, మనో బుద్ధులు వంతెనలు. ఆదర్శం ఉన్నత మైనదై, ఉదార భావాలను పెంపొందించేటంత పవిత్రమైనదే అయితే, అందుకు తగిన ఫలితాల నది పొంది తీరాలి. అయితే ఆ ఫలితాలను పొందడాని కది, తాను జయించ పూనుకొన్న చెడుగు వైపుకు దిగకుండా, తన మెత్తువరకూ చెడుగును లేవనెత్తుతుంది. అనగా ఏ ఆదర్శం ఉదార పద్ధతుల ద్వారా విజయం పొంద ప్రయత్నిస్తుందో, అదే ఉదాత్తమైన, నీతియుక్తమైన ఆదర్శం. కాబట్టి సత్యాగ్రహ మొక్కటే అందుకు తగినది. రక్తపాతంతో కూడిన యుద్ధాలు కావు. ఇటువంటి ప్రత్యేక సిద్ధాంతాలను మన్నించక బ్రిటను, యూరోపు వ్యవహారాల నన్నింటినీ మెడకు చుట్టుకొని, ఇండియా మెడకు కూడా చుట్టింది. ఇండియా, అందుకు తన అయిష్టాన్ని ప్రకటించి 1940 లో సత్యాగ్రహోద్యమం సాగించింది.

నిజమైన సత్యాగ్రహం, దేశంలో ఒకే రీతిని, మార్దవంగా రెండు దశాబ్దాల పాటు నడవదనే విషయం, ఈ నూతన సిద్ధాంతాన్ని అవలంబించి, జాతీయాభ్యుదయం కోసం విశేషత్యాగాలు చేసినవారు కూడా, ఇంకనూ గుర్తించవలసియే యున్నది. విజాతీయ ప్రభుత్వ నిర్బంధంవల్ల కలిగే జాతీయ కష్టాలను తొలగించుకొనే నిమిత్తం, ఒక్కసారి వ్యక్తి శాసనోల్లంఘనం గానీ సమష్టి శాసనోల్లంఘనం గానీ చేయడానికి అలవాటు పడటయితే, ఆనాటి నుండీ దేశంలోని శాంతి శాసనాలకు

భంగం కలిగేటందు కవకాశ ముందని కొంద రాక్షేపిస్తూం టారు. మరొక ఆక్షేపణ కూడా ఉంది. అది సత్యాగ్రహే తరులనుండి కాదు; సత్యాగ్రహ నాయకులనుండి. సత్యాగ్రహా నికి అలవాటు పడ్డవారు, అన్ని రాజకీయ బాధలకూ సత్యా గ్రహ మొక్కటే చికిత్స అన్నట్లుగా దానికోసం చేతులు ముడుచుకొని ప్రార్థిస్తూంటారని వారి విమర్శ. ఈ రెండు విమ ర్శలకూ కూడా భారత స్వాతంత్ర్య చరిత్రలో తగిన ఉదా హరణా లున్నవి. కాని సత్యాగ్రహ సిద్ధాంతంలో ప్రధాన సూత్రాలను చక్కగా అర్థం చేసుకొన్నవా రెవరూ, మొట్ట మొదటి ఆక్షేపణకు ఏవిధమైన విలువా యివ్వరు. కాంగ్రెసు మంత్రివర్గాలు స్థాపించబడిన వెంటనే, పైకి సత్యాగ్రహం వలె కనపడే అనేక ఉద్యమాలు తలలెత్తినవి. కాని అవి ఉద్రేకంతో ద్వేషభావంతో, ధిక్కారంతో బయలుదేరిన వగుటచేత వాటిలో సాత్విక భావమనేది లేనే లేదు. అవి ఆ మహోద్యమము యొక్క కృత్రిమానుకరణాలు.. ఖాక్సారులు శాంతికి భంగం కలుగచేస్తే, వారి మర్యాదాతిక్రమణాన్ని సత్యాగ్రహానికి అంటకట్ట కూడదు. వారు మారణ సాధనాలతో బయలుదేరి, అవసర మైతే వాటిని నిరుద్రేకకర సమయాలలో సైతం ఉపయోగిస్తా మని స్పష్టం చేసి ఉన్నారు. దేశంలో వివిధ ప్రాంతాల యందున్న కార్మిక సంస్థలనుండి, కమ్యూనిస్టులు లేవదీసిన కల్లో లముల వలన కూడా సత్యాగ్రహమనే ఈ నూతన సంగ్రామ విధానం, దాన్ని అవలంబించడాని కనర్హులైన అశిక్షితుల చేతు ల్లలో పడి, అపోహాలకూ అపనిందలకూ గురి కావడానికి వీలు

కలిగింది. కమ్యూనిజము యొక్క ముఖ్య సిద్ధాంతం, అహింసను అవతల పెట్టమంటుంది. కనుక ఆ సంస్థలోని సభ్యుల ఉద్రేక పూరిత మైనట్టి, కోపకారణ మైనట్టి ప్రవర్తనమునకు, సత్యాగ్రహోద్యమం కారణ మనడం సమంజసం కాదు. నిజానికి వారిలో సత్యాగ్రహ తత్వం లేకపోవడమే అందుకు కారణ మనాలి. సత్యాగ్రహ సిద్ధాంతానికి పునాదులైన సత్యాహింస లను త్యజించినందు వలన కలిగే ఫలితమే కమ్యూనిజం. గాంధీ యొక్క ఏకైక నాయకత్వం కింద శాసనోల్లంఘన మనే ఉద్యమం నడుస్తూండగా, అదే సమయంలో, స్పష్టంగా దానికి విరోధంగా ఉండే ఉద్యమాలు, విదేశీ ప్రభుత్వంతో ముఖాముఖి రాజకీయ పోరాటం జరపడానికి, సత్యాహింసలు సరియైన మార్గాలు కావని చాటిస్తూన్న వివిధ నాయకత్వాల కింద నడపబడుతూంటే- ఈ ఉద్యమాలన్నీ కూడా సత్యాగ్రహం యొక్క శాఖోపశాఖలే ననడం చాలా సాహసం. ఎవరో కొందరు సత్యాగ్రహాన్ని సద్వినియోగం చేయకపోవడం కానీ, దుర్వినియోగం చేయడం కానీ, మాకిప్పు డంత పట్టింపుగా లేదు. కాని, సత్యాహింస లనే కఠిన నియమాలతో సహా సత్యాగ్రహాన్ని హృదయ పూర్వకంగా అవలంబించే వారే, దానిని అతిగా వాడుతూండడం మాకు కష్టమనిపిస్తూన్నది. వారికి భావోద్రేకం మెండు. వారి ఉత్సాహశక్తి అనంతం; కాని యుక్తాయుక్త వివేకం వలన కాని, సమగ్ర విషయావలోకనం వలన గాని, అవి తగిన అదుపులో ఉంచబడడం లేదు. యుద్ధం ప్రారంభమైన మొదటి మేడాదిలోనే, యుద్ధంలో

జోక్యం కలిగించుకో కూడదనీ, యుద్ధ ప్రయత్నాలను నిరోధించ వలెననీ ముందుగానే ప్రచారం మొదలుపెట్టి, కాంగ్రెసును ఎలాగైనా సరే బలవంతంగా సత్యాగ్రహోద్యమం లోకి తోయాలని గట్టి ప్రయత్నం జరిగింది. అప్పటికీ యువకుల ఉత్సాహాన్ని అణచిపట్టి, సత్యాగ్రహం ప్రారంభించేటందుకు సరియైన సమయం వచ్చిందని కాంగ్రెసు తలంచేటంత వరకూ పొంగి పొరలి పోతూన్న వారి భావోద్రేకాన్ని ఆపుకోవడానికి వారిని ఒప్పించడం కాంగ్రెసుకు చాలా కష్టమై పోయింది. శత్రువు యొక్క కష్టదశను అవకాశంగా తీసుకొని వినియోగించుకోవడం గాంధీజీ సిద్ధాంతాలకు విరుద్ధమని పదేపదే చెప్పవలసి వచ్చింది. ఇందుకు సంబంధించిన గాంధీ జీవిత చరిత్రలోని కొన్ని ఉదాహరణా లిదివరకే ఇచ్చి యున్నాము. కాబట్టి అనవసరం.

సత్యాగ్రహము - ప్రపంచ యుద్ధము (1940)

ఇండియా దేశం యుద్ధంలో జోక్యం కలిగించుకోవడం విషయంలోనూ, యుద్ధ ప్రయత్నాల విషయం లోనూ, ఇండియన్ నేషనల్ కాంగ్రెసున్నూ తదితరులున్నూ తమతమ అభిప్రాయాలను సంపూర్ణం గానూ, అహింసాయుతం గానూ, ప్రకటించ గలిగిన స్థితిలో ఉండవలెనని, గాంధీ రాజప్రతినిధిని కోరినాడు. ఇంగ్లండులో అంతరాత్మ కారణముల చేత యుద్ధ విముఖులుగా నుండే వారికి, యుద్ధంలో సైనికులుగా చేరకుండా ఉండడానికీ వారి విశ్వాసాన్ని బహిరంగంగా చెప్పడానికీ కూడా

హక్కున్నది. కాని యుద్ధంలో పని చేసే వారికడకు పోయి, తమ ఉపదేశాలను అనుసరించ వలసిందని ప్రోత్సహించ డానికి అధికారం లేదు. ఇండియాలో కూడా, ఆ హద్దులను దాటి పోవడానికి వీలు లేదని లిన్ లిత్ గో ప్రభువు ప్రత్యుత్తర మిచ్చాడు. కాని హిందూదేశపు వింతపరిస్థితులను బట్టి, వైస్రాయి అంగీకరించిన దానికంటె, గాంధీ యెక్కువ కావా లని కోరినాడు. ఇండియాలో అసలు యుద్ధానికే వ్యతిరేకంగా ఉన్నవారు గానీ, ఇండియా యుద్ధంలో జోక్యం కలిగించుకో రాదనేవారు గానీ, తమతమ అభిప్రాయాలను ప్రకటించడానికి సంపూర్ణాధికారం ఉండాలని ఆయన వాదం. యుద్ధ కార్యా లను నిర్వర్తించే వారికడకు పోయి పికెటింగు చేయవలెనని కానీ, లేక వారు చేసే పనిని వద్దని బోధ చేయవలెనని కానీ గాంధీ ముఖ్యోద్దేశం కాదు. హిందూదేశాన్ని రక్తపాతానికి కారణ భూతంగా చేసే యుద్ధ ప్రయత్నాలకు ఏ విధంగానూ తోడు పడవద్దని ప్రజలకు చెప్పి, ప్రోత్సహించే నిమిత్తం కాంగ్రెసు వారికీ కాంగ్రెసేతరులకూ కూడా హక్కు ఉండాలని మాత్రమే ఆయన అభిప్రాయం. ఎవరికో కొందరికి అంతరాత్మ సంబంధ మైన అభ్యంతరా లుండడంకా దిక్కడ మనం విచారించవలసిన విషయం. ఇండియాలో అనేకమంది కనేక కారణా లున్నాయి. యుద్ధానికి సహాయం చేయక పోవడానికి అంతరాత్మ కారణం సరే- తమను పిలవని యుద్ధంలోకి సహాయం చేయడానికి తా మెందుకు వెళ్ళాలి? తమను బలవంతంగా దించిన యుద్ధానికి తా మెందుకు తోడ్పడాలి? తమను పీడించే సామ్రాజ్య తత్

రక్షణకోసం చేయబడుతూన్న యుద్ధమని తాము నమ్ముతూన్నప్పుడు, తమకా యుద్ధంతో ప్రయోజన మేమిటి? ఇవి ఇండియా ప్రజల కారణాలు. కాని ఇదివరలో నాజీ తత్వానికి తాము వ్యతిరేకుల మనీ, బ్రిటిషు జాతీయ చరిత్రలో తటస్థించిన ఈ క్లిష్ట దశయందు తాము బ్రిటిష్ వారిని చీకాకు పఱచ దలచుకోన లేదనీ, కాంగ్రెసున్నూ గాంధీయున్నూ చేసిన ప్రకటనలను, రాజప్రతినిధి ఇప్పుడు తన కనుకూలంగా ఉపయోగించు కొంటూన్నాడు. మీరు నాజీలు జయించవలెనని కోరక పోయినట్లయితే, యుద్ధం గెలవడానికి బ్రిటిష్ వారికి సహాయం చేసి తీరాలని గాంధీతో రాజప్రతినిధి అన్నాడు. కాంగ్రెసు కానీ భారతీయులు కానీ నాజీల విజయం కోరడం లేదన్నంత మాత్రాన, బ్రిటను చేసే యుద్ధంలో, ఇండియా పాల్గొంటుందనే అర్థం లేదని గాంధీ వ్యాఖ్యానం చేశాడు. కాంగ్రెసు బ్రిటనును ఈ క్లిష్ట సమయంలో చీకాకు పెట్టదలచుకో లేదన్న మాటకు, రాజప్రతినిధి, కాంగ్రెసు ఆత్మహత్యకు ఒప్పుకొన్నదనే టంతవరకూ అర్థం లాగినాడు. ఇందుకు గాంధీ ఒప్పుకోలేదు సరికదా, పైపెచ్చు కాంగ్రెసు భావాన్ని అర్థం చేసుకొని, ప్రభుత్వం అందు కనుగుణంగా వ్యవహరించడానికి కపకాశ ముండవచ్చునని కూడా ఆశించాడు; తన విశ్వాసాన్ని ప్రకటించే సందర్భంలో కాంగ్రెసును బాధించ కూడదని కూడా ఆయన దాచకుండా చెప్పివేశాడు.

ఇంగ్లాండులోని యుద్ధవ్యతిరేకి (Pacifist) ఒక విచిత్ర పురుషుడని ఇదివరకే మనవి చేశాము. ఇక అంతరాత్మ అభ్యంత

ర్శాలు కలవాడు, యుద్ధసమయం తన ప్రచారానికి మంచి అవకాశం కల్పించిం దనుకొంటాడు. నిజాని కనేకమందికి, యుద్ధానికి వ్యతిరేకంగా అప్పు డేమి చెప్పినా అతుకుతుంది. కాని ఇండియాలోని కాంగ్రెసులో ఉన్నవాళ్ళంతా అంతరాత్మ అభ్యంతరాలు కలవాళ్ళే కారు. తమ దేశంపైన బలవంతంగా రుద్దబడిన ఈ యుద్ధమంటే వారికి బొత్తిగా గిట్టదు. అది వారి ఆత్మ గౌరవాన్ని బాధిస్తూన్నది. అందుకు తగిన కష్టాలు వారు పడాలి. మన మొక రాజ్యంలో పౌరులంగా ఉన్నందుకు కాక, మనకు కూడా కొన్ని అభిప్రాయా లున్నందుకు జాతీయ పునర్నిర్మాణమును గూర్చి, సాంఘిక సంస్కరణమును గూర్చి, మన అభిప్రాయాలను మనం ముందుగా వెల్లడిస్తూన్నందుకు- అంటే ఇంతకంటె మంచి రాజ్యం కోసం పరితపిస్తూన్నందుకు- మనం తగిన త్యాగం చేయక తప్పదు. కనుక కాంగ్రెసు తిరిగీ అచంచల విశ్వాసంతో అధికారాలను విసర్జించి అడవులపాలు కావాలి. రిఛార్డు బి. గ్రెగ్గు ఇలా అన్నాడు :

> బాధ, అంతరాత్మ అభ్యంతరాలు కలవాళ్ళ శక్తినీ, భావాలనూ, చిత్తవృత్తినే కాక, ఉదార జాతీయాత్మ గౌరవం కలిగి, సత్యాహింసల పైన ఆధారపడే నూతన సాంఘిక వ్యవస్థను భావించగలవాళ్ళ శక్తినీ, ఊహాలనూ, మనో వైఖరినీ కూడా, బలపరచి పరిశుద్ధంగా చేస్తుంది.

1940 సత్యాగ్రహోద్యమం

గాంధీ మఱొక పర్యాయం 1940 లో హిందూదేశంలో సత్యాగ్రహం సాగించాడు. ఇప్పుడు జరిగే యుద్ధంలో భారతీయులు

జోక్యం కలిగించుకోవడానికి గానీ, కలిగించుకోకుండా ఉండడానికి గానీ, వారికి స్వాతంత్ర్య ముండాలనే కోరికపైన ఈ ఉద్యమం ప్రారంభింప బడినది. అహింసపైన ఆధారపడిన రాజకీయ చతురతా నైపుణ్యములు, ప్రపంచంలో ఈనాడే విధంగా లోపించి పోయినవో బాగా స్పష్టమవుతూనే ఉంది. ప్రతి సంధీ భావి సంగ్రామానికి బీజంగా పరిణమిస్తూన్నది. యుద్ధం కానీ పరస్పర హత్యాకాండ కానీ జరుగకుండా ఉండవలెనంటే, సుహృద్భావం పెంపొందాలి. శాఖా భేదా లున్నప్పటికీ, యూరోపుఖండ మంతా క్రైస్తవ మతంలో నమ్మకం కలిగినట్లు గానే ప్రకటిస్తూంటుంది. కాని క్రైస్తు ఉపదేశాలను, అక్కడివారు మన్నించడం కంటె, ఉల్లంఘించడం ఎక్కువ. యుద్ధం చేసే ఉభయ కక్షులవారూ జీసస్ క్రైస్తును ఒకే విధంగా ప్రార్థిస్తూంటారు. జీసస్ బెర్లినుకు గానీ లండనుకు గానీ వచ్చి చూస్తే, పాప మాయన ఏమనుకొంటాడో? ఇండియాలో సైన్యం లేని రాజ్యం కావాలని కోరడంలో గాంధీ హద్దులను అతిక్రమించి పోలేదు.

సత్యాగ్రహానికీ సైన్యం కావాలి; ఉపాయం కావాలి; నైపుణ్యం కావాలి. సత్యము యొక్క ఆదర్శాలను అందుకోవడానికి ప్రయత్నించే అహింసావ లంబకులైన శాంతి సైనికులు కావాలి మనకు. అహింస కేవలం ప్రతిషేధాత్మక భావం కాదనీ, అది ఒక క్రియాశక్తి అనీ, ఇదివర కనేకసార్లు చెప్పి ఉన్నాము. ఐకమత్య వ్యాప్తకమునకూ ప్రేమ ప్రచారమునకూ, పశు శక్తిపైన ఆత్మశక్తిని విజయం పొందేటట్లు చేయడానికీ,

అది యొక ప్రబల సాధనం. శాంతి సైన్యంలో చేరే సైనికులు బలిష్ఠులుగా నుండనక్కర లేదు. కాని ఉన్నతాత్మ కలవారుగా ఉండాలి. సత్యాగ్రహం పరుల రక్తం కోసం హాహా కారాలు చేయదు. కాని సత్యాగ్రహి తన రక్తంతో పరుల దాహం తీరుస్తాడు. సత్యాగ్రహం, శత్రువులో గడ్డ కట్టుకొని పోయిన, ప్రాపంచిక జీవిత లక్ష్యాలకు సంబంధించిన పాత నమ్మకాలను చెల్లాచెదరు చేసి, అతనినుండి కావలసినంత నిర్మాణ శక్తిని వెలువరిస్తుంది. సత్యాగ్రహ మంటే పిఱికితనం కాదు ధైర్యం; స్తబ్ధత్వం కాదు చైతన్యం. సత్యాగ్రహం సంస్కారులైన యే కొలదిమంది సొత్తో కాదు; అసంఖ్యాకులైన ప్రజల పైత్యకధన మది. అది కొత్తకల్పన కాదు; రాజకీయాలకు అనువర్తింప చేసే టందుకు, శిల్పం గానూ శాస్త్రం గానూ తయారు చేయబడిన పాత సిద్ధాంతం యొక్క ప్రత్యేక్షీ కరణమే అది.

రథగమనం

1920 లో అసహాయోద్యమం ప్రారంభించి నప్పుడు గాంధీ ఒంటరిగా నిలబడ్డాడు. నాడు భారత జాతీయత అనే కాగు, నిప్పు పొయ్యి మీద యెక్కడో ఒక మూల మాత్రం ఆని ఉంది. అందులోని నీళ్ళు బాగా కాగి, కళపెళ లాడుతున్నాయి. కాబట్టి 1940 లో ఒకే సత్యాగ్రహిని జైలుకు పంపించడ మనేది గాంధీకి కొత్త అనుభవం కాదు. నిప్పులు మండుతూన్న కొద్దీ బానకు క్రమక్రమంగా ఒక్కొక్క ప్రాపు కుదురుతూంటుంది. అప్పుడది స్థిరంగా ఒకచోట నిలబడడానికి వీలు కలుగుతుంది.

ఆలాగే 1920 లో గాంధీతో మొట్టమొదట మోతీలాలు నెహ్రూ చేరాడు. తరువాత లాలా లజపతిరాయి "పూర్ణ శరీరంతోనూ" అర్ధ హృదయం తోనూ చేరాడు. పిదప దేశబంధు చిత్తరంజన దాసు, కొండ కోననుండి దూకిన మంచు గడ్డవలె ఉటికి, పంజాబు సంయుక్త రాష్ట్రాలలోని అసహాయోద్యమ నిర్మల సలిల ప్రవాహాలను పొంగి పొరలెత్తించి, బెంగాల్ మైదానాలలోకి మహా నదిగా విస్తరింప చేశాడు. ఇక వర్షఋతువు మళ్ళీ రావాలి. వేసగి మండుటెండలు లేనిదే వానలు కురియవు. సూర్య రథము నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. సూర్య రథానికి ఒకటే చక్రం, ఏడు గుఱ్ఱాలు, ఏడు పాము పగ్గాలు; అది కిందా పైనా యేమీ ఆధారం లేకుండా అంతరిక్షంలో ఆకాశమంతా చుట్టి రావాలి. సారధిని చూతామా కుంటివాడు. కాని సూర్యుడు ప్రతి రోజూ యథా ప్రకారం ప్రయాణం సాగిస్తూనే ఉన్నాడు. అదే విధంగా గాంధీ సూర్యుడు, ఒక అజ్ఞాత సారధితో, దమ, యమ, దాన, శౌచ, సత్య, క్షమా, ధర్మాలనే ఏడు పాము పగ్గాలతో, భారతాకాశ వీధులను, తాను రధిగా చుట్టి వస్తూ న్నాడు. మళ్ళీ వడగాడ్పులు సాగినయి. కాని వాటి కవసరం లేకపోలేదు. వానలు కురియడానికి ముందు హిందూదేశంలో ప్రతి మూలా వేడిగాడ్పు వీస్తూనే ఉంటుంది. తరువాత కొద్ది రోజుల లోనే వాన కురుస్తుంది. కొండలలో నుండి, లోయలలో నుండి, పొదలలో నుండి, అడవులలో నుండి ప్రవహించే ఈ వాన నీరు, భూమిని సస్య శ్యామలంగా చేసి ప్రపంచానికి జీవనాధార మవుతుంది. మహాత్ములకీ క్రియా సిద్ధి, ఉపకరణముల వల్ల

గాక తమలోని సత్యం వల్లనే కలుగుతుంది. ఒక్కటే చక్రంతో కాళ్ళు లేని సారథితో, ఏడు పాము పగ్గాలతో, సూర్య రథం ప్రతి రోజూ తూర్పు కొననుండి పడమటికొన వరకూ సంచారం చేయ గలిగితే, నిష్కళంక శీలం కల సారధి సహాయంతో, గాంధీ వంటి రథికుడు, భారత రథాన్ని పడమరనుండి తూర్పుకు తోలుకొని రాలేడని మన మెందుకు సందేహించాలి?

అయితే ఇప్పుడు మనం వ్యక్తిగతంగా చేయవలసిన పని యేమిటి? సైనికులు యుద్ధరంగంలో పోరాడు తూన్నప్పుడు, వారికి దుస్తులు, ఆహార పదార్థాలు, యుద్ధ సామగ్రి పంపించడానికి వెనుక ఒక ప్రత్యేక శాఖ పనిచేస్తూ ఉండాలి. అదే విధంగా మనమంతా, ఆహార పదార్థాలనూ వస్త్రాలనూ తయారు చేస్తూ యుద్ధ పరికరాలను కూడా సంసిద్ధంగా ఉంచాలి. రాటం, రోకలి, తిరుగలి, బెల్లపు పెనం, మగ్గం, గానుగ, ఇవీ మన పరికరాలు. కుల మత భేదాలను మఱచిపోయి మనమంతా ఒకే జాతి అనే సంగతి జ్ఞాపకం చేసుకోవాలి. అంటరాని తనాన్ని నిర్మూలించాలి. త్రాగుడు మానిపించాలి. బ్రిటిష్ వానిలో యెన్ని లోపా లున్నప్పటికీ అతనిని కూడా మనం ద్వేషించకూడదు. ఎందువల్ల నంటే, ఆలోచించినకొద్దీ అతడు మొట్టమొదట మనకు అతిథిగా వచ్చినట్లు తెలుతుంది. మన మిచ్చిన ఆతిథ్యాన్ని ఆతడు దుర్వినియోగం చేసినప్పటికీ, అతిథిని రక్షించ వలసిన బాధ్యత మనకు పోలేదు.

ప్రతి యుద్ధంలోనూ "యుద్ధంయొక్క ఉద్దేశాలు" ఉంటాయి. "యుద్ధం యొక్క ఉద్దేశాలంటే యుద్ధం గెలవడమే నన్నాడు

విక్షామ్ స్టీడ్ను, "యుద్ధోద్దేశాలు" వేరు. "యుద్ధం యొక్క ఉద్దేశాలు వేరు." "యుద్ధోద్దేశా" లంటే శాంతిస్థాపనకు కారణ భూతములయ్యే సిద్ధాంతాలు. "యుద్ధం యొక్క ఉద్దేశాలు" యుద్ధం సాగించడానికి ప్రోత్సాహకరంగా ఉంటాయి. "యుద్ధోద్దేశాలు" యుద్ధ పరిసమాప్తిని నిర్ణయిస్తాయి. ఇండియాలో మొదటిది సత్యాగ్రహం; రెండోది నిర్మాణ కార్యక్రమం. యోధులు తక్కువగా ఉంటారు, పునర్నిర్మాణకు లెక్కువగా ఉంటారు. గాంధీ అందువలననే సత్యాగ్రహాన్ని మొట్టమొదట సమూహానికి గాక, వ్యక్తులకు మాత్రమే వర్తింప చేశాడు. ఈ వ్యక్తి సత్యాగ్రహం కూడా ఇద్దరికే వర్తిస్తుందన్నాడు. భారత దేశంలోని కోట్ల కొలదీ ప్రజలను, నూలు వడుకుతూ, బట్టలు నేస్తూ, వడ్లు దంచుతూ, పిండి విసురుతూ, నూనె ఆడుతూ, బెల్లం వండుతూ, కాగితం చేస్తూ శాంతి స్థాపనకు సంసిద్ధ పడమన్నాడు.

దంపుడు బియ్యమూ పిండీ రెండుకోట్ల మందికి పని కల్పిస్తవి. నూలు వడకడం వల్లా, బట్టలు నేయడం వలనా 12 కోట్ల మంది జీవిస్తూన్నారు. కుటీర పరిశ్రమల వలన సాధారణ నిరుద్యోగ సమస్య పరిష్కార మవుతుంది. ఒకప్పు డింగ్లీషు పరిపాలన పోయినప్పటికీ, లంకాషైరు, మాన్ చెస్టర్, లివర్ పూల్, నాటింగ్ హాముల యాజమాన్యం పోకపోవచ్చు. కాబట్టి స్వతంత్ర భారత దేశం స్వయం సంపూర్ణంగా, స్వయం శక్తివంతంగా, ఆత్మ గౌరవ యుతంగా ఉండ ప్రయత్నించాలి. గాంధీ సత్యాగ్రహం వలన బంధన విముక్తమయిన "ఆత్మ" కు నిర్మాణ

కార్యక్రమము తోడుగు. అది సత్యాగ్రహానికి అనుబంధం గాను, అనుయాయి గాను ఉంటుంది. కాబట్టి ఇండియా తన ఆత్మను గాంధీలో ప్రవేశింపచేసి, నిర్మాణ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ, తన ఏకీభావం వల్ల పేరిను తత్వాన్ని సేవా భావాన్ని విజృంభింప చేయునుగాక.

గాంధీ - విపరీత పరిణామమూర్తి.

గాంధీ విపరీతంగా మారిపోతూంటాడనే ప్రజల దోషారోపణకు ఆయన సావకాశం కలిగిస్తూంటాడు. ఒక్కొక్కప్పుడు లోకాలను ప్రళయ కల్లోలంలోకి దింపుతూన్నట్టుగా నిందాపాత్రు డవుతాడు. మజొకప్పుడు మహా సామ్రాజ్యాని కెదురుగా యేదో బొమ్మ పోరాటం ప్రారంభించినట్లు అవహేళనకు గుజి అవుతాడు. హైదరాబాదులో అభివృద్ధి నిరోధక శాసనాలను ఎదురోడ్డవడానికి నలుగురు సైనికులను పంపుతాడు. ఇండియాలో బ్రిటిష్ సామ్రాజ్యాని కభిముఖంగా నిలబడడానికి ఒక్కడు చాలు నంటాడు. ఖజానాలో ఉన్న చిట్టచివరి షిల్లింగునూ, పటాలాలలో ఉన్న చిట్టచివరి సిపాయినీ కూడా వినియోగించి అయినా విజయం పొందవలెననే యుద్ధనీతి పైన ఆధారపడి లేదు సత్యాగ్రహం. పవిత్ర హృదయుడు, ఉన్నతాత్మ కలవాడు, నిష్కాముడు, స్వార్థరహితుడు, నిర్భయుడు, నిరాశాపరుడూ అయిన ఒక్క వ్యక్తి, అత్యంత బలిష్ఠమైన ప్రభుత్వంతో ఒంటరిగా పోరాడగలడు. ఆ ప్రకారం తన వారపత్రికలో గాంధీ రాజప్రతినిధికి వ్రాశాడు, ఆసంగతి ఆయన ఇంతవరకు

మూడు పర్యాయాలు వెల్లడించాడు. ఆయన యెన్నడూ తాను చేయబోయే పనులను దాచడు. కాని విడివిడిగా ఆయన వ్రాస్తూన్న వాక్యాలను జాగ్రత్తగా పరిశీలిస్తూ ఉండాలి. అప్పుడే వాటి భావం తెలుస్తుంది. అదే విధంగా, హిందూ సంఘం నుండి హరిజనులను విడదీసే ప్రయత్నాన్ని, తన ప్రాణాలను ఒడ్డి నిరోధిస్తానని గాంధీ, 1931 లో జరిగిన రెండవ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సులో సర్ శామ్యూల్ హోరుతో అన్నాడు. అయన లండన్ నుండి తిరిగి వచ్చినతరువాత కూడా, అజద్ మైదానంలో జరిగిన బహిరంగ సభలో మళ్ళీ అదేమాట అన్నాడు. 1932 మార్చిలో తన కారాగారం నుండి, తిరిగీ అదే అర్థం వచ్చే మాటలలో, హిందూదేశ రాజ్యాంగ కార్యదర్శికి తన మనో నిశ్చయాన్ని తెలియపటిచాడు. ఆ సంవత్సరం సెప్టెంబరులోనే ఆయన అందుకోసం ప్రాయోపవేశం ప్రారంభించాడు. కాబట్టి ఆయన యేది చేయబోతూన్నాడో, అది ముందు చెప్పి చేస్తాడు. ఆయన నీతి అహింస. ఆయన ఉపాయం సత్యం.

కాని గాంధీ చేసిన పనిలో కొంత వింత లేకపోలేదు. ఎవరీ వినోబాభావే అని, అర్థంకాని ప్రపంచం అత్యాశ్చర్యంగా అడుగుతుంది. వేయి వేదికలపైన ఉపన్యాసాలిచ్చినవానికంటె, తన ఆశ్రమంలో పాతుకొనిపోయి, రాటంపైన రాటు తేలినవాడు గాంధీకి అనేకరెట్లు విశ్వాస పాత్రుడు. గాంధీకి సఖుడు "సహ యోధుడూను" వినోబా భావే. ఒక విధంగా గాంధీ ఆయనకు జాతీయ పోరాటంలో అగ్రస్థాన మిస్తాడు. జాతీయ

వాక్స్వాతంత్ర్యాన్ని ప్రతిష్ఠించే ప్రయత్నంలో, ఆయన మరణించడమే జరిగితే ఆయన త్యాగం స్వచ్ఛతమము. గాంధీ తన సేనానులను, తన యోధులను, తన సహచరులను, ఇటువంటి ప్రమాణాలతో పరీక్షిస్తాడు. గాంధీ కార్యక్రమమును గూర్చి అపోహలూ చిక్కులూ వెల్లడింపబడడ మిది మొదటిసారి కాదు. ఆయన, ఆనంద్ బార్డోలీ తాలూకాలలో తన కళ్ళయెదుట పన్నుల నిరాకరణమును ప్రారంభిస్తా నన్నప్పుడు, గుజరాతులోనే మొట్టమొదట యెందుకు ప్రారంభించాలి, గుంటూరులో యెందుకు ప్రారంభించ కూడదని పెద్ద గోల జరిగింది. ఆయన దండీకి చేరుకోనేటంత వరకూ ఎవ్వరూ ఉప్పు ముట్టుకోకూడదని శాసించి నప్పుడు, స్వచ్ఛంద సైనిక దళాలలో గలిగిన ఆత్రాన్ని అణచిపెట్టి, వారిని శిబిరాలలో నుండి కదలకుండా చేయడమే, జిల్లా నాయకులకు రాష్ట్ర నాయకులకూ పని అయిపోయింది. అదేవిధంగా, ప్రపంచమంతా ప్రళయ యుద్ధంలో మునిగి ఉన్నప్పుడే ఒక్క మనిషి అరెస్టుతో ఏమి జరుగుతుంది? తక్కిన దేశాలు మనను చూచి నవ్వుతాయి కూడాను; అనడం సాగించారు చాలామంది.

వినోబా యెవరు?

వినోబాను ప్రభుత్వంవారు పట్టుకోకనే పోతే యేమవుతుంది? అని చాలామంది అడుగుతూ వచ్చారు. వినోబా ఉత్త బొమ్మ కాదు; ఎందుకూ పనికిరాని మొద్దూ కాదు. ఆయన బరోడా నివాసి. 1916 లో ఇంటర్మీడియేటు తరగతి చదువుతూ, వ్యాని

హిమాలయాలకు తపస్సు కోసం వెళ్ళినాడు. అక్కడనుండి తిరిగి వచ్చిన తరువాత ఆయనకు గాంధీతో సన్నిహిత సంబంధం కలిగింది. వినోబా సోదరులు ముగ్గురు. వారందరూ సుప్రసిద్ధులే. కాని అందరిలో ఈయన ఎక్కువ తెలిసినవాడు. అందరి లోనూ పెద్దవాడు కూడాను. వినోబా, భగవద్గీతను తన మాతృభాష యైన మహారాష్ట్రం లోకి భావ పూర్ణంగానూ మాధుర్యం గానూ అనువదించాడు. వడుకు కూలి హెచ్చించ డాని కీయనే కారకుడు. ఈయన అనుభవాలను అందరికీ నచ్చ చెప్పి, అది సాధ్యమని నిరూపించాడు. ఈయనవలన గాంధీ, గాంధీ వలన ఈయన, పరస్పర పరివర్తనం పొందుతూ వచ్చారు. కాంగ్రెసులో తక్కినవారంత యెంత రాజకీయ వేత్తలో, ఈయన కూడా అంతకు తక్కువ రాజకీయ వేత్త కాడు. అందరూ వెళ్ళినట్లే ఈయనా జైలుకు వెళ్ళాడు. అంతేకాని, ఈయనను పౌనారు ఆశ్రమంలోని దూదిబేళ్ళ కింద నుండి లేవనెత్తి, గాంధీ సత్యాగ్రహానికి కీలు బొమ్మగా ప్రదర్శించ లేదు. వినోబాను అరెస్టు చేయకనే పోతే ఆయన ప్రచారం కొనసాగిస్తాడు. వేలకొలదీ జనులు "ఈ వింతమృగాన్ని" చూడడానికి వస్తారు. "ఈ అజ్ఞాత యోధుడు" ఏలా మాట్లాడు తాడో, ఎలా పోరాడుతాడో, ఏమి చేస్తాడో, ప్రజలు కళ్ళారా కనే భాగ్యం కలుగుతుంది. ఆయన పట్టుపడితే రెండో మనిషికి స్థానం వస్తుంది. రెండో మనిషి యెవరో కొద్ది కాలం లోనే తెలుస్తుంది. సత్యాగ్రహం ప్రారంభించ బడినప్పుడల్లా కొత్త రూపం తాలుస్తూంటుంది. కాని సత్యాగ్రహంలో కొత్తగా

చేరినవాళ్లు తాము పూర్వ మెక్కడ విడిచిపెట్టినారో అక్కడ నుండి ప్రారంభిస్తారు. మూలపురుషుడు మాత్రం కొత్తకొత్త రూపంలో మొదలు పెడతాడు. ఇక తరువాత ఎత్తు ప్రభుత్వానిది. ప్రభుత్వం వేసిన ఎత్తును బట్టి మన ఎత్తు ఉంటుంది. ఇంతా అయితే సత్యాగ్రహం కూడా బ్రిటను చేసే యుద్ధం లాంటిదే. కాని ఇందులో రక్తపాతం, క్రోధం, కసి- ఇవన్నీ ఉండవు. కాబట్టి ఈ యుద్ధంలో పోరే ఇరుకక్షులవారి ప్రకృతిని, ఇది ఉన్నతస్థితికి లేవనెత్తుతుంది. మొట్టమొదట శాసనోల్లంఘన కార్యక్రమం విచారణకు వచ్చినప్పుడు, సముద్రపు నీటిని ఉప్పు చేసే నిమిత్తం కుండ బొచ్చెలలో కాచినప్పుడు, ఉప్పు మళ్లలోకి గుప్పెళ్ళతో ఉప్పు తీసుకొని రావడానికి ప్రజలు దండయాత్ర వెళ్లినప్పుడు, స్త్రీలు కల్లు దుకాణాలకు పిక్కెటు చేయడానికి పోయినప్పుడు, ఈతచెట్లూ తాటిగెలలూ కొట్టివేయబడినప్పుడు, విదేశీ వస్త్రాలు దహింపబడ్డప్పుడు, పాత రాట్నాలను పైకి తీసినప్పుడు, అదంతా అహంకారోన్మాదుని అపహాస్యపు చేష్టలవలె, బంగారం చేస్తాననే గోసాయివాని శుష్క వాగ్దానాలవలె, పరికలదాని సోదులవలె, జ్యోతిష్కుల యొక్కయు, హస్తసాముద్రికుల యొక్కయు అనాగత వృత్తాంతముల వలె, ఇంద్రజాలికుని మాయవలె కనిపించింది. ఇరవై సంవత్సరాల నుండి సత్యాగ్రహాన్ని ఆచరణలో పెట్టి ఒరిసి చూచాము. ఇందులో మన ఆలోచనకు తోడు, మరికొంత నమ్మకం కూడా ఉంచినట్లయితే, కొద్దికాలంలోనే ఈ నూతన శాస్త్రం, హింసా

ప్రతీకారముల నుండి మానవ కోటిని రక్షించేటందుకు, శిల్పం గానూ శాస్త్రం గానూ కూడా అభివృద్ధి పొందుతూన్నదని తెలుసుకో గలము. సత్యాగ్రహం అద్భుతములతో నిండిఉంటుంది. అద్భుతం అత్యంతమైన సృజన శక్తిని కల్గించే భావ వికారం.

చిట్టచివరకి సత్యాగ్రహం వినోబా భావేతో ప్రారంభించినప్పుడు, ఏ కొద్దిమంది లోనో నిరాశా సందేహా లున్నప్పటికీ, అనేక మందిలో ఆశా విశ్వాసాలు అంకురించినవి. భావేకు సత్యాగ్రహంలో 32 ఏండ్ల అనుభవం ఉంది. ఆయన గొప్ప పండితుడు, గట్టి నియమంగల బ్రహ్మచారి. ఖద్దరు, గ్రామ పరిశ్రమల యందు శ్రద్ధా భక్తులు కలవాడు. గాంధీ అనుయాత్రికులలో అగ్రగామి. తేలిక భాషలో గట్టిగా తొట్రుపాటు పడకుండా తూచినట్లు యుద్ధ ప్రయత్నంలో జోక్యం కలుగచేసుకో కూడదని, వినోబా నాలుగు ఉపన్యాసా లిచ్చాడు. కాని కాంగ్రెసు, యుద్ధ చందాల విషయంలో గాని, సైనికులను సమకూర్చే విషయంలో కాని, పికెటు చేయదలచుకో లేదని కూడా వాటిలో స్పష్టం చేశాడు. చట్టం ప్రకార మీ ముద్దాయికి మూడు మాసాలు ఖైదు విధింప బడింది. ప్రభుత్వం కూడా మృదువును మృదుత్వం తోనే ఎదుర్కొన్నారు. "నేరమెం"త ఆడంబర రహితంగా జరిగిందో విచారణ కూడా అంత నిరాడంబరం గానూ జరిగింది. రెండు వైపులా కూడా దూరాలోచన, ఉచితజ్ఞత, దీర్ఘదర్శిత్వమూ ప్రదర్శింప బడినవి. చిట్టచివరి వరకూ ఇలా సాగుతుందా?

కాని తరువాతి సత్యాగ్రహి. ప్రచండ వేగం గల వ్యక్తి. ఆయనకు సాఫల్యం అంటే ఏమిటో తెలియదు. నమ్రత అనే మాట పనికిరాదు. సాధారణంగా ఆయన సమావేశాలు అతి విస్తృతములు. ఆయన దీర్ఘోపన్యాసాలు గర్జారావాలు. ఉజ్జీని బట్టి ఉజ్జీ ఉంటూడంటూరు. ప్రభుత్వంవారు, వినోబా యెడల ప్రవర్తించి నట్లుగానే జవహర్‌లాలు ఎడల కూడా ఒకేరీతిని ప్రవర్తిస్తారా అని, మే మాశ్చర్యంలో మునిగిపోయినాము. అలా ప్రవర్తించకుండా ఉండడంలో వింత లేదు. సత్యాగ్రహికి ఎంత శిక్ష వేశాడా అనేది ప్రధాన విషయం కాదు. సత్యాగ్రహం నడిపేటప్పుడు, అతను చూపే కార్యదీక్ష, వాక్పటుత్వము, మనో నిశ్చయము ఇవి మాత్రమే ముఖ్యములు. వినోబా భావే పేరు ప్రకటన బడ్డప్పుడు, అతనిని అజ్ఞాతయోధు డన్నారు. ఈనాడాయన పేరు లక్షలకొలదీ సమకాలికులలో తెలిసిపోయింది. రేపు భారత భావి సంతానం, ఈయనను మాతృదేశారాధనము నకు గాంధీ మహాత్మునిచే కోరుకోబడిన అనుయాత్రికులలో అగ్రేసరుడుగా పూజ చేస్తారు.

సత్యాగ్రహం ఒక యజ్ఞం. యజ్ఞపశువుగా ఎక్కడా తెలుపులేని నల్లని మేక కావాలి. ఆలాగే సత్యాగ్రహ యజ్ఞ పశువుకు ఎక్కడా నలుపులేని తెల్లని నడవడి కలవాడు కావాలి. ఒక్కసారి త్రోవ చూపబడింది. ఇంక నడుస్తుంది ఉద్యమం; ఎవరు ముందు తుపాకి పేల్చారు, ఎవరు ముందు పొలిమేర దాటి నారు అనే దానిమీద విజయం ఆధారపడి ఉండదు. సత్యాగ్రహం ధర్మయుద్ధం. అందువలన ఎవరెవర్లో ముందుగానే

పరస్పరం యోధులకు తెలుసు. మేము ప్రత్యర్థికి మరొక లాభం కూడా చేశాం. భీష్ము డర్జునునికి తన రహస్యాలను వెల్లడి చేసి నట్లుగా, మేము మా బలా బలాలను ముందుగా ప్రత్యర్థికి తెలియ పరిచాము. మేమీ రహస్యం దాచుకో లేదు. మా యుద్ధనీతి తెలిసిందే. మా కోరికలు చాలా చిన్నవి. బ్రిటను ఈ రోజున, ప్రపంచంలోకెల్ల మహాపురుషు డైనవానినీ పవిత్ర హృదయుణ్నీ తన పక్షాన కెందుకు తిప్పుకోలేదు? పవిత్రత వలన కలిగే బలం అజేయం కదా?

సత్యాగ్రహా లన్నిటిలోకి సాటిలేని సత్యాగ్రహ మిది. సందేహం లేదు. దీని దృష్టి చాలా విశాలం. కాని దీని ప్రారంభం అత్యల్పం. అయినా మహాత్ముడు దీనికి అత్యుత్తమ ఫలితం కలుగుతుందని ఆశిస్తూన్నాడు. ఇంత చిన్న గింజనుండి అంత పెద్ద ఫలం కలుగుతుందని ఆయన ఎలా అనుకొంటూ న్నాడు? మన ఈ ప్రశ్న అసందర్భంగా లేదూ? ప్రతిగింజా చిన్నగానే ఉంటుంది. ప్రతి ఫలమూ పుష్కలంగానే ఉంటుంది. అయితే గింజ మొలిచి, చెట్టయి, పూచి, కాయాలి; అంటే అందుకు తగిన దోహదమంతా చేయాలి. అందువల్లనే గాంధీ భారతజాతి అంతటినీ, నిర్మాణ కార్యక్రమాన్ని అత్యంత శ్రద్ధా భక్తులతో సాగించ మన్నాడు. దోహదం లేని చెట్టు ఫలించ నట్లే, నిర్మాణ కార్యక్రమంతో నడవని సత్యాగ్రహం, ఫల ప్రదం కాదని ఆయన అభిప్రాయం.

ఇప్పుడు గాంధీ ప్రారంభించిన సత్యాగ్రహం వంటి దెన్నడూ ఇదివరకు ప్రారంభింపబడ లేదు. తాను హిందూదేశ

సమస్యనే కాక అంతర్జాతీయ సమస్యనుకూడా పరిష్కరించగల నని గాంధీ ఆశ. గాంధీ, శాంతి సభలో హిందూదేశం పక్షాన ప్రాతినిధ్యం వహించడమే కాక, యుద్ధంలో చిక్కుకొన్న అన్ని దేశాలమధ్య తాను శాంతి రాయబారాలు నడపడానికి కూడా తగినట్లు పరిస్థితులు పరిపక్వ దశను పొందుతవని ఆయన తలంచెను. ఆయన "ప్రతి బ్రిటిష్ వానికీ" అని వ్రాసిన ఉత్తరంలో, జర్మనీని నిరోధించకుండా బ్రిటనులోకి రానిస్తే, జర్మను దండయాత్రను అహింసా యుతంగా ఎదుర్కోవడానికి తాను సంపూర్ణ సహకారం చేస్తానని రచించిన వాక్యం అత్యంత కౌతుకావహంగా ఉంది. గాంధీ చేసిన ఈ వాగ్దానమును రివరెండ్ జాక్ సి. విన్స్లో ముందుగా తానే ఊహించ గలిగినాడు. ఈ విషయం వెనుకనే ఉదాహరింప బడినది.

సత్యాగ్రహ నియమాలు 1930

సత్యాగ్రహ నియమాలను పూర్తిగా పరిశీలించవలెనంటే, గాంధీ 1930 లోనూ తరువాత 1940 లోనూ నిర్మించిన నియమాలను కొన్నిటి నిక్కడ ఉదాహరిస్తే సరిపోతుంది.

సత్యాగ్రహం అంటే సత్యమునందు పట్టుదల గలిగి ఉండడం. ఈ పట్టుదల సత్యాసక్తి గలవానికి అసమానమైన శక్తిని కలుగ చేస్తుంది. ఈ శక్తికే సత్యాగ్రహ మనే పేరు పెట్టబడ్డది. పరిశుద్ధమైన సత్యాగ్రహాన్ని తల్లి దండ్రులకు వ్యతిరేకంగా, భార్యకు వ్యతిరేకంగా, బిడ్డలకు వ్యతిరేకంగా, పరిపాలకులకు వ్యతిరేకంగా, తోడి పౌరులకు వ్యతిరేకంగా, చివరకు ప్రపంచానికి వ్యతిరేకంగా కూడా నడపవచ్చును.

ఆ విశ్వశక్తికి తనవాళ్ళూ పరాయివాళ్ళూ అనికాని, బాలురు వృద్ధులూ అనికాని, పురుషుడు స్త్రీ అనికాని, మిత్రుడు శత్రువు అనికాని భేదం లేదు. ఆ విధంగా ప్రయోగింపబడిన శక్తి యెన్నడూ భౌతిక శక్తి కానేరదు. దానిలో దౌర్జన్యానికి స్థానం లేదు. కాబట్టి అన్నిచోట్లా ప్రయోగించదగిన శక్తి, అహింసాశక్తి కానీ ప్రేమశక్తి కానీ ఐ యుండాలి. ఆత్మశక్తి అని కూడా అనవచ్చు.

ప్రేమ యితరులను దహించదు. తనను తానే దహించుకొంటుంది. కాబటి సత్యాగ్రహి అనగా సాత్విక నిరోధకుడు ఆమరణాంతం కష్టాలను సంతోషంతో ఒప్పుకొంటాడు.

కనుక సాత్విక నిరోధకుడు, ప్రస్తుత పరిపాలనా పద్ధతిని రూపుమాపడానికి, శక్తివంచన లేకుండా పని చేస్తాడు. కాని మనస్సుతో గాని, మాటతో గాని, క్రియారూపంలో గాని, యే ఇంగ్లీషు వానికీ ఎన్నడూ హాని కలుగచేయడు. సత్యాగ్రహాన్ని గూర్చిన ఈ సంగ్రహ వ్యాఖ్యానం, పాఠకున కీ క్రింది నియమాలను అర్థం చేసుకొని వ్యవహరించడానికి సావకాశం కల్పిస్తుంది.

ఎ. వ్యక్తిగతంగా

1 సత్యాగ్రహి అనగా సాత్విక నిరోధకుడు మనస్సులో కోపం పెట్టుకోడు.

2 ప్రత్యర్థి కోపాన్ని భరిస్తాడు.

3 ఆ సందర్భంలో ప్రత్యర్థి కొడితే పడతాడు; ఎన్నడూ తిరిగి కొట్టడు. కాని కోపంలో యిచ్చిన యే ఉత్తరువుకు, శిక్షా భయంవలన కాని, మరొక కారణం చేత కాని అతడెన్నడూ లోబడడు.

4 ఏ అధికారి అయినా సాత్విక నిరోధిని అరెస్టు చేయదలచుకొంటే, ఆయన బుద్ధిపూర్వకంగా అరెస్టుకు లోబడతాడు. తన ఆస్తిని జప్తు చేసి ప్రభుత్వం వారు స్వాధీన పరచుకోవడానికి తీసికొని పోతూంటే, ఆయన అడ్డగించడు.

౫. సాత్విక నిరోధి సంరక్షణలో ఉన్న ధర్మాదాయాన్ని ప్రభుత్వంవారి స్వాధీనం చేయడానికి ఆయన అంగీకరించడు. అవసరమైతే, ఆ సందర్భంలో ప్రాణాలొడ్డియైనా దానిని కాపాడుతాడు. కాని ప్రత్యపకారం మాత్రం చేయడు.

౬ ప్రత్యపకారం అంటే తిట్టడం శపథం చేయడం కూడా చేరుతుంది.

౭ కాబట్టి సాత్విక నిరోధి యెన్నడూ తన ప్రత్యర్థిని అవమాన పరచడు. అంతేకాదు, ఇప్పుడు క్రొత్త క్రొత్తగా కల్పింపబడిన నినాదాలలో కూడా, అతను జోక్యం కలిగించుకోడు. అవి అహింసా తత్వానికి వ్యతిరేకమైనవి.

౮ సాత్విక నిరోధి యూనియన్ జాకును ప్రణామము చేయడు. దానిని అవమానించనూ అవమానించడు. ఆయన యే ఉద్యోగినీ, భారతీయుడు కానీయండి ఆంగ్లేయుడు కానీయండి, అవమానం చేయడు.

౯ పోరాట మధ్యంలో ఎవరైనా, ఉద్యోగస్థుణ్ణి అవమాన పరచినా, కొట్టినా, సాత్విక నిరోధి, అటువంటి ఉద్యోగస్థులను అవమానం నుండి కాని, రక్షించేటందుకు తన ప్రాణాలను కూడా త్యజించడానికి సంసిద్ధంగా ఉంటాడు.

౧౦ ప్రతి సత్యాగ్రహి లేక సాత్విక నిరోధి జైలు ఉద్యోగులయెడ తగు మర్యాదగా ప్రవర్తిస్తాడు. తన ఆత్మ గౌరవానికి భంగం కాని పద్ధతిని జైలు నియమాలను పాటిస్తూంటాడు. జైలు నియమాల ప్రకారం జైలు ఉద్యోగస్థులకు వందనం చేయవలసి వచ్చినప్పుడు, అవమానకరమైన పనిని దేనినీ అతడాచరించడు. సర్కారుకు విజయం కలుగుగాక, అనే నినాదాన్ని అతడు చేయడు. ఆయన పరిశుద్ధంగా వండి వడ్డింపబడిన ఆహారాన్ని స్వీకరిస్తాడు. కాని అపరిశుద్ధమైన పాత్రలలో ఉంచబడిన ఆహారాన్ని నిరాకరిస్తాడు.

౧౧ తన శరీరాన్ని సరియైన స్థితిలో ఉంచడానికి అవసరం లేని యే అనుకూలాన్నీ అతడు కోరడు. తన భౌతిక ఆధ్యాత్మిక శ్రేయస్సుకు కావలసిన అన్ని అనుకూలాలనూ, అతడు కోరవచ్చును.

౧౨ తన ఆత్మగౌరవ రక్షణకు కావలసిన అవకాశములు లేవనే కారణం చేత తప్ప, సాత్విక నిరోధి యితర అనుకూలాలు లేనంత మాత్రాన ఉపవాసం చేయడు.

బి. దళంలో

౧౩ దళాధిపతి యిచ్చే అన్ని ఉత్తరువులను తన కిష్టమున్నా లేకపోయినా సాత్విక నిరోధి సంతోషంతో అనుసరిస్తాడు.

౧౪ అవి ఆయనకు, అవమాన కరంగానూ, విరుద్ధంగానూ, అవివేకంగానూ కనిపించినప్పటికి కూడా, ముందా ఉత్తరువులను అనుసరించి, తరువాత పై అధికారులకు విన్నవించు కొంటాడు. మొట్టమొదట ఆయన చేరే టప్పుడే, ఆ దళం తనకు తగి ఉంటుందో లేదో చూచుకోవడానికి ఆయన కధికారం ఉంది. చేరిన తరువాత దళ నియమాలు, తనకు కష్టంగాఉన్నా, ఎలా ఉన్నా, వాటికి లోబడి ఉండడం ధర్మం. దళం, మొత్తంపైన సరియైన శక్తివంతంగా లేదని కానీ, అవినీతి కరంగా ఉందని కానీ, ఆయనకు తోచే యెడల తానా దళంతో సంబంధం వదులుకోవచ్చు. కాని అందులో ఉండి మాత్రం నియమ భంగంగా ప్రవర్తించడాని కాయన కధికారం లేదు.

౧౫ తనపైన ఆధారపడి ఉన్నవారి సంరక్షణకు కావలసిన భరణం, ఎవ్వరో యిస్తారని సాత్విక నిరోధి అనుకోకూడదు. ఎప్పుడైనా అటువంటి సావకాశం కలిగితే, అది అకారణంగా సంభవించిం దనుకోవాలి. మామూలు యుద్ధాలలో సమర్పణమై పోతూన్న లక్షలకొలదీ జనులు, ముందుగా తమ కుటుంబ భరణాలను ఏర్పాటు చేసుకొని పోజాల

కుండా ఉన్నారు. కాబట్టి సత్యాగ్రహంలో అసలే అటువంటి అవకాశం ఉండదనుకోవాలి. అటువంటి సమయాల్లో ఎవ్వరూ ఉపవాసాలు చేయవలసిన అవసరం కలగదనేమాట, అందరికీ అనుభవసిద్ధం.

సి. సాంఘిక పోరాటాలలో

౧౬ బుద్ధిపూర్వకంగా ఏ సత్యాగ్రహీ కూడా సాంఘిక పోరాటాలకు కారణం కాదు.

౧౭ అటువంటి కల్లోలం కలిగినప్పుడు తానొక పక్షాన్ని చేరడు. కాని ఏ పక్షాన ప్రత్యక్షంగా న్యాయ్యం కనిపిస్తున్నదో, ఆ పక్షానికి సహాయం చేస్తాడు. హిందూ అయితే ఆయన ముసల్మానుల యెడలనూ ఇతరుల యెడలనూ ఔదార్యంగా ప్రవర్తిస్తాడు. హిందువుల దండయాత్ర నుంచి, హిందువులు కానివారిని రక్షించే నిమిత్తమాయన ఆత్మ సమర్పణ చేసుకొంటాడు. అవతలి వాళ్ళే పైపైకి వచ్చిన యెడల, తాను ప్రత్యపకారం చేయకుండా, హిందువులను రక్షించడానికి తన ప్రాణాలను ఒడ్డుతాడు.

౧౮ సాంఘిక పోరాటాలకు సావకాశం కలిగించే ప్రతి సాదర్భాన్నీ, ఆయన శక్తివంచన లేకుండా తొలగించే యేర్పాటు చేస్తాడు.

౧౯ సత్యాగ్రహుల ఉత్సవాలలో ఎవ్వరి మత భావాలకు గానీ విరుద్ధంగా ఉండే పనులేమీ వారు చేయరు. ఎవరి మత భావాలకైనా విరుద్ధంగా తోచే యే ఉత్సవాలలోనూ వారు జోక్యం కలిగించుకోరు.

ఈ ఇటీవలి సత్యాగ్రహానికి సంబంధించిన రెండు పత్రాలిచట ఉదాహరించడం ఉచితంగా కనిపిస్తుంది. ఒకటి సత్యాగ్రహి యొక్క ప్రమాణ పత్రం. రెండు గాంధీ జారీ చేసిన సత్యాగ్రహ నియమావళి.

1. సత్యాగ్రహ ప్రమాణ పత్రం

నేను కార్యదీక్షా సత్యాగ్రహిగా చేరదలచుకొన్నాను. నేనీ దిగువ విధంగా ప్రమాణం చేస్తున్నాను.

౧ నేను కార్యదీక్షా సత్యాగ్రహిగా ఉన్నంత కాలమూ వాచా కర్మణా అహింసా యుతంగా ఉంటాను. ఉద్దేశంలో కూడా అహింసా యుతంగా ఉండడానికి ప్రయత్నిస్తాను. భారత దేశ మిప్పుడున్న పరిస్థితులలో, పూర్ణ స్వరాజ్య సంపాదనకు గానీ, హిందువులు, మహమ్మదీయులు, సిక్కులు, పార్శీలు, క్రైస్తవులు, యూదులు - ఈ అందరి మతస్థుల యొక్కయు, జాతుల యొక్కయు, ఐకమత్య సంధానమునకు గానీ, అహింస ఒక్కటే సహకారి కాగలదని నా విశ్వాసం.

౨ ఈ ఐకమత్యంలో నాకు నమ్మకముంది. అందుకోసం నేను కృషి చేస్తాను.

౩ అస్పృశ్యతా కళంకాన్ని రూపు మాపడం అవసరమనీ, న్యాయ్యమనీ నా నమ్మకం. కాబట్టి అవకాశం వచ్చినప్పుడల్లా, నిమ్న జాతులతో సన్నిహిత సంబంధం కలిగించుకొని వారికి సేవ చేయడానికి ప్రయత్నిస్తాను.

౪ భారత దేశము యొక్క ఆర్థిక రాజకీయ నైతిక మోక్షమునకు స్వదేశీ అత్యావసరమని నమ్ముతూ, చేతితో వడికి చేతితో నేసిన బట్టను మాత్రమే నేను ఉపయోగిస్తాను. నేను సాధ్యమైనంత వరకు గ్రామ పరిశ్రమలనే వినియోగిస్తాను.

౫ నూలు సక్రమంగా వడుకుతాను.

౬ నా పై అధికారుల ఉత్తరువులను అనుసరిస్తాను. ఈ ప్రమాణ పత్రమునకు విరుద్ధం కాకుండా, పై కాంగ్రెసు సంస్థ యేదైనా గానీ లేక వర్కింగు కమిటీ గానీ, లేక కాంగ్రెసు నిర్మించిన యే సంస్థగానీ చేసే నియమాలను, నిబంధనాలనూ నేను నిర్వర్తిస్తాను.

ఔ ఏవిధమైన అసంతృప్తి లేకుండా ఈ ఉద్యమం కోసం, నా దేశం కోసం, ఖైదు అనుభవించడానికి గానీ మరణించడానికి గానీ నేను సంసిద్ధం.
ఔా నేను ఖైదు అనుభవించే సందర్భంలో నాకోసం గానీ, నా కుటుంబం కోసం గానీ, నామీద ఆధారపడి ఉన్న ఇతరులకోసం గానీ, కాంగ్రెసు నుండి యే విధమైన సహాయమూ కోరను.

2. గాంధీ యేర్పాటు చేసిన నియమావళి ఇది.

(ఎ) ఎవరుగానీ ముందుగా జిల్లా మేజిస్ట్రేటుకు, స్థలమూ, కాలమూ, శాసనోల్లంఘన పద్ధతిని సరిగా తెలియపఱచకుండా శాసనోల్లంఘనం చేయరాదు.
(బి) ఇందుకోసం నగరాలలో బహిరంగ సభలు జఱుపకుండా ఉండడం మంచిది. గ్రామాలలో సభలు జఱుపవచ్చును. శాసన నిరోధకుడు పోతూ, త్రోవను పోయేవా రందఱికీ, ఈ దిగువ నినాదాన్ని, ఆయన అరెస్టు చేయబడే టంతవఱకూ పదేపదే వినిపించడం, ఉత్తమోత్తమమైన, తేలికలోకి తేలికైన పద్ధతి ఆ పద్ధతే నాకెక్కువ యిష్టం. అది నిరపాయ కరమైనది, సంగ్రహమైనది, ప్రయోజనకరమైనది; వాదం అనవసరం. అది యుద్ధసమస్య ఒక్కదానిపైననే ప్రజల దృష్టిని కేంద్రీకరిస్తుంది. ఈ ఉద్యమం సమష్టి సత్యాగ్రహంగా మారిపోకుండా ఉండడమే దీని ఉద్దేశం. నినాద మిది: "బ్రిటిష్ యుద్ధ ప్రయత్నానికి మనుష్య సహాయం గానీ ధనసహాయం గానీ చేయడం తప్పు. అహింసా నిరోధంతో అసలు యుద్ధా లన్నిటినీ ఆపివేయడమే ఉత్తమ పద్ధతి" శాసనోల్లంఘనం జరుగవలసిన రాష్ట్రాలలో, అక్కడి భాషలలోకి ఈ నినాదము అనువాదం చేయబడవలెను.
(సి) శాసనోల్లంఘనం ఒక్కరొక్కరుగా చేయాలి. ఒక్కసారే ఒకేచోట ఒకరికంటె ఎక్కువమంది సత్యాగ్రహం చేయకూడదు. సాధ్యమైతే ఈ కార్యక్రమమంతా ఒక్క నెలలో పూర్తి కావాలి.

(డి) శాసనోల్లంఘనం జరుగుతూండగా యే విధమైన ప్రదర్శనా లూ ఉండ కూడదు.

(ఇ) మామూలు ప్రకటన మార్గాలన్నీ మూసివేయ బడ్డప్పుడు, ప్రతివాడూ తనకు తాను పత్రిక కావడమే మార్గం. సత్యాగ్రహం మామూలు త్రోవలపైన ఆధారపడి ఉండదు; ఉండకూడదు. అవి లేకుండా ఉన్న మాత్రాన మనం నిస్సహాయులమై పోయినట్లు భావించ కూడదు. చాలా వరకవన్నీ, మనకు సంబంధించినంతవరకు ఇప్పటికే మూసివేయ బడ్డవి. త్రోవనే పోతూ ఈ పలుకులను పదేపదే పలకడం ఉద్యమాన్ని సాధ్యమైనంత నిరాడంబరంగా చేస్తుంది.

(యఫ్) రహస్యం మనేది ఉండనే కూడదు. కాబట్టి సైక్లోస్టైలు వంటి యంత్రాలను ఉపయోగించేవారు, వాటిని పోగొట్టు కోవడానికి తయారై ఉండాలి. ఎక్కువ ప్రతులు కావాలంటే కాంపోజిషన్ ట్రేలు ఉపయోగించ వచ్చు. వాటిని తయారు చేసే పద్ధతిని స్థానికంగా సంగ్రహించ వచ్చును. (తరువాత అ. భా. కాం. సం॰ కార్యాలయం పంపడానికి ప్రయత్నిస్తుంది.)

(జి) కాంగ్రెస్సు నిధులను రహస్యంగా దాచు నక్కరలేదు. ప్రభుత్వము వారు వాటిని స్వాధీన పరచుకొన దలచుకొంటే స్వాధీన పరచుకో వచ్చు. బ్రతుకుతామో చస్తామో తెలియని ఈ పోరాటంలో, మన నిధులనే కాదు యావదాస్తినీ కూడా పోగొట్టు కోవడానికి సిద్ధంగా ఉండాలి. మన ఉద్యమానికి ప్రతిరోజూ కావలసిన ధనానికి, మనం మన దేశీయులపైన ఆధారపడి ఉండడం నేర్చుకోవాలి. కాబట్టి మనం మన అవసరాలను సాధ్యమైనంత వరకు తగ్గించు కోవాలి.

(హెచ్) మనం సాధ్యమైనంత వరకు ఖైదీలలో తరగతి విభజనము లేకుండా చూచుకోవాలి. ఏ సందర్భం లోనూ కూడా పెద్ద తరగతిని గాని

చిన్న తరగతిని గాని అడగ ప్రయత్నించ కూడదు. 'ఏ' తరగతి ఖైదీ తన కియ్యబడిన ప్రత్యేక సౌకర్యాలను, వినియోగించుకొని తీరాలనే నిర్బంధం లేదు. కాని తన ఆరోగ్యాని కవి అవసరమైతే, వాటిని వినియోగించు కోవడాని కాయన సిగ్గుపడ నక్కర లేదు.

(ఐ) మానవ మర్యాదకు భంగకరంగా ఉండనంతవరకు, జైలు నియమాలను క్రమాన్ని జాగ్రత్తగా అనుసరించ వలసిందే. పని తప్పించు కోవాలని చూడకూడదు. పనికొక గౌరవం ఉందని ప్రతిమనిషీ తెలుసుకోవాలి.

(జె) హర్తాళాలు చాలా తక్కువగా ఉండాలి. మరీ తఱచుగా చేయడం వల్ల వాటి మర్యాద పోతుంది. అవి నిషేధింప బడవచ్చును. మన సాత్విక నిరోధం చాలా పరిమిత మైనది. అందరికీ వర్తించేది కాదు.

(కె) కాంగ్రెసు అశాస్త్రీయ సంస్థగా ప్రకటింప బడినప్పటికీ ఏమీ పరవా లేదు. నేను స్వేచ్ఛగా ఉన్నంతవరకు నేనే ఉద్యమాన్ని నడుపుతాను. నేను నిర్బంధింప బడే సందర్భంలో, ప్రజలు అహింసా తత్వాన్ని అస్థిగతం చేసుకొన్నట్లయితే, ఈ ఉద్యమం దానంతటు అదే నడుస్తుంది. కాంగ్రెసు వాదులు నిశ్చలం గానూ ప్రశాంతం గానూ ఉండాలి. ప్రతి మనిషీ తనకు తోచినట్లు చేయాలి. తాను శాసనోల్లంఘనం చేయ వలె ననుకొంటే యేమీ అభ్యంతరం లేదు. అలా చేయ లేకపోతే, నిర్మాణ కార్యక్రమం లోని ౧౩ విషయాలలో ఒకటి గానీ అంతకు మించి గానీ తీసుకొని పనిచేయ వచ్చును. నేను నా తరువాత పని చేయ వలసిన మనిషిని నియమించను. నేను జైలులోపల ఉన్నా, జైలు వెలుపల ఉన్నా, కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమానికి సంబంధించినవా రెవరూ శాసనోల్లంఘనం చేయకపోవచ్చును.

(ఎల్) కాంగ్రెసు శాస్త్రీయ సంస్థగా పనిచేస్తూన్నంతవరకు, ఇప్పుడు పని చేస్తూన్న రాష్ట్రీయ కాంగ్రెసు అధ్యక్షులు నిర్బంధింపబడితే, వారి స్థానే కొత్త అధ్యక్షులను ఆ సంస్థ ఎన్నుకో వచ్చును. అలా ఎన్నుకో

బడిన మనిషి, నా అంగీకారం పొందాలి. నా షరతులను ఆయన నిర్వ ర్తించక పోతే, ఆయనద్వారా పనిచేయడం నాకు కష్టమై పోతుంది.

(ఎమ్) కాంగ్రెసు వాదులు తాము ఫాసిజముకు గానీ, నాజీజముకు గానీ అనుకూలురు కారనీ, ఏ యుద్ధానికైనా తాము ప్రతికూలురే ననీ, కనీసం బ్రిటిష్ సామ్రాజ్యం పక్షాన నడపబడుతూన్న యుద్ధానికి తాము ప్రతికూలురనీ, తమ మాటలలోనూ చేతలలోనూ కూడా స్పష్టం చేయాలి. బ్రిటిష్ వారు తమ బ్రతుకు కోసం చేసుకొనే ప్రయత్నంలో వారికి సానుభూతి ఉంది. కాని వారు కూడా పూర్ణ స్వాతంత్ర్యం పొందిన జాతిలో సభ్యులుగా ఉండాలని కోరుతూన్నారు. కాబట్టి వారి స్వాతంత్ర్యాన్ని త్యాగం చేసుకొని, బ్రిటనుకు వారు సహాయం చేస్తారని అనుకో కూడదు. వారి కే జాతిపైనా ద్వేషం లేదు. ప్రపంచంలో శాశ్వత శాంతిని స్థాపించే నిమిత్తం, వారి ధర్మాన్ని వారు నిర్వర్తించ కోరుతూన్నారు.

సత్యాగ్రహ ఖైదీలకు గాంధీ సలహాలు

సత్యాగ్రహ ఖైదీల ప్రవర్తనను గూర్చి అడిగినప్పుడు గాంధీ 1940 లో యిచ్చిన ప్రత్యుత్తరాలు.

౧ ఎక్కువ స్థితిలో నున్న సత్యాగ్రహులు తక్కువ స్థితిలో నున్న తన సోదర సత్యాగ్రహుల కంటె, ఎక్కువ సౌకర్యాలను (నిరాకరించక) ఎందుకంగీకరించాలి? ఈ భేద ప్రవర్తనకు వారెందు కసమ్మతి చూపించకూడదు? తమ రొజుల చూపే ఈ ఎక్కువ మర్యాదను వారు నిరాకరిస్తే ఒక నేరం కోసం ఒకే చట్టంకింద శిక్షింపబడిన అందరు రాజకీయ ఖయిదీలకూ సమాన ప్రతిపత్తి ఈయవలసిన నిర్బంధం ప్రభుత్వానికి కలగదా?

౨ కొందరు నియమంగా ఖద్దరు ధరించేవా రున్నారు. వారు ఖాదీ వస్త్రాలు ధరించడానికి నానా కష్టాలూ పడుతూన్నారు, వారు రాజకీయ ఖయిదీ

.లయినప్పటికీ వారికి ఖాదీ ఈయడం లేదు. అటువంటి పరిస్థితులలో వారేమి చేయాలి?

3. హృదయ పూర్వకంగా కాంగ్రెసు వాదులు కానివారు కాంగ్రెసును ఉపయోగించుకొని, స్థానిక సంస్థలలోని అధికారాలలోకి మఱికొన్ని అధికారాలలోకి దూరి, కాంగ్రెసు ప్రతిష్ఠను కించ పరుస్తుంటే యేమి చేయాలి?

జవాబులు

సేవాగ్రామం, వార్ధా, ౨౮-౧౧-౪౦.

౧ 'ఏ' క్లాసు ఖయిదీలు తమ ఆరోగ్య క్షేమాలకు అవసరమైనంత వఱకే సౌకర్యాలను గ్రహించాలి. ఇతరులే సందర్భంలోనూ గొణుగుతూ ఉండరాదు.

౨ జైలులో ధరించడానికి ఖద్దరీయకపోతే ఖయిదీ ఉపవాసం చేయరాదు.

3 ఏ ఉద్యమంలోకైనా సరే దొంగలను రానీయకుండా చేయడానికి అన్నిప్పుడెల్లా సాధ్యం కాదు.

వ్యక్తి సత్యాగ్రహం యొక్క అవకాశం

కొన్ని ప్రశ్నలకు గాంధీ ప్రత్యుత్తరాలు

కలకత్తా, నవంబరు ౨౪, ౧౯౪౦

ప్రియమైన మహాత్మాజీ,

ఫార్వర్డు బ్లాకుకు సంబంధించిన కాంగ్రెసు వాదులు, సత్యాగ్రహోద్యమ ప్రారంభకులయిన మిమ్ముల నీ కింది విషయాలను అడిగి తెలుసుకోవాలని కోరుతూన్నారు.

౧ మీరు ప్రారంభించిన వ్యక్తి సత్యాగ్రహానికి వాస్తవికోద్దేశ మేమిటి?

౨ (అ) మీరు వైస్రాయిని దర్శించిన సందర్భంలో సెప్టెంబరులో సెలవిచ్చినట్లు, మాటకూ వ్రాతకూ, ప్రతి మనిషికీ స్వాతంత్ర్యం ఉండవలెననేనా ఈ ఉద్యమాన్ని ప్రారంభించింది?

(ఆ) లేక ఇది కేవలం యుద్ధ వ్యతిరేక ప్రచారం కోసం స్పష్టంగా ఉద్దేశింప బడిందా?

(ఇ) లేక సంపూర్ణ స్వరాజ్య సమస్యను గూర్చియా?

3 ఈ ఉద్యమం వర్కింగ్ కమిటీ, అ. భా. కాం. సం. కేంద్ర రాష్ట్రీయ సభల సభ్యులకు మాత్రమే నని పరిమితి యేర్పాటు చేయబడిందా?

(అ) అలా కాకపోతే ఇంకా ఎవరెవరీ ఉద్యమంలో పాల్గొనడాని కర్హులు?

౪ ఈ ఉద్యమాన్ని ఏ దశలోనైనా ప్రజా సామాన్యానికి వ్యాపింప చేసే ఉద్దేశం మీ కార్యక్రమంలో ఉందా?

దయచేసి తక్షణం ప్రత్యుత్తరంవ్రాస్తే చాలా కృతజ్ఞులం. నమస్కారాలు.

సెలవు మహాత్మాజీ,
మీ విశ్వాస పాత్రుడు.

గాంధీ జవాబు

సేవాగ్రామం, వార్ధా, (సి. పి.) నవంబరు ౨౮.

ప్రియ మిత్రమా!

వాక్స్వాతంత్ర్యం లేఖనా స్వాతంత్ర్యముల కోసమే వ్యక్తి సత్యాగ్రహం ప్రారంభింప బడినదనే మాట నిస్సందేహం. కాని ప్రతి ఉద్దేశము యొక్క కొట్టకొననూ భారత స్వాతంత్ర్య సమస్య ఉండనే ఉంది. ఈ ఉద్యమ పరిమితి మొట్టమొదట్లో ఇద్దరు ముగ్గురి వరకే యేర్పాటు

చేయబడింది. తరువాత మీరు పేర్కొన్న మూడు సంఘాల సభ్యులలో నేను కోరుకొన్న వారికి కూడా విస్తరింప చేయబడ్డది. నేను రాష్ట్ర కార్య సంఘాలలోని రాష్ట్రీయ, జిల్లా, ఫిర్కా, తాలూకా, పట్టణ సంఘాలలోని సభ్యుల జాబితాలను తరగతులుగా యేర్పాటు చేసి పంప నున్నాను. కాని ఏ విధంగా విస్తరింప చేయబడినప్పటికీ ఇది ప్రజా సామూహ్యోద్యమంగా మాత్రం పరిణమించదు. నేనూహించ గలిగినంత వరకిది వ్యక్తి సత్యాగ్రహం గానే ఉంటుంది. నా షరతులను నిర్వర్తించిన వారికి మాత్రమే వర్తిస్తుంది. మీ ప్రశ్న లన్నిటికీ ఈ జవాబు సరిపోతుం దనుకుంటాను.

మీ విశ్వాస పాత్రుడు.

సత్యాగ్రహ ప్రదర్శనాలు వద్దు
సాత్విక నిరోధకులకు గాంధీ జవాబు

బీహారు మాజీ ప్రధాని శ్రీకృష్ణసిన్హా నిర్బంధింప బడినప్పుడు జరిగిన సంఘటనను గూర్చి బాబూ రాజేంద్ర ప్రసాదు వ్రాయగా, "సత్యాగ్రహం చేసే విషయం ప్రజలకు తెలియపఱచ నక్కరలేదు. అధికారులకు తెలియపఱిస్తే చాలు. సత్యాగ్రహ సందర్భంలో బహిరంగ ప్రదర్శనాలు కూడవు" అని గాంధిజీ ఆయనకు సలహా యిచ్చారు.

ఉద్యమం కొంత దూరం బాగా సాగినతరువాత, ఈ దిగువ షరతులను అక్షరాలా అనుసరించిన వారే సత్యాగ్రహం చేయ డాని కర్హులని గాంధీ స్పష్టీకరించాడు.

౧ వారు నిత్యమూ క్రమంగా నూలు వడికే వారుగా ఉండాలి.

౨ వారికి ఖాదీ కట్టడం నిత్య వ్యవహారంగా ఉండాలి.

౩ వారికి సాంఘి కైకమత్యము నందూ, అంటరాని తనమును అన్ని రూపాల లోనూ రూపు మాపడమునందూ విశ్వాస ముండాలి.

౪ గ్రామ పరిశ్రమలనూ స్వదేశీని అన్ని విధాలా ప్రోత్సహించడం అవసరమని వారు నమ్మాలి.

౫ అహింస లేకుండా లక్షలాది ప్రజలకు స్వరాజ్యం లభించదని వారికి విశ్వాస ముండాలి.

౬ అ. భా. కాం. సం. వారి బొంబాయి తీర్మానంలో వారికి నమ్మక ముండాలి.

౭ పైన చెప్పిన అన్ని విషయాలకూ అహింసతో తీరని సంబంధ ముందని వారు నమ్మాలి.

కేవలం క్రమశిక్షణ కోస మెవ్వరూ ఖైదుకు పోనక్కరలేదని గాంధీ గట్టిగా వ్రాశాడు. శాసనోల్లంఘనం క్రమశిక్షా సంబంధమైనది కాదు; అనుల్లంఘనీయ మైన విశ్వాసానికి సంబంధించి ఉందది. శాసనోల్లంఘనము యొక్క అవసరాన్ని గమనించని వా రెవ్వరూ ఆ పనిని అవలంబించ వలెనని కాంగ్రెసు కానీ గాంధీ కానీ అనుకోనైనా లేదు. వట్టి నియమానుసరణం కోసం శాసనోల్లంఘనం చేసినట్లుగా చెప్పడం, కాంగ్రెసు వాదికి లజ్జాకరమని గాంధీ అభిప్రాయం. కాంగ్రెసుకు అంటీ అంటనట్లుగా, పని చేసీ చేయనట్లుగా నటించడం వల్ల, మనం మన ఆదర్శాన్ని అందుకోలేము; ప్రయోజనం లేదని కూడా గాంధీ అనేక సార్లన్నాడు.

నిర్మాణ కార్యక్రమంలో పని చేసే వారంతా కూడా శాసన నిరోధకుల వంటివారే. తాము శ్రద్ధతోనూ విశ్వాసంతోనూ చేసే సేవవల్ల, సందేహాస్పదులైన శాసన నిరోధకుల

కంటె కూడా వారు శాసనోల్లంఘనానికి ఎక్కువ దోహదం చేస్తున్నారు. నిర్మాణ కార్యక్రమ రూపంలో దేశీయుల సహకారం ఉంటే శాసనోల్లంఘనం అప్రతిహతంగా మనను మన ఆదర్శ సీమకు తీసికొని పోగలదు. మన పోరాటానికి గుణం ప్రధానం కాని సంఖ్య ప్రధానం కాదు. రెండూ ఉంటే మరీ మంచిది.

అధ్యాయము ౫

సత్యాగ్రహాము - దాని నైపుణ్యాము

తాను సంఖ్యలతో కుంగిపోతూన్నానని గాంధీ అంటూంటాడు. ఇది కొంత లోక విరుద్ధంగా కనిపిస్తుంది. జైలుకు వెళ్ళేవాళ్ళు గాని సంఘంలో చేరేవాళ్ళు కాని ఎంత తక్కువమంది ఉంటే అంత సంతోష మాయనకు. ప్రతి వ్యక్తి యొక్క ఆత్మ పరమాత్మలో భాగమనీ, అందువల్ల ఆయన జగత్తుయొక్క సూక్ష్మ స్వరూపమనీ గాంధీ నమ్మకం. ప్రతి వ్యక్తికీ యెవరికి తగిన పవిత్రత వానికి ఉంది. కాని గాంధీ, ఆయన కోరిన కొద్దిమందే కావాలంటాడు. వారు "అకలంక బ్రహ్మచర్య వ్రతమవలంబించాలి; పేదరికాన్ని కోరి తెచ్చుకోవాలి; సత్యాన్ని అనుసరించాలి; నిర్భీతిని అలవాటు చేసుకోవాలి." ఆయన ఆధ్యాత్మిక చింతలో భౌతిక శరీరాన్ని మఱచిపోలేదు. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనం" అనే పూర్వఋషుల సూత్రాన్ని, వారివలెనే ఆయన కూడా గమనిస్తూ ఉంటాడు. అందువలననే ఆయన ఆర్థిక శాస్త్రంలో పేదల కూడు గుడ్డలు చాలా పెద్దస్థానాన్ని ఆక్రమిస్తూన్నాయి. ఇందుకోసం ఆయన మధ్య తరగతుల జీవిత ప్రమాణాన్ని తగ్గించ కోరుతాడు. కొందఱి జీవితావసరాలను ఎక్కువగా పెంచుకొని, లక్షలాది ప్రజల జీవిత ప్రమాణాన్ని శూన్యందాకా తగ్గించడం ఆయనకు గిట్టదు. "ఓ ఆత్మా! తిని తాగి హాయిగా ఉండు" అనే వేదాంతం ఆయనది కాదు. తినేదీ, తాగేదీ శరీరం, ఆనంద మనుభవించేది ఆత్మ. మానవ

శరీరానికి అతి నిరాడంబరమైన ఆహారము మానవాత్మకు, అత్యుదాత్తమమైన ఆనందమూ కావాలని ఆయన ప్రయత్నం. కాబట్టి రైతును సాలీని తిరిగీ తొలినాటి ఉన్నత స్థితిలోకి తీసుకొని రాగోరుతూన్నాడాయన. ముందీ సంస్కరణాన్ని తనతోనే ప్రారంభించాడు. కాబట్టే ఆయన వృత్తి "వ్యవసాయము–నేత" అని చెప్పుకొంటాడు. నూలు వడకడం నేతకు ముందుగా జరుగవలసిన పనే గనుక, ఆయన నిజంగానూ ఆలంకారికంగానూ కూడా వడుకుతూ ఉంటాడు. అందువల్లనే పి. జి. బ్రిడ్జి,

"జాతియొక్క భవితవ్యాన్ని నిజంగా వడుకుతూన్నద మహాత్మాజీ" అన్నాడు.

ప్రపంచ భవితవ్యాన్నే అంటాము మేము. రాజకీయం చదరంగపు టాటవంటి దంటారు. అందులో ఎత్తును బట్టి పై ఎత్తు ఉంటుంది. పేకాటవంటి దంటామా పేకాటలో ప్రతివాడూ పక్కవాడి ముక్కలను ఓరగంటితో చూడాలని ఆతుర పడతాడు; లేకపోతే ఆ ముక్క లేవై యుంటవో ఊహించడానికైనా ప్రయత్నిస్తాడు. గాంధీ మాత్రం ఆలా చేయడు. ముందు తన ఎత్తులను నిర్ణయించుకొని ప్రత్యర్థిని స్వరక్షణలో పెడతాడు; తన పేక చూపించి ఆడతాడు. కల్లా కపటమూ ఏమీ లేదు. సత్యాన్ని మించిన రాజనీతి గానీ అహింసను మించిన రాజకీయ నైపుణ్యము గానీ లేదాయనలో.

ఆయన ఏమి చెప్పినా సీలోని ఉన్నతాత్మకు చెబుతాడు. ఆయన ఉపవాస వ్రతం వల్ల హిందూ అంతరాత్మను చివుక్కుమనిపించి, సరియైన మత మార్గంలో పెట్టడానికి ప్రయత్ని

స్తాడు. ఆయన ఆత్మ ప్రపంచానికి బాగా తెలుసు. మౌన వ్రతము యొక్కయు ఉపవాస వ్రతము యొక్కయు శక్తిని ఎలా వినియోగించాలో ఆయనకు తెలుసు.

యఫ్. జి. జేమ్సు ఇలా అన్నాడు :

బాధపడడం ప్రేమించడం ఈ రెండూ "నాటి క్రైస్తు నేటి క్రైస్తు" (మహాత్మా గాంధి) తమతమ కాలాలలో బహిర్గతం చేసిన మహాత్తమ విషయాలు.

పురాణ జీసస్ వలెనే గాంధీ కూడా ప్రేమయొక్క మహా శక్తిని గురిస్తూన్నాడు. జీసస్ సిద్ధాంతాలనే గాంధీ ఇంకనూ ఎక్కువ విస్తృతం గానూ ఇంకనూ ఎక్కువ పెద్ద ఆదర్శం కోసమున్నా ప్రయోగిస్తూన్నాడు. ఆయన "భూలోక స్వర్గాన్ని" భావిస్తూన్నాడు.

నేటి క్రైస్తు

ఆయన నేటి క్రైస్తు అనే విషయంలో ఎవ్వరికీ వివాదం లేదు. అందఱూ ఇదివరకే ఒప్పుకొన్న విషయానికి మన అంగీకార మనవసరం. కాని "ఆయన మళ్ళీ తిరిగి వచ్చినట్లుగా మన మాయనను గుర్తించాలా" అనేదే మానవలోకం నేడు విచారిస్తూన్న సమస్య.

ఆల్బర్టు ఈన్‌స్టీన్ ఇలా అన్నాడు :

గాంధీ పరాధీన జాతియొక్క మోక్షం కోసం అతి నూతనమైన, కరుణా పూర్ణమైన ఉపాయాన్ని కనిపెట్టాడు. తరువాత తన సొంత ఉదాహరణం వల్ల తన ప్రజలలోని నైతిక శక్తుల నన్నిటినీ ఒక్కసారిగా విజృంభింప చేసి వారిని శక్తివంతులనుగా చేశాడు.

గాంధీ యుద్ధనీతి ఒకప్పుడు కత్తిని ఒరలో పెట్టమంటుంది. మఱొకప్పుడు ఒరనుండి పైకి లాగమంటుంది. ఒకప్పుడు కౌన్సిళ్లు బహిష్కరించడం, మఱొకప్పుడు ప్రవేశించి పనిచేయడం, తరువాత వాటిని విడిచిపెట్టి రావడం,- ఇవన్నీ గాంధీ యుద్ధనీతిలో భాగాలే. మారణ యంత్రాలు లేని ఈ మాదిరి నైతికయుద్ధం, అప్రతిహత మైనదని స్మట్సు సేనాని అంగీకరించాడు.

ఎవరైనా మన వ్యవహారాల లోకి అనవసరంగా వచ్చి బలాత్కారంగా దూరితే, అక్కడ నుండి తాత్కాలికంగా గాని ఎప్పటికీ గాని వైదొలగడమే సత్యాగ్రహి అవలంబించ వలసిన పద్ధతి. పూర్వకాలంలో దుష్టుల రాష్ట్రాలలో నుండి జనమంతా లేచిపోతూండేవారు. పీడిత ప్రజలకు గాంధీ ఇచ్చే సలహా అదే. ఒరిస్సాకు తూర్పు యేజన్సీలో నున్న నీలగిరి రాజ్యంలోని ప్రజలు, గాంధీ సలహా ప్రకారం రెండుసార్లలా చేశారు. ఆ యేజెన్సీలోనే ఉన్న టాల్చేరు మొదలగు రాజ్యాల ప్రజలు కూడా తమ ప్రభువుల క్రోధాగ్ని నుండి తప్పించుకోవాలని లేచి పాఱిపోయినాడు. ఇరవై సంవత్సరాల కిందట ప్రజలసమ్మతి చూపినప్పటికీ, వారి ఇష్టానికి వ్యతిరేకంగా, చీరాల పేరాల గ్రామాలను మున్సిపాలిటీగా చేసినప్పు డక్కడి వారా మున్సిపల్ సరిహద్దులలో నుండి లేచిపోయి పదకొండు నెలలు వేరే కాపురమున్నారు. 1928 పన్నుల నిరాకరణోద్యమంలో బార్డోలీ ఆనంద తాలూకాల లోని రైతులు బరోడా రాజ్యం లోకి లేచిపోయినారు.

గాంధీయొక్క సేవాతత్వం

గాంధీ చేసే సేవ, యేదో అనుగ్రహ భావంతో చేసేది కాదు. విశాల మానవ జీవితంలో తానొక అణువు వలె అభేదంగా లీనమై సేవించ వలెననే తత్వమాయనిది. వరదలు కానీయండి భూకంపం కానీయండి ఆయన దృష్టిని ఆకర్షిస్తుంది; ఉన్మాదుడు కానీయండి; పతిత స్త్రీ కానీయండి ఆయనకు కనికరం కలుగుతుంది. నూలు వడికే పొందువైనా సరే నేసే మహమ్మదీయుడైనా సరే ఆయన హృదయానికి ఒకటే విధమైన సంతోషం కలిగిస్తాడు. సమ భూములలో ఉన్న నాగరికుడొకప్పుడు, గుహాలో నుండి తఱిమివేయ బడుతూన్న అడవి మనిషి ఒకప్పుడు ఆయన భావాలను అరికడుతూంటాడు. అధఃపతితుడైన అస్పృశ్యుడొకప్పుడూ, ఆకలితో అణిగిపోతూన్న హిందూ కులీనుడొకప్పుడూ ఆయనకు జాలి కలిగిస్తూంటాడు. ఈ చెప్పిన వారిలో ప్రతి ఒక్కరూ కూడా ఎప్పుడూ ఆయన సేవకు అధికారులైనట్లుగానే భావిస్తూంటారు. గాంధీ ఆశ్రమానికి వచ్చి సహాయం కోరిన కుష్ఠురోగి కాయన సేవాగ్రామంలో ఇల్లూ చోటూ ఇచ్చాడు. అంతే కాదు, సైన్యాలు గానీ యుద్ధసామగ్రి గానీ లేకుండా ఉండే ఆయన స్వరాజ్య ప్రణాళికలో, అతనికి పని కల్పించాలని కూడా గాంధీ ఆశ. అప్పుడాచరణలోకి వచ్చే శాంతి సైన్యంలో అతను చేరి, అవసరమైతే మాతృదేశ రక్షణార్థం కాల్చ బడడానికి సంసిద్ధమై కూడా సేవ చేసే అవకాశం అతనికి కలిగించ కోరుతున్నాడు గాంధీ.

న్యాయ్యం కంటె బలమే సాగిపోతూన్న రోజులలో స్వప్రయోజనాలను రంక్షించుకోవడానికి శరీరబలం ఎక్కువ కావాలి. "బలం కలవాడిది భాగ్యం" అనే సామెత సామాన్యపు సామెతే కాని అందులో సత్యం చాలా ఉంది. కాబట్టి న్యాయ్యం, బలాన్ని ఎదుర్కొంటూన్నది అంటే, అది కొందఱి స్వప్రయోజనాల నెదుర్కొంటూన్న దన్నమాట. గాంధీ జీవిత మంతా ఎప్పుడూ స్వప్రయోజనాల నెదుర్కోవడమే. దక్షిణ ఆఫ్రికాలో తెల్లవాళ్ళను, చాంపరాలో తోట యజమానులను, ఖైరాలో నిరంకుశ ప్రభుత్వమును, బోర్సాదులో పోలీసులను, అహమ్మదాబాదులో మిల్లు యజమానులను, హిందువులలో సవర్ణులను, భారత దేశంలో బ్రిటిషు సామ్రాజ్య తత్త్వాన్ని ఎదుర్కోవడం వాళ్ళ వాళ్ళ స్వప్రయోజనాల నెదుర్కోవడమే అవుతుంది. కాబట్టి ఆయన కార్యక్రమం ఎవరినో ఒకరిని ఎప్పుడో ఒకప్పుడు బాధించనే బాధించింది. విద్యార్థి, అధ్యాపకుడు లాయరు, డాక్టరు, ఉద్యోగస్థుడు, కల్లు దుకాణదారు, పెట్టుబడిదారు, సనాతన ధర్మపరుడు, వర్తకుడు, ముఖ్యంగా నిరంకుశాధికారి- వీరంతా బాధింప బడ్డవారే. కాని ఆయన ఎదుర్కొన్న ప్రతి విషయమూ న్యాయ్యమని అంగీకరింప బడడమే కాకుండా, తరువాత అందుకు తగిన పరిహారం జరిగినందువలన కూడా అది ధర్మంగా స్థిరపడ్డది. బ్రిటిష్ కామన్ వెల్తులో ఇండియా స్వతంత్రం గానూ సమభాగి గానూ ఉండేటందుకు బ్రిటిష్ ప్రభుత్వం వారు తమ 1940 ఆగస్టు 8 వ తేదీ ప్రకటనలో అంగీకరించనే - అంగీకరించారు. కాని ఇండియా

స్వాతంత్ర్య ప్రకటన కోసం పోరాడుతూన్నది. భవిష్యద్ద్రష్ట లందఱూ చపల చిత్తులని నిందింప బడడం జరుగుతూ వచ్చింది. వారు తాము జన్మించ వలసిన కాలం కంటె ముందు జన్మించారు. నాస్తికులుగా పరిగణింపబడి హత్య చేయబడడం వారి విషయంలో పరిపాటి అయిపోయింది. వారు స్వధర్మం కోసం ప్రాణాలను సమర్పిస్తున్నారు. వ్యర్థ విమర్శలతో ద్వేషింపబడుతూన్నారు. కాని కొద్ది కాలంలోనే వారు మార్గోపదేశకులవుతూన్నారు. అయితే గాంధీ విషయంలో అలా కాదు. సాక్రెటీస్ విషపాత్రే కాని గియార్డానో బ్రూనో (Giordano Bruno) అరిస్టాటిల్, లావాయిజర్ (Lavoiser) వంటి శాస్త్రజ్ఞుల నెదుర్కొన్న వధ్యశిల, ఉరికంబాలు, శూలములు గానీ గాంధీ నెప్పుడూ ఎదుర్కోలేదు. ఎదుర్కోవడానికి సిద్ధంగానూ లేవు. ప్రపంచ ప్రవక్తగా అంగీకరింపబడి, తాను చేసిన వాగ్దానాలను సమర్థతతో చెల్లించుకొని, తన కార్యక్రమంలో చాలా వరకు విజయం పొందిన గొప్ప అదృష్టం ఆయన కొక్కడికే పట్టింది. మఱీ యెక్కువగా అనేవారు, ఆయన భావ ప్రపంచంలో విహరిస్తాడన్నారు. అవును నిజమే, ఋషుల కుండవలసిన దివ్యదృష్టి భవిష్యత్తు లోకి చొచ్చుకొని పోయి చూడగలిగిన భావం- లేనిదే యే మహత్కార్యమూ యెన్నడూ జరుగలేదు. పూర్వాచార పరాయణత్వముతో, పాత సంప్రదాయములతో కుంగిపోతూన్న యుగంలో, అటువంటి ఋషులూ ప్రవక్తలు, కొత్త భావాలు, కొత్త ఆదర్శాలు, కొత్త నడవడికలూ ప్రవేశపెట్టడానికి పోరాడుతూనే ఉంటారు. ఇవ్వాళ జరిగిన నైతిక

యుద్ధాలు రేపటికి చరిత్రగా పరిణమించి, మెల్లుండికి ధర్మ శాస్త్రం గానూ, స్మృతి ప్రమాణం గానూ పరివర్తనం పొందుతయి. ప్రతి యుగములోనూ కూడా మార్పు జరుగుతూనే ఉంటుంది. అందులో మన యుగం మఱీ ప్రత్యేక విలక్షణంతో విలసిల్లు తూన్నది. మానవ విశ్వాసముల లోనూ, మానవ ప్రవర్తనము లోనూ కూడ, పునాదుల నుండీ పరివర్తనము కలుగుతూన్నది. ప్రజల ఆత్మలు శూన్యములై పోయినవి. ఆ శూన్యంలోకి ప్రాపంచక భూతాలూ ప్రవేశించినవి. గాంధీ అహింసా ఉద్యమము నూతన ప్రయోగ మన్నమాట నిజమే. గాంధీ తన స్వీయ చరిత్రకు "నా సత్య పరిశీలనములు" అని నామకరణం చేశాడు. కాని "నిజమైన నైతిక సిద్ధాంతాలు, అనుభవం వలన అందఱికీ వర్తించేటట్లు వ్రాయబడిన సూత్రాలు మాత్రమే" నని మనం మఱచిపో కూడదు. గాంధీ నిగూఢంగా చెప్పిన విషయాన్నే, జాన్ మార్లే వివరంగా ఇలా చెబుతూ న్నాడు :

> మానసిక స్తబ్ధత్వాన్ని, జడత్వాన్ని ఒక సుగుణంగానూ, భావ సంకుచిత తత్వాన్ని ఒక పవిత్రత గానూ తలంచే యుగంలో జీవిస్తూన్నాము మనం.

ఈ నైతిక సిద్ధాంతాలను ఇంకొక అడుగు అటూ ఇటూగా నిర్ణయిస్తే చాలు, ఆ నిర్ణయం కాపట్యానికికూడా దారి తీస్తుంది. జీవితమంతా అరలూ మరలూ అయిపోయింది. దేవాలయంలో హేయంగా భావింపబడి నిషేధింపబడిన అసత్యం, కోర్టులలో తప్పు కానట్లు తలంప బడుతూన్నది. నైతిక సిద్ధాంతాల

శాశ్వత సత్యం కొన్ని పరిస్థితులలో కొన్నిచోట్ల మాత్రమే అనుసరింపబడ తగిన దంటూన్నాము. గాంధీ అలా కూడ దంటాడు. ఆయన దృష్టిలో జీవితంలో అరలూ మరలూ లేవు, అది అవిభాజ్యము; నీతి ఎటు తిప్పితే అటు తిరుగదు. ఎప్పుడూ ఒకే తీరుగా ఉంటుంది. గుణా గుణాలు ఒకదానిపైన ఒకటి ఆధారపడి ఉండక స్వతంత్రంగా ఉంటవి. సత్యం సోరణ గండ్లలో నుండి క్రమక్రమంగా తొంగి చూస్తుంది. కాని ఒక్క-సారిగా సూర్యోదయం వలె మనకు ప్రత్యక్షం కాదు. కాబట్టి రాజకీయానికీ మతానికీ, మతానికీ నీతికీ, నీతికీ సంఘమర్యాదకూ, సంఘ మర్యాదకూ అంతరాత్మకూ ఉండే భేదాలను తుడిచిపెట్టి వేసే నూతన మతసిద్ధాంతం ప్రచారంలోకి తీసికొని రాబడింది. సిద్ధాంతానికీ తాత్కాలి కావసరానికీ, తక్షణలాభ సౌకర్యాలకూ ముందెప్పుడో కలిగే శాశ్వత క్షేమానికీ, నిరంతర యుద్ధం జరుగుతూంటుందనే మాట అంగీకరిస్తే గాంధీ చేసే పోరాటం యొక్క మూలం అర్థమవుతుంది. రాజనీతి ఆచరణ యోగ్యంగానూ అందరికీ వర్తించే టట్లుగానూ ఉండాలనే సూత్ర మవలంబించి "మిన్ను విరిగి మీద పడ్డాసరే సత్యానికీ న్యాయ్యానికీ కట్టుబడి ఉండాలి" అనే సుభాషితానికి భిన్నంగా ప్రవర్తించ కూడదని గాంధీ అభిప్రాయం. కాని సమయం వచ్చినప్పుడు నిరపాయ కరమైన రాజీలకు అంగీకరించక కార్యభంగం కావించుకొనే పిచ్చి పట్టుదల కలవాడు కాడాయన.

మార్లీ ఆయనను గూర్చి ఇలా అన్నాడు:

ఆయన చతురుడే కాని కుయుక్తిపరుడు కాడు. మితభాషే కాని కపటి కాడు. నెమ్మది మనిషి కాని మందుడూ కాడు, భీరువూ కాడు. సక్రియ స్వాతంత్ర్యం, నిష్కళంకమైన ప్రజా పరిపాలనం, కాదనడానికి వీలులేని వ్యక్తి స్వాతంత్ర్యంతో కూడిన నిరంతర శాసన విధేయత- ఇవి ఆయన నీతి సూత్రాలు.

బుద్ధి బలం, ప్రేమ బలం, ఇచ్ఛా బలం, ఈ మూటినీ సమన్వయం చేసుకోగలిగిన జీవితాన్ని మనం ఉచిత జీవిత మంటాము. గాంధీ అటువంటి జీవితాన్నే అంగీకరిస్తాడు. అప్పుడు "ప్రేమకు విరోధమైన విషయాలను బుద్ధి సూచించదు. అది కావాలన్న విషయాలను నిషేధించదు. ఇచ్ఛ, బుద్ధి ప్రేమా ప్రేరేపించే ప్రవృత్తుల కనుగుణంగా నడుస్తుంది." నైతిక దోషంవల్ల కలిగే చెడుగు స్థానికంగానే ఉంటుంది కాని ఇతరచోట్లకు వ్యాపించదని ఆయన విశ్వసించడు. జాతీయ సహజ లక్షణాలకు భిన్నమైన సిద్ధాంతం ఆ జాతియొక్క శాంతి అభ్యుదయములకు తోడ్పడుతుందనే పిచ్చి నమ్మకం ఆయనకు లేదు.

రహస్యం లేని రాజకీయ చతురత

సత్యాగ్రహ మూలపురుషుడు, తన జీవితంలోనూ కాంగ్రెసు చరిత్రలోనూ ఇంతకు పూర్వం నుడువబడిన సిద్ధాంతాల కనుగుణంగా, ఆ ఉద్యమాన్ని నడపిన నైపుణ్యాన్ని గూర్చి, ఇక్కడ కొంత చెప్పవలసి ఉంది. గాంధీ ధురాసదుడని ఎవరైనా అనుకొంటే అది పొరపాటు. ఆయనను అజేయుడనాలి. ఆయన

అజేయత్వానికి గల రహస్యకారణ మేమిటి? భారతీయు లాయన లోని ఆ సుగుణాన్ని గ్రహించక మునుపు లేక ఒప్పుకోక మునుపు, ఇరవై యేండ్లకిందట గిల్బర్టు మ్రరే పండితుడీ విధంగా వ్రాశాడు :

ఇంద్రియ భోగాలను కానీ, శారీరక సుఖాలను కానీ, స్తుతిని కానీ పదవిని కానీ లక్ష్యపెట్టక, కేవలం తాను న్యాయ్యమని నమ్మిన పనిని చేయ నిశ్చయించుకొన్న మనిషితో వ్యవహరించే టప్పుడు జాగ్రత్తగా ఉండాలి. అటువంటి మనిషి అపాయ కరమైన ప్రబల శత్రువు. ఎందు వల్ల నంటే, ఆయన శరీరాన్ని నీ వెప్పుడైనా జయించ వచ్చును. కాని ఆత్మ స్వాధీనం కాదు.

కాబట్టే గాంధీ తన రాజనీతిలో రహస్యం లేకుండా చేశాడు. సత్యాహింసలపైన ఆధారపడిన రాజనీతి బహిరంగంగా ఉండక తీరదు. రహస్యం తన రాజనీతికి శత్రువని ఆయన భావం. ఆయన వేయబోయే ఎత్తులనూ ఉద్దేశాలనూ అను క్షణమూ శత్రువుకు తెలుపుతూనే ఉంటాడు. అందువల్లనే ఆయన టెరరిస్టు ఉద్యమాన్ని నిరసించాడు. అందులోని రహస్య భావమూ దౌర్జన్య గుణమూ కూడా ఆయనకు గిట్ట నివే. అయితే టెరరిస్టులతో (విప్లవకారులతో) తాను మాట్లాడి వారినా మార్గమునుండి తప్పించ కోరినాడు. అదేవిధంగా, 1932 లోని దౌర్జన్య రహిత సత్యాగ్రహోద్యమం కూడా, రహస్య మార్గాలను పడుతూన్నదని, తెలిసి నిరసించాడు.

సత్యాగ్రహానికి మూలం, సత్యమునందు పట్టుదల గలిగి ఉండడమే. సత్యాగ్రహులు, స్వాతంత్ర్యోద్యానంలో పని చేసే

తోడి తోటమాలీల వలె పోలీసుతో కలసి, వారి కార్యక్రమాన్ని ముందుగా పోలీసుకు తెలియపరుస్తూండేవారు. కాని రహస్య పద్ధతుల వలన 1932-33 ఉద్యమం యేవిధంగా కళంకితమైనదో, 1934 లో ఉద్యమాన్ని ఆపివేస్తూ గాంధీ రహస్య పద్ధతుల నేవిధంగా ఖండించాడో అందఱికీ తెలిసిన విషయమే. ఉద్యమం బాగా నడుస్తూన్నప్పుడు, గవర్నమెంటు దాని లోతుపాతు లన్ని తెలుసుకోని దాన్ని సాగనీయకుండా చేశారు. అనుకో కుండా తటస్థించిన అటువంటి అడ్డంకులనుండి తప్పించుకోవ డానికి, ఉద్యమాన్ని రహస్యంగా సాగించడం ఉత్తమమని తరు వాత వచ్చిన సత్యాగ్రహ దళముల వారున్నూ, జైళ్ళనుండి ముందుగా విడుదల చేయబడ్డ వారున్నూ తలంచారు. ఇది మేము సిగ్గుపడుతూ నైనా ఒప్పుకోక తప్పదు. కాంగ్రెసు అశా స్త్రీయ సంస్థగా ప్రకటించ బడినప్పుడు, కలకత్తాలోనూ, ఢిల్లీ లోనూ కాంగ్రెసు మహాసభలను జరిపేటందుకు ప్రతినిధులుగా పోయినవారు పట్టుబడకుండా ఉండడానికి, విదేశీ బట్టలలో ప్రయాణం చేయడం విపరీతంగా కనిపించలేదా రోజులలో. ఉద్యమానికి సంబంధించిన సాహిత్యాన్ని రహస్యంగా పంచి పెట్టడం, టైపు రైటర్లు, సైక్లోస్టైలు మెషీనులు రహస్యంగా పని చేయడం, ఛాయా కార్యనిర్వాహకులు, నామమాత్ర నియం తలు యేర్పాటు కావడం- ఇవన్నీ ఉద్యమ ప్రతిష్ఠను తగ్గించి దాని నొక "పాతాళ హోమం" గా తయారు చేసినవి. గాంధీకి ఈ సంగతి అంతా తెలిసి, ఈ పద్ధతులను నిరసిస్తూ 1934 లో ఉద్యమాన్నే ఆపివేశాడు. అనేకసార్లు డబ్బు దాచి

పెట్టాలని ప్రయత్నాలు చేశారు. గాంధీ ఇదికూడా మేమీ బాగా లేదన్నాడు. మన శరీరం, మన ఆస్తి, మన స్వేచ్ఛ, మన సర్వస్వమూ కూడా శత్రువుకు ధారపోయడం లోనే సత్యాగ్రహ మూలతత్వ మంతా ఉందనీ, అంతకు తప్ప మేదో విధంగా వాటిని దాచుకోవడం సరియైన పద్ధతి గాదనీ నిక్కచ్చిగా చెప్పాడాయన. రహస్యం అనేది, భయమనే మాటకు, అసత్యమనే మాటకూ పర్యాయపద మన్నాడు గ్రెగ్. అహింస ఆంతరంగిక నిర్మలత్వమునకు, అంతర్దృష్టికీ అవకాశం కలిగిస్తుంది. అందువల్లనే గాంధీ కాంగ్రెసులో- ముఖ్యంగా మంత్రిత్వాలు పుచ్చుకొన్న తరువాత సభ్యులను చేర్పించడం లోనూ కాంగ్రెసు ఎన్నికల లోనూ జరిగే అకృత్యములను, విసుగూ విరామం లేకుండా ఖండిస్తూ వచ్చాడు. మా యిల్లు మేము బాగుచేసుకోవడానికి కావించుకొన్న ప్రకటనలను ఆధారంగా చేసుకొని, మా శత్రువులు మాపైన రాళ్లు విసరడానికి కూడా సావకాశం కలిగింది. అందువలన మా తప్పులను దిద్దుకోవడానికి మేము ప్రయత్నించ కుండజాలము. ప్రపంచంలో ఏ నాయకుడైనా తన సంస్థలోని అకృత్యాలను బహిరంగంగా వెల్లడించడం కానీ, ఏ రాజకీయ సంస్థ యైనా తమ మంత్రులు చేసిన తప్పులను బహిరంగంగా విచారించడం గానీ జరిగిందా? అటువంటి సంస్థనూ నాయకుణ్ని మీ రెప్పుడైనా చూచారా? బయటి ప్రపంచాన్ని మమ్ములను గౌరవించక తీరని స్థితిలో పెట్టడమే అహింసలో ఉన్న చాతుర్యం, అవినీతి, సంస్థ ప్రతిష్ఠను తగ్గించి విజయాన్ని దూరం చేస్తుంది. అందువల్లనే, గాంధీ

1940 లో ప్రారంభించిన సత్యాగ్రహోద్యమం, 1932 లోని ఉద్యమం కంటె విలక్షణంగా ఉంది. 1940 లో తాను ఇద్దరు సత్యాగ్రహులను మాత్రమే జైలుకు పంపుతూన్నానని మొట్టమొదటగా రాజప్రతినిధికి తెలియపఱిచాడు. తరువాత తన ఉపవాస వ్రతాన్ని తాత్కాలికంగా విరమించిన తరువాత, వ్యక్తి సత్యాగ్రహోద్యమాన్ని విస్తీర్ణం చేయ దలచుకొని, ఆ సంగతి తిరిగీ రాజప్రతినిధికి తెలియచేశాడు. ఆయన కాంగ్రెసులోని తన అనుచరుల కిచ్చిన సూచనలను మఱొకచోట పూర్తిగా ఉదాహరించి ఉన్నాము.

ఇంతా అయితే సత్యాగ్రహ పరిణామదశలో మే మిప్పటికీ ఓనమాల దగ్గరే ఉన్నామని ఒప్పుకొని తీరాలి. ఆ ఉద్యమం ఇంకా అపరిణతం గానూ అపూర్ణం గానూ ఉన్నప్పుడు, దానిని పరిశీలన చేయ పూనుకోవడం చాలా కష్టమైన పనీ, సున్నితమైన విషయమూ కూడాను. ముఖ్యంగా దాని అద్భుత శక్తిలో విశ్వాసం కలిగినవారు, దాని ప్రత్యర్థులకు అవహేళన పాత్రులు గానూ ద్వేషభాజనులు గానూ అవుతూ ఉన్నప్పుడు, ఆ పని మఱింత కష్ట మనిపిస్తుంది. అన్ని మహోద్యమాలూ అటువంటి దశలను కడచినవే. ఉద్దేశ పూర్వకంగా గానీ అజాగ్రత్త వలన గానీ, అసలు ఉద్యమాలను కృత్రిమోద్యమాలతో పోల్చి, కొందఱు విమర్శిస్తారు. మఱికొందఱు ఉద్యమ ప్రారంభ దశలోని వంకరలను తరువాత కూడా ఆపాదించి వెక్కిరిస్తారు. వజ్రాన్ని పరిశీలించి, దాని గుణాలనుబట్టి అది బాగేనని నిర్ణయించిన ట్లుంటుం దీవిషయం. సత్యాగ్రహాన్ని కూడా ఇలాగే

ఒక్కొక్కప్పుడు సాత్విక నిరోధంతో సమానం చేసి మాట్లాడు తూంటారు. కాని ఈ రెండు ఉద్యమాలకూ చాలా భేదముంది. వజ్రపు మణిలోని నిగ్గులకూ, ప్రకృతి శాస్త్రజ్ఞుని పరిశోధనాలయం లోని నల్లని వజ్ర పదార్థం మసిబొగ్గుకూ- యెంత భేద మున్నదో అంత భేదమున్నది. కాదు, అంతకంటెనూ యెక్కువ భేదమున్నది. సాత్విక నిరోధ సత్యాగ్రహాలు రెండూ పరస్పర విరుద్ధ లక్షణాలను ప్రదర్శిస్తవి. సత్యాగ్రహోద్యమ మూల పురుషుడు బుద్ధిపూర్వకంగా, తన ఉద్యమం సాత్విక నిరోధమును పోలి ఉండవలెనని తలంచక పోయినప్పటికీ, ఆయన తన ఉద్యమం ప్రారంభించే ముందు 1917 లో బెసెంటు నిర్బంధింప బడినప్పుడు, అటువంటి చిన్నెలు కొన్ని కనిపించినయి. గాంధీ, కాంగ్రెసు రంగంలోకి వచ్చిన తరువాత కొంత కాలానికి, సత్యాగ్రహ మనగా సాత్విక నిరోధ పునరుద్ధరణం కాదనీ, అది మఱియొక విశిష్టోద్యమ మనీ అర్థమవుతుంది. సాత్విక నిరోధంలో కసి, గర్వం, కొంత ద్వేషం, దౌర్జన్యం- అన్నీ ఇమిడి ఉండేవి. సహాయ నిరాకరణంలో, ప్రజల తీవ్రత, ఆవేగం, ప్రభుత్వంమీద కోపం, కొట్టాలని కోరిక, కొట్టేటందు కశక్తి - ఇవన్నీ కనిపించేవి. సివిల్ డిజోబిడియన్సు లోని నామ వాచకానికి ప్రాధాన్య మీయబడి విశేషణం విడిచివేయ బడేది. తరువాతి పరిణామదశలో విశేషణంలోని విశేషం గ్రహించ బడడం చేత, సత్యాగ్రహానికి మార్గ మేర్పడింది. కొద్ది కాలంలోనే సత్యాగ్రహానికి సత్యాహింసలు పునాదులనీ, అహింస కేవలం ప్రతిషేధాత్మక మైనది కాక క్రియారూపక శక్తి అనీ, "ఇతరు

లను దహించక తన్ను తాను దహించుకో గలిగిన ప్రేమతత్వాని" కది సరిపోలుతుందనీ అర్థం చేసుకొన్నాము. కాబట్టే చౌరీ చౌరా సంఘటనం జరుగగానే ఒక్క గోరఖ్ పూరు జిల్లాయే గాక, భారతదేశ మంతా శిక్షింపబడ తగినంత ఘోర కృత్యం జరిగినట్లుగా భావింప బడింది. ఈ విధంగా సత్యాగ్రహం కేవలం భౌతిక శక్తియే గాక, చాలా త్యాగం చేయవలసిన నైతికశక్తి ఆధ్యాత్మిక శక్తీ కూడా నని గ్రహించాము. సత్యాగ్రహంలో చైతన్యం ఉంది. పరాక్రమం ఉంది. ప్రచండ శక్తి ఉంది. జలియన్‌వాలాబాగు హత్యాకాండలో నుండి ఉద్భవించిన సత్యాగ్రహం, చౌరీచౌరా హత్యలతో తనంతట తానే భస్మీపటలమై పోయింది. సత్యాగ్రహి అప్పటినుండీ నూతన భావ ప్రపంచంలో ప్రవేశించాడు. అక్కడ ద్వేష దోషాలకూ భయ, భీరుత్వాలకూ, క్రోధ ప్రత్యపకార చింతలకూ బదులుగా, ప్రేమ, పవిత్రత, ధైర్యము, బాధాసహిష్ణుత, సహనం, క్షమా ఉంటవి; ఐశ్వర్యానికి గౌరవం పోయి సేవకు స్థానం వస్తుంది; శత్రువును ఓడించడం కాక సరిచేయడం ముఖ్య మవుతుంది. ప్రతి సత్యాగ్రహి కూడా అన్ని భయాలనూ - మనిషి భయం, ప్రభుత్వ భయం, సంఘభయం, దరిద్ర భయం, మృత్యుభయం- వీటి నన్నిటినీ కూడా వదిలించి వెయ్యాలి. ఇవి మనిషిని యెప్పుడూ చుట్టుకొని ఉంటయి. గర్వం భయానికి కారణ మవుతుంది. వినయం ధైర్యాన్ని విజృంభింప చేస్తుంది. కాబట్టి గర్వంతో కాక వినయంతో ఆత్మ సమర్పణమునకు శిక్షణ పొందాలి. దానికి సహాయ నిరాకరణం క్రమవిధానం గానూ

సాధన గానూ పనికి వస్తుంది. కాబట్టి సత్యాగ్రహోద్యమ విధాత ఒక్కసారిగా ఆనాటి కలుషిత రాజకీయాలను సంస్కరించి ఔన్నత్య దశకు తీసికొని వెళ్ళినాడు. మనం సత్యము నందు పట్టుదల గలిగి, భావోద్వేగాలను అరికట్టి, పవిత్ర వంతులంగా ప్రవర్తించ గలిగినప్పుడు, మనలో వినయ సేవా భావాలు వికసిస్తయి. ఒక్కసారి కోపాన్ని అణచుకొని, సహనాన్ని అలవాటు చేసుకొంటే, మానవ వ్యవహార నిర్వహణంలో అహింస ఆధిపత్యం వహిస్తుంది. సత్యాగ్రహ వృక్షానికి వేరు తృప్తి; సంఘత్యాగం చేసే సన్యాసం కాక కోరికలనూ భావోద్వేగాలనూ పరిమితిలో ఉంచుకో గలిగిన భోగ విముఖత- ప్రపంచాన్ని విడచిపెట్టడం కాక మానవ సేవలో త్యాగబుద్ధి కలిగి ఉండడం. ఈ నూతనోపదేశం కావలసినంత శక్తిని విజృంభింప చేస్తూన్నది. అంతేకాక శత్రువుతో మనం సహాయ నిరాకరణం చేస్తూన్నప్పటికీ, అతని సాహచర్యం అవసరమని ఆదేశిస్తూన్నది. ఈ శక్తిని పేదల సేవకు వినియోగించ వలెననే ఉద్దేశంతో సత్యాగ్రహి ముఖ్యంగా నూలు వడకవలె ననే నియమం యేర్పాటు చేయబడింది. ఇది పేదలయందు మనకు గల స్నేహాను రక్తికి పవిత్ర చిహ్నంగా భావింప బడుతూన్నది. ఇందుకు మనస్సు శరీరాన్ని స్వాధీన పఱచుకోగలిగి ఉండాలి. ఆత్మ, మనశ్శరీరాలను రెంటినీ సరియైన మార్గంలో పెట్టగలిగి ఉండాలి. అప్పుడు బుద్ధి కూడదన్న దానిని దేనినీ శరీరం వాంఛించదు. భావం పనికిరాదన్న దానిపైకి ఆలోచన పోనే పోదు. ఈ ఫలితాలను పొందడానికి నిగ్రహాంకంటె ఉత్తమ

మార్గం లేదు. మనో వాక్కుల విషయంలో మౌనమును, ఆహార విహారముల విషయంలో ఉపవాసమును, భావోద్వేగాల విషయంలో బ్రహ్మచర్యమును నిగ్రహమని చెప్పవలెను.

మౌనం

ఈ ఒక్కొక్క శీర్షిక కింద మనం సత్యాగ్రహ శాస్త్రాన్ని పరిశీలింతము గాక. గాంధీ మాట్లాడుతూ ఉన్నప్పటి కంటే మౌనం వహించినప్పుడు, కాంగ్రెసుకు లోపల ఉన్నప్పటి కంటె వెలుపల ఉన్నప్పుడు, మన ఎదుట ఉన్నప్పటికంటె జైలులో ఉన్నప్పుడు, ఎక్కువ ప్రోత్సాహ ఫలితంతో ఎక్కువ ప్రయోజనకరంగా పని చేస్తాడు. కాన్పూరు కాంగ్రెసు (1925 డిశంబరు) తరువాత ఒక సంవత్సరం ఆయన రాజకీయ మౌనం అవలంబించాడు. ఈ మౌన కాలాలలో ఆయన, మనస్సులో పెద్దపెద్ద ప్రణాళికలను ధ్యానం చేస్తాడు. కాలక్రమేణా అవి పరిణతములై సమగ్ర కార్యక్రమాలుగా వెలువడతయి. మౌనవ్రతం వెటకారంగా ఉంటుందనీ, ఉపవాసం శరీరాన్ని కృశింప చేస్తుందనీ, బ్రహ్మచర్యం సాధ్యంకాని పని అనీ ఎవరో కొందఱు అనేక విధాలుగా అపహాస్యం చేస్తూన్నారంటే ఆశ్చర్య పడవలసిన పని లేదు. అన్ని మహోద్యమాలనూ ప్రారంభ దశలో అలాగే అవహేళనం చేశారు. అట్టి వెక్కిరింపులను, నిందలను, తిట్లనూ కూడా లెక్కపెట్టకుండా జీవించి, మానవాభ్యుదయమునకు తోడ్పడే ఆదర్శాల నవి పునరుజ్జీవింప చేసినయి.

మౌన వ్రతం శిక్షణగా, పుష్టిదాయకంగా, భావ ప్రేరకంగా ఎలా పనిచేస్తుందో గాంధీ వ్రాసిన మాటలనే ఈ దిగువ ఉదాహరిస్తున్నాము.

> నేనింక నిరంతర మౌనవ్రతావలంబినని చెప్పగలను. కొంతకాలం కిందటనే నేను రెండు నెలలవరకూ పూర్తిగా మౌనంలో ఉన్నాను. ఆ మౌనం యొక్క వశీకరణ శక్తినుండి నేనింకా బయటపడలేను. ఈ రోజులలో, సాయంకాలం ప్రార్థనా సమయంలో నేను మౌన మవలంబించి, రెండు గంటలకు నన్ను చూడవచ్చిన వారికోసం విడిచిపెడుతూన్నాను. ఈ నాడు మీరు వచ్చినప్పుడే విడిచి పెట్టాను. అది నాకు శారీరకం గానూ ఆధ్యాత్మికం గానూ కూడా అవసర మయింది. మొట్టమొదట వతిడి తప్పించుకోవడానికిది ప్రారంభించాను. అప్పుడు నాకు వ్రాసుకోవడాని కవకాశం కావలసి వచ్చింది. కాని కొంతకాలం దానిని నే నభ్యాసం చేసిన తరువాత, దానిలోని ఆధ్యాత్మిక గుణాన్ని అర్థం చేసుకొన్నాను. దేవునితో సంధానం కలిగించుకోవడాని కదే అత్యుత్తమ సమయమని నా మనసు కకస్మాత్తుగా తట్టింది. మౌనానికి తగిన సహజ లక్షణాలు నాదగ్గర ఉన్నట్లుగా నే నిప్పుడు భావిస్తున్నాను.

గాంధీ చిరకాలము కిందటనే అంతర్వాణిని అనుసరించవలెనని తెలుసుకొన్నాడు. దక్షిణ ఆఫ్రికాలోని ఒక ట్రాపిస్టు మఠమునుండి ఈ సంగతి నేర్చుకొన్నాడు. ఆ మఠంలోని వారు చాలామంది "మనలో నిరంతరమూ నెమ్మదిగా మాట్లాడుతూన్న చిన్ని గొంతును మనం వినదలచుకొన్నట్లయితే, మనమే ఎప్పుడూ మాట్లాడుతూంటే దానిని వినలేము" అనే నమ్మకం గలిగిన మౌన వ్రతావలంబకులు కాబట్టి "సత్యాన్వేషి

మౌనంగా ఉండాలి" అని ఆయన సిద్ధాంతీకరించాడు. ఆ అమూల్య పాఠాన్ని ఆయన గ్రహించి మౌన వ్రతంలోని రహస్యాన్ని గుర్తించాడు. ఐహికాధికార రక్షణకింద వచ్చిన క్రైస్తవ మత ప్రచారకునికి "గ్రహించే సహనము, వినయము, ప్రజా సామాన్యంతో కలసి మెలసి ఉండాలనే కోరిక"- ఇవి కలుగవు.

సత్యాగ్రహ శాస్త్రంలో మౌనం, ఉపవాసం, బ్రహ్మచర్యం, ఈ మూడు భౌతిక విషయాలు, అనిర్వచనీయములైన ఆధ్యాత్మిక ఫలములను ఇంకనూ ఫలింపచేస్తూనే ఉన్నవి. అయితే సత్యాగ్రహి ప్రవర్తనమునకు కొలికిపూస అయిన ఆత్మోన్నతిని కూడా కలిగిస్తున్నవవి.

శాస్త్ర దృష్టితోనూ ఆధ్యాత్మిక దృష్టితోనే కాక, అవసరాన్ని బట్టి కూడా ముఖ్యంగా ఈ తరుణంలో అహింసా సిద్ధాంతాలను అవలంబించ వలసిన అగత్య మున్నది. జీవహింస చేయడానికీ, ఖడ్గబలం మీద ఆధారపడి ఉండడానికీ ఇష్టపడక పోవడంలో, క్రైస్తు బోధలలోని క్షమాగుణం కొంతవరకైనా అవలంబించినట్లు అర్థమౌతుంది.

డాక్టర్ ఉడ్ ఇలా అన్నాడు :

బ్రిటిష్‌వారు చేసిన షనులల్లో క్షమించ వలసినవి చాలా ఉన్నయి. సామ్రాజ్యతత్వం భారత ప్రజల యొక్కయు బ్రిటిష్‌ప్రజల యొక్కయు బాంధవ్యాన్ని విషపూరితంగా చేసింది. బహుశా పూర్తిగా విడాకులు పుచ్చుకొంటేనే తప్ప ఈ విషం పోదు. తాను కోరుకొన్న నాయకుల

కింద ఇండియా తన మోక్షం తాను చూచుకోవడానికి తగిన తరుణం తటస్థించింది. మనం నిజంగా ఇండియాను యెడబాయవలసే వస్తే క్షమా సహన భావాలతోనే ఎందుకు యెడబాయ కూడదు?

అటువంటి యెడబాటు, ఉభయ జాతులకూ గౌరవప్రదంగా ఉండే షరతులతో ఇరువురూ తిరిగి కలియడానికి తోడ్పడడమే గాక, మానవాభ్యుదయ సిద్ధాంతాలతో "ప్రపంచ సమష్టి సౌభాగ్య సంస్థను" (World commonwealth of Nations) స్థాపించడానికి సాధన మవుతుంది.

మఱచి పోవడం, క్షమించడం అనే ఉత్తమ గుణాలు, ఆటల లోనూ దావాలలోనే గాక, సంఘం లోనూ గృహకృత్యాల లోనూ కూడా అవసరం. కాబట్టి సత్యాగ్రహంలో అవి అగ్ర స్థానం వహించవలె ననడంలో అభ్యంతర మేముంది? కోప మెన్ని వ్యాఘాతాలకో, ఎన్ని వైకల్యాలకో కారణ మవుతుందని ఇదివరకే చెప్పి ఉన్నాము. దానికి క్షమా గుణమే తగిన మందు.

గాంధీ ఇలా అన్నాడు :

> అహింసావలంబకుని నిఘంటులో బాహ్య శత్రువు అనే మాటలేదు. కాని శత్రువుగా తలంపబడే వానినిగూర్చి కూడా ఆయనకు జాలి తప్ప మఱొకటి ఉండదు. అతడు ఏమనిషీ బుద్ధి పూర్వకంగా దుర్మార్గుడుగా ఉంటాడని నమ్మడు. మంచి చెడ్డలు తెలుసుకొనే శక్తిలేని మానవు డుండడనీ, ఆ శక్తిని పూర్తిగా పెంపొందిస్తే అది అహింసగా పరిణతి పొందుతుందనీ ఆయన తలంపు. కాబట్టి శత్రు వనబడే వానికి తగిన వివేకాన్ని ప్రసాదించి దీవించ వలసిందని, ఆయన భగవంతుణ్ణి ప్రార్థి

స్తాడు. తనలోని జాలి సెలయేటి తరగలు ఎడతెగకుండా జాలువారవలె ననీ, తన నైతిక బలం మృత్యువును నిర్భయంగా ఎదుర్కొన గలిగేటంత వఱకూ దినదిన ప్రవర్ధమానం కావలెననీ, తనను గూర్చి తాను కోరుకుంటూ ఉంటాడు.

గాంధీ మఱొకచోట :

"సహనం బలవంతుల శుభలక్షణ" మన్నాడు.

అధ్యాయము ౬

ఉపవాసాలు

౧

సత్యాగ్రహ శాస్త్రంలోనూ, సత్యాగ్రహి జీవిత చరిత్ర లోనూ ఉపవాసములకూ ఉపవాస వ్రతములకూ ఈయబడిన విలువ కొంత వింతగా కనిపిస్తుంది. ఇంగ్లీషు చదువుకొన్న వాళ్ళకు ఉపవాసం అంటే దాదాపు వెక్కిరింపుగా ఉంటుంది. కాని హిందువులకు పండుగలూ విందులూ కూడా ఉపవాస మును ప్రోత్సహిస్తూ ఉంటాయి. హిందూ దేశీయునికి విందులంటే దాదాపు ఆలస్యంగా భోజనం చేయడమని అర్థం. పండుగలలో జరుగవలసిన వ్రతానుష్ఠానాలూ, పూజా పురస్కారాలూ పూర్తి అయ్యేసరికి దాదాపు ఉపవాస వ్రతంగానే పరిణ మిస్తుంది. భారతీయులు- హిందూ మహమ్మదీయ క్రైస్తవులు, తమ పండుగుల యెడల చూపే శ్రద్ధా భక్తులు, ఇట్టి ఉపవాస ముల వల్ల మఱింత అతిశయిస్తూ ఉన్నవి.

గాంధీ మొట్టమొదటి సారి 1919 లో, రౌలట్టు శాసనాందోళన సందర్భంలో, సత్యాగ్రహ ప్రారంభానికి ముందుగా, ఈ ఉపవాస వ్రతాన్ని ప్రజలకు ఆదేశించాడు. ఉపవాస వ్రతములలో ఆయనకు కల విశ్వాసాన్ని తెలియచేసేటందు కాయన వ్రాతలలో నుండి మూడు ఉదాహరణాల నీ దిగువ యిస్తూ న్నాము :

౧ ఉపవాస వ్రతము కృతయుగం నాటినుండీ వస్తూన్నది. అది ఆత్మ పరి శుద్ధత కోసము గానీ లేక మంచికోసమో చెడ్డకోసమో యేదో ఒక

ప్రయోజనం కోసం గానీ అవలంబించ బడుతూన్నది. బుద్ధుడు, జీసస్, మొహామ్మదులు దేవుణ్ణి ముఖాముఖి దర్శించ వలెనని ఉపవసించారు. రామచంద్రుడు తన వానర సైన్యానికి దారి నీయ వలసిందని సముద్రుని గూర్చి ఉపవసించాడు. పార్వతి మహాదేవుణ్ణి తనకు ప్రభువు గానూ పతి గానూ కోరి ఉపవసించింది. నేను వారి కోరికల కంటె తక్కువ కోరికలతో ఆ మహా మహుల మార్గాల ననుసరించి ఉపవాస వ్రతము నవలంబిస్తూన్నాను.

* * *

2 సత్యాహింసలతో పాటు తనకు దేవుడు తగిన బల మిస్తాడనే విశ్వాసం కూడా సత్యాగ్రహికి ఉండాలి. తన ఉపవాసంలో ఏమాత్రం కళంకం ఉన్నా వెంటనే దాని నతడు సందేహించకుండా విడచిపెట్టాలి. అనంత మైన ఓర్పు, గట్టి పట్టుదల, ఏకాగ్ర చిత్తం, సంపూర్ణ శాంతి, అక్రోధం- ఇవన్నీ అతనికి ఉండి తీరాలి. ఈ అన్ని సుగుణాలూ, ఆకస్మికంగా ఒక్కసారి రావడమంటే అసంభవం గనుక, అహింసయందు శ్రద్ధ పూననివారెవరూ సత్యాగ్రహోపవాసములను సాగించ కూడదు.

* * *

3 ఆత్మ పరిశుద్ధత కోసం నేను చాలా చిన్న వయస్సులోనే ఉపవాసాలు ప్రారంభించానన్న విషయం ప్రజలు తెలుసుకొందురు గాక. నా కొడుకు చేసిన తప్పిదాలకు నేను దీర్ఘోపవాస వ్రత మవలంబించాను. తరువాత నా అత్యంత ప్రియమిత్రుని కూతురు చేసిన తప్పిదమునకు వెంటనే మరి యొక దీర్ఘోపవాసం చేశాను. ఈ రెండు సందర్భాలలో కలిగిన ఫలి తాలూ కూడా ఉపవాసాల ఉత్కృష్టతను స్పష్టం చేసినయి. దక్షిణ ఆఫ్రికా సత్యాగ్రహ పోరాటంలో పాల్గొన్న కూలీల కష్ట నివారణార్థం, నేను మొదటిసారి ఆ దేశంలోనే బహిరంగోపవాస వ్రతానికి పూను కొన్నాను. నేను చేసిన ఉపవాసాలలో ఒక్కటి కూడా నిష్ప్రయోజనమై

పోయినట్లు నాకు జ్ఞాపకం లేదు. పైపెచ్చు నేను అమూల్యమైన శాంతినీ, అనంతమైన ఆనందాన్నీ, ఆ ఉపవాసాలన్నిటిలోనూ అనుభవించాను. దైవ ప్రేరిత గాని ఉపవాసం, ఉపయోగం లేని ఉత్త లంకణమో అంతకంటెనూ అధమమో అని చెప్పాలి.

పూర్వోపవాసములను గూర్చిన ఈ అభిప్రాయాలు తరువాత, యుద్ధకాలంలో (1940 ఆగస్టు, డిశంబరుల మధ్య) గాంధీ ప్రారంభించవచ్చునని తలపబడిన ఉపవాసమును గూర్చి ఆయన 1940 నవంబరు 7 వ తేదీని హరిజన్‌లో వ్రాసిన వ్రాతలను పరిశీలిద్దాం.

నేను నా జీవితంలో మఱియొకసారి ఉపవాసవ్రత మవలంబించవచ్చుననీ అది నేననుకొన్నదానికంటె ముందుగానే తటస్థించవచ్చుననీ వర్కింగు కమిటీలో నా మిత్రులకిటీవలనే సూచించి ఉన్నాను. కాని నాకు జ్ఞాపకమున్నంత వరకు, నేను ముందుగా ఆలోచించి దిగిన బహిరంగోపవాస మొక్కటి కూడా లేదు. నా ఉపవాసాలన్నీ దేవుని వరాలవలె అప్పటి కప్పుడు తటస్థించినవే. వాటన్నింటికీ తప్పనిసరిగా మంచి ఫలితాలు కలిగినయి. ఎప్పుడూ వాటినిగూర్చి నేను పశ్చాత్తాప పడ్డ క్షణం లేదు. దేవుడు నా కోసం మఱియొక ఉపవాసాన్ని నిర్దేశించి నట్లయితే అది తప్పకుండా మంచి ఫలితాన్నే చేకూరుస్తుంది. అన్ని విషయాలలోనూ అతని కోరికే సిద్ధిస్తుంది.

భారత భూమిలో గాంధీ ప్రారంభించిన బహిరంగోపవాసాలలో, 1918 అక్టోబరులో జరిగిన అహమ్మదాబాదు మిల్లు కూలీల సమ్మె సందర్భంలోది మొట్టమొదటిది. గాంధీ తన స్వీయ చరిత్రలో దానిని గూర్చి ఇలా వ్రాస్తూన్నాడు:

నేను చాలా మొగమాటు పరిస్థితులలో పడిపోయినాను. మిల్లు కూలీల వాదం బలమైనది. అంబాలాల్ శరభాయి మిల్లు యజమానుల పక్షం వహించాడు. ఆయన సోదరి అనసూయా బేన్ ఆయన కెదురు పక్షంలో పోరాడవలసి వచ్చింది. నాకూ వారికీ స్నేహం. అందువల్ల పోరాటం సాగించడం మరీ కష్టమై పోయింది. వారితో ఆలోచనలు ప్రారంభించి మధ్యవర్తి తీర్పుకు ఒప్పుకోవలసిందని వారిని ప్రార్థించాను. కాని వారా సిద్ధాంతాన్నే అంగీకరించలేదు.

కాబట్టి గాంధీ, కూలీలను సమ్మె కట్టవలసిందని సలహా యిచ్చాడు. పూర్తిగా దౌర్జన్య రహితంగా ఉండి, గట్టిగా నిలబడేటట్లు వారికడ నుండి ప్రమాణాలు తీసుకొన్నాడు.

కాని చిట్టచివరకు వారు తడబడుతూన్న చిహ్నాలు కనిపించినయి. సమ్మె చల్లబడుతూన్న కొద్దీ పనిలోకి పోయే కూలీల యెడల సమ్మెదారుల వైఖరి మరింత భయంకరంగా ఉంటూ వచ్చింది.... చివరకు సమ్మెదారు లెక్కడివా రక్కడ జారిపోతూన్నట్లుగా వార్త తెలిసింది. అప్పుడు నేను చాలా చీకాకు పడ్డాను. ఆ పరిస్థితులలో నే నవలంబించవలసిన ధర్మ మేమిటన్ని తీవ్రంగా ఆలోచించాను.

గాంధీ ఆ చరిత్ర ప్రసిద్ధమైన ఉపవాస వ్రతాన్ని అవలంబించిం దప్పుడే.

అప్పటికింకా నాకేమీ దారి దొరకక తప్పుళ్ళాడుకొంటూన్నాను. ఆ ఉదయాన మిల్లు కూలీల సమావేశంలో ఆకస్మికంగా నాకు వెలుతురు కనిపించినట్లయింది. "కూలీలంతా సమావేశమై సంధి కుదిరేటంత వరకూ సమ్మె సాగించకైనా సాగించాలి, లేదా నాగు పూర్తిగా మిల్లులను విడచిపెట్టకైనా విడిచిపెట్టాలి. ఈ రెంటిలో ఏదో ఒకటి జరిగేవరకూ నేను అన్నం ముట్టను" అనే వాక్యాలు అనుకోకుండా తమంతట తాము

నా పెదవులనుండి వెలువడినయి. అనసూయాబేను చెక్కిళ్ళనుండి కన్నీరు కార ప్రారంభించింది.
కూలీలు కూడా దుఃఖంతో "మీరు కాదు మేము ఉపవాసం చేయాలి. మీ రుపవాసం చేయడం ఘోరం. మా తప్పు క్షమించండి. చిట్టచివర వరకు మేము చేసిన ప్రమాణానికి కట్టుబడి ఉంటాం" అన్నారు.
అక్కడి పరిసరాలన్నీ సుహృద్వాతావరణంతో నిండి పోవడమే దాని పర్యవసానం. మిల్లు యజమానుల హృదయాలు కరిగినవి. వారు రాజీ ఉపాయాలను ఆలోచించడం ప్రారంభించారు. వారి ఆలోచనలకు అనసూయాబేను గృహమే ఆస్పదమయింది. ఆనంద శంకర ధ్రువుడు జోక్యం కల్పించుకోగా, ఆయన మధ్యవర్తిగా నియోగింప బడ్డాడు. నేను మూడురోజులే ఉపవాస మున్నది. తరువాత సమ్మె ముగిసింది. ఈ విధంగా 21 రోజులు సమ్మె జరిగిన తరువాత రాజీ కుదిరింది.

కార్మికోద్యమంలో గాంధీకి కలిగిన విజయాలు కానీ ఆయన చేసుకొన్న రాజీలు కానీ ఎటువంటి వైనప్పటికీ, కూలీ సంఘాలను గూర్చి ఆయన అభిప్రాయాలకు తక్కిన రాజకీయ, కార్మిక నాయకుల అభిప్రాయాలకూ చాలా భేదమున్నది. అహమ్మదాబాదు మిల్లు కూలీల కాయన (1940 డిశంబరు 4 వ తేదీన) మఱి ఇటీవల యిచ్చిన సందేశ మిది :

> నాకు మీతో సన్నిహిత సంబంధం కలిగినప్పటి నుండీ మీ మోక్షం మీ చేతులలోనే ఉందన్నే మాట నచ్చచెప్పడానికి ప్రయత్నించాను. పనికి యిచ్చే పైకం ఖరీదుకంటె పనివిలువ ఎన్నోరెట్లెక్కువ. మీ కోరికను బట్టి మీ విలువను మీరు పెంచుకోనూ వచ్చు తగ్గించుకోనూ వచ్చు. అయితే మీ పనికి కట్టిన మూల్యానకు మీరు సంతృప్తి పడ్డట్లయితే, మీ విలువకు మీరే పరిమితి నేర్పాటు చేసుకొంటూన్నారన్నమాట.

ఇక జరిగిన ఇరవై సంవత్సరాలలో నిర్వహించబడిన అనేక ఉపవాసములలో కొన్నిటిని గూర్చి మాత్రం పరిశీలిద్దాం. "బ్లాకు బిల్" అని పిలువబడ్డ రౌలట్టు చట్టానికి వ్యతిరేకంగా అసమ్మతిని చూపిస్తూ 1919 ఏప్రిల్ 6 వ తేదీని అఖిల భారత దేశంతో చేసిన బహిరంగోపవాసం ఆ తెగలో మొట్టమొదటిది.

తరువాత చౌరీచౌరాలో జరిగిన అపరాధానికి ప్రాయశ్చిత్తంగా 1922 ఫిబ్రవరి నెలలో గాంధీ అయిదురోజులు ఉపవాసం చేశాడు.

ఆ సందర్భంలో ఆయన ఇలా వ్రాశాడు:

నేను ఆత్మ పరిశుద్ధత పొందాలి. నాకు చుట్టూ ఉన్న నైతిక వాతావరణంలో యేమాత్రం మార్పు కలిగినా తెలుసుకో గలిగినంత సున్నిత పరికరంగా ఉండాలి నేను.— నా ప్రార్థనలు పైకి కనబడేటంతకంటె కూడా ఎక్కువ వినయవంతములుగానూ యెక్కువ సత్యభూయిష్టములుగానూ ఉండాలి. మానసిక సహకారంతో కూడిన ఉపవాసంకంటె నాకు సహాయం చేయగలిగినదీ పవిత్రవంతమైనదీ మఱియొకటి లేదు. శరీరంపైన ఆత్మ ఆధిపత్యాన్ని వహించేటందుకున్నూ మనోభావాన్ని ఎక్కువగా ప్రదర్శించేటందుకున్నూ చేయబడే ఉపవాసం, మనిషియొక్క పరివర్తనానికి అత్యంతం తోడ్పడుతుంది కాబట్టి బాగా ఆలోచించి అయిదురోజుల ఉపవాసం నాపైన నేను విధించుకొంటూన్నాను.

ఉపవాస ప్రాయశ్చిత్తములు సాధ్యమైనంత వరకు రహస్యంగా జరగాలి. కాని నా ఉపవాసం, ప్రాయశ్చిత్తమూ శిక్షా కూడా అవడంచేత బహిరంగం చేయవలసి వచ్చింది. అది నాకు ప్రాయశ్చిత్తము, నే నెవరి సేవ చేయదలచు కొన్నానో, యెవరికోసం నేను జీవించ కోరుతూన్నానో,

యెవరికోసం చావడానికి కూడా యిష్టపడతానో వారికి శిక్ష. వారికి కాంగ్రెసుతో సంబంధం లేకపోయినా, కాంగ్రెసుపైన సానుభూతి పరులుగా, కాంగ్రెసు నియమాల కనుద్దేశ పూర్వకమైన కళంకం కలిగించారు. తమ దేశీయుల సోదరులూ అయిన పోలీసులను- బహుశా నా పేరును ఉచ్చరిస్తూ- నటికి-ఉంటారు వారు. కేవలం తాను బాధపడడం వలననే ప్రేమ, తప్పు చేసినవారిని శిక్షిస్తుంది. వారు కాంగ్రెసును ఉల్లంఘించి నందువల్లనే నేనీ బాధను తెచ్చిపెట్టుకొన్నానని వారెఱుంగుదురు గాక.

దేశం హిందూ ముస్లిము కొట్లాటలతో అట్టుడికిన ట్లుడికి పోతూన్న సమయాన, గాంధీ హిందూ మహమ్మదీయ సఖ్యత కోసం మహోత్కృష్టమైన తపస్సు చేశాడు. 1924 సెప్టెంబరు 18 వ తేదీని 21 రోజుల ఉపవాస వ్రతాన్ని ప్రకటిస్తూ గాంధీ ఈ రీతిగా అన్నాడు.

ఇటీవల జరిగిన సంఘటనలను నేను భరించలేకుండా ఉన్నాను. మనం తొలగించలేని ఆపత్తు వచ్చినప్పుడు, ఉపవాసం చేసి దేవుణ్ణి ప్రార్థించవలసిందని నా మతం నాకు బోధిస్తూన్నది. నా కత్యంత ప్రేమాస్పదులైనవారి విషయంలో నే నలా చేశాను. నేను చెప్పే మాటలు కానీ వ్రాసే వ్రాతలు కానీ ఈ రెండు సంఘాలనూ ఏకం చేయజాలక పోతూన్న వనేమాట స్పష్టం. కాబట్టి ఇవ్వాళ ప్రారంభించి ౨౧ రోజుల ఉపవాసం నాపైన నేను విధించుకొంటున్నాను. అది తపస్సు, ప్రార్థనా కూడాను తపస్సుగా నా ఉపవాసాన్ని గూర్చి నే నెవరికీ చెప్పనక్కరలేదు. హిందూ మహమ్మదీయు లిరువురకూ నా ఉపవాసం ఫలప్రదమైన ప్రార్థనగా (నా ఆశ అది) ఉండాలని నేను ప్రకటిస్తూన్నాను. ఇంతవరకూ కలసి పనిచేసిన ఉభయ సంఘాలూ ఆత్మహత్య చేసుకోవద్దని నా ప్రార్థన. మతానికీ మానవత్వానికీ కూడా లజ్జాకరంగా ఉండే ఈ

పోరాటాన్ని, అన్ని సంఘాల నాయకులు ఇంగ్లీషు వారితో సహా సమావేశమై తుదముట్టింప నగునని నే నాహ్వానిస్తున్నాను. దేవుడు సింహాసన భ్రష్టు డైనాడా అనిపిస్తోంది. తిరిగి ఆయనను మన హృదయాలలో ప్రతిష్ఠింతము గాక.

*　　*　　*

(తరువాత మళ్ళీ వారం రోజులకు ఆయన ఇలా వ్రాశాడు)

దేవునిలో వల్లెగింజంత నమ్మక మున్నవా డెవడూ నిరాశ చెందడు. అతడు తుదకు సత్యం విజయం పొందుతుంద నే నమ్మకంలోనే ఉంటాడు. దైవభక్తు డెప్పుడూ అసత్యానికి పోడు. కాబట్టి ఆయనకు నిరాశ అనేది కలుగదు. పైగా ఆయన ఆశ గాఢాంధకారంలో మరింత ప్రకాశిస్తుంది. "దిక్కులేని వాళ్ళకు దైవమే దిక్కు" అని మంచి తెనుగుసామెత ఒకటి ఉంది. దీని తత్వం ఇవ్వాళ తెలిసినంత బాగా ఇదివరకు నాకు తెలియలేదు. పెద్దపెద్ద జన సమూహాలను నడిపించడం, వాళ్ళతో వ్యవహరించడం, వారి పక్షాన మాట్లాడడం, పనిచేయడం, ఇవి దేవునిచే పరిమిత శక్తితో సృజింపబడిన సామాన్య మానవునికి సాధ్యములైన పనులు కావు. కాబట్టి అటువంటి మనిషి కలకాలం కాపుదలమీద ఉండాలి. పూర్తిగా నా నిస్సహాయత్వాన్ని నేను గమనించిన తరువాతనే ఈ చిట్ట చివరి పనికి నేను పూనుకొన్నానని పాఠకులు గ్రహింతురుగాక. తన రక్షకులైన పాండవు లైదుగురూ కూడా తనను విడిచివేసినట్లు భావించిన ద్రౌపది వలెనే నేను దేవుణ్ని ఎలుగెత్తి పిలుస్తున్నాను. ఆమె కేక దేవునికడ వ్యర్థం కాలేదు. ఆ కేక కేవలం పెదవులమీద నుండి కాదు రావలసింది; అగాధమైన అంతరంగమునుండి; కాబట్టి ఎంతో మనోవేదన ఉంటేనే కాని అటువంటి కేక రాదు. ఇప్పటి నా కేక ఉపవాసవ్రతము ద్వారా బహిర్గతము చేయబడినది; అది ప్రస్తుత సమస్యలను పరిష్కా-

రింప దగినంత సమర్థమైనది కాదు. నా హృదయము నిరంతరమూ ఇలా పాడుతూన్నది:

"నా కోరిక 'తొలినాటి కొండ' పగిలినది
దైవమా! నన్ను నీలోన దాగనిమ్ము"

* * *

ఢిల్లీలో 1924 సెప్టెంబరు 16 వ తేదీని ఐకమత్య మహాసభ సమావేశ మయింది. హిందువులు, మహమ్మదీయులు, పార్శీలు, సిక్కులు, క్రైస్తవులూ ఇంగ్లీషువారూ కూడా ఆ సభకు హాజరైనారు. భారతదేశపు ప్రధాన క్రైస్తవ మతగురువయిన డాక్టరు ఫాస్ వెస్టు కాట్ కూడా హాజరైన వారిలో ఉన్నాడు. ఆ మహాసభా ఫలితాలానా డంత శ్లాఘింప దగినవిగా లేవు. కాని ఐకమత్యాని కవి కొంత ఉపకరించినవి. "ఈ కొత్త భావం కింది తరగతులకు వ్యాపించాలి. అందుకు కొంతకాలం పట్టే మాట నిజమే; కాని ఆ ధోరణి ఇప్పటికే కనిపిస్తూన్నదని మన మనుకో వచ్చును" అన్నాడు ఇండియా ప్రధాన క్రైస్తవ గురువు. గాంధీ చేసే ఉపవాస వ్రతాలను గూర్చి ప్రపంచంలోని మహా పురుషు లందఱూ ముందు తరంలోని పాఠకుల శాశ్వత ప్రయోజనం కోసం ఆందోళనతో నిరీక్షిస్తూం డేవారు. 1924 లో హిందూ మహమ్మదీయ కొట్లాటల సందర్భంలో జరిగిన ఒక ఉపవాస వ్రతాన్ని గూర్చి ముదివర కే తెలిసికొని ఉన్నాము. అప్పుడు సెప్టెంబరులో ప్రారంభమైన ఆ మూడువారాల ఉపవాసమునూ పరిశీలించిన ఇండియా క్రైస్తవ ప్రధాన గురువు రివరెండు డాక్టరు ఫాస్ వెస్టు కాట్, ఉపవాస మూలకారణ

మును తుద ముట్టించే నిమిత్తం ఢిల్లీ శాంతిసభలో తక్కిన అన్ని పక్షాల వారితోనూ గలసి పాల్గొన్నాడు. గాంధీ తన ఉపవాసములకు కొన్నిటికి పరిమితిని యేర్పాటు చేస్తాడు. కొన్నిటికి చేయడు. కాని 1924 లో తాను ఉపవాసం చేసి చావపోవడం లేదని గాంధీ స్పష్టం చేశాడు. "దేశానికీ దేవునికీ సేవ చేయడానికి ఇంతకంటె బాగానూ పవిత్రవంతం గానూ జీవించే నిమిత్తమే" తానుపవసిస్తున్నట్లుగా కూడా ప్రకటించాడు. ఇది చెప్పి "చచ్చిపోవడమా భుజించడమా అన్నంత సంకట స్థితి వచ్చినప్పుడు, తాను తప్పకుండా ఉపవాసం మానివేస్తానని" కూడా ఆయనన్నాడు. ఆయన ఉపవాసాలు అందరికీ హృదయాలు కలసిపోయి తాము చూచిన సత్యం చెప్పే సావకాశం కలిగించేటందు కుద్దేశింపబడ్డవి. "ఐకమత్య వర్ధంతి" (Unity day) నాడు 1924 అక్టోబరు 8 వ తేదీన, స్టేట్సుమన్ పత్రికలో ప్రకటింపబడిన ఒక సందేశాన్ని ఇలా ఉదాహరించాడు డాక్టర్ వెస్టు కాట్ :

> ప్రత్యేకపు నైనట్టీ రాజకీయ వాదం యేమాత్రమూ రాణించనిచోట గాంధీ ఉపవాసం వలన ఉద్భూతములైన ఆధ్యాత్మిక శక్తులు విజయం పొందినవి. సహన భావాన్ని అలవాటు చేసుకో వలసిందని లక్షలాది ప్రజలను ప్రోత్సహించ వలసిన అతి కఠినమైన పని ఇంకా ఆలాగే మిగిలి ఉంది.

రెండవ రౌండుటేబిలు మహాసభ జరిగిన తరువాత 1932 లో రామ్సే మాక్డోనాల్డు చేత సాంఘిక సమాఖ్య అని పిలువబడుతూ వచ్చిన సాంఘిక నిర్ణయమును గూర్చి యిక విచారింతము. అప్పుడు రాజాజీ ఇలా అన్నాడు :

సమాఖ్య రోగం కాదు. రోగ స్వభావాన్నీ దాని భయంకర స్వరూపాన్నీ వెల్లడి చేసే రోగ లక్షణం మాత్రమే. అది హిందూ మతంలో విభాగాలు కలిగించి, ఆరుకోట్ల హిందువులను హిందూ మతానికి సంబంధించని పరాయి వాళ్ళనుగా చేయడానికి తయారుగా ఉంది. అది శస్త్ర చికిత్స చేయవలసిన రోగ చిహ్నమని గాంధీజీ అభిప్రాయం.

రామ్సే మాక్డొనాల్డు సాంఘిక సమస్యను గూర్చి తీర్పు చెప్పిన మరునాడు, 1932 ఆగస్టు 18 వ తేదీని, తాను ఏ విధమైన ఆహారమూ తీసికోకుండా ప్రాయోపవేశం చేయడం వలన మాత్రమే, ఈ తీర్పును నిరోధించ గలనని బ్రిటిష్ ప్రధాన మంత్రికి గాంధీ వ్రాశాడు. ఆయన వ్రాసిన అంత్య లేఖలో ఇలా ఉంది :

నిమ్న జాతులకు ప్రత్యేక నియోజకవర్గా లుండడం, వారికి గానీ హిందూ మతానికి గానీ అపాయ కరముగా భావించే నేను, పూర్తిగా పొరపాటు పడి ఉండవచ్చును. నా నిర్ణయం సరియైనది కాకపోవచ్చును. అలాగే అయితే నా జీవితానికి సంబంధించిన తక్కిన సిద్ధాంతాల విషయంలో కూడా నా అభిప్రాయాలు సరిగా ఉండడానికి వీలు లేదు. అటువంటప్పుడు నా ప్రాయోపవేశ మరణం నా తప్పులకు ప్రాయశ్చిత్తం గానూ, నా వివేకంలో పసిపిల్లల వలె అమాయక విశ్వాసం గల అసంఖ్యాకులైన ప్రజలపై నుండి నా భారాన్ని తొలగించడానికి కూడా వినియోగిస్తుంది. కాక నేను నిస్సందేహంగా విశ్వసిస్తున్నట్లు నా నిర్ణయం సరియైనదే అయితే, జరిగిన పాతిక సంవత్సరాల పైనుండి జయప్రదంగా అనుసరింప బడుతూన్న నా జీవిత కార్యక్రమాన్ని నెరవేర్చడానికి మాత్రమే నేను తీసుకోబోయే ఈ చర్య అక్కరకు వస్తుంది.

సెప్టెంబరు 13 వ తేదీ గాంధీ ప్రాయోపవేశ వార్త వల్ల హిందూదేశమంతా కంపించి పోయింది. ఒక్క హిందూదేశమే కాదు ప్రపంచ మంతాను. "సండే టైమ్సు" పత్రికా విలేఖకు లొకరిలా వ్రాస్తూన్నారు :

> భారతదేశ ప్రజల హృదయ స్పందనం ఇంగ్లాండు అమెరికా ప్రజల మనస్సులలో ప్రతినదించింది. మొదటిసారి ఈ వార్త వినగానే అవిశ్వాసమూ ఆశ్చర్యమూ కలిగినవి. అతి నూతనమూ అతి నిరుపమానమూ అయిన ఈ ప్రతిజ్ఞయొక్క ఉద్దేశం కానీ అర్థం కానీ గ్రహించలేక లోకం విస్తుపోయింది.

గాంధీని ఇందులోనుండి తప్పించవలెనని ప్రయత్నించినవారి కాయన ఇలా వ్రాశాడు :

> నా అంతర్వాణి సత్యసంధతను గూర్చి నాకవిశ్వాసం లేదు. ఈ విచార మేఘంలో నుండి తొలకరి మెఱుపు తొంగి చూస్తుందని నాకు నమ్మక మున్నది. దాదాపు రెండువే లేండ్లకిందట కూడా ఒకసారి యిటు వంటి ఆపత్సమయమే వచ్చినది. తమ ప్రభునిపై ప్రేమతో దుఃఖించిన మిత్రులకు జెరూసలెంలో ఇటువంటి ప్రత్యుత్తరమే ఈయబడింది.

నిమ్నజాతుల నాయకులూ కులీన హిందూనాయకులూ కూడా ఈ ఉపవాస వ్రతాన్ని గూర్చి చాలా ఆందోళన పడ్డారు. చాలాదూరం రాయబారాలు సాగినయి. చిట్టచివరకు ఎఱవాడా జైలులో ఒడంబడిక పత్రం వ్రాసుకొన్నారు. కాని "బ్రిటిష్ ప్రభుత్వం దాన్ని అంగీకరిస్తుందా?" అని అందఱూ అడగడం ప్రారంభించారు. గాంధీ స్థితి అంతకంతకు సందిగ్ధ మవుతూన్న సమయంలో, బ్రిటిష్ మంత్రివర్గం తొందర

తొందరగా సమావేశమై ఎరవాడ ఒడంబడికను తుట్టతుదకంగీకరించింది. సెప్టెంబరు 26 సాయంకాలం గాంధీ ఉపవాసం విరమించాడు. సెప్టెంబరు 27 న ప్రారంభించి అక్టోబరు రెండో తేదీవరకు భారతజాతి అంతా "అస్పృశ్యతా నివారణ వారం" జరిపారు. ఉపవాసం జరిగిన పూనాలో సమావేశమైన సభకు అధ్యక్షత వహించి, ఆ తరుణానికి తగినట్లుగా, మహాకవి టాగూరు మనస్సులు కరిగిపోయేటట్లు ఇలా మాట్లాడాడు :

> దైవయోగం వలన కలిగిన జన్మ కారణంగా, కళంకితులుగా వ్యవహరింప బడుతూన్నవారి వంగిన నడుములపై నుండి, తరతరాల నుండీ ఉన్న అవమాన భారాన్ని తొలగించడానికి ప్రయత్నించే గాంధీ మహాత్ముని మహత్తర ప్రయత్నంలో, మనం నేడు పాల్గొనడం వల్ల, మన దేశీయులలో అనేకమంది యొక్క జన్మహక్కును తృణీకరించిన పాపాన్ని తుడిచివేసు కోవడమే కాక, భారతదేశపు నైతిక పరాధీనతను తొలగించి మానవ లోకానికి మార్గదర్శకులంగా కూడా కాగలుగుతూన్నాము. స్వార్థ వంచనం ఎక్కడ ఏ రూపంలో ఉన్నాసరే, అది ఈ నాడు మహాత్మాజీ ప్రచారంలోకి తెచ్చిన అంతరాత్మ వేసే సూటి ప్రశ్నకు ప్రత్యుత్తర మీయగలదా అని అడుగుతూన్నాము.

ఈ ఉపవాసాలే కాక దండన గానూ ప్రాయశ్చిత్తం గానూ ఉద్దేశింప బడిన ఉపవాసా లింకా కొన్ని ఉన్నవి. 1933 మే లో గాంధీ 21 రోజుల ఉపవాసం మరొకటి ప్రారంభించాడు. కాని దాని కేమీ ప్రత్యేకోద్దేశం లేదు. అది "తన యొక్కయు తన అనుయాయుల యొక్కయు పవిత్రత కోసము జాగరూకత కోసము అప్రమత్తత కోసము ఉద్దేశింపబడ్డ హృదయప్రార్థనం" అన్నాడు. గాంధీ ఇలా వ్రాశాడప్పుడు :

నాకు చచ్చిపోవాలనే కోరిక లేదు. నా ధర్మ నిర్వహణం కోసం, నా మంచికోసం, నా అనుయాయుల కెక్కువ పవిత్రత, ఎక్కువ అనువర్తనము, ఎక్కువ శ్రద్ధా భక్తులూ కలిగేటందుకు, నేను జీవించదలచుకొన్నాను. నిష్కళంక జీవితంగల అనుచరు లింకా నాకు కావాలి. ఆశ్చర్యం కలిగించే అపవిత్ర వృత్తాంతాలు నాకు తెలిసినవి. అటువంటివారంతా నా ధర్మకార్యాన్ని నాకు విడచి వెళ్ళవలెనని ప్రార్థించడమే ఈ ఉపవాసోద్దేశం.

తరువాత 1933 నుండి రెండు ఉపవాసాలు జరిగినవి. అందులో ఒకటి, సనాతనమత నాయకుని పైన కొందఱు సంఘ సంస్కర్తలు చేసిన దౌర్జన్యానికి ప్రాయశ్చిత్తంగా, 1934 ఆగస్టులో ఒక వారం జరిగింది. 1933 ఆగస్టు ఒకటో తేదీనుండి వ్యక్తి సత్యాగ్రహం ప్రారంభించ వలసిందని గాంధీ సలహా యిచ్చిన పిమ్మట, ఆయన ఆ తేదీనే అరెస్టు చేయబడ్డాడు. అప్పుడు హరిజన్ పత్రికను జైలులో నుండి నడిపే హక్కును ఆయనకు తీసివేయ బడినందున వెంటనే ఆయన ఉపవాసం ప్రారంభించాడు. ఆయన ఆరోగ్యం అపాయకర స్థితిలోకి వచ్చినప్పుడు, యేవిధమైన షరతులూ లేకుండా విడుదల చేయబడి పూనాలోని సాసూన్ ఆసుపత్రికి పంపబడ్డాడు.

రాజకోటలో జరిగిన ఉపవాస వృత్తాంతం చాలా ఇటీవలిదవడంచే, దానిని గూర్చి తిరిగి ఇక్కడ విశేషంగా చెప్పవలసిన అవసరం లేదు. అది నిజంగా "దైవ ప్రసాదితోపవాసం." థాకూరు సాహెబు ప్రజామండలితో చేసుకొన్న ఒడంబడికకు భిన్నంగా నడవడం మంచిది గాదని, తాను బిడ్డగా చూచు

కొంటూన్న ఆయనను మందలించడానికి రాజకోటకు వెళ్ళినప్పుడు, తానక్కడ ఉపవాసం చేయవలసి వస్తుందని గాంధీ యెంతమాత్రమూ అనుకొని ఉండలేదు.

దానిని గూర్చి మహాదేవ దేశాయి హరిజన్‌లో ఇలా వ్రాస్తూన్నాడు :

దర్బారు వీరవల్లాతో జరిపిన మనోవేదన కరమైన సంభాషణలలో చిట్ట చివర సంభాషణ యొక చాలుననిపించింది. 1939 మార్చి రెండోతేదీ రాత్రి ఒక్క క్షణంలో ఈ నిర్ణయం జరిగింది. ఈ ఉపవాసమును ఆవరించుకొని పెటిగిన రాజకీయ తికమకలతో మనకిక్కడ పనిలేదు. చిట్ట చివరకు ఫెడరల్ ప్రధాన న్యాయాధిపతి సర్ మారిస్ గయర్ మధ్యవర్తిత్వానికి యావద్విషయము గాంధీ వదలివేశాడు.

రాజకోట ఉపవాస విచారణ

రాజకోట ఉపవాసం జరుగుతూండగా తటస్థించిన చిక్కులు, ఉపవాసం పూర్తి అయిన పిమ్మట కూడా అంతకంటె ఎక్కువైనయి. ఆ విధంగా రాజకోట ఉపవాసం అగ్రస్థానం అలంకరిస్తూన్నది. "ఆ నాలుగురోజుల ఉపవాసము, సత్యాగ్రహి కుండవలసిన లక్షణాలను గూర్చి ఆలోచించే టందుకు నా కవకాశం కల్పించింది" అని ఆ లక్షణాలను గాంధీ ఇలా వ్రాశాడు :

౧ ఆయనకు దేవునిలో అనంతమైన నమ్మక ముండాలి. దేవుడొక్కడే ఆయనకు కొండవంటి తోడు.

౨ సత్యాహింసలలో ఆయన మత విశ్వాసం కలిగి ఉండాలి. తద్వారా తన బాధాసహిష్ణుత వల్ల రేకెత్తించ నుద్దేశించిన మానవ ప్రకృతిలోని సహజ సద్గుణమునం దాయనకు నమ్మకం ఉండాలి.

3 ఆయన జీవితం పవిత్రంగా ఉండాలి. తన ధర్మం కోసం ఆయన తన సర్వస్వమును తుదకు జీవితమును కూడా త్యజించ సిద్ధంగా ఉండాలి.

४ ఆయన నిత్య ఖద్దరు ధారిగానూ, నిత్యమూ నూలువడికే వాడుగానూ ఉండాలి. ఇది ఇండియాకు ముఖ్యం.

౫ ఆయన పూర్తిగా మద్యపాన విముఖుడుగా ఉండాలి. ఇతర మత్తుపదార్థాలను కూడా యేమీ ఉపయోగించ కూడదు. అందువల్ల ఆయన బుద్ధి ఎల్లప్పుడూ నిర్మలంగానూ ఏకాగ్రం గానూ ఉంటుంది.

౬ అప్పుడప్పుడూ యేర్పాటు చేయబడే అన్ని నియమాలనూ ఆయన హృదయపూర్వకంగా అనుసరించాలి.

౭ తన ఆత్మ గౌరవానికి హానికరంగా ఉన్నప్పుడు తప్ప తక్కిన అన్ని సందర్భాలలోనూ జైలు నియమాలను పాటించాలి.

ఇవి కేవలం ఉదాహరణంగా చెప్పబడినవి మాత్రమే. కాని పూర్తిగా చెప్పబడినట్లు భావింపరాదు.

రాజకోట ప్రజ లవలంబించ వలసిన విధులను ఈ విధంగా ఆదేశించాడు :

౧ బాగా శిక్షణ పొందండి. బ్రాందీ వగైరా తాగుడు మాని నిరాడంబర జీవిత మలవాటు చేసుకోండి.

౨ నిర్మాణ కార్యక్రమంలో నమ్మకం కలిగి ఉండండి.

3 "నాదే న్యాయ్య మన" కండి. "న్యాయ్య మేదో అది నాద" నండి.

४ ఆడంబరం, అసూయ, దురభ్యాసాలు – ఇవి మానండి.

౫ ఇతర ప్రజల హక్కులకు భంగం చేయడం అన్యాయ్యం.

౬ బాధితుణ్ని రక్షించడం మన ధర్మం.

౭ క్షమ బలవంతుల సద్గుణం.

౮ విలువ కలిగినమాట మాత్రమే మాట్లాడండి. అనాలోచితంగా ఒక్క మాట కూడా అనవద్దు. మీకు స్వేచ్ఛ కావాలంటే ధైర్యంగా ఉండండి,

రాజకోట ఉపవాసమును గూర్చి వాద ప్రతివాదాలు

రాజకోట ఉపవాసాన్ని గూర్చి దాని ఫలితాన్ని గూర్చి జరిగిన వాద ప్రతివాదాలలో, గాంధీ సత్యాగ్రహ మర్యాదలను అతిక్రమించకుండా తన హక్కులలో తాను ఉన్నాడా, అతి తీవ్రమైన చర్చ వచ్చింది. గాంధీ, వారం వారం తనను సమర్థించుకొంటూ వచ్చాడు. చిట్టచివరకు 1939 ఏప్రిల్ చివరలో లోబడి, తానపజయం పొందినానని ఒప్పుకొన్నాడు. 24-4-39 న బొంబాయి పోయే రైలులో వ్రాసిన మాటలలో, ఆయన ఈ నిర్ణయానికి రావడానికి తగిన మానసిక ప్రవృత్తి బాగా వెల్లడింప బడింది.

> రాజకోట నా యౌవనాన్ని అపహరించి నట్లున్నది. ఇంతకు పూర్వం నేను ముసలివాడినని ఎన్నడూ అనుకోలేదు. ఇప్పుడు నేను నా వార్థక్య జ్ఞానంతో వంగిపోయినాను. నే నెన్నడూ ఆశను కోల్పోయి ఎఱుగను. కాని అది రాజకోటలోనే దహింప బడ్డట్లున్నది. ఇదివఱ కెన్నడూ ఇంత కఠినంగా నా అహింస ఒరసి చూడబడలేదు.
>
> ఇండియా ప్రధాన న్యాయ్యాధ్యక్షపతి తీర్పు ప్రకారం కమిటీని నిర్మించడానికి, నేను నా విలువయిన 15 రోజుల కాలమును వెచ్చించాను. కాని మొదట నేనున్నచోటనే ఉన్నట్లు కనిపిస్తూన్నది. ఈ సందర్భంలో నేననుకోని చిక్కులు నాకు తటస్థించినవి. సర్దారుకు సంపూర్ణ విజయం కలిగినట్లుగా హిందూదేశంలో అందఱూ తీర్పును గూర్చి శ్లాఘించారు. కాని దానివల్ల నేను ముస్లిములకూ భయతులకూ చేసిన వాగ్దానాన్ని భంగం చేసినట్లుగా నన్ను గుఱించి బాగా ఆడి పోసుకొంటూన్నారు. నేను ఢిల్లీనుండి తిరిగి రాగానే ఠాకూరు సాహేబు చేసిన వాగ్దానభారం, బలహీనుడనైన నేను భరించవలసి వచ్చింది. తీర్పు ప్రకారం నాకు

బాధ్యత లేకపోయి నప్పటికీ, థాకూరు సాహెబు చేసిన వాగ్దానాన్ని చెల్లించడానికి సహాయ పడతాననే నేను చెప్పిన మాటలలోని సారాంశం. కారణాలేవైనా కానీయండి, ముస్లిములూ భాయతులూ కూడా, థాకూరు సాహెబు చేసిన వాగ్దానమును చెల్లించ వలసి, బాధ్యత నుండి ఆయనను తప్పించారు. ముస్లిములనూ భాయతులనూ సమాధాన పఱచ లేక, థాకూరు సాహెబుకు పరిషత్తు పేర్లను ఏడింటిని పంపించాను. వారి జవాబులో నేను పంపిన ఏడుగురిలోనూ ఆరుగురను గూర్చి వారు రాజకోట సంస్థాన ప్రజలని ఋజువుచేయ వలసిందని నన్ను అడిగారు. వారి అభ్యంతరానికి కారణాలేవో సూచనగానైనా నాకు తెలిపి ఉండ వలసింది. న్యాయ్యంగా నిజమని నమ్మడానికి వీలున్న యే మాటను ఋజువు చేయమన్నప్పటికీ, ఒక్కొక్క విషయాన్ని ఋజువు చేయడాని కొక్కొక్క సంవత్సరం పడుతుంది. కాని వారు కోరిన ఋజువులను నేను పంపించాను. నేను చేయవలసిన ప్రయత్నాలన్నీ చేసిన తరువాత నా ఓర్పు పోయి, రాజప్రతినిధి చేసిన వాగ్దాన షరతుల ననుసరించి, స్థానిక సర్వాధికారియైన అక్కడి రెసిడెంటుకు మొరపెట్టుకొంటూ ఆయన సహాయం కోరినాను. ఆయన నన్ను మాట్లాడడానికి రమ్మని ఆహ్వానించాడు. నేనాయనతో ఈ చిక్కులను విడదీయడానికి మార్గాంతరాలను చర్చిస్తూన్న సమయంలో, కమిటీ సభ్యులను పేర్కొనే అధికారాన్ని నేను వదులుకొని ఈ సంతాపాన్ని చల్లార్చుకొంటే బాగుండు ననిపించింది. ఆమాటే ఆయనతో అన్నాను. ఆయన అది చాలా ఉదారమైన సంగతి అన్నాడు. వెంటనే కమిటీ సభ్యుల నందఱినీ థాకూరు సాహెబు పేర్కొని, డిశంబరు 26 న చేయబడిన ప్రకటనలోని షరతుల ననుసరించి నివేదికను తయారుచేసి, దానిని పరిషత్తుకు చూపించి, పరిషత్తువారు డిశంబరు ప్రకటనలోని షరతుల నా నివేదిక సరిగా నిర్వర్తించ లేదని తలంచినట్లయితే, వారి అభ్యంతరాలతో సహా ఆ నివేదికను

ప్రధాన న్యాయాధిపతి నిర్ణయానికొరకు పంపడం మంచిదని సూచించాను. ఈ సూచనను రెసిడెంటు, దర్బారు శ్రీ వీరవాలాకు పంపినాడు. కాని ఘనత వహించిన ఠాకూరు సాహెబు దానిని తోసిపుచ్చాడు. ఠాకూరు సాహెబు గానీ దర్బారు శ్రీ వీరవాలా గానీ, పైనుండి వచ్చిన వత్తిడివల్ల మాత్రమే తా మేమైనా ఈయవలసి వచ్చిందని అనుకొన్నట్లయితే, నా అహింస అపజయం పొందినట్లుగా తెలుసుకోనేటందుకే మనస్తాప కరములైన ఆ పదిహేనునాళ్ళ అనుభవాలూ నాకు తోడ్పడ్డవి. అటువంటి అభిప్రాయం వారి మనస్సులలో నుండి తొలగించ వలసిందని నా అహింస నాకు చెప్పింది. కాబట్టి నా కవకాశం రాగానే, సామ్రాజ్యాధికారుల సహాయం పొందడం నాకు సంతోషకరమైన పని కాదని, దర్బారు శ్రీ వీరవాలాకు నచ్చచెప్ప ప్రయత్నించాను. అహింస అలా ఉండగా, రాజకోటుతో నాకు గల సంబంధాన్ని బట్టి కూడా అటువంటి నిగ్రహం కలిగి ఉండడం విధి అని తలంచాను. నేను హఠాత్తుగా గిబ్సన్‌కు చేసిన సూచనకు కూడా కారణ మదేనని ఆయనకు వివరించాను. కాని ఆయన "రాజుగారి కమిటీ నివేదికను, డిశంబరు ప్రకటన ననుసరించి పరిశీలించి, అభ్యంతరాలుంటే వ్రాసి, ఇండియా ప్రధాన న్యాయాధిపతి నిర్ణయం కొరకు పంపడానికి పరిషత్తు కధికారం ఉండాలని మీరు కోరినారుగదా! ఇది వత్తిడిని తొలగించడ మవుతుం దంటారా? రాజుగానీ ఆయన మంత్రినీ పూర్తిగా ఎందుకు నమ్మరాదు? మీరు కోరిన దంతా ఇప్పుడు మీరు రాకపోవచ్చుగాక. కాని వచ్చేదేదో రాజుగారి సుహృద్భావం తోనూ, ముందు పూర్తిగా యిచ్చే వాగ్దానం తోనూ వస్తుందికదా! నన్ను గురించీ ఠాకూరు సాహెబును గూర్చీ పరిషత్సభ్యు లేమన్నారో మీరు తెలుసునా? సంస్థానాధిపతుల నుండి రాజకీయ సంస్కరణాలను కోరే ప్రజలు ప్రవర్తించవలసిన విధ మిదేనా?" అని నిగ్గదీసి అడిగాడు. ఆయన మాటలలో పరిషత్తు సభ్యులను గూర్చి కాత్తి

న్యమూ ద్వేషమూ కనిపించింది. కాని నా కతనిని ఎదురుదెబ్బ కొట్టవలె ననే కోరికకు బదులుగా, నేను అహింసను సరిగా ఆచరణలో పెట్టలేదని హఠాత్తుగా అర్థమయింది. మానవ స్వభావంలోని మంచితనాన్ని విశ్వసించ లేకపోయినా నన్నా అతని వాదంలోని పటిమను నేను గ్రహించాను. అహింసలో నాకు గల నమ్మకం అత్యల్పమైన దన్నట్లుగా తోచింది నాకు. ఆపైన చాలా సేపు మే మిరువురము మాట్లాడు కొన్నాము. చాలా సూచనలను గూర్చి విచారించాము. కాని మా సంభాషణ పూర్తి కాలేదు. నేను చిక్కులోనుండి ఇంకా బయటు పడలేదు. అయితే మే మిద్దరమూ విడిపోయే టప్పుడు పరస్పరం అర్థం చేసు కొన్నాము. దర్బారు వీరవాలాను మంచిమాట చేసుకోవలెనని నేను ప్రయత్నించడం సరియైన పద్ధతే నని నా అభిప్రాయం.

తరువాత నా సహచరుల కీ క్రొత్త పద్ధతిని గూర్చి చెప్పినాను. రాజకోటకు వచ్చిన ఈ ముప్పుకు మూలకారణం దర్బారు శ్రీ వీరవాలాయే అనీ అతనిని తీసివేస్తే తమకు పూర్ణ స్వరాజ్యం వచ్చినట్లే ననీ అనేక సార్లు వారు నాతో అన్నారు. అయితే వారనుకొనేది సుపరిపాలనం కాని స్వపరిపాలనం కాదనే విషయం వారు తేలికగా గ్రహించేటట్లు చేశాను. అహింసను గూర్చి నేను చెప్పే అర్థాన్ని వా రంగీక రించేటట్లయితే దర్బారు శ్రీ వీరవాలాను తొలగించడానికి గాక, ఆయనను మార్చడానికి ప్రయత్నించ వలసి ఉంటుందని నిన్న జరిగిన సమావేశంలో వారికి నేను తెలియపరిచాను. ఆయనలోని మంచి గుణాలను కనుగొనడానికి ప్రయత్నిస్తూ పనిచేయడం వలన మాత్రమే సాధ్యమవుతుంది. హింసాయుత మానవుణ్ణి శక్తిహీనుణ్ణిగా చేయడానికి అహింసలో అత్యంతమైన విశ్వాసం కలిగి ఉండాలి. హింస నోటిలో తల దూర్చడమే నిజమైన అహింస. ఆవులకు తెలివి ఉండి, తగినన్ని ఆవులను పెద్దపులి నోటి కందించ గలిగినట్లయితే, పులికి ఆవుమాంసం మీద అసహ్యం పుట్టి తన

ప్రకృతిని మార్చుకొంటుంది. కాబట్టి దర్బారు శ్రీ వీరవాలాను గూర్చిన భయాన్నీ, అహింసా శక్తి యందుగల అవిశ్వాసాన్నీ వారు విడిచిపెట్టి, చూడడానికి అసంభవంగా కనిపించే ఆదర్శాన్ని అందుకొనే టందుకు ప్రయత్నించాలి. ఈ నూతన సిద్ధాంతాన్ని వా రత్యంత శ్రద్ధతో విన్నారు. వారికిది ఒప్పుదలగా ఉందో లేదో నే నడుగలేను. వారొప్పు కొన్నారనే అనుకొంటూన్నాను; "ప్రధాన న్యాయాధిపతి యిచ్చిన తీర్పును చింపివేసి, కేవలం దర్బారు శ్రీ వీరవాలా మంచితనం మీద ఆధారపడి ఉండవలసిందని మీరు మా కుపదేశిస్తూ అవలంబించిన ఈ వింత వైఖరి సరియైనదే నని మీరు నమ్మక మున్నదా" అని వారే నన్ను న్యాయ్యంగా అడిగి ఉండవలసింది. వారు నన్నామాట అడిగి ఉంటే నాకంత ధైర్య మింకా కలుగలేదు. "ధైర్యవంతుల లోనే అహింస అభి వృద్ధి పొందుతుంది" అని నాకు చెప్పక తప్పేదికాదు.

కాబట్టి నా ఆశ దగ్ధమై, శరీరం జీర్ణమై, రిక్త హస్తాలతో వచ్చాను. రాజకోట నా కమూల్యమైన పరిశోధనాలయ మయింది. కలియవాడు కుటిల రాజకీయాలతో నా ఓర్పు తీవ్రంగా పరీక్షింప బడింది. నన్నూ సర్దారు పటేలునూ మఱిచిపోయి, దర్బారు శ్రీ వీరవాలాతో ఆలో చనలు సాగించి, వారి కనీసపు కోర్కెలు లభించినటయితే మాతో చెప్పకుండానే అంగీకరించ వలసిందని అక్కడ పనిచేసే వారికి చెప్పి వేశాను. "నేను ఓడిపోయినాను. నీవు జయం పొందుదువు గాక! సాధ్యమైనంత ఎక్కువ యిచ్చి ప్రజలను సమాధానపఱచి వెంటనే నాకు తంతీ పంపితే, నేను తాత్కాలికంగా ఆరిపోయిం దనుకుంటూన్న ఆశా జ్యోతి తిరిగీ నా హృదయంలో ప్రకాశిస్తుంది." అని దర్బారు సర్దారు వీరవాలాకు చెప్పి వచ్చాను.

కడసారికి 1939 మే 17 వ తేదీని గాంధీ తన పొరపాటును గుర్తించి, ఆ సాయంకాలము తన సహచరులతో తర్జన భర్జ

న్నలు చేసిన పిమ్మట, తాను ప్రధాన న్యాయమూర్తి తీర్పువలన పొందిన ప్రయోజనాలను వదులుకోవలెనని నిర్ణయించుకొన్నాడు. 1939 మే 20 తేదీ "హరిజన్" లో తన దౌర్బల్యం వల్ల తాను వైస్రాయికీ ప్రధాన న్యాయమూర్తికీ కలిగించిన అనవసర శ్రమకున్నూ, తన సహచరులతోపాటు తానుకూడా దర్బారు శ్రీ వీరవాలాను గూర్చి మనస్సులో చెడ్డ అభిప్రాయాలను పెట్టుకొన్నందుకున్నూ, క్షమాపణలు చెప్పుతూ థాకూరు సాహెబు నుద్దేశించి కూడా తన్ను మన్నించమని వ్రాశాడు. ఒకపక్క తీర్పును చూపించి భయపెడుతూ, రెండోపక్క దర్బారు శ్రీ వీరవాలా ద్వారా ఠాకూరు సాహెబుకు సలహా యిప్పించి మంచి రాజ్యాంగ సంస్కరణలను రాబట్టుకోవడానికి ఆయనతో మంచిమాటలాడుతూ, రెండువిధాలా నాటక మాడినట్లు కనిపించే నేరానికి తాను గుఱియైనట్లాయన ఒప్పుకొన్నాడు.

రాజకోట ఉపసంహారానంతరం గాంధీ నేర్చుకొన్న కొత్త గుణపాఠము ననుసరించి, తిరువాన్కూరు ప్రజలు సర్ సి. పి. రామస్వామయ్యరు పైన మోపిన నేరములను ఉపసంహరించుకొని, మహారాజుతోనూ దివానుతోనే తమ వ్యవహారములను పరిష్కరించుకోవలసిందని సలహా యిచ్చాడు.

ఏమిటి నీవిప్పు డవలంభించిన కొత్త పంథా అని ఆండ్రూసు అడిగిన ప్రశ్నకు గాంధీ ఇలా వ్రాస్తూన్నాడు :

అది హింసకు ఇంకా దగ్గర మార్గం. అంతకంటె కొత్తేమీ లేదు దానిలో. నేను వైస్రాయి దగ్గరకు వెళ్ళవలెనంటే నేను సిమ్లాకు నడవవలసినా

నడవాలి లేదా ఆయన ఢిల్లీకి విమానంమీద రావైనా రావాలి. గోఖలే తో కలసి వెళ్ళినప్పుడు తప్ప ఎన్నడూ దక్షిణ ఆఫ్రికాలో నేను కారులో గాని విక్టోరియాలో గాని వెళ్ళలేదు. నే నెన్నడూ మోటారులో ఎక్క పోలేదు. జనరల్ స్మట్సు దగ్గరకు నే నెప్పుడూ నడిచే పోయినాను. ఉపవాసం చేయడం, బాగా ఒత్తిడి చేయడమే. తండ్రిని తాగుబోతు తనంనుండి తప్పించాలంటే, ఉపవాసం యొక్క ఉపయోగం. విషము కానీ తుపాకీ కానీ కాదు. అందువల్లనే నేను పీరవాలాకు విరుద్ధంగా ఉపవసించాను. కాని ఆయనయందు నేను కాఠిన్యం వహించాను. నేను ఢిల్లీనుండి వచ్చిన తరువాత అంతకుపూర్వ మెన్నడూ నా ఉపవాస మంత ఫలప్రదం కాలే దనుకొన్నాను. కాని కొద్దిరోజులలోనే నేను పొంద కూడనిచోట నుండి సహాయం పొంద ప్రయత్నించడం వల్ల తప్పు చేసి నట్లుగా గ్రహించాను.

ఉపవాసాలను గూర్చి 1940 నవంబరు 7 వ తేదీని గాంధీ చేసిన ప్రకటనతో ఈ అధ్యాయము ముగించెదము గాక. అది ఇది,

> నాచే ఉద్దేశింప బడిన ఉపవాస వ్రతమును విరమించ వలసిందని నా కనేక తంతులు వస్తూన్నవి. దాదాపు ఈఅన్ని తంతీవార్తలు కూడా నా మిత్రుల దగ్గరనుండే. వారంతా నే నింకా జీవించి ఉన్నట్లయితే, దేశానికి ఉపయోగ కరమైన సేవ చేస్తాననే ఉద్దేశంతో, నా ఆరోగ్యమును గూర్చి ఆందోళన పడుతూన్నవారు. ఒకరిద్దరు మాత్రం రాజకీయాలలో ఉపవాసాలకు స్థానం లేదనీ, పైపెచ్చు రాజకీయ వాతావరణాన్ని కల్లోలం కావించి స్వాతంత్ర్య పోరాటంలోని ప్రభుత్వ వ్యతిరేక శక్తులను బలహీన పరుస్తుందనీ, గట్టిగా నిందిస్తూ తంతు లిచ్చారు. నా మిత్రులకూ నా విమర్శకులకూ కూడా కృతజ్ఞుడను. వర్కింగు కమిటీ సభ్యులూ నేనూ ఉపవాసాన్ని గూర్చి చాలాకాలం తర్జన భర్జన పడ్డాము.

వ్యక్తి సత్యాగ్రహాన్ని విశాలపఱిచే సందర్భంలో ఉపవాసం విషయం కొంతకాలం ఆపి ఉండవచ్చు. కాని ఇంతవరకు నేను విన్న ఈ విషయాలన్నీ జీవిత వ్యవహారా లన్నిటిలోనూ రాజకీయాలలో కూడా ఉపవాసాల ఔచిత్యాన్ని గూర్చి గాని, అవసరాన్ని గూర్చి గానీ మొదటి నుండీ నాకున్న అభిప్రాయాలను మార్చలేక పోయిన వన్నమాట నేనిక్కడ చెప్పవలసి ఉంది. ఇది ఒక కొత్త ఆయుధమని నేను అంగీకరిస్తాను. అంతేకాదు, దీనిని ఎవరు పడితే వా రుపయోగించడానికి వీలు లేదనీ, శాసనోల్లంఘనము వలెనే దీనిని కూడా ఇందులో నిపుణులైన వారు మాత్రమే ఉపయోగింప నర్హులనీ కూడా నేను ఒప్పుకొంటాను. శాసనోల్లంఘనానికి కొన్ని అర్హతలు కావలసి వచ్చినప్పుడు, ఉపవాస వ్రత మవలంబించడాని కంతకంటె అనేక రెట్లెక్కువ అర్హతలు కావాలి. నా కా అర్హతలు ఉన్నవని నా నమ్మకం. 1906-07 ల నుండీ, 38 సంవత్సరాలు బుద్ధిపూర్వకంగా ఈ విధమైన శిక్షణ పొందడానికి నాకు భగవత్ప్రసాదితము లైన అవకాశాలు లభించినవి. కాని ఊరికే యంత్రం లాగున ఉపవాసాలు చేయడానికి వీలులేదు. అవి ఒక అజ్ఞాత శక్తి యొక్క ఆజ్ఞల ననుసరించి ప్రారంభింపబడ వగినవి; దానిని మీరు అంతర్వాణి అనండి, దైవం అనండి, మరి మీ యిష్టంవచ్చిన ట్లింకేమైనా అనండి. నాలో ఏదో ఒకటి నన్ను ప్రేరేపిస్తూండడం చేత నే నుపవాసం చేయవలసి రావచ్చునని అన్నాను. నా అంతట నేనే దానిని నిరోధిస్తూన్నాను. నా భావం ఎంత బలంగా ఉన్నా శరీరం దుర్బలంగా ఉంది. ఉపవాసంలో తగినంత ఉదకం పుచ్చుకోకపోతే ముఖ్యంగా మొదటిరోజులు గడవడం చాలా కష్టమన్న సంగతి నాకు తెలుసు. అయితే శరీరం ఎంత బలహీనంగా ఉన్నా అన్ని శక్తులనూ మించిన ఆ అజ్ఞాతశక్తి నాలో అధివసించినట్లయితే, దుర్బలత్వం దూరంగా పోతుందని నా విశ్వాసం.

కాని ఇంకా ఆ ధైర్యం నాకు కలగడం లేదు. అది కలిగేదాకా ఉపవాస ముండదన్నమాట నిశ్చయం. అది కలిగినట్లయితే స్నేహితులు తెచ్చే ఒత్తిడి గానీ, విమర్శకులు చేసే కోపం గానీ గ్రహించడానికి తగిన శక్తి నాకు తప్పిపోతుంది. కాబట్టి అందరినీ సహనంతో రానున్న సంఘటనలను నిరీక్షింప కోరుతూన్నాను.

దేశాన్ని ప్రస్తుత సంకట స్థితినుండి తరింప చేసేటందు కందరూ నాకు తోడ్పడడానికి సావకాశ మున్నది. స్నేహితుడు గానీ విమర్శకుడు గానీ నాకు సహాయ పడడానికి తగిన అనేక మార్గాలను నేను చెప్పియే ఉన్నాను. ప్రజలు నాకు తోడ్పడవలసిన పద్ధతులను సూచిస్తూ నేనిప్ప డొక పెద్ద ప్రకటన చేయదలచుకొన లేదు. హరిజన్ వారపత్రికను ప్రచు రించడం మానివేసిన తరువాత, బహిరంగ ప్రకటనలను చేయాలనే కోరికే పోయింది నాకు. అసంఖ్యాకులైన ప్రజల ఆందోళనమును అణచి వేయడానికిన్నీ మిత్రుల ప్రశ్నలకు ప్రత్యుత్తరంగా నున్నా నేనీ ప్రక టన చేయవలసి వచ్చింది.

ఉపవాసాలు ఒత్తిడియా?

ఉపవాసం కూడా ఒక మోస్తరు ఒత్తిడియే అనిపించు కుంటుందా? ఈ ప్రశ్నకు గ్రిగ్గుగా ఇలా జవాబిచ్చారు: ఒక్కొక్కప్పుడు చచ్చేదాకా, మఱొకప్పుడు చావ సిద్ధమయ్యే వరకూ, ఉపవాసవ్రత మవలంబించి గాంధీ తన శత్రువులను ఒత్తిడి చేయడం సత్యాగ్రహ పద్ధతికి కేవలం విరుద్ధంకాదా అని ఆయనను చాలామంది తీవ్రంగా విమర్శిస్తూంటారు. తాను ప్రారంభించిన ఉద్యమ విజయానికి తా నవలంబించే ఉపాయం వల్ల తానే ఉద్యమ నియమాలను అతిక్రమిస్తూన్నాడా లేక

అసలు ఉద్యమానికే భంగం తీసికొని వస్తూన్నాడా అనే విషయాన్ని, నిర్ణయించి చెప్పడానికి నిజంగా ఉద్యమ మూలపురుషుడే ఎక్కువ అర్హుడు. శత్రువు యొక్క ఆలోచనకు, నిర్ణయానికీ, చర్యకూ స్వేచ్ఛ లేకుండా చేసే ఉత్కృష్ట శక్తిని గానీ ప్రభావాన్ని కానీ, ఒత్తిడి అనేటట్లయితే ఆ శక్తి యెటు వంటిదో విచారిస్తేనే గాని అది ఆక్షేపణీయ మైనదా కాదా అనే సంగతి తేలదు. "ఏ" అనే మనిషి తన బుద్ధి విశేషం వల్ల "బి" మనస్సును లోబఱచుకో గలిగిన యెడల అది ఆక్షేపణీయ మైన పద్ధతి కాదు. "ఏ" తన నైతిక బలంవల్ల "బి" ని లొంగదీసుకొన్నా తప్పుకాదు. శరీర బలంవల్ల అనగా దౌర్జన్యంవల్ల జయించ ప్రయత్నిస్తే, అది ఒత్తిడి అవుతుంది. సత్యాగ్రహం ప్రతివానినీ బాధ పడమని ఉపదేశిస్తుంది కాని, బాధపెట్టమని ఉపదేశించదు. అయితే సత్యాగ్రహం వల్ల పొందే బాధకు మితీ మేరా ఉండవచ్చు లేకపోవచ్చు. ఉపవాసం వల్ల కలిగే బాధకు మితీ మేరా లేదు. కాబట్టి న్యాయ్యమైన కారణం కోసం, సరియైన సమయంలో ప్రభుత్వానికి గానీ, సంఘానికి గానీ, షాహుకారుకు గానీ వ్యతిరేకంగా ఉపవాసం ప్రారంభించ బడినట్లయితే అది ఒత్తిడి అనిపించుకోదు. కాబట్టి గాంధీ రాజకోట సంస్థానమునకు వ్యతిరేకం గానూ, హరిజన సమస్యా సందర్భంలో బ్రిటిష్ ప్రభుత్వ, కులీన హిందువులకు వ్యతిరేకం గానూ, అహమ్మదాబాదు మిల్లు యజమానులకు వ్యతిరేకం గానూ చేసిన ఉపవాసాలను, ఒత్తిడి అనడానికి వీలులేదు. అయితే ప్రతివారూ ప్రతి పనికీ ఉపవాసాన్ని ప్రారంభించ కూడదు.

ఎందువల్ల ననగా ఉపవాసం బాధావలంబనమునకు పరమావధి. ఎంతో సమగ్రదృష్టి, యుక్తాయుక్త వివేకజ్ఞానమూ కలిగిన వారే దానిని ప్రారంభింప తగినవారు.

యూరోపు ఖండంలోని ప్రజలు దేవుణ్ణి ప్రత్యక్షం కావించుకొని శాంతిని పునరుద్ధరించు కోవలెనని కోరుతూ, ఇటీవల (1940 డిశంబరు) పోపు ఏడురోజు లుపవసించడమే ఉపవాస వ్రతముయొక్క ఉత్తమత్వాన్ని తెలియచేసే ప్రబల నిదర్శనం.

పికెటింగు - బహిష్కరణము

గాంధీ సత్యాగ్రహ కార్యక్రమంలో పికెటింగుకు మంచి స్థానముంది. 1921 లో కల్లు సారా దుకాణాలను, తరువాత విదేశీ వస్త్ర విక్రయ శాలలనూ పికెటింగు చేసేటప్పుడు ఈ మాట ఎక్కువ ప్రచారంలోకి వచ్చింది. పిదప కొద్దికాలం లోనే కోర్టులకు వెళ్ళే లాయర్లనూ పరీక్షలకు పోయే విద్యార్థులను, కౌన్సిళ్ళకు పోయే శాసనసభ్యులను పికెటింగు చేయడం ఆచారమైపోయింది. రీడింగుప్రభువు కాలంలో గాంధీ గవర్నమెంటుల మధ్య రాజీ సూచనలు భగ్నమై పోవడానికి కొంత కారణం పికెటింగే. 1931 ఫిబ్రవరి మార్చి నెలలోని గాంధీ ఇర్విను రాయబారాలు కూడా ఈ కారణంతోనే విచ్ఛిన్నం కావడానికి సంసిద్ధమైనవి. పికెటింగు సామాన్య చట్ట సమ్మతమైన నైతిక హక్కని, పికెటు చేయబడే మనుష్యులకు కానీ ప్రదేశాలకు కానీ అపాయం కలిగించకుండా ఉన్నంతవరకు వ్యతిరేక ప్రదర్శనాలు కానీ నిరసన నినాదాలు కానీ చేయకుండా ఉన్నంత

వత్తకు, పికెటింగును నిరోధించడం ఆపివేయడం కూడని పని అనీ గాంధీ వాదం. సమ్మెల సందర్భం లోనూ పికెటింగు సందర్భం లోనూ కూడా, యజమానులపైన గానీ సమ్మెలో నుండి చీలి పోయిన వారిపైన గానీ దౌర్జన్యం చేయకూడదని గాంధీ గట్టి నియమం చేశాడు. సమ్మెదారుల కారణం న్యాయ్యమైనదై వారిలో ఆత్మ విశ్వాసమూ ఐకమత్యమూ ఉంటేనే కాని సమ్మె ప్రారంభించ కూడదనే సంగతి, చెప్పకుండానే చదువరులు గ్రహించుకో గలరు.

1931 మార్చిలో జరిగిన గాంధీ ఇర్విన్ ఒడంబడికలో పికె టింగు వివరింప బడ్డది. అందులోనే బహిష్కరణమును గూర్చి కూడా ఒక ముఖ్యమైన భావం ఉదాహరింప బడింది. బ్రిటిష్ వస్తు బహిష్కరణమునకూ విదేశీ వస్తు బహిష్కరణమునకూ సూక్ష్మభేదం గలదని గాంధీ వివరిస్తూ ఉంటాడు. మొదటి దానిలో ఒక విధమైన ద్వేషం కనిపిస్తూన్నది కనుక పనికిరాదనీ, రెండవది కేవలం స్వయం సంపూర్ణతా స్వయం శక్తులను అభి వృద్ధి చేసుకోవడానికే ఉద్దేశింప బడినది గనుక అవలంబించ తగినదనీ గాంధీ వాదం కాబట్టి గాంధీ ఇర్విన్ ఒడంబడిక జరి గిన తక్షణం, 1931 మార్చి ఐదో తేదీన బ్రిటిష్ వస్తు బహిష్కా రోద్యమాన్ని గాంధీ నిలిపివేశాడు. పికెటింగు బహిష్కారము లకు సంబంధించిన గాంధీ ఇర్విన్ సంధి షరతు లొకసారి జ్ఞాపకం చేసుకో తగ్గవి.

విదేశీ వస్తు బహిష్కరణ సందర్భంలో రెండు విషయాలను మననం చేయాలి. ఒకటి, బహిష్కరణ లక్షణం, రెండు, దానిని ఆచరణలో

పెట్టడానికవలంబించే పద్ధతులు: ప్రభుత్వంవారి పద్ధతి ఇది: భారత దేశ భౌతిక పరిస్థితులను వృద్ధిచేసే నిమిత్తం ముద్రింపబడిన ఆర్థిక పారిశ్రామికోద్యమములోని భాగంగా, భారత దేశంలో తయారైన వస్తువులను ప్రోత్సాహ పరచడానికి వారంగీకరిస్తారు. శాంతి భద్రతలకు భంగంలేని పద్ధతిని, వ్యక్తి స్వాతంత్ర్యానికి అడ్డు తగలని సందర్భంలో, స్వదేశీ వస్తువుల ప్రదర్శనమునకు గాని, ప్రోత్సాహమునకు గాని, ప్రచారమునకు గాని నిరోధం కలిగించవలెనని కూడా వారు కోరరు. అయితే విదేశీవస్తు బహిష్కరణం (వస్త్రముల విషయంలో తప్ప- వస్త్ర బహిష్కరణం విదేశీ వస్త్రాలన్నిటికీ వర్తింపచేయబడ్డది) శాసనోల్లంఘనోద్యమ సమయంలో, కేవలంగా కాకపోయినా ముఖ్యంగా, బ్రిటిషు వస్తువులకు వ్యతిరేకంగా రాజకీయ ప్రయోజనముల కోసం ప్రయోగింపబడినది.

కాంగ్రెసు యొక్కయు, బ్రిటిష్ ప్రభుత్వము యొక్కయు, సంస్థానాల యొక్కయు, ఇంగ్లాండులోని రాజకీయ కక్షుల యొక్కయు ప్రతినిధులందరూ కలిసి రాజ్యాంగ ప్రణాళికను స్నేహభావంతో చర్చించడానికిటువంటి బహిష్కరణం అనుగుణంగా ఉండదనే ఉద్దేశంతో శాసనోల్లఘనం విరమింప బడడంతోనే బ్రిటిషు వస్తు బహిష్కరణోద్యమం కూడా విరమింప బడింది. అందువల్ల రాజకీయోద్యమం ప్రచండంగా జరుగుతూన్న సమయంలో ఉద్రేక పూరితులై బ్రిటిష్ వస్తువులను కొనడం గానీ అమ్మడం కానీ మానివేసినవారంతా, ఇష్టమైతే తమ వైఖరిని మార్చుకోవడానికేమీ అభ్యంతరం లేదని నిర్ణయింప బడింది. విదేశీ వస్తువులకు బదులుగా స్వదేశీ వస్తువులను ప్రోత్సహించే సందర్భంలోనూ, కల్లు సారాయీలను ఇతర మత్తుపదార్థాలనూ ఉపయోగించకుండా చేసే సందర్భంలోనూ, సాధారణ శాసనానికి అనుగుణంగా ఉన్నంతవరకు తప్ప అంతకు మించి పికెటింగు చేయకూడదని నిర్ణయించ

బడినది. అటువంటి పికెటింగులో నిర్బంధం కానీ భయపెట్టడం కానీ, నిరోధించడం కానీ, వ్యతిరేక ప్రదర్శనాలు కానీ, ప్రజలకు అడ్డంకు కలుగచేయడం కానీ ఉండకూడదు. శాసనబద్ధంగా వ్యవహరించాలి. ఎక్కడైనా ఈ పైన పేర్కొనబడిన అశాస్త్రీయ పద్ధతు లుపయోగింప బడినట్లు తెలిసినయెడల ఆచోట పికెటింగు తాత్కాలికంగా ఆపివేయ బడును.

"సత్యాగ్రహికి శారీరక శిక్షణ మవసరమా? అయితే అది ఏటువంటిదిగా ఉండాలి" అని తఱచుగా అడుగుతూంటారు. గాంధీ సత్యాగ్రహోద్యమాన్ని విరమించిన తరువాత 1934 మేలో స్వచ్ఛంద సైనిక దళోద్యమమును పునరుద్ధరించ వలసిందిగా ఆయనను కొందఱు బలవంతం చేశారు. అప్పటినుండీ ఆయన అందుకు వ్యతిరేకంగానే ఉన్నాడు. 1940 లో కొన్ని రాష్ట్రాలవారు స్వచ్ఛంద సైనికుల కిచ్చిన శిక్షణకు కూడా ఆయన ఇష్టపడలేదు. గాంధీ యీ విషయాన్ని గూర్చి పూర్తిగా చర్చించే ఉన్నాడు. ఆయన అభిప్రాయాలు సత్యాగ్రహ శాస్త్ర చర్చకు సన్నిహితంగా సంబంధిస్తూన్నవి. అవి ఇవి :

"సైనికశిక్షణ ఎలా ఉంటుందో మనకందఱికీ దగ్గరదగ్గరగా తెలియనే తెలుసు కాని అహింసా శిక్షణ దానికి భిన్నంగా ఉండాలని మన మెప్పుడూ అనుకోలేదు. పూర్వ మెప్పుడైనా ప్రపంచంలో ఎక్కడైనా అటువంటి శిక్షణ ఈయబడిందా అనే సంగతి తెలుసుకోనేటందుకు కూడా మన మెప్పుడూ ప్రయత్నించ లేదు. పూర్వ మటువంటి శిక్షణ ఈయబడు తూండేదనీ, ఇప్పుడుకూడా అక్కడక్కడా యాదృచ్ఛికంగా ఈయ బడుతూన్న దనీ నా అభిప్రాయం. హఠయోగంలోని వివిధ ఆసనాలూ దీనికి సంబంధించినవే. ఈ పద్ధతులలో ఈయబడిన శారీరక శిక్షణవల్ల, ఇతర గుణములతోపాటు ఆరోగ్యము, బలం, చురుకుదనం, శీతోష్ణము లను ఓర్చుకోగల శక్తి కలుగతవి.

పూర్వంనుండీ వస్తూన్న ఈ అహింసాత్మక వ్యాయామం ఇప్పటికీ ఆచరణలోనే ఉంది. కాని దీనిని ఇంకా అభివృద్ధి చేయడానికి అవకాశముందని నా తలంపు. ఈ శాస్త్రముయొక్క మూలపురుషుడు ప్రజా సమూహానికను సంబంధించిన అహింసా తత్వాన్ని ఉద్దేశించాడో లేదో నేను చెప్పజాలను. ఈ వ్యాయామం వ్యక్తి మోక్షము నుద్దేశించి యేర్పాటు చేయబడినది. ఈ ఆసనాలన్నీ శరీరాన్ని బలిష్ఠం గానూ పరిశుద్ధం గానూ చేసుకొని, మనస్సును స్వాధీన పఱచుకోవడాని కేర్పడ్డవి. మన ముద్దేశిస్తూన్న సమష్టి అహింస అన్నిమతాల వారికీ వర్తిస్తుంది. అందువల్ల అందరికి సంబంధించిన నియమాలు, అహింసలో నమ్మకమున్న అందరూ అంగీకరించేట ట్లుండాలి. అంతేకాక, మనమిప్పు డొక అహింసాసైన్యాన్ని అనగా ఒక సత్యాగ్రహ సంఘాన్ని నిర్మించాలని అనుకొంటూన్నాము. కనుక ఇదివర కున్నదానిని పునాదిగా తీసికొని కొత్తదాన్ని కట్టడం తేలిక. ఇక మనం సత్యాగ్రహికి కావలసిన శారీరక శిక్షణమును గూర్చి విచారింతము. సత్యాగ్రహి, మానసికం గానూ శారీరకం గానూ కూడా ఆరోగ్యంగా లేకపోయినట్లయితే నిర్భయత్వాన్ని అలవాటు చేసుకోలేడు.

అతడు రాత్రింబవళ్ళు ఒక్కచోటనే నిలచినవాడు నిలచినట్లుగా కావలి కాసే శక్తి గలిగి ఉండాలి; వానకూ ఎండకూ చలికీ ఓర్చుకోగలిగి, జబ్బు పడకుండా ఉండాలి; అపాయకర ప్రదేశముల లోకి పోవడానికీ, అగ్ని ప్రమాదాలు తటస్థించిన స్థలాలకు పరుగెత్తడానికి బలం కలిగి ఉండాలి; నిర్జనారణ్య ప్రదేశాలలోనూ శ్మశానభూముల లోనూ ఒంటరిగా తిరగడానికి తగిన ధైర్యంతో ఉండాలి; ఏమీ ఎదురాడకుండా దెబ్బలకు, ఆకలికి, అంతకంటే ఎక్కువ కష్టాలకూ ఓర్చుకొని తన స్థలాన్ని కదలకుండా నిలబడగలిగి ఉండాలి. లోపలికి పోవడానికి వీలు లేనట్లు కనిపిస్తూన్న దెబ్బలాటల మధ్యకు దూకేటందుకు తగిన ఉపాయమూ

శక్తి కలిగి ఉండాలి; మేడలపైన మంటలతో ఆవరింపబడిన మనుష్యులను రక్షించేటందుకు, భగవన్నామ స్మరణంతో పరుగెత్తే కోరికా సమర్థతా కలిగి ఉండాలి; వరదలో కొట్టుకొనిపోయే వారినీ నూతిలో మునిగిపోయే వారినీ రక్షించేటందుకు నీటిలో ఉఱుకగల ధైర్యంకలిగి ఉండాలి.

ఈ జాబితాను అంతులేకుండా ఎంతవఱకైనా పెంచవచ్చును. ఆపత్తులోనూ దుఃఖంలోనూ ఉన్న ప్రజలను రక్షించడానికి, మన మెటువంటి కష్టములనైనాసరే ఆనందంతో భరించగలిగిన శక్తిని సంపాదించవలయుననియే దీని సారాంశం. ఈ మూలసిద్ధాంతాన్ని అంగీకరించినవారు, సత్యాగ్రహుల వ్యాయామ శిక్షకు తగిన నియమాలను తేలిగ్గా నిర్మించగలరు. ఈ శిక్షణకంతకూ పునాది దైవభక్తి అని నాకు గట్టి విశ్వాసం. అదిలేకపోతే సంకటసమయం వచ్చేసరికి ఇంత శిక్షణమూ ఎందుకూ పనికిరాకుండా పోవచ్చు. దేవుడిపేరుచ్చరించడానికి సిగ్గుపడే వాళ్లెంతో మంది కాంగ్రెసులో ఉన్నారనిచెప్పి నా మాటలను తేలికగా తోసివేయకండి! నేను భావించి పెంచి పెద్దచేసిన సత్యాగ్రహ శాస్త్ర సిద్ధాంతాలను బట్టే మాత్రమే ఈ సంగతులు నేను మీకు చెప్పుతూన్నాను. ఎవరేపేరుతో ఆయనను ఎఱిగి ఉన్నప్పటికీ సత్యాగ్రహి చేతులో ఉన్న పరికరం దైవమే. అతడు లేకపోతే అతి భయంకరాయుధములు గల శత్రువు నెదుట, సత్యాగ్రహి సారంలేనివాడవుతాడు. ప్రపంచంలో అనేకమంది భౌతిక బలానికి పాదాక్రాంతు లవుతూంటారు. కాని దైవాన్నే రక్షకుడుగా నమ్మినవాడు అవనిపై గల అత్యంత శక్తివంతుడికికూడా తలఒగ్గడు.

సత్యాగ్రహికి దైవభక్తివలెనే బ్రహ్మచర్యం కూడా ముఖ్యం. బ్రహ్మచర్యం లేకపోతే సత్యాగ్రహికి తేజస్సు ఉండదు. ప్రపంచానికంతటికీ వ్యతిరేకంగా నిరాయుధుడై నిలబడగలిగిన ఆత్మబలముండదు. బ్రహ్మచర్యమంటే కామక్రియా నిగ్రహం కలిగిఉండి వీర్యశక్తి వృథా కాకుండా

ఉంచుకోవడమనే సంక్షిప్తార్థంలో ఇక్కడ వాడుతున్నాము. అంతేకాని ఇదివరకు నేనుచెప్పిన సమగ్రార్థంలో ప్రయోగించడంలేదు. కొద్ది భోజనంతో జీవిస్తూ వేటే బాహ్యాపచారాలేమీ లేనివాడు బలం కలిగి ఉండాలంటే, ఆయన వీర్యశక్తిని కాపాడుకోవలసిన అవసరముంది. మనిషి పొందగలిగిన అత్యంతమైన ఐశ్వర్యం అదే. దానిని నిలుపుకో గలిగినవాడు దానినుండి నూతన శక్తిని సంపాదించుకొంటూంటాడు. బుద్ధిపూర్వకంగాగాని అబుద్ధిపూర్వకంగాగాని దానిని వెచ్చించివేసి నట్లయితే చిట్టచివరకు క్షీణబలులైపోతారు. అవసరం వచ్చినప్పుడు తనబలం అక్కరకురాదు.

కాబట్టి సత్యాగ్రహి పొందవలసిన శరీర వ్యాయామ శిక్షణలో బల్లెము, కత్తి మొదలగు మారణ సాధనాలకు స్థానం లేదనే సంగతి ఇప్పటికి తెలిసి ఉంటుంది. ప్రస్తుత స్థితిలో ఇంతకంటెనూ ఎక్కువ భయంకర సాధనాలు ప్రచారంలో ఉన్నవి. ప్రతిరోజూ కొత్త కొత్తవి కనిపెట్ట బడు తూన్నవి. అటువంటి సమయంలో ఈ చిన్న మారణ సాధ నాలతో నేమి ప్రయోజనం? నిజమైనదిగానీ ఊహాజనితమైనదిగానీ అసలు "భయమనే" పదార్థాన్ని జయించే శక్తిని సంపాదించుకో దలచిన మానవునకు, కత్తి యేపాటి భయాన్ని పోగొట్టగలదు? కత్తిసాము తెలుసుకొనినంత మాత్రాన నిర్భీతుడైన మానవుణ్ణి నేనింతవరకు చూడ లేదు. మహావీరుడు కానీ తదితరులు కానీ కత్తిని ఉపయోగించడం తెలుసుకొన్నందువల్ల అహింసా తత్పరులు కాలేదు. కత్తుల ఉపయోగం వారికి తెలిసినప్పటికీ కూడా భయం విడిచిన కారణం చేతనే వారలా అయినారు.

కొంచెం అంతర్దృష్టి కలవానికి కత్తిమీద ఆధారపడి ఉండడం అలవా టయినతరువాత, దానిని విడచిపెట్టడ మెంత కష్టమో తెలుస్తుంది. కాని దానిని బుద్ధిపూర్వకంగా విడచిపెట్టిన వాని అహింస, కత్తి ఉపయో

గించడమే తెలియక, దానిని చూచి భయపడనని అనుకొనేవాని అహింస కంటె ఎక్కువ చిరస్థాయిగా ఉంటుంది. దీనినిబట్టి నిజమైన అహింసా తత్పరుడుగా ఉండవలెనంటే ప్రతివాడూ మొట్టమొదట ఖడ్గధారియై యుండి, దానిని ఉపయోగించడం తెలిసి ఉండవలెనని అర్థం కాదు. అలా అనుకోవడం, దొంగమాత్రమే మర్యాదస్థు డవుతాడనీ, రోగిష్ఠియే ఆరోగ్యవంతు డౌతాడనీ విషయాసక్తుడు మాత్రమే బ్రహ్మచారి కా వీలున్నదనీ అనుకోవడం వలెనే ఉంటుంది. నిజానికి మన ఆలోచనలన్నీ ఆచారాన్ని అనుసరించి ఉండడంచేత, అందులోనుండి బయట పడడం కష్టమౌతూన్నది. అంతేకాదు, మనం నిర్మమకారంతో ఆలోచించ లేనందువలన సరియైన నిర్ణయాలకు రాలేక మాయా వాగురలలో చిక్కుకొని పోతూన్నాము.

సత్యాగ్రహ శాస్త్రంలో మనం పరిశీలించ వలసిన వింకా రెండు అంశా లున్నవి. వాటితో గాని అది పరిపూర్ణం కాదు. అందులో ఒకటి ప్రార్థన, రెండోది దారిద్ర్య స్వీకరణము. ఈ రెండు విషయాలను గూర్చి స్వానుభవం లేనిది వ్రాయడం కష్టం. కాబట్టి వీటిని గూర్చి గాంధీ వ్రాసిన విషయాలనే ఉదాహరించడం యుక్తం.

ప్రార్థన

ప్రార్థన నాకు జీవరతు అయింది. అది లేకపోతే నే నెన్నడో పిచ్చి వాణ్ని అయి ఉండేవాణ్ని. నా ప్రజా జీవితం లోనూ వ్యక్తి జీవితం లోనూ కూడా అనేక కఠినతమములైన కష్టాలను అనుభవించాను. అవి తాత్కాలికంగా నన్ను నిరుత్సాహంలో ముంచివేసినవి. నేనా నిరుత్సాహంలో నుండి తప్పించుకో గలగడానికి కారణం ప్రార్థనయే. సత్యమువలె ప్రార్థన నా జీవితంలో ఒకభాగం కాదు. కేవలం అవస

రాన్నిబట్టి ప్రార్థనను అవలంబించాను. ప్రార్థన లేనిదే హాయిగా బ్రతుక జాలననే సందిగ్ధ స్థితిలో పడ్డాను నేను. దేవునిలో నాకు భక్తి కుదిరిన కొద్దీ ప్రార్థనలో నాకు ఆసక్తి యెక్కువ అయింది. అది లేని జీవితం జడం గానూ శూన్యం గానూ కనిపించింది.

నేను దక్షిణ ఆఫ్రికాలో క్రైస్తవ మత కైంకర్యాలకు హాజరవుతూండే వాణ్ణి. కాని అవి నన్ను ఆకర్షించలేక పోయినయి. నా క్రైస్తవ మిత్రులు దేవుణ్ణి దైన్య వృత్తితో యాచించేవారు. నేనలా చేయ జాలక పోయినాను. అందులో నేను పూర్తిగా అపజయం పొందినాను. దేవునిలోనూ ప్రార్థనలోనూ అపనమ్మకంతో ఆరంభించాను. చాలా కాలం వరకూ నా జీవితం శూన్యంగా నేను భావించలేదు. శరీరానికి ఆహారం అవసరమైనట్లు ఆత్మకు ప్రార్థన అవసరమనే సంగతి పెద్ద కాలానికి తెలిసింది నాకు. ఇంకా ఆలోచిస్తే నిజానికి ఆత్మకు ప్రార్థన అవసరమైనంతగా శరీరానికి ఆహారమంత అవసరం కాదు. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచవలెనంటే ఆహారం మానివేయవలసి వస్తుంది. ప్రార్థన మానివేయవలసిన తరుణం రాదు. ప్రార్థన విషయంలో అతి అనేది లేదు. ప్రపంచంలో అత్యుత్కృష్ట ప్రవక్తలుగా పరిగణింపబడే బుద్ధుడు, జీసస్, మహమ్మదు, ఈ ముగ్గురు కూడా ప్రార్థనద్వారా తమకు వెలుగు కనిపించిందనీ, అది లేకుండా తాము జీవించలేక పోయినామనీ ప్రకటించి విలువ లేని ప్రత్యక్ష ప్రమాణాలను మనకు చూపి వెళ్ళినారు. లక్షలాది హిందువులూ క్రైస్తవులూ మహమ్మదీయులూ కూడా ప్రార్థన వల్లనే ఊరడింప బడుతూన్నారు. వారిని నీవు అసత్యవాదులని గానీ, వట్టి భ్రమలో చిక్కుకొని బాధపడుతూన్నారని కానీ, తోసివేయాలి. అయితే అటువంటి "అబద్ధం" లో సత్యాన్వేషినైన నాకు ఆనందం కనిపిస్తూన్నది. అది లేకపోతే నాకు ఒక్క క్షణం కూడా స్థైర్యం ఉండేది కాదని నేను ధైర్యంగా చెప్పగలను. రాజకీయాకాశంలో నిరాశ నా

వంక దృష్టి నిగిడించి చూస్తూన్నప్పటికీ కూడ, నా మనశ్శాంతిని నేనెన్నడూ కోల్పోలేదు. పైగా నా మనశ్శాంతిని చూచి, తమరలా ఉండగలిగితే బాగుండు ననుకొనేవారి ననేకమందిని నే నెఱుగుదును. అది ప్రార్థనవల్ల వచ్చిన శాంతి. నేను పండితుణ్ణి కాను. కాని ప్రార్థనా పరుణ్ణి అనుకొంటూన్నాను. ప్రార్థన ఉండవలసిన పద్ధతిని గూర్చి నాకంత పట్టుదల లేదు. ఈ విషయంలో ఎవరికి తోచినట్లు వారు ప్రవర్తించ వచ్చును. కాని పూర్వ ప్రవక్తలు పోయిన పాత దోవలలో, వారి అడుగు జాడలను అనుసరించడం అపాయంలేని పద్ధతి.

మీకు దేవునిలో విశ్వాసం కలిగించడానికి నాకు శక్తి చాలదు. కొన్ని విషయాలు తమంతట తాము ఋజువు కావలసి ఉంటవి. కొన్ని ఋజువు కావడానికే వీలులేదు. దేవుని ఉనికి రేఖాగణిత మూలసూత్రం వంటిది. అది మనకు హృదయగోచరం కాకపోవచ్చు. బుద్ధి గోచరం సంగతి నేను మాట్లాడ దలచుకోలేదు. బుద్ధితో చేసే అన్ని ప్రయత్నాలూ దాదాపు భ్రాంతిపూరితములు. యుక్తివాదం మీకు నిజమైన దేవుడిలో నమ్మకం కలిగించ జాలదు. ఎందువల్ల ననగా అది యుక్తివలన సాధించ తగినది కాదు. అది అన్నియుక్తులనూ అతిక్రమిస్తుంది.

దేవుని ఉనికిని ప్రతిభాసింప చేయదగిన వనేక మహద్విషయా లున్నవి. కాని ఆ విధంగా యుక్తివాదంతో మిమ్ములను ఒప్పించడానికి ప్రయత్నంచేసి మీ తెలివితేటలను నే నవమానించ తలచుకోలేదు. కాబట్టి అన్ని తర్క వితర్కాలనూ అవతలబెట్టి దేవునిలో పసిపాపవంటి నిష్కల్మష విశ్వాసం కలిగి ఉండండి. నేను ఉంటే దేవుడూ ఉన్నాడు. నాకు సంబంధించినంతవరకు అటువంటి విశ్వాసం నా జీవితాని కవసరం. కోట్లకొలదీ ప్రజల విషయంలో కూడా అంతే. దైవభక్తిని గూర్చి వారు మాట్లాడలేక పోవచ్చును. కాని వారి జీవితమునుండి, అది వారి బ్రతుకులో భాగమని మీరు గ్రహించగలరు.

దారిద్ర్య స్వీకరణం

నేను రాజకీయ కోలాహలంలో పడిపోయినానని తెలుసుకోవడం తోనే, అవినీతికీ అసత్యానికీ రాజకీయ ప్రయోజనాలకూ దూరంగా ఉండవలె నంటే నేనేమి చేయవలసి ఉంటుంది, అని ఆలోచించుకోవడం ప్రారంభించాను. అప్పుడు నేనేమి చేశానో ఆ వివరాలన్నీ వినడానికి మీకు వినోదంగా ఉండవచ్చును గాని, నేనవి ఇక్కడ చెప్పదలచుకో లేదు. కాని మొదట్లో అది నాకు కృత్యాద్యవస్థ అయిపోయింది. నా భార్య తోనూ పిల్లలతోనూ కూడా కుస్తీ పట్టినంత పని జరిగింది. అది ఇప్పటికీ నాకు బాగా జ్ఞాపక మున్నది. ఆ సంగతి అలా ఉండనీయండి. ఏ ప్రజల కష్ట పరంపరలను నేను కళ్ళారా ప్రతిరోజూ చూస్తూన్నానో, ఆ ప్రజల మధ్య నేను జీవిస్తూ వారిని నేను సేవించవలెనంటే, నా భాగ్య భోగ్యాలను విడిచివేయడం ముఖ్యావసరమని నాకు గట్టిగా తోచింది. నాకిలా తోచిన తక్షణం నాదగ్గర ఉన్నదంతా త్యజించానని నేను మీకు నమ్మకంగా చెప్పజాలను. మొట్టమొదట ఈ అభిప్రాయాన్ని ఆచరణలో పెట్టడానికి చాలా జాగయింది. జాగవడమే కాదు, చాలా బాధగా కూడా ఉన్నట్లు జ్ఞాపకం. కాని కాలక్రమేణా నావి అనుకొన్న వనేకం నేను వదిలివేయవలసి వచ్చింది. ఆ తరువాత కొంతకాలానికి వాటిని వదలివేయడ మొక ఆనందంగా కూడా పరిణమించింది. పిదప అన్నీ ఒకటి తరువాత ఒకటి నా దగ్గరనుండి హారతికర్పూరం వలె హరించి పోయినవి. అప్పుడు నా నెత్తి మీద బరువంతా తీసివేసినట్లయింది. తేలికగా నడవగలిగాను. ప్రజాసేవ యెక్కువ చులుకుగానూ సుఖంగానూ సంతోషం గానూ కూడా చేయగలుగుతానని తోచింది. ఏమాత్రం మిగిలి ఉన్నా అప్పుడు నాకు చిక్కుగానూ బాధగానూ తోచేది. ఈ వర్ణించిందంతా నా అనుభవం.

ఆ సంతోషానికి కారణ మేమా అని ఆలోచించాను. "నాది అనుకొనేది ఉంటే దానిని రక్షించుకొనేటందుకు ప్రపంచమంతా ఎత్తి వచ్చినా ఎదురు నిలవడానికి నేను తయారు కావాలి. అంతేకాక అది తమకు కావాలన్నప్పటికీ రాక ఇబ్బంది పడుతూన్నవారు చాలామంది ఉన్నారు. కరువువల్ల ఆకలితో బాధపడుతూన్నవారు నన్నొంటరిగా చూచి, తమకు కావలసింది నా దగ్గరనుండి తీసుకోవడంతో సంతృప్తి పడక, నాకసలే లేకుండా చేద్దామని ప్రయత్నించినప్పుడు నేను పోలీసు సహాయం కూడా పిలవవలసి వస్తుంది. కాబట్టి వారికది కావలసి తీసుకొనే పక్షంలో, యే విధమైన దురుద్దేశమూ లేకుండా తీసుకోనీ. నాకంటె వారి కెక్కువ అవసరం కనిపిస్తూన్నది అని నాలో నే ననుకొన్నాను." అదే నా ఆనందానికి కారణం.

తరువాత మళ్ళీ ఇలా ఆలోచించాను : ఆస్తి కలిగి ఉండడమే అపరాధంగా కనిపిస్తూన్నది. కావాలంటే ఇతరులకు కూడా లభించేటందుకు వీలున్న వస్తువులనే నే నుంచుకోవాలి. కాని అనుభవం వల్ల అది అసంభవంగా కనిపిస్తుంది. కాబట్టి మనం చేయవలసిం దేమిటంటే ఏమీ ఉంచుకోక పోవడమే. అనగా ఉన్నదంతా బుద్ధిపూర్వకంగా వదిలివేయడం. అయితే ఉన్నదంతా వదలివేయ వలసిందని ఒకవంక ఉపన్యసిస్తూ నీ ఒంటిమీద ఇన్ని వస్తువుల నెలా ఉంచుకొన్నావు అని మీరు నన్నడగవచ్చును. ఇప్పుడు నేను చెప్పిన విషయాలను పైపైన అర్థం చేసుకొన్నట్లయితే మీ అవహేళనమున కవకాశ ముంది. కాని మీరు నా మాటలలోని ముఖ్యభావాన్ని గ్రహించండి. మీకు శరీర మున్నంతవరకు దానిని కప్పడానికి ఏదో ఒకటి కావలసి వస్తుంది. కాబట్టి మీ శరీరానికి మీకు లభించిందంతా ఉపయోగించకండి. ఎంత తక్కువ అవసరమో అంత తక్కువ ఉపయోగించండి. మీ రుండడానికి సౌధాలు కావాలని కోరుకోకండి. ఎంత కప్పు అవసరమో అంతతో సరిపుచ్చుకోండి. కూడు గుడ్డల విషయంలో కూడా అదే ఆదర్శంగా గ్రహించండి.

నేడు మనము నాగరికత అనుకొనే దానికిన్నీ, అంపటూ వాంఛించ తగిన స్వర్గ రాజ్యంగా చిత్రించి నేను మీకు ప్రదర్శిస్తున్న దానికిన్నీ, దిన దినమూ వైమనస్యం కలుగుతూండడం మీరు గమనిస్తూనే ఉన్నారు. పైపెచ్చు కోరికలను హెచ్చించుకోవడమే నాగరికతకు కావలసిన ప్రధాన సంస్కృతిగా కూడా భావింప బడుతూన్నది. మీకొక గది ఉండడం తోన్నే రెండు కావాలి, మూడు కావాలి, ఎన్ని ఉంటే అంత సంతోషం అనిపిస్తుంది. ఇక ఇల్లు నిండిపోయేటంతవరకూ గృహోపకరణాలు కావాలనిపిస్తుంది. అన్ని విషయాలలోనూ కూడా ఈలాగే కోరికల కంతుండదు. మీరెంత భోగం అనుభవిస్తూంటే అంత ఎక్కువ సంస్కారం కలిగినవారుగా అనుకొంటారు జనం. ఇప్పుడు నేను చెప్పినదంతా అనాగరికతను సమర్థించేవారు చెప్పగలిగినంత బాగా చెప్ప లేకపోయి ఉండవచ్చు. కాని నేను దానిని అర్థం చేసుకొన్న పద్ధతిని మీకు వివరించాను. ఇక మీరెంత తక్కువ భోగం అనుభవిస్తూంటే అంత తక్కువ కోరికలు కలుగుతయి. అంత ఎక్కువ హాయిగా ఉంటారు. హాయి అంటే మీ స్వీయ భోగం కాదు. మీ సోదర మానవులను మీరు సేవించే భాగ్యం కలగడం. మీ ఆత్మ, దేహం, మనస్సు, ఈ అన్నీ వారి సేవలోనే విని యోగించడం......ఈ దేహం కూడా మీది కాదని నమ్మండి. తాత్కాలికంగా ఇది మీ స్వాధీనంలో ఉంచబడింది. మీకీ శరీరం ఎలా వచ్చిందో ఆలాగే పోవచ్చు కూడాను.

కాబట్టి నాలో సంపూర్ణ విశ్వాస ముంచిన మీరు, దైవాజ్ఞ అయితే మీ శరీరాన్ని కూడా అర్పింప సంసిద్ధంగా ఉండాలని నా కోరిక. ఇక మీ శరీరం నా స్వాధీనంలో ఉన్నంత కాలము, భోగలాలసత్వముతోనూ ఐహిక సుఖానుభవముల తోనూ జీర్ణించి పోకుండా, మీరు మేలుకొని ఉన్నంతసేపూ ప్రజా సేవలోనే ఉపయోగ పడాలి. మీ శరీరానికే ఈ సిద్ధాంతాన్ని వర్తింప చేసినప్పుడు ఇక వస్తులు మొదలయిన వస్తువుల కెంత బాగా అనువర్తింప చేయవచ్చునో ఆలోచించండి......

ఎవరైతే ఈ పైన చెప్పిన ప్రకారం తమకు సాధ్యమైనంత సంపూర్ణ దారిద్ర్యాన్ని బుద్ధిపూర్వకంగా తెచ్చుకొని (ఈ సందర్భంలో పూర్ణత్వమును పొందడం అసాధ్యం కనుక సాధ్యమైనంత అంటున్నాను) ఆదర్శప్రాయులవుతారో వారు, నీవేమీ లేకుండా చేసుకొన్నప్పుడు ప్రపంచ భాగ్యమంతా నీపాలే అవుతుందని చూపగల ప్రమాణ పురుషులు కాగలరు. అనగా నిజంగా నీకవసరమైన దంతా నీకు వచ్చి తీరుతుంది. అన్నం అవసరమైతే వెంటనే అన్నం వస్తుంది.

మీలో అనేకమంది భజనపరులున్నారు. భజనచేసి భోజనం సంపాదించుకొన్నట్లుగా అనేకమంది క్రైస్తవుల నోటినుండి నేను విన్నాను. ప్రార్థన చేస్తే కావలసింది లభిస్తుందని వారంటారు. నేను నమ్ముతున్నాను. కాని ఇది చాలదు. నాతో కలసి ఇంకో అడుగు ముందుకు వేసి నన్ను నమ్మండి. నేను చెప్పినట్లుగా సర్వమూ విడచిపెట్టి శరీరాన్ని కూడా సమయం వస్తే సమర్పించడానికి సిద్ధంగా ఉన్నవాళ్ళు (వారు చాలా కఠినంగా అణువణువూ పరీక్షించుకొని తమకు తామే వ్యతిరేకంగా తీర్పు చెప్పుకొనేటందుకు తయారుగా ఉండాలి) నిజంగా లేనివాళ్ళు కారని వాళ్ళకే తెలుస్తుంది...... మళ్ళీ అన్నదానికంతా అక్షరాలా అర్థం తీయకండి. దేవుడంత కఠినుడు భూమండలంలో లేడు. అతడు మాటు మాటుకూ మిమ్మల్ని ఒరిసి చూస్తాడు. మీ విశ్వాసం చలిస్తున్నప్పుడు, మీ శరీరం దుర్బలమవుతున్నప్పుడు, మీరు కుంగిపోతున్నప్పుడు, ఏదో ఒక రూపంలో మీ కాయన సహాయపడి, మీరు విశ్వాసం కోల్పోకూడదనీ మీరు పిలవగానే తాను ప్రత్యక్షమౌతాననీ నమ్మకం కలుగచేస్తాడు. అయితే, ఆయన మీరు చెప్పినట్లు వినడు. ఆయన చెప్పినట్లు మీరు వినాలి. ఇది నా అనుభవం. అత్యంత సంకట సమయాలలో ఒకప్పుడు కూడా ఆయన నన్ను విడనాడినట్లు నాకు జ్ఞాపకం లేదు.

అధ్యాయము 8

మతము

శతృ మిత్రులతో సమాన శాంతి కలిగి మెలగవలెననీ, ప్రతి జంతువు తోనూ తాదాత్మ్యమును పొంది జీవించ వలెననీ గాంధీ యొక్క మహదాశయం. ఆయన జాతీయత కాని, దేశభక్తి కాని, పృథగ్భావాన్నీ ప్రబుద్ధ స్వార్థ పరత్వమునూ వెల్లడించవు. అవి "నిరంతర శాంతి స్వాతంత్ర్య సీమకు దారి తీస్తవి." అటువంటి సీమ ఈ భూమండలంలో లేదనీ చచ్చిపోయిన పిమ్మట పొందే స్వర్గలోకమనీ ఆయన అభిప్రాయం కాదు. అది కేవలం మన ప్రపంచానికి సంబంధించినదే ననీ మన మవలంబించ వలసింది కూడా లౌకికమార్గమే ననీ ఆయన మతం. కనుకనే ఆయన ఇలా అన్నాడు :

> మతం లేని రాజకీయాలు లేవు. అవి మతాన్ని అనుసరిస్తవి. మతాన్ని వీడిన రాజకీయాలు మృత్యు వాగురుల వంటివి. అవి ఆత్మను చంపుతయి.

మనిషి దేహాత్మల మిశ్రమ సమన్వయం. దేహం ఆధారం,- ఆత్మ ఆధేయం. కేవలం ఆధారం విషయంలో అతి జాగ్రత్త వహిస్తూ ఆధేయమును గూర్చి అశ్రద్ధ వహిస్తే, ఆత్మ నశించి దేహం అభివృద్ధి పొందుతుంది. అదే విధంగా అంతా ఆత్మయే అయి దేహం లేకనే పోతే, జీవితం ఒక అస్పష్టమైన అగ్రాహ్యమైన అతి సున్నిత పదార్థంగా తయారవుతుంది. గాంధీ యోగి యైనప్పటికీ సన్న్యాసి యైనప్పటికీ ప్రపంచమును ప్రాపంచిక వ్యవహారములను విడచిపెట్ట లేదు. భారత దేశపు యోగులు

వారు సేవించే ప్రదేశములను బట్టి తీర్థ, ఆశ్రమ, వన, అరణ్య, గిరి, పర్వత, సాగర, సరస్వతి, భారతి, పురి, మొదలగు పేరులతో వ్యవహరింప బడుతూన్నారు.

కాని గాంధీ నది సాగర పర్వత పట్టణ నగరాలను వేటినీ తన సేవా స్థలములుగా కోరుకోక, గ్రామమును తన నివాస స్థలముగానూ గ్రామీణులు తాను సేవించదగిన వారుగానూ నిర్ణయించుకొన్నాడు. వారి సేవలో తనకు ఆత్మావబోధం కలుగుతుందని ఆయన నమ్మకం. కాబట్టి ఆయనకు రాజకీయమూ మతమూ దేహాత్మల వంటివి. ఈ రెంటిలో ఏది లేకపోయినా లోపమే. అవి రెండూ జీవిత నాణెమునకు రెండు వైపులు. రెండూ కలిస్తేనే పూర్ణజీవిత మవుతుంది. ప్రత్యగాత్మ పరమాత్మతో అనుసంధానం పొందినప్పుడు కలిగే సంతోషం నుండి జనించిన అగ్రాహ్యానందం యొక్క జాడ్యస్థితియే సన్న్యాసమని మానసిక వైద్య శాస్త్ర నిపుణుల అభిప్రాయం. సన్న్యాసి అంతకంతకు లౌకిక జీవితానికి దూరమైపోయి స్వకర్మలను త్యజిస్తాడు. ఇంకా విశేష సందర్భాలలో పర్వతాల లోనో, గుహలలోనో ఏకాంతంగా విహరిస్తూ పరమాత్మతో సన్నిహిత సంబంధం కలిగి ఉంటాడు. ఆరావళీ పర్వతాలలో అనేక సంవత్సరాలు కడపిన బుద్ధుని చరిత్రములోనూ సెంటు క్యాథరీన్ ఆఫ్ సీనా, సెంట్ ఆంథోనీ, సెంటు ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సిసీ, మొదలగువారి కథలలోనూ, ఇంకా అనేక చోట్ల కూడా మత ప్రవక్తలు ధ్యాన నిష్ఠతో ఏకాంతంగా కొంతకాలం గడపి అప్పుడప్పుడు తమ మత వ్యాప్తి కోసం పీఠాధి పతులుగా బయలు వెడలుతూండినట్లు

మనం వింటున్నాము. గాంధీ జీవితంలో ప్రవృత్తి నివృత్తు లావిధంగా పరస్పర పరివర్తనం పొందుతూండడం మనము చూడలేదు. కాబట్టి గాంధీ, మతంతో రాజకీయాలను కలంగ దీస్తున్నాడని కానీ, రాజకీయాలతో మతాన్ని కళంకితంగా చేస్తూన్నాడని గానీ నిందించడం, మానవ సంఘాన్ని గానీ ప్రధాన జీవిత నిర్మాణ నియోగములను గానీ గ్రహించలేక పోవడం. ఆయన అహింసకు ఆధారమే యిది. ఆయనకు శత్రు మిత్రులు సమానులు. మనమీ యిరువురిలో ఎవరితో పోరాడ వలసి వచ్చినా అహింసా మర్యాదను అతిక్రమించ కుండానే పోరాడాలి.

తప్పో ఒప్పో కాని కాంగ్రెసులో మాత్రం మతాలను ఆధారంగా చేసుకొన్న తీవ్ర విభజనలు లేవు. మతం కేవలం వ్యక్తుల విశ్వాసానికి సంబంధించింది; మనిషికీ అతని సృష్టికర్తకూ మధ్య ఉండే బాంధవ్యాన్ని తెలియ చేస్తుందది. కాబట్టి ఏ మతమువారైనప్పటికీ మనుష్యులందఱికీ సంబంధించిన సామాన్య విషయాలు సమష్టిగా నిర్వర్తించుకో వలసిన వనేక ముంటవి. మతాలు మనుష్యులను చీలదీయ డానికి కాక వారిని ఐక్యం కావించడాని కుద్దేశింప బడినవి. మతాలు మానవులలో పరస్పర కలహాలకు హత్యలకూ కారణం కాకూడదు. ఇండియాలో అంతకంతకు మతం నశిస్తూన్నదని గాంధీ చాలా విచారపడుతూ ఉంటాడు. ఆయన మతము అని వాడినప్పుడు ఒక ప్రత్యేక మతాన్ని ఉద్దేశించక అన్ని మతముల లోను ఇమిడి ఉన్న ముఖ్యోద్దేశాన్ని ఉద్దేశించి వాడతాడు. "మనం దేవుడికి దూరమై పోతూ

న్నాము” అని ఆయన భయం. ఒకప్పుడు గాంధీ దేవుణ్ని "సత్యము” అని వర్ణించాడు. మఱొకప్పుడు ఇలా అన్నాడు :

> అనిర్వచనీయము, నిగూఢము, విశ్వవ్యాప్తము, సృష్టిస్థితి లయములకూ పునఃసృష్టికీ కారణభూతము, ప్రాపంచక నిరంతర పరిణామములకు మూలము, నిర్వికారము అయిన చేతనాశక్తి లేక భావమే దైవం.

గాంధీ సనాతన ధర్మపరుడు

ప్రపంచం లోని భక్తిపరులకు గాంధీ నిగూఢ పురుషుడు. ఆయన నేటి మతాలను కాదనడు. కాని వాటిలో ఉన్న విషయాలన్నిటినీ ప్రబోధించడు. తాను సనాతన ధర్మపరుడనని చెప్పుకోవడానికి చాలా గర్వపడతాడు. కాని ప్రత్యేకం ఒక్క వేదాలలోనో, లేక బైబిలు, కురాను, జెండ్ అవస్తాలలోనో మాత్రమే దైవతత్వం ఉన్నదనే మాట విశ్వసించ రాదని ఖండితంగా అంటాడు. ఆయన అన్ని మత గ్రంథాలకూ సమాన స్థానమిస్తాడు. సనాతన ధర్మ సౌధం, "అహింస", "సత్యము", "బ్రహ్మచర్యము", "అపరిగ్రహము" అనే నాలుగు మూల స్తంభాలమీద నిర్మింప బడినదని ఆయన మతం. వట్టి పాండిత్యం వ్యర్థమనీ, పాండిత్యంతోపాటు పవిత్రత కూడా ఉంటేనే రాణిస్తుందనీ ఆయన ఆశయం. ఆయన ఇలా వ్రాశాడు :

> వర్ణాశ్రమం మానవ ప్రకృతిలో పరంపరాగతంగా వస్తూన్న ధర్మం. హిందూమతం దానిని కేవలం శాస్త్రంగా చేసింది. అందులోని నాలుగు విభాగాలూ మనుష్యుల వృత్తులను వివరించినవే కాని సాంఘిక సంబంధాలను నియమించడం కానీ నిరోధించడం కానీ చేయలేదు.

అన్ని వర్గాలూ కూడా సమాన ప్రయోజన కరము లైన సాంఘిక సేవలకోసం ముద్దేశింప బడినవే. గాంధీ తన జీవితమును,

నాలుగు వర్ణాల యొక్కయు, నాలుగు ఆశ్రమముల యొక్కయు ధర్మాల నూత్న సంయోగమునకు స్థానంగా చేశాడు.

నాలుగు వర్ణ విభాగాలను పూర్వం వలె హద్దు మీరకుండా ఆచరణలో పెట్టడానికి వీలులేని ఈ యుగంలో, గాంధీ విజ్ఞానమును వెదజల్లే బ్రాహ్మణుడు గానూ, రక్షణ ఇచ్చే క్షత్రియుడు గానూ, ఐశ్వర్యాన్ని సమకూర్చే వైశ్యుడు గాను, ఉత్పత్తి చేసే శూద్రుడు గానూ ప్రాతినిధ్యం వహించి నిజమైన చాతుర్వర్ణ సంయోజకుడుగా వ్యవహరిస్తూన్నాడు. ఈ జీవిత విభాగం లోనే నాలుగు వర్ణాలకూ ప్రతిగా నాలు గాశ్రమాలు కూడా ఉన్నవి. వర్ణాలు హిందూజాతి అంతకూ వర్తిస్తాయి. ఆశ్రమాలు ప్రతి హిందువుయొక్క వ్యక్తిగత జీవితాన్ని నియమిస్తాయి. ప్రతి వ్యక్తీ మొదటి పాతిక సంవత్సరాలు బ్రహ్మచర్యాశ్రమం, తరువాత మరి పాతికేండ్లు గృహస్థాశ్రమం, పిమ్మట పదేళ్ళు వానప్రస్థాశ్రమం, చివరకు సన్న్యాసాశ్రమము స్వీకరించ వలెనని నియమింప బడినది. బ్రహ్మచర్యాశ్రమంలో జ్ఞాన సముపార్జనం, గృహస్థాశ్రమంలో భక్తిపూర్వక సంఘ సేవా పరత్వము, వానప్రస్థ సన్న్యాసాశ్రమములలో సర్వసంగ పరిత్యాగమూ ధర్మములుగా చెప్పబడెను. విగ్రహారాధనము మానవ ప్రకృతిలో భాగము. మానవు డెప్పుడూ రూపకల్పన చేసుకోకుండా ఉండలేడు. గాంధీ దీన్ని ఆక్షేపించడు. హిందూ మతం తక్కిన మతాలతో కలసి ప్రశాంతంగా కాలక్షేపం చేయగలదు. సత్యం తనలో తప్ప, తక్కిన మతాలల్లో లేదని అది యెన్నడూ చెప్పదు. కనుక హిందూ మతంలోకి ఇతరులను

కలుపుకోవడమనే పద్ధతి లేదు. గాంధీ జీవితంలోని చాలా విషయాలు, మనలను క్రైస్తవ సిద్ధాంతోపదేశములకు దగ్గర దగ్గరగా తీసికొని పోగలవు. కాబట్టే గాంధీ జీవితం ప్రపంచ విఖ్యాత క్రైస్తవ రాజకీయ చతురుణ్ని తనవైపు కాకర్షించుకో గలిగింది. "మీలోని ఉత్కృష్ట పురుషుడు మీకు సేవకుడుగా ఉండనిండు" అని జీసస్ అన్నాడు. ఆయనే గాంధీ.

హిందూమతం ఆత్మ స్వాతంత్ర్యం కోసం శరీర సుఖాలను త్యజించ వలసిందని ఆదేశిస్తుంది. అందువల్ల ఆ మతంలో ఆత్మ నిగ్రహం పరమావధిని పొందిందని గాంధీ తలంపు. ఆయన దృష్టిలో ఆవు "కరుణా గీతం" అది మానవునికి దిగువ మెట్టులో నున్న జంతు ప్రపంచాన్ని నిరూపిస్తుంది. లక్షలాది ప్రజలచే మాతృదేవిగా పూజింప బడుతుంది. హిందూమత ప్రకారం ప్రతి మనిషీ తన ధర్మాన్ని తాను నిర్వర్తిస్తూండాలి; అన్ని మతాలు పరస్పర శాంతితో వర్ధిల్లాలి; అది యుగ యుగాలనుండీ క్రమాభివృద్ధి పొందిన మతం. కాని అందులో అస్పృశ్యత, కణితి పెరిగినట్లు పెరిగింది. దానికి శస్త్రచికిత్స కావాలి.

గాంధీ క్రైస్తవమతం

గాంధీయే ఒకప్పుడిలా అన్నాడు:

మానవజాతికి మహోపదేశకు లైనవారికి లభించిన స్థానం ఒకరిస్తే వచ్చిందికాదు. వారి సేవనుబట్టి వారికది అధికారరీత్యా లభించింది. కాని దానినిగూర్చి కొన్ని అభిప్రాయాలను కలిగి ఉండడానికి మాత్రం సంఘంలో అట్టడుగునఉన్న జనులకుకూడా హక్కున్నది.

ఇక్కడ గాంధీ "ఈయడం", "పుచ్చుకోవడం" అనే మాటలలో బుద్ధిపూర్వకంగా భేదాన్ని నిరూపిస్తూన్నాడు. మహాపురుషులకు తాను గానీ తదితరులు గాని స్థానాన్ని యిస్తున్నామనుకొని అహంకార పడడం తప్పని ఆయన తలంపు. దీనినిబట్టి గాంధీ, భారత దేశపు మహర్షుల యొక్కయు స్వధర్మం కోసం ప్రాణాలను త్యజించిన మహానుభావుల యొక్కయు యశో మందిరములోనూ, ప్రపంచ మహాపురుష సమ్మేళనంలోనూ, తన స్థానాన్ని తా నిదివరకే నిర్మించుకొని ఉన్నాడన్నమాట సత్యము. కుటుంబముయొక్క విస్తృత రూపమే సంఘమని గాంధీ ఉద్దేశం. అందువల్ల సంఘ సమస్యలను విచారించడంలో కుటుంబ సంబంధమైన ఉదాహరణా లెక్కువ సహకారాలుగా ఉంటవని నమ్ముతాడాయన. మనకూ ప్రపంచ ప్రవక్తలకూ గల సంబంధం దాదాపు భార్యా భర్తల సంబంధం వంటిది. అందువల్ల హృదయంలో పీఠం పెట్టుకొని ఉన్న భార్యకు "ఏటు వంటి స్థాన మిద్దామా అని బుద్ధితో ఆలోచించడం ఎంత భయంకర విషయమో ఎంత విషాద భూయిష్ఠమైన సంగతియో ప్రపంచ ప్రవక్తల కీయదగిన స్థానమును గూర్చి యోచించడం కూడా అటువంటిదే" అని గాంధీ భావం. ఎంత సత్యము! "ప్రపంచ మహా ప్రవక్తలలో జీసస్ ఒకడు. ఏ మతానికి చెందినవారైనా సరే పరమత సిద్ధాంతాలను పరిశీలించి నందువల్ల హృదయం సంకుచితం కాదు; విశాల మవుతుంది. అన్ని మతోప దేశాలనూ భక్తిపూర్వకంగా పఠించడమే ఉత్కృష్ట విద్యా పద్ధతి. మనస్సంస్కారం హృదయ సంస్కారానికి

లోబడి ఉండడమే విద్యకు మూలంగా ఉండాలి" అని గాంధీ ఉపదేశించాడు. ఆయన ఇంకా ఇలా అన్నాడు :

"దేవుడు" అనే మాటకు మనలో ఒక్కొక్కరు ఒక్కొక్క అర్థం చెప్పుకో వచ్చును. మనకలా చెప్పుకోక తీరదు. ఎందువల్లనంటే దేవుడు మన ఈ ఒక్క అల్ప గోళాన్నే ఆవరించి లేడు. ఇటువంటి గోళాలను అర్బుదాల కొలదీ ఆవరించి లోకాలపై లోకాల కతీతుడుగా ఉన్నాడు. ఈ నేలపైన పాకే చిన్ని కీటకములవంటి మన మేవిధముగా ఆయన మహత్త్వాన్ని, ఆయన అనంత ప్రేమను, నిరంతర కరుణనూ ఎన్నగలము? మనిషి గర్వంతో ఆయనను తృణీకరించి నప్పటికీ, తోడి మానవుల కుత్తుకలు కోసినప్పటికీ, దేవుడుపేక్షాభావం వహించడం ఆయన అనంత కరుణా ప్రేమలకు చిహ్నము.

గాంధీ ఇటీవల వ్రాసిన వ్రాతలను బట్టి ఆయన విశ్వాస మీ దిగువ విధముగా నున్నట్లు కనిపిస్తున్నది.

దైవ నియతిని దాటకుండా ఉండడమే మతమని సిద్ధాంతీకరించ వచ్చును. దైవం అన్నా, దైవనియతి అన్నా ఒక్కటే. కాబట్టి దేవుడంటే నిర్వికార చైతన్యమని అర్థ మవుతుంది. నిజానికి ఆయనను ఎవ్వరూ ఎప్పుడూ చూడలేదు. కాని అవతార పురుషులు మహర్షులు తమ తపోబలం ద్వారా దైవతత్త్వాన్ని మనకు మసక మసకగా చూపించి, మన హృదయాలను పరిశుద్ధంగానూ పవిత్రంగానూ చేసుకొనేటందుకు మనలో ప్రతివానినీ నిష్కళంకమైన నీతిని పాటించ వలసిందిగా నియోగించారు.

మత ప్రచారకులకు సలహా

సింహళ దేశంలోని క్రైస్తవ మత ప్రచారకుల కాయన ఈ విధంగా ఉపదేశించాడు :

మనం, మన మాటల వల్లను, చేతల వల్లను, మన మతంలో కలుపుకో చూడడం అనవసరం. మన ప్రవర్తన వల్లనే ఆ పని చేయవచ్చును. మన జీవితాలు పఠించడానికి తగిన బహిరంగ గ్రంథాలుగా ఉండనీయండి.

అంతటితో ఊరుకోక ఇంకా ఇలా అన్నాడు :

నైతిక ప్రధాన సిద్ధాంతాలకు విరుద్ధం కానంతవరకు ఈ దేశ ప్రజల ఆచార వ్యవహారాలలో బుద్ధిపూర్వకంగా గానీ అబుద్ధిపూర్వకంగా గానీ బలవంతంగా జోక్యం కలిగించుకోకండి. ప్రాచ్య ప్రజల జీవిత మూలాలను త్రెంచివేయడం మీ ధర్మంలో భాగం కాదని నేను మీకు గట్టిగా చెప్పగలను. వినయము, స్వాభిమానము ను దేశభక్తినీ మించిన సుగుణం.

మిషనరీలకు చెప్పిన ఈ మాటలాయన అసామాన్య ధైర్యాన్ని వెల్లడిస్తూన్నవి.

క్రీస్తు ఉపదేశించిన ప్రధాన సిద్ధాంతానికీ క్రైస్తవజాతుల జీవితానికీ గల భేదాన్ని యోజించినట్లయితే "ఈనాడు క్రైస్తవ మతంగా వ్యవహరింప బడుతూన్నది చాలావరకు క్రీస్తు ప్రధాన సిద్ధాంత తృణీకరణమే" నని గాంధీ అభిప్రాయం. "జీసస్ స్వధర్మంకోసం ప్రాణాలను త్యజించిన మహానుభావుడు; త్యాగమూర్తి; దివ్యోపదేశకుడు; కాని పూర్ణపురుషు డనడానికి వీలులేదు" అని ఆయన తలంపు. త్యాగబుద్ధిలో హిందువులు క్రైస్తవులను అతిక్రమించారనియే గాంధీ విశ్వాసం. ఆయన హిందూ మతాన్నిగూర్చి ఇలా అన్నాడు :

నే నర్థం చేసుకొన్నంత వరకు హిందూమతం నా ఆత్మను సంతృప్తి పరుస్తూన్నది. అది నా ఆపాదమస్తమూ ఆవరించి ఉన్నది. క్రీస్తు ప్రధాన సిద్ధాంతంలో కూడా కానని ఊరడింపు, నాకు భగవద్గీతలోనూ ఉపనిషత్తుల లోనూ కనిపిస్తూన్నది.

గాంధీ అన్ని మతాలనూ పరిశీలించి అన్నీ సరియైనవే ననీ, కాని అన్నీ అసమగ్రంగానే ఉన్నవనీ అర్థం చేసుకొన్నాడు. "హిందూ దేశంలో ప్రతి దృశ్యమూ ఆనంద జనకంగానే ఉంటుంది. కాని మానవుడే కొఱగానివాడు. పంచముని చిన్ని గుడిసెలో సత్య దైవములు మూర్తీభవించి ఉన్న దేశమిది."

మతము - అతీత శక్తులు

మానవునికి ప్రత్యేకం బయట గాని ప్రత్యేకం లోపల గానీ లేని విశ్వవ్యాప్తమైన శక్తి ఒకటి ఉంది. అది సమగ్ర జ్ఞాన బలములు గల అతీతశక్తి. దానిద్వారా, జీవితంలో సమన్వయం కాని అనుభవాలను సమన్వయం చేసుకొనే నిమిత్తం ఉపయోగ పడే మూలసిద్ధాంతమే మతం. మనిషి శీలమునూ జ్ఞానాన్ని అభివృద్ధి చేసేటందుకే మత ముద్దేశింప బడ్డదన్న మాటను ఎవ్వరూ కాదనరు. ఉపదేశములతోనూ ఆచారములతోనూ పాటు, కొన్ని వాదాలను కర్మకాండలనూ కూడా, మతం తప్పనిసరిగా ప్రచారంలోకి తీసికొని వచ్చినది. ఒక మతంలో విశ్వాసమును ప్రకటిస్తూ మఱియొక మతములోని ఆచారాలను అవలంబిస్తూన్నందువల్ల విశాలదృష్టీ, సమబుద్ధీ అలవడడాని కవకాశం ఉన్నమాట వాస్తవమే. మతాలు మూఢభక్తిని కలి గించి ఉండవచ్చును. కాని అవిశ్వాసాన్ని పురికొల్పి భావోద్రే కాన్ని పెంపొందింప చేస్తవి. అవి ప్రజలను విజ్ఞాన వంతులుగా చేసి, సేవాసక్తినీ త్యాగబుద్ధినీ వారిలో కలిగించడానికి సహాయ పడుతవి. స్వార్థాన్ని త్యజించి ఇతరుల మంచిని గూర్చియే

నిరంతరం ధ్యానించడంవల్ల, ఉత్తమజ్ఞానం కలిగి మనిషిలో ఉదార శక్తులు విజృంభింపవచ్చును. మనం స్వాభావిక జ్ఞాన మని చెప్పే అతీత శక్తులు పక్షులకూ జంతువులకూ ఉన్నవి. సృష్టిలో ఇతర విధంగా ఉన్నతదశలో నున్న మానవులకు గల మాట్లాడే శక్తీ, ఆలోచనాశక్తీ అనే సాధారణ శక్తుల నవి అభివృద్ధి చేయక పోయినందువల్లనే, ఆ అతీతశక్తులు వాటికి లభ్యమైనవి. కాని మనిషి నిద్రాహారములను విడచి, శరీరాన్ని వశపఱచుకొని, మౌనవ్రతమును పూని, తన అధికశక్తులను ప్రతి రోధించుకోవడంవల్ల, దిగువ మెట్టులోనున్న జంతువుల అతీత శక్తులను అభివృద్ధి చేసుకోవచ్చును. ఈ విధంగా మనిషికి భవిష్యద్దృష్టి తేలికగా యుక్తాయుక్త వివేకము, ఇంద్రియ నిగ్రహమూ అలవడతవి. అటువంటి మహాశక్తులను దుర్విని యోగం చేస్తే, అవి నెత్తి అపస్తయ్యని సాధువులు, మంత్ర వేత్తలు, మహర్షులూ అంటారు.

కాబట్టి ఈ శక్తులను ప్రజల క్షేమంకోసం ఉపయోగించ వలెనేకాని స్వార్థం కోసం వినియోగించుకోరాదు. జీసస్ తన మూడేండ్ల సేవ వల్లనూ అద్భుతమైన పలుకుబడిని సంపా దించడమే కాక అనేకమంది ఆగ్రహమునకు పాత్రుడైనాడు. ఇందుకు ముఖ్యకారణం- ఆయన వారందఱికీ లోబడక పోవ డమేగాక తన అద్భుత శక్తులను బహిర్గతం చేయ నిచ్చగించ కుండుట కూడాను. ఇదంతా ఏదో నిగూఢ తత్వంగానూ అహంకారోన్మాదంగానూ తోచవచ్చును. కాని మతవిశ్వాసం కలిగి యున్నప్పటికీ కర్మానుష్ఠానాలలో పడిపోక, భక్తి పను

డైనప్పటికీ భావోన్మాదుడు కాక, నూలువడకడమే మత సంస్కార విధిగా భావిస్తూ దంభాచార పరుడు గాక, గాంధీ తన జీవితంలో ఈ సిద్ధాంతాలను ఏవిధంగా ఆచరణలో పెడుతూన్నాడో గ్రహించవలసి యున్నది. సనాతన ధర్మపరునికి "సంధ్యావందనము", "బ్రహ్మయజ్ఞము", "పితృతర్పణము" వలెను, మౌల్వీకి "వాజూచ్", "పాంచ్ నమాజ్" వలెను, క్రైస్తవ గురువులకు "ప్రభుప్రార్థనము వలెను ఆయనకు నూలు వడకడమొక పవిత్ర నిత్యకర్మ. "ఇచ్ఛా బుద్ధులమధ్య జరిగే సంవాదమే ధ్యానమని" గాంధీ అభిప్రాయం. ఆయన యెప్పుడూ సత్యాన్ని అతిక్రమించిన భావ ప్రపంచంలో విహరించడు. నిత్యజీవిత సమస్యలను గూర్చియే ఆయన తన మనస్సును వినియోగిస్తాడు. ప్రభుత్వం నడపే ప్రధానమంత్రి అన్ని శాఖలలోని కార్యక్రమాన్ని సంయోగ పఱచుకొని సమన్వయం చేసుకొంటాడు. గాంధీ మద్యపాన నిషేధము, ఖద్దరు ఉత్పత్తి ఖద్దరు ప్రచారం, అస్పృశ్యతా నివారణము, గ్రామపరిశ్రమలు, ఈ అన్నిటిని సమన్వయం చేసుకొని సాగిస్తూ, ప్రపంచమంతా ఒక కుటుంబ మనుకొని అందులోని ప్రతి భాగాన్ని ఆయన స్వయం సంపూర్ణంగా చేయకోరుతూన్నాడు. ఇందుకొఱకు ప్రపంచంలోని తదితర భాగాల కాదర్శంగా ఉండేటట్లు భారత జాతీయ జీవితాన్ని ముందు పరమావధికి తీసికొనిపో ప్రయత్నిస్తూన్నాడు. ఈ విధంగా ప్రపంచములోని అన్ని దేశాలూ స్వయం సంపూర్ణములై, ఒకే సమ్మేళనముగా చేరినప్పుడది, నైతికంగానూ ఆర్థికంగానూ వంక పెట్టడానికి వీల్లు

లేని సుందర కళామందిరంగా తయారు కాగలదు. ఇదే గాంధీ దృష్టికి ప్రత్యక్షంగా కనిపిస్తూన్న మతం.

ఈ సందర్భంలో స్టీవెన్ హాబ్ హౌస్ చెప్పిన కథ ఒకటి వ్రాయవలసి ఉంది. జర్మన్ సైలీషియాలోని గార్లిబ్స్ పట్టణంలో, యాభై యేండ్లకిందట ఒక అజ్ఞాత క్రైస్తవ మహా పురుషుని శిలావిగ్రహం నిర్మింప బడింది. ఆయన పేరు జాకబ్ బోహ్మం. ఆ విగ్రహం నిలబెట్టబడిన వేదికపైన "మా ఆయుధం ప్రేమ, వినయము" అని వ్రాయబడి ఉన్నది.

దాని శక్తి

పట్టి రాజకీయ వేత్తకు వినయమనగా ఏమిటో తెలియదు. తెలియక పోవడమే కాదు అతనికి అసలు పనికిరాదు. "నాలో వినయం లేదు. నా నిఘంటువులో దానికి స్థానంలేదు" అన్నాడొక నాయక శిఖామణి ఒకనాడు. ఆయన నిఘంటువులోనే కాదు, ఆయన జీవితంలో కూడా లేదు. అయితే అప్పుడప్పుడూ మన అభిప్రాయాలను స్పష్టమైన వినయపూర్వక భాషల్లో వెల్లడిస్తూంటారు. కాని అది భాషా సౌష్ఠవంకోసం చూపించే వినయం కాని నిజమైన వినయం కాదు. గాంధీకి ఉన్న శక్తి అంతా ఆయన వినయంలోనే ఇమిడి ఉంది. అహింస అనగా అందరియెడలా ఔదార్య ప్రేమలను గలిగి ఉండడమే అయితే, అహింసావలంబకుడు నిష్కామం గానూ, తనది అనేది లేకుండానూ ఉండాలి. అప్పుడు తప్పకుండా అతనికి వినయం వస్తుంది. అందువల్ల స్వీయ ప్రతిష్ఠకోసం కాక పరులకోసం సేవ చేస్తూం

టాడు. ఆయన కరుణ, అనుగ్రహ పరత్వంతో కళంకితం గాక నిర్మలంగా ఉంటుంది. వినయము నిర్మమత్వము, వినయము నిష్కామము, వినయము బ్రహ్మచర్యము, ఇవన్నీ కారణ కార్యములవలె పరస్పర సంబంధము కలవి. వీటి సంచలన ఫలితంగా మధ్య తేలిన స్వార్థపరత్వమనే ఒండును కిందకు తోసివేయగా ప్రేమ, బాధా సహిష్ణుత, పవిత్రభావము, గర్వరాహిత్యము, విశ్వాసము, నిష్కామము, నిర్భీతి అనే సుగుణముల నిర్మల ద్రవ పదార్థంపైన నిలచి ఉంటుంది. "వినయవంతు లదృష్టవంతులు. వారు భూమండలానికి వారసులయి తీరుతారు" అని క్రైస్తు రెండువే లేండ్లకిందట అన్నాడు. ఈ రోజున కూడా ఆమాట నిజమే. కాని వారికి వినయంలో విశ్వాసం మాత్రం ఉండాలి. గాంధీకన్న ఎక్కువ బాగా మాట్లాడగలవాళ్ళు చాలామంది ఉన్నారు. ఆయనతో సమానంగా చక్కగా వ్రాయగలవాళ్ళు కూడా కొంతమంది ఉన్నారు. ఆయనకన్న భాగ్యవంతులు లక్షోపలక్షలున్నారు. కాని సాధారణపు ఎత్తుకంటె తక్కువ ఎత్తు, సామాన్యపు ఆరోగ్యముకంటె తక్కువ ఆరోగ్యము, మామూలు సామర్థ్యంకంటె ఏమీ కొంచెమో ఎక్కువ సామర్థ్యం గల ఈ మనిషి, రాజులను రాష్ట్రాధిపతులనూ లోబరచుకొన్నాడు. నిరంకుశాధికారులను ప్రజాప్రభుత్వ వాదులనూ కూడా ఆకర్షించాడు. పండితులకు ప్రాజ్ఞులకూ, ప్రధానులకు ప్రభువులకూ, ఆర్థికశాస్త్ర నిపుణులకు మత పీఠాధిపతులకూ, సమానంగా గౌరవపాత్రుడు నమస్కారార్హుడూ అవుతూన్నాడు. దీనికి కారణం ఆయన బుద్ధివిశేషం కాదు; అనేక

ఉపన్యాస వేదికలపైన ఉపన్యసించి నందువలన కాదు; ఆయన ఉపదేశించిన ఆర్థిక సిద్ధాంతాల వల్లను, నీతిసూత్రముల వల్లనూ కాదు; ఆయన గంభీర భాషణములు కాని, సూత్రప్రాయ సుభాషితములు గానీ ఇందుకు హేతువులు కావు. కాని ఆయన అనుకొన్నది చెప్పి, చెప్పింది చేస్తాడు. పరమ పవిత్రంగా జీవితాన్ని నడుపుతాడు. ఇదే ఆయన జీవిత రహస్యం. శౌర్యమంటే ఆయనకేమీ మోజులేదు. కీర్తి ఆయనకు లెక్కలేదు. సంఖ్యా బలంపైన ఆయన ఆధారపడడు. ఒంటరిగా ఉండడానికి కల్లోలపడడు; కటికి చీకట్లో ఏకాంతంగా కూర్చొని జ్ఞాన చక్షువుతో వెలుతురును చూడగలడు; తర్క వితర్కాలను లెక్కపెట్టక అంతర్వాణి చెప్పినట్లాయన నడచుకొంటాడు. స్వార్థము, గర్వము, కోరిక, భయము- వీటిని త్యజించినందువలన ఆయనకు యోగదృష్టి లభించినది. మానవునిలోని సహజాంతరంగ జ్ఞానాన్ని ఆయన అభివృద్ధి చేసుకొన్నాడు. వినయము వలన ఆయన వేలకొలది సుగుణాలను పొందగలిగాడు. "మానవుని గొప్పతనానికి అంతులేదు. కాని దాని గాంభీర్యాన్నిబట్టి అది శాశ్వతంగా ఉంటుంది" అని చెప్పగా విన్నాము. వినయమే దాని గాంభీర్యాన్ని తెలియచేసే గుణం.

వినయమువంటి లేక వినయమునకు విరుద్ధమైన గుణంచేత కూడా మనిషి వినయవంతుడివలె కనపడవచ్చు. జీవితంలో గర్వం వినయంగా ఎప్పుడు కనిపిస్తుందో, వినయం వినయంగానే యెప్పుడు ప్రత్యక్షమాతుందో తెలుసుకోవడం కష్టం. క్రియలో రెండూ ఒకటిగానే ఉంటయి. కాని రెండింటికీ వెనుకఉన్న

ఉద్దేశాలలో భేదముంది. ఉత్సవాలు, అభినందన పత్రాలు, ఛాయాపటాలు, పూవుల దండలు, ఇవన్నీ వద్దనడం ఆచార పరంపరగా వచ్చే ఈ గౌరవాలను గర్వంతో తృణీకరించడమూ కావచ్చు, లేక అంతఃశ్శుద్ధిగా నిరాడంబర జీవితమును కోరే వినయమూ కావచ్చును. కాని అది మొదట గర్వంగా ప్రారంభమైనప్పటికీ, నిరంతరం అలాగే చేస్తూన్నందువల్ల కొంతకాలానికది సరియైన వినయ గుణములోకి మారుతుంది. వినయం బలాన్ని చేర్చిపెట్టే శక్తిగా మారుస్తుంది. పాండిత్యం, ఐశ్వర్యం, ఆడంబరం, అహంకారం, ఇవన్నీ కలిగించజాలని నైతిక సంవేగాన్ని అభివృద్ధి చేస్తుంది వినయం.

"సోవియటు యువకులకు" ప్రొఫెసర్ ఇవాన్ పావ్‌లావ్ ఉపదేశించిన మాటల నిక్కడ ఉదాహరిస్తూన్నాము :

మీరు వినయవంతులు కావాలని కోరిక. అన్నీ మీకే తెలుసుననుకోకండి. ఎక్కువగా ఎవరైనా పొగిడేటప్పుడు "నే నజ్ఞానిని" అని చెప్పగల ధైర్యం ఉండాలి మీకు. గర్వానికి దాసులు కాకండి. అది లొంగిపోవలసిన చోట పెంకెతనం చూపేటట్టు చేస్తుంది; స్నేహితుల సలహా సహాయాలను అంగీకరింపనీయదు; వాస్తవికతను సరిగా గ్రహించే శక్తిని నశింపచేస్తుంది. ఈ మానవ సమూహంలో సాధారణ వాతావరణాన్ని బట్టి ప్రతివిషయమూ ఆధారపడి ఉంటుంది. మనమంతా కలిసి పనిచేస్తూన్నాము. మనలో ప్రతి ఒక్కరు తమ తమ శక్తి సామర్థ్యాలను బట్టి సహాయ పడుతూన్నారు. కాబట్టి "నాపని" "నీపని" అని విడదీయజాలము. అందువల్ల మనకందరికీ సంబంధించిన పనికి లాభం కలుగుతుంది.

గాంధీజీ ఒకరోజున ఆకు కూరలు, ఎండురొట్టె, దవడలు నొప్పిపట్టేటట్టు నమలుతూన్నాడు. "మీరు భోజనం బాగా భుజిస్తూన్నారా మహాత్మాజీ!" అని ఈ గ్రంథకర్త ఆయనను ప్రశ్నించాడు "ఓ!" అన్నాడాయన. "గమగమ లాడుతూ కమ్మగా ఉందా?" అన్నాడు మళ్ళీ ఈ గ్రంథకర్త "సరి! అది నాకు తెలియదు" అన్నాడు గాంధీ. నిజానికి మనం మన భోజనం కోసం ఏరి కోరి తెచ్చుకొన్న వస్తువులను ఎలా చెయ్యాలో చెప్పి, ఆ ప్రకారం తయారుచేస్తే గమగమలాడుతూ కమ్మగా ఉంటయి. అవి తిని మనం తృప్తి పడతాము. కాని గాంధీ ఇంద్రియ వాంఛలను నిగ్రహించుకో వలెననే తత్వంలోని మనిషి గనుక, ముందుగా ఆయన జిహ్వేంద్రియ నిగ్రహమును ప్రారంభించాడు. ప్రాపంచక భోగలాలసత్వం అనేక పాపాలకు దారి తీస్తుంది- ముఖ్యంగా జీవితానికి కావలసిన దానికంటె ఎక్కువగా కూడబెట్టడం- అందువల్ల సంఘంలో, హెచ్చు తగ్గులు- మహా వృక్షాలకూ కుక్కగొడుగులకూ ఉన్నంత హెచ్చుతగ్గులు కలగడం- ఇవన్నీ తటస్థిస్తయి. ఇంద్రియ నిగ్రహం కంటె కూడా ఉదాత్త సద్గుణం మరొకటున్నది. అది అపరిగ్రహము. ఈ సద్గుణాలను ఆచరణలో పెట్టినప్పుడు, పరసేవా పరత్వమునందు జీవితమును వినియోగించడానికి సావకాశం కలుగుతుంది. భయము, కోరిక- ఇవి ఉండవు. అందువలన సత్యాహింసలను సరిగా అవలంబించ వచ్చును.

భారతీయులకు తెలిసింది, పరాయివాళ్ళకు తెలియనిది ఇంగ్లీషులో చెప్పడానికి వీలులేనిదీ మరొక ఉత్కృష్టగుణం

ఉంది. అది పూర్వఋషులు తపస్సు- అంటే యమ దమ ధర్మ దాన శౌచ క్షమా గుణాలను కలిగి ఉండడమే. నిష్కళంక పరివర్తనము, విశ్వప్రేమ, ఇవి జీవిత ముఖ్య ధర్మాలు.

మతము - రాజకీయాలు

మత రాజకీయ సాంఘిక విషయాలను వేరువేరుగా తలంచే పాశ్చాత్యులకు గాంధీ అర్థంకాడు. వార్ధాకు వచ్చిన క్రైస్తవ యాత్రికులు కొందరు, భారతదేశంలో గాంధీ చేసే సేవకు మూలోద్దేశ మేమిటని ఆయన్ని ప్రశ్నించారు. వెంటనే "మతోద్దేశం తప్ప మరేమీ లేద"ని జవాబిచ్చాడు. "నేను విశ్వమానవ సంబంధం కలిగి ఉంటేనే గాని భక్త జీవితాన్ని గడప వీలులేదు. రాజకీయాలలో జోక్యం లేకుండా విశ్వమానవ సంబంధం కలుగద్దు. మనిషి జీవితం విభజించడానికి వీలులేనిది. మత సాంఘిక రాజకీయ కార్యములను వేరువేరుగా విభజించడానికి సాధ్యం కాదు. మానవ కార్యరంగము నతిక్రమించిన మతం నాకు కనిపించడం లేదు. మతం అన్నిపనులకూ నైతిక సిద్ధాంతాల నేర్పాటు చేసింది. మతం లేకపోతే జీవితం శూన్యం" ఇవి గాంధీ చెప్పిన మాటలు. ఈ భక్తి ప్రపూర్ణతయే ఖండ ఖండాంతరాల నుండి వివిధ మతస్థుల నాకర్షించ గలిగింది. విగ్రహారాధకునికీ, అగ్నిపూజా పరునికీ, బ్రహ్మోపాసకునికీ ఆశ్రయ మిచ్చిన అబ్రాహం హృదయం వంటిదే గాంధీ హృదయం. ఆయన ఇలా అన్నాడొకప్పుడు :

పాము చుట్టలవలె చుట్టవేసికొని ఉన్న రాజకీయాలనుండి మనమెంత ప్రయత్నించినా తప్పించుకోలేము. అందువల్లనే నేను రాజకీయాలలో జోక్యం కలిగించుకోవలసి వచ్చింది. ఆ పాముతో నేను కుస్తీ పట్టుకోరుతూన్నాను........రాజకీయాలలోకి మతాన్ని ప్రవేశపెట్ట వలెననే ప్రయత్నిస్తూన్నాను.

"నేను కలుసుకొన్న మతానుష్ఠాన పరు లనేకమంది ఆరూపంలో ఉన్న రాజకీయ వేత్తలు. కాని నేనో రాజకీయవేత్తగా కనపడే మతానుష్ఠాన పరుణ్ని". 1917 లో మాంటేగు ఇండియాకు వచ్చినప్పుడు "మీరు నిజంగా సంఘ సంస్కారులే! రాజకీయాలలోకి ఎందుకు దిగారు?" అని గాంధీని ప్రశ్నించాడు. అందువల్లనే రాజకీయాలలోకి దిగవలసి వచ్చిందని గాంధీ జవాబిచ్చాడు. ఇందులో పరిపాలనా ఫలితమంతా ఇమిడి ఉంది. పర ప్రభుత్వం మానముద్రాలంకారుడైన రాజుగారి పేరుతో ప్రజాభ్యుదయమునకు సంబంధించిన అన్ని పనులకూ దూరంగా ఉండి, ప్రజా జీవితంలో జోక్యం కలిగించుకోక, అభివృద్ధిని నిరోధించి, ఆచారాలను జడతుల్యములుగా చేసింది. స్వపరిపాలిత దేశాలలోని రాజు, ప్రజారక్షకుడుగా రాజ్యాంగ నేతగా ప్రథమ పౌరుడుగా, జాతీయసంఘ నాయకుడుగా ఉంటాడు.

స్వతంత్ర రాజ్యాల రాజకీయాలు దాదాపు సంప్రదాయ పరంపరగా వస్తూంటయి. పరాధీన దేశాలలోని వారికి, చిన్నతనంలోనే కొన్ని రాజకీయాభిప్రాయా లేర్పడి, సాధారణంగా అవి మారవు. గోఖేలు సర్ ఫిరోజిషా మెహతాలు, సురేంద్రనాథ భూపేంద్రనాథులు, వారు ప్రజాజీవితం ప్రారంభించిన

నాడేవిధంగా ఉన్నారో అంత్యకాలం దాకా ఆలాగే ఉన్నారు. లజపతిరాయి, తిలక్ బిపినచంద్రపాలులు మొదటి నుండీ జాతీయవాదులై చివరవరకూ రెస్పాన్సివ్ సహకార వాదులుగానే ఉండిపోయినారు. అసహాయోద్యమ సంపూర్ణ సిద్ధాంతంతో వారేకీభవింపజాలక పోయినారు. కాని గాంధీ, తన జీవితంలో ఒక అద్భుత పరివర్తనాన్ని ప్రదర్శించాడు. ఆయన ఒక స్వదేశ సంస్థానపు దివాన్‌కు బిడ్డ కావడంవల్ల పుట్టుకతోనే మితవాది. ఇంగ్లాండులో ఆంగ్ల విద్యా శిక్షణతో పెరిగి బారిష్టర్ వృత్తి అవలంబించిన మనిషి; సంప్రదాయ క్రమం ఆలాగే ఉండాలనే పద్ధతివాడు. బ్రిటిష్ ప్రకృతిలో అనంత విశ్వాసంగల పురుషుడు. కాని మహా యుద్ధానంతరం ఆయన మానసిక ప్రవృత్తి, అభిప్రాయాలూ అన్నీ మారుతూ వచ్చినయి. ఆయన అభిప్రాయాలకు, అనురాగాలకు కల భిన్నత్వం అనేకసార్లు ప్రదర్శింప బడుతూ వచ్చింది. 1931 లో ఆయన శ్రీ శ్రీ చక్రవర్తి గారిని దర్శించినప్పుడు, 1918 నాటికీ అప్పటికీ ఆయనలో కలిగిన మానసిక పరివర్తనమును గూర్చి ఆయనకు రాజుగారే స్వయంగా తెలియజేశారు. గాంధీజీ జూలూ తిరుగుబాటులోనూ, దక్షిణ ఆఫ్రికా యుద్ధంలోనూ వ్రణచికిత్సా దళాలను తయారు చేశాడు; 1917 లో బ్రిటను కోసం సైనికులను సమకూర్చాడు. తరువాత ఆయనలో మార్పు వచ్చింది. కాని జార్జి చక్రవర్తి ఆయనకీ మార్పును గూర్చి తెలియ చెప్పడానికి పూర్వం చాలాకాలం కిందనే, 1920 ఆగస్టు

1 వ తేదీని అసహాయోద్యమ ప్రారంభదినమున, అప్పుడు వైస్రాయిగా నున్న చెమ్సుఫర్డు ప్రభువుకు గాంధీ ఇలా వ్రాశాడు:

మీరు ప్రభుత్వోద్యోగుల అపరాధాన్ని అంతగా పాటించక పోవడం, సర్ మైకేల్ ఒడయరును సమర్థించడం, మాంటేగు నివేదిక, పార్లమెంటు ప్రభువులు పంజాబు దురంతాలను గూర్చి ప్రదర్శించిన అపకీర్తి దాయకమైన అజ్ఞానం, భారతీయాభిప్రాయాలను గూర్చి వారు చూపిన తృణీకారభావం- ఇవన్నీ సామ్రాజ్య భావిదశను గూర్చి అతి ప్రబలము లైన అపోహలను గలిగించి ప్రస్తుత ప్రభుత్వముపైన నాకు పూర్తిగా కోపం పుట్టించినవి. కాబట్టి ఇంతవరకూ చేస్తూన్న హృదయపూర్వక సహకార మిక నేను చేయజాలను.

ఒక పక్షాన్ని నిర్మించి అభివృద్ధి చేయదలచుకొన్నవాని రాజకీయాలకు ఒక విధమైన నిర్మమకారాన్ని నిర్దేశించే సిద్ధాంతానికీ పరస్పర కలహం కలుగుతూంటుంది. కాని హాకింగ్ చెప్పినట్లుగా గాంధీ, "సన్న్యాసి నిర్మమత్వమునకూ రాజకీయ విశారదుని కార్యసాధకత్వమునకూ చక్కని సమ్మేళనం" కలుగ చేశాడు. మొదటిది రెండోదానిని కేవలం బలపరుస్తూన్నది. సంప్రదాయం పడుగుగానూ, పరిస్థితిని పేకగానూ చేసి "ప్రస్తుత చరిత్రను" నేయగల నేర్పే రాజకీయ చతురత తరతరానికీ కాలమూ కాలతత్వమూ కూడా మారుతూంటవి. వాటినిబట్టి రాజకీయ స్వభావం మారుతూంటుంది. భారతదేశంలో ప్రజాజీవితానికి ప్రాణమిచ్చి నడిపిస్తూన్నది రాజకీయం, రాజకీయజ్ఞులే అక్కడ ప్రధాన పురుషులు. పత్రికలు

పైనుండి కిందివఱకు రాజకీయాలనే చర్చిస్తూంటాయి. కాని ఇటీవల న్యాయ్యంగా రాజకీయ దృక్పథంలోకి రావలసినవన్నీ రాజకీయాలుగానే వ్యవహరింప బడుతూన్నాయి. విదేశీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడంతోనే ఆగిపోక, భారత జాతీయ నిర్మాణానికి కావలసిన ప్రధాన విషయాలను గూర్చి హిందూదేశ రాజకీయజ్ఞులు శ్రద్ధ వహిస్తూన్నారు. ఖద్దరు కేవలం పునరుజ్జీవన చిహ్నంగా మాత్రమే గాక, దేశంలో ఒక నిర్దిష్ట సంఘానికి ఆర్థిక సహాయంగాను, నిరుపేదలకూ అనాథలకూ శరణ్యంగాను, భారత జాతీయతకు పునాదియైన గ్రామాన్ని పునరుద్ధరించే గృహపరిశ్రమలకు అగ్రగామి గానూ భావింపబడు తూన్నది. గాంధీ ప్రాయోపవేశ ఫలితంగా హరిజనులకు లభించిన రాజకీయస్థితిని బట్టి, అస్పృశ్యతా నివారణ తేలికయింది. ఆత్మ గౌరవం కళకళ లాడుతూన్న ముఖాలతో వారు తలలెత్తుకొని తిరుగుతూన్నారు. బ్రిటిష్ ప్రధాని రామ్సే మ్యాక్డొనాల్డు హృదయంలో ఏ మూలనో న్యాయ్యబుద్ధి మినుకు మినుకుమంటూనైనా ఉండకపోయినట్లయితే, 1932 లోనే గాంధీ ఒక్క హరిజనులకోసం ప్రాణాల నర్పించి ఉండేవాడు. ఇంతకంటెనూ ఎక్కువ ఘనకార్యముల కోసం హిందూస్థానం లోని రెండు పెద్ద సంఘాలకు ఐకమత్యం చేకూర్చడం కోసం, బ్రిటిష్‌వారు నూరు సంవత్సరాల పైనుండీ తమ రాజకీయ నిర్మాణాన్ని బలవత్తరంగా చేసుకొనేటందు కుపయోగించిన పాపపు ద్రవ్యాన్ని తుడిచిపెట్టడం కోసం, ఆయన ప్రాణాలు నిలచి ఉన్నవి. తాగుడు పిశాచమింకా పోనిమాట నిజమే. హిందూ

మహమ్మదీయులకు ఇంతవరకూ సామరస్యం కుదరనిమాట నిజమే. ఇవి రాష్ట్రీయ స్వాతంత్ర్యం ద్వారా పరిష్కరింపబడ తగినవి. అయితే 1935 ఇండియా ప్రభుత్వ చట్టము ననుసరించి బలవంతంగా జరుపబడే ఎన్నికలలో కాంగ్రెసు పాల్గొనాలా లేక బహిష్కరించాలా? శాసన సభలలోను మంత్రివర్గాల లోనూ ఉండి చట్టాన్ని ఎదిరించాలా? లేక శాసన సభలకూ మంత్రివర్గాలకూ వెలిగా ఉండి నిరోధించాలా?- 1935 నుండి కొంతకాలం వఱకు గాంధీని ముఖ్యంగా బాధించిన విషయాలివే.

ఇవి భారత స్వాతంత్ర్య సమస్యకు సంబంధంలేని సమస్య లుగా ఆయన భావించలేదు. కేవలం ఆ ప్రధాన సమస్యతో విడదీయడానికి వీలులేని విషయాలివి. కాని ఈ సమస్యలన్నీ కూడా సామాన్య లౌకిక జ్ఞానంతో కాక మహర్షుల దృష్టితో గాంధీ పరిష్కరిస్తూన్నాడు. పట్టి రాజకీయ దృక్పథంతో కాక, నైతిక ఆధ్యాత్మిక దృక్పథంతో చూస్తూన్నాడాయన. ప్రతి విషయాన్ని మత రాజకీయముల పరస్పర సమ్మేళనము భార తీయ పద్ధతుల కనుగుణమైన ప్రభుత్వాన్ని నిర్మించడానికి పునా దులను వేసింది. కాని అదియే శ్రోత్రియులకు లౌకికులకు, కాంగ్రెసుకు ఆశ్రమములకు, రాజకీయసంస్థలకు నైతిక వ్యవస్థ లకూ మధ్య, కలహకారణం కూడా అయింది.

అధ్యాయము ౮

ఆశ్రమాలు

కొన్ని నియమాలను కొన్ని సిద్ధాంతాలను అనుసరించే కొంత మంది సహచరులు కలసి ఆశ్రమాలను నిర్మించుకొంటారు. వాటిలో అభిప్రాయాల కలయిక లేనివారుండరు. ఇటువంటి ఆశ్రమ వాసులే ఈశ్వర దూతలనే పేరుతో వ్యవహరింపబడుతూ వచ్చారు. క్రీస్తు కటువంటిదూతలు పన్నెండుమంది ఉన్నారు. రామకృష్ణ పరమహంసకు కూడా అంతమంది ఉన్నారు. "ఇరవైమంది లేక ముప్పైమంది కూడా కలసి పనిచేస్తూ ఒక సమూహంగా ఉండవచ్చునని" ఆల్డస్ హక్స్లీ అభిప్రాయం. బెనిడిక్టిన్ మతస్థులు ఒక్కొక్క మఠాధిపతికింద పదిమందివంతున గుంపుగా చేరి పని చేస్తూండేవారని ఆయనే వ్రాశాడు. కమ్యూనిస్టు గుహాలో సరిగా అంతమందే పని చేస్తూంటారు. పాత సత్యాలను పునఃప్రతిష్ఠ చేయడానికి, నూతన సత్యాలను శాస్త్రీయ పద్ధతులతో నిరూపించడానికి ఏర్పడిన పరిశోధనా కేంద్రాలే ఆశ్రమాలు. సత్యం చక్కగా వ్యాపించవలెనంటే కేవల మొక సిద్ధాంతాన్ని స్పష్టీకరించిన మాత్రంతో చాలదు. దానికి తగిన ప్రచారం సాహిత్యం కూడా కావాలి. ప్రవక్త దివ్య చక్షువుతో చూచినదానిని మహర్షి "బుక్కు" లో గానం చేస్తాడు. వారి శిష్యకోటి ఆ అభిప్రాయాలను ఆచరణలో పెడుతూ "ఉత్తమ సంఘ వ్యవస్థకు ఉదాహరణంగా ఉండే

చిన్నచిన్న సంస్థలను స్థాపిస్తూంటారు". కొండంత సిద్ధాంతం కంటె గోరంత ఆచరణ నయం" అనే సామెత ఇక్కడ బాగా వర్తిస్తుంది. నూలు వడకడంపైన మనం గంటలకొలదీ మాట్లాడిన దానికంటె ఒక చిలప నూలు వడికి చూపిస్తే ప్రజలకు చిత్తాకర్షకంగా ఉంటుంది. మీరు కట్టుకొన్న బట్ట మీరు వడికిన నూలుతో నేసిందేనని తెలిస్తే, ప్రజల సంతోషం పట్టశక్యం గాదు. వసిష్ఠ, అత్రి, భరద్వాజ, మైత్రావరుణ, కౌండిన్య, శ్రీవత్స, కౌశికాది మహర్షులందఱూ ఈ విధంగానే తమ సిద్ధాంతాన్ని సంస్కృతినీ ప్రచారం చేశారు. * గాంధీ సేవాసంఘం గాంధీ జీవిత సిద్ధాంతాల నంగీకరించి శ్రద్ధా భక్తులతో పని చేస్తూన్న సంస్థ. ఇటువంటి సంస్థలలో చాలాకాలం మనుష్యులను గట్టిగా ఒరిసి చూస్తేనేగాని సభ్యులుగా చేర్చుకోరు. సర్వెంట్సు ఆఫ్ ఇండియా సొసైటీ కూడా ఇంత గట్టిగానూ పరీక్ష చేస్తుంది. కాని అక్కడ ఆధ్యాత్మిక వాతావరణం శూన్యం. గాంధీ సేవాసంఘంవారు చేసే పరీక్ష లంత కఠినంగా ఉండక పోవడంచేత అక్కడ సభ్యత్వం సంపాదించడం తేలికవుతూంది. తన కాలనీలో చేర్చుకొనేముందు మనుష్యులను పరీక్షించక పోవడంలో "రాబర్టు ఒవెన్" తప్పు చేశాడు. "జాన్ హంఫ్రీ నాయిస్" గట్టిగా పరీక్ష చేస్తేనేగాని చేర్చుకొనేవాడు కాదు. అందువల్లనే "ఒనీడా సంఘం" చేయగలిగిన పని "న్యూ హార్మనీ" చేయలేక పోయింది. బ్రాహ్మణులది కూడా పూర్వం అటువంటి

---

* ఈ సంఘ వివరణము ముందొకచోట ఉదాహరింప బడింది.

వ్యవస్థయే. కాని పేదరికం కంటె ఐశ్వర్యానికి ఆధిక్యత వచ్చే సరికి వారి పతనం ప్రారంభ మయింది. సోవియట్టులు నాజీలు కూడా ఇటువంటి సమూహాలకు చెందినవారే. కాని వారి ఆదర్శాలకు పునాది దౌర్జన్యం. ఇండియాలోని కాంగ్రెసువాదు లోక సమాజం- మహాజన సమాజం అని చెప్పవచ్చును. కాని వారందఱూ ఒకే జీవిత పద్ధతిని అనుసరించేవారు కారు. అయి నప్పటికి వారు నియమించుకొన్న అహింసను నిత్యజీవితంలో ఆచరణలోకి తెచ్చుకొన్నట్లయితే, ఒకే విధమైన జీవితపద్ధతి లోకి వస్తారు. సంఘ క్షేమంకోసం మొట్టమొదట బయలుదేరిన సమాజాలలోని ప్రధాన సిద్ధాంతాలు, పోనుపోను పల్చబడి, సాహసికులకు మోసగాళ్ళకూ వ్యాజంగా ఉపయోగ పడు తూన్నవి. ఈ సమాజాలన్నీ మొట్టమొదట దరిద్రంతో ప్రారం భించి నప్పటికీ తరువాత ధనం చేరగానే ఇటువంటివారుకూడా వీటిలో చేరుతూంటారు. ధర్మ సంస్థలలోని వారందఱు తమ పాండిత్యాన్ని, దరిద్రము, శిక్షణ, సేవ, త్యాగము- వీటి కంకితం చేయాలి అనేది మొదటి సిద్ధాంతంగా ఉంటుంది. యూరపులో నున్న ధర్మజ్ఞాన సమాజకులలోని వివిధ సమూహాల శిక్షణ క్రమాలను ఆల్డస్ హక్స్లే పోల్చి చూపిస్తూన్నాడు. లయోలా సంఘములోని జేసూట్ సభ్యులది "చేసి చావు! ఎందుకని ప్రశ్నింపరాదు" అనే సైనికశిక్షణ పద్ధతి. క్వేకరు సమాజం వారిది సభ్యుల ఇష్టము ననుసరించి నడచుకొనే ప్రజాపాలన పద్ధతి. బెనిడిక్టిన్ మతాధిపతులు ముందు సభ్యుల అభిప్రాయా లను తెలుసుకొన్న తరువాత, తమ విచక్షణను వినియోగిస్తారు.

కాబట్టి ఇది ఒకతరహా శాసనానురూప చక్రవర్తిత్వము. గాంధీ ఆశ్రమాలకు కొన్ని ముఖ్య సిద్ధాంతాలు ఉన్నవి. కాని మార్చ వీలులేని కఠిన నిబంధనలు లేవు. వాటిలో కొంతమంది చిన్న చిన్న సమూహాలుగా పని చేస్తూంటారు. వారి కార్యసిద్ధి సాధారణంగా వారి నాయకుని ఔన్నత్య స్థితినిబట్టి ఉంటుంది. ఇటువంటి "వ్యవస్థల"న్నీ సాధారణంగా అధిపతిపైన ఆధార పడి ఉంటవి. అధిపతితోనే అంతరిస్తాయి కూడాను.

కాని గాంధీ ఆశ్రమవాసులు అహింసా మార్గము ననుసరించి జాతీయాభ్యుదయమునకు చాలా తోడ్పడ్డారు. వైజ్ఞానికంగాను, ఆర్థికంగాను కూడా, నూతన సాంఘిక వ్యవస్థకు గ్రామమే పునాదిగా ఉండవలెనని వీరి ఆదర్శం. చరిత్ర భూగోళం చదివేకంటె, ప్రతిరోజూ మూడుగంటలు నూలు వడికితే జీవితంలో యెక్కువ ఉపయోగకరంగా ఉంటుందని, అట్టు వంటి నియమం చేయడం ఈ ఆశ్రమాలలోని ముఖ్యాలోపమని పిస్తుంది. కాని విసుగుపుట్టిస్తూ నిర్జీవంగా కనిపించే ఈ కఠిన నియమంవల్ల, అనుకోకుండా ఆశ్చర్యకరమైన అభివృద్ధి కలిగింది. విద్యాపద్ధతియే పూర్తిగా మారిపోతూన్నది. వ్రాయడం చదవడం జ్ఞాపకముంచుకోవడం విద్యకు ముఖ్యాంగాలుగా పరిగణింపబడుట లేదు. * చేతి పనులలో నేర్పుకలిగి ఉండడమే విద్యాభ్యాసమునకు మూలంగా ఎన్నబడుతూన్నది. నవ్య భారత దేశమునకు కావలసిన నూతనావసరముల కోసం, వ్యవసాయంలో పరిశ్రమలలో, దేశీయ సంస్కృతిలో శిక్షణ పొందిన

* ఈ విషయం షష్ఠోకభోట వివరంగా వ్రాశాము.

యువకులు కావలసి యున్నారు. ఈ ఆశ్రమా లటువంటి యువకులను తయారుచేస్తూ గ్రామస్థుల వైద్య సహాయానికి తోడ్పడుతూన్నవి. పెద్దపెద్ద పారిశ్రామిక సంస్థలను స్థాపించే ముందు ప్రారంభింపబడే ప్రదర్శన యంత్రాలయాల వంటివి ఆశ్రమాలు. ఈ ఆశ్రమవాసులు ముందొక మూలసిద్ధాంతాన్ని భావించి దానిని అనుసరించడం ద్వారా ఒక శాస్త్రాన్ని తయారు చేస్తారు. వారి విశ్వాసాని కనుగుణంగా ఆశ్రమ నియమాలుంటాయి. ఆశ్రమ నియమాల ననుసరించి వారి ప్రవర్తనను అలవరచు కొంటారు. వ్యక్తులుగా వారికి కొన్ని కర్తవ్యాలు ధర్మాలూ ఉన్నవి; సంఘ సభ్యులుగా వారు కొన్ని దృక్పథాలను పెంపొందించుకోవాలి. సత్యాహింస లొకరి సొంత సొత్తు కాదు. కాబట్టి అవీ, అందుకు సంబంధించిన సిద్ధాంతాలూ ప్రజా సామాన్యంలో బాగా వ్యాపించవలెననీ వారి ఆశయమూ ఆదర్శమూ అయి ఉండాలి. ప్రత్యేక గౌరవాల కోసము సౌకర్యాల కోసమూ కాక, ప్రజల సేవలో పరులను చంపకుండా తాము చచ్చేటందుకు మాత్రమే ప్రజానాయకులు కావలెనని వారు కోరుతూండాలి. ఎప్పుడూ నెమ్మదిగా ఓర్పుతో ఇతరులకు నచ్చచెప్పే పద్ధతిలో ఉండాలి వారు. ఈ పద్ధతుల వలన శాంతి సైన్యాలకు, సమష్టి సత్యాగ్రహానికీ కూడా ఏకకాలమందు పునాది వేయగలుగుతూన్నాము. ఇది మీకు అత్యాశగా కనిపించవచ్చును గాని, నిజానికి ఈ రీతిగా చేసిన బోధనలే ప్రజల మనస్సులను తక్షణం ఆకర్షించి వారిని కార్యరంగంలోకి తీసుకొని రాగలుగుతవి,

ఆశ్రమాల నడక

గాంధీ ఆశ్రమాలలో క్రొత్తగా ప్రవేశించ దలచుకొన్న మనిషి, ముందుగా సంఘంలో అట్టడుగున ఉన్నవాడు చేసే సేవ చేయ డానికి సంసిద్ధంగా ఉండాలి. ఇది మొట్టమొదటి నియమం. ఈ పనిని అక్కడి పాతవాళ్ళు చాలా సంతోషంతో నిర్వహి స్తూంటారు. ఎవరి పళ్ళెములను వారు తోముకోవడం, ఎవరి బట్టలు వారుతుక్కోవడం, ఎవరిగదులు వారు తుడుచుకోవడం, ఎవరి పాకలను వారు కట్టుకోవడమే అయితే మన యువతీ యువ కుల కంత క్రొత్తగా ఉండదు. ఈ పనులన్నీ దాదాపుగా హాస్టె లులో వాళ్ళిదివరకు చేసుకొంటూన్నవే. కాని ఆశ్రమంలోని క్రొత్త పద్ధతులు వారికి విపరీతంగా కనుపించవచ్చును. ఆశ్రమ వాసులు మఱుగుదొడ్లను తుడిచి, మలపు బొక్కెనలను తీసుకొని పోయి కడగవలెననే నియమం కేవలం క్రొత్తగా కనిపించడమే కాక అతి కఠినంగా కూడా కనిపిస్తుంది. అయినప్పటికీ విశ్వ విద్యాలయ పట్టములను పొందిన యువతీ యువకులీ పనులను సంతోషంగా నిర్వహిస్తూంటే చూడడంవలన, తాత్కాలికంగా చుట్టపు చూపుగా వచ్చిన అతిథికి కూడా ఆపని చేయడానికి, మొట్టమొదట "క్రొత్త ఒక వింత" అన్నట్లుగా ఉత్సాహం కలుగు తుంది. తరువాత అది ఒక విధి అనుకొని చేయగా చేయగా, అందులో ఒక విశ్వాస ముత్పన్నమౌతుంది. చివరకు సంఘా నికి వెలిగా ఉన్న పాకీమనిషి, మనకెంతో సేవ చేసి మన జీవి తాన్ని ఆనంద దాయకంగా చేస్తూంటే, మనమతనికి ప్రత్యుప కారం చేయలేకపోగా అతనిని అస్పృశ్యుడుగా పరిగణిస్తూన్నా

మనే విచారం కలుగుతుంది. ఒక్కసారి సేవ చేయడం అలవాటయితే మానవ సమూహమంతా బంధువర్గంగా కనిపిస్తుంది. వేళ ప్రకారం పని, భోజనం, తిరుగ మూతలు పరిమళద్రవ్యాలూ లేని పుష్టికరమైన నియతాహారం, ఉదయం రాత్రి క్రమప్రకారం ప్రార్థన, చేతిపనులను నేర్పడం, విధిగా నూలు వడకడం, అతిథి పూజ, గురు శిష్యుల ప్రశ్నోత్తరాలు సంభాషణలు, స్త్రీలూ పురుషులూ కలసి మెలసి ఉండడం, తోటపని, గాలిలో కాలక్షేపం చేయడం, శరీరశ్రమ ఇవన్నీ ఆశ్రమ జీవితానికి సంపూర్ణత్వాన్నీ ఉత్సాహాన్నీ కలిగిస్తాయి. వీటికితోడు అప్పుడప్పుడు ఉపవాసాలూ మౌనవ్రతాలూ ఉంటాయి. ఇవి రెండూ శరీరానికీ ఆత్మకూ కూడా పుష్టిని కలిగిస్తాయి. గాంధీ ఉపవాస వ్రతాలను గూర్చి ఇదివరకుదాహరించే ఉన్నాము. అవి సుప్రసిద్ధంగా అందరికీ తెలిసే ఉన్నాయి. గాంధీ మౌనం ఉపవాసంతోనే ఉంటుంది. ప్రతి సోమవారము ఆయన 24 గంటలు మౌనము, 12 గంటలు ఉపవాసము ఉంటాడు. ఇటీవల ఆయన ఉపవాసంతో చేరని మౌన మవలంబిస్తూన్నాడు. కాని ఆయన ఈ వ్రతాలకు గాని నియమాలకు గానీ దాసుడు కాడు. తాను ప్రపంచంలో చేయవలసిన పని చాలా ఉందని తెలుసుకోవడం వలన, తన కార్యవిధానానికి భంగం కలిగించే యే కర్మకాండకు ఆయన ప్రాముఖ్యత ఈయడు.

ఇటువంటి చిన్నచిన్న నియమముల నుండియే "నిరాడంబర జీవితము ఉదారభావము" కలిగి ఉండవలెననే సిద్ధాంతము, ప్రచారంలోకి వచ్చింది. గొప్పగొప్ప మతాలు కూడా

ఆ సిద్ధాంతాన్ని ఆధారం చేసికొని వరిల్లినవి. పురాణకాలపు మఠాలనుండి క్రీస్తు ఉపదేశాలు ప్రచారంలోకి వచ్చి మధ్యయుగ నాగరికతకు కారణము లైనవి.

తమకడ శిక్ష పొందవలెనని వచ్చే శిష్యులను వినీతులనుగా చేసేటందుకు ఆశ్రమాలు, బౌద్ధ విహారాలవంటి విద్యాలయాలు, ఈ పురాతన సంస్థలను వివేకానంద రామకృష్ణ పరమహంసల వలెనే గాంధీజీ పునరుద్ధరించాడు. వీటి ననేక పేర్లతో పిలుస్తూండ వచ్చును. చైత్యాలు, విహారాలు, మఠాలు, ఆశ్రమాలు- అనే నామ భేదాలతో ఈ వ్యవస్థలు వ్యవహరింప బడుతూన్నప్పటికీ, ఇవన్నీ కూడా ఆధ్యాత్మిక సంస్కృతికీ, సంఘసేవకు, విజ్ఞాన ప్రచారానికీ కేంద్రా లైనవని చెప్పక తీరదు. గాంధీ ఆశ్రమ జీవితం యావత్తూ జాతీయ పునర్నిర్మాణ కార్యక్రమానికి అను గుణంగా నియమింప బడింది. ఐహిక వ్యవహారాలలో మునిగి పోయి భోగపరాయణు లైనవారికి, ఈ ఆశ్రమాలు బైరాగి మఠాలో బౌద్ధ విహారాలో అన్నట్లుగా పైకి తోచవచ్చును గాని, లోపలికి దిగి ఆలోచిస్తే అలా కాదని తెలుస్తుంది. ఇవి తమ ముఖ్యోద్దేశాలకు భంగంకాని పద్ధతిని పనులను చక్కబెట్టు కుంటూ, వయస్సులో నున్న ఆశ్రమ వాసులు జీవిత ప్రారంభ దశలో తగు నిగ్రహం కలిగి అభివృద్ధి కావడానికి తగిన అవ కాశాలను కల్పించినవి. ఆశ్రమ కార్యాలు నిర్మాణ కార్య క్రమానికి సంబంధించి ఉంటవి. ముఖ్యంగా చాలామంది "నీచం" గా తలంచే చేతిపనులు చేస్తూంటా రాశ్రమవాసులు. చేతి పనుల్లో నిజానికి నీచమనదగిన దేదీ లేదు. నూలు వడకడం,

నేయడం, ఏకడం, ఏకులు చేయడం- ఇవన్నీ ఉదారములు ఉత్తేజకరములూను. పేదలకు చదువు చెప్పడం, రోగులకు వైద్య సహాయం చేయడం, అప్పుడప్పుడు సహకారోద్యమంలో పని చేస్తూండడం, ప్రజల ఆరోగ్య రక్షణను గూర్చి నిత్యమూ ప్రచారం చేయడం, గ్రంథాలయాలు నడపడం, పంచాయతీలు చేయడం, ప్రదర్శనాలు పెట్టడం, వయోజనులకు లోకజ్ఞానం కలిగించే విద్యా వ్యాపకం చేయడం- ఇవన్నీ వారి కార్యక్రమ ప్రకారం నిర్వహించవలసిన పనులు. బ్రహ్మచర్యవ్రతం పూని పేదరిక మనుభవిస్తూ ఆశ్రమవాసులు చేసే ఈ లోకసంగ్రహ కార్యాలు, విముక్త మాతృదేశ పునరుజ్జీవనమునకు కావలసిన ఆర్థిక సాంఘిక విశాల కార్యక్రమంలో పాల్గొనేటందుకు, దేశ సేవికా సేవకులకు మంచి శిక్షణ ఈయగలవు.

ఆశ్రమాలు జీవిత రంగాలకు కేంద్రాలుగా ఉండాలి- అంతే కాని బిచ్చపు డబ్బులను దాచిపెట్టుకొనేవిగా ఉండకూడదు. అవి ఆహారాన్నీ బట్టనూ ఉత్పత్తి చేస్తూ తాము స్వయం సంపూర్ణములుగా ఉండి, పరిసరాలకు జీవశక్తిని విజృంభింప చేయాలి. అంతేకాని పోషకులమీద ఆధారపడే దేశాభిమానుల గుంపుగా ఉండకూడదు.

అధ్యాయము ౯

గాంధీ సేవా సంఘం

మానవ జీవిత నీలాకాశంలో ఆశ్రమా లనేక స్వయం ప్రకాశ మాన తారా మండలాల వంటివి. వా టన్నిటి మధ్యను ఉజ్జ్వల సూర్యగోళమువలె, నిరంతరము తన చుట్టూ తిరుగుతూన్న గ్రహాముల పైనను ఉపగ్రహాముల పైన నూతన తేజః పుంజము లను వెదజల్లుతూ, గాంధీ సేవా సంఘం దేదీప్యమానంగా ఉంది. అది కేవల మొక సహచర మండలికానీ, పఠన సమాజంకానీ కాదు. అది సత్యాన్వేషణ తత్పరులుగల ఒక సోదర సంఘం. ఇటీవల, వివిధ రాష్ట్రాలలో ఆ సంస్థ యేటేటా మహాసభలు జరుపుతూన్నది. సల్లీ (1936) మహారాష్ట్రంలో, హుద్లే (1937) కన్నడరాజ్యంలో, డెలాంగ్ (1938) ఒరిస్సాలో, బృందావనం (1939) బీహారులో, మాలికంద (1940) వంగరాష్ట్రం. ఈ సంఘం కఠిన నియమాలు కటికి నిబంధనలు కల మతసంస్థ కాదు. ఇందులో ఉన్నవారంతా పరిశోధకులు, సాధకులు, ఆత్మ పరిశుద్ధతకోసం కృషి చేసేవారూ. దేశములో ఒక కొన నుండి మఱియొక కొనవరకూ వ్యాపించిన యంత్రాలయాల వల్లను, ఐహిక భోగాసక్తి మూలముననూ నేడు మఱుగుపడి పోయిన ఆర్థిక నైతిక రంగములలో వారు తత్వాన్వేషణ తత్పరులై పని చేస్తూన్నారు. ఈ సంఘముయొక్క పుట్టు పూర్వో త్తరాలను గూర్చి మాకు తెలిసిన సంగతు లివి :

1923 లో గాంధీ దీర్ఘ కారాగారశిక్ష ననుభవిస్తూండగా అప్పటి రాజ కీయ పరిస్థితుల ఆవశ్యకత ననుసరించి ఈ సంఘం స్థాపించబడింది.

ఆయన ఆదర్శాలు ఉద్దేశాలూ అప్పటికింకా సరియైన రూపం దాల్చ లేదు. గాంధీ ప్రధాన శిష్యులలో ఒకడైన జమన్‌లాలు బజాజ్, తన ఐశ్వర్యం కంటె గాంధీ ఆదర్శాలు, సిద్ధాంతాలూ ఎక్కువ అమూల్యము లని తలంచి, ఆయన పద్ధతులమీద జాతీయ కార్యక్రమాన్ని నడిపించేటందు కత్యధికంగా ధనసహాయం చేశాడు. జమన్‌లాలు బజాజుచేత స్థాపించ బడిన ఈ సంఘ కార్యవిధానం, 1924 నుండి 1929 వరకు కాంగ్రెసు కార్యక్రమాని కనుగుణంగా క్రమ పరివర్తనం పొందుతూ వచ్చింది. తరువాత "గాంధీ సిద్ధాంతాల ననుసరించి జాతీయ సేవ చేయడమే" ఆ సంఘ పరమోద్దేశమని తేలింది. అప్పటినుండీ అది కేవలం కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమాన్ని మాత్రమే నిర్వహిస్తూన్నది. 1930 లో శాస నోల్లంఘనోద్యమ దండయాత్రకు కాంగ్రెసు శంఖధ్వానం చేసింది. 1934 ప్రారంభదశ వరకూ సంఘ ధర్మకర్తలు చాలామంది జైలు లోనే ఉన్నారు. 1934 మధ్యలో శాసనోల్లంఘనం కాలపరిమితి లేకుండా విరమింప బడ్డది. అప్పుడు సంఘ కార్యక్రమం ఇంకా ఎక్కువ స్పష్టంగా నిర్వచింప బడింది. సభ్యత్వాన్ని విస్తరింప జేసుకోవడానికి వీలుగా సంఘ నియమాలలో మార్పు జరిగింది. 1937 లో ఆ సంస్థలో నూరు మంది సభ్యు లున్నారు. వారంతా తమ వ్యక్తి జీవితంలోనూ సంఘ జీవితంలోనూ కూడా సత్యాహింసలనే అవలంబించ వలెననీ, సత్యా హింసలపైన ఆధారపడి నడచే యావత్తు జాతీయ కార్యక్రమం లోనూ వారు పాల్గొనవలెననీ కూడా ప్రమాణాలు చేసుకొన్నారు. అహింస, సత్యము, అస్తేయము, బ్రహ్మచర్యం, దారిద్ర్య స్వీకరణము, శరీరకృషి, జిహ్వేంద్రియ నిగ్రహం, నిర్భయత్వం, సర్వమత సామరస్యం, స్వదేశీ, విశ్వమానవ సౌభ్రాతృత్వం— ఈ పదకొండు సూత్రాలు నేడా సంఘ ధర్మ సిద్ధాంతాలైనవి.

1936 లో గాంధీ సభలో ఇలా అన్నాడు :

సత్యాహింసలను కాదు అహింసనే (సత్యం వినా అహింస అసంభవం గనుక) ప్రత్యక్షంగా ప్రదర్శించే ప్రతి కార్యక్రమం లోనూ సంప్రార్థ విశ్వాసం గల సహచర మండలిగా మీ సంఘం పని చేస్తూంటే నేను సంతోషిస్తాను. కాబట్టి మీ సభ్యులలో ఎవ్వరూ కూడా "సత్యా హింసలలో నమ్మక మున్నది గాని, గృహ పరిశ్రమలలో గానీ, లేక ఖాదీ గ్రామ సేవలలో గానీ, లేక హిందూ మహమ్మదీయ సఖ్యతలో గానీ, లేక అస్పృశ్యతా నివారణంలో గానీ నమ్మకం లేదనకూడదు. ఎవరైనా అటువంటి వారు మీ సంఘంలో ఉంటే వారి భావం ప్రకారం వారు సత్యా హింసలలో నమ్మక మున్నవారు కావచ్చును కాని గాంధీ భావం ప్రకారం మాత్రం కాదని చెప్పి, వారి సభ్యత్వానికి రాజీనామా యిప్పించండి. దీనిని మించి మీ సంఘానికి ధార్మిక, ప్రాదేశిక, వ్యావస్థాపిక నియమా లేవీ లేవు.

1937 నాటి హుడ్లీ సభలో, గాంధీ సేవాసంఘ సభ్యులు శాసనసభల ఎన్నికలలో నిలబడవచ్చునా లేదా అని తీవ్ర చర్చ జరిగింది. సభ్యులు తమ సభ్యత్వ దరఖాస్తులను పంపిన తరువాత గాంధీ అంగీకారము నర్థించిన సంగతి ఆయన ఆ సభలో వెల్లడి చేశాడు. 1939 లో ఆ సంఘానికొక ప్రత్యేక రాజకీయ పక్షం ఉండాలా అనే విషయం చర్చకు రాగా, బృందావనంలో అక్కర లేదని తేల్చారు. సాంఘిక కల్లోలములు జరుగుతూన్న రోజులలో, సంఘ సభ్యులను మత కలహాలను మాన్పించే నిమిత్తం శాంతి దళంలో చేర కోరుతూ, 1938 లోనే గాంధీ డెలాంగు సమావేశంలో ఉపన్యసించాడు. బృందావనంలో ఆత్మ పరీక్ష చేసుకోవడం అలవాటు చేయండని సంఘ సభ్యులకు సలహా యిచ్చాడు. అది ఒక నూతన శాస్త్ర

పద్ధతి అన్నాడు. అప్పటినుండీ అహింస పరమావధిని పొందిరింది. ప్రతిపక్షి పైన యే విధమైన దురుద్దేశము గాని, కసి గానీ ఉండక పోవడమే అహింస అనిపించు కొంటూన్నది.

శాసన సభలను గూర్చి 1937 హుడ్లీ సమావేశంలో గాంధీ యిచ్చిన ఉపన్యాస భాగాలను కొన్నిటి నిక్కడ అవసరమైనంత వర కుదాహరిస్తూన్నాము :

సత్యాహింసలవలె శాసనసభా బహిష్కారం మారడానికి వీలులేని సిద్ధాంతం కాదని తెలుసుకోండి. వాటిని గూర్చి నా ప్రాతికూల్యం చాలావరకు తగ్గిపోయింది. కాని అంతమాత్రంతో నా పూర్వ స్థితికి భిన్నంగా పోతూన్నానని అర్థం కాదు. ఇది కేవలం రాజనీతికి సంబంధించిన విషయం కాబట్టి, ఏ క్షణంలో ఏది ఉచితమో ఆ సంగతి మాత్రమే నేను చెప్పగలను. నేను 1920 నాటి అసహాయవాదినేనా నేడు? అవును, అప్పటి అసహాయవాదినే. కాని నేనా కాలంలో కూడా సహాయవాదిని. నేను సహకారం నిమిత్తమే అసహాయ యోగాన్ని అవలంబించాననీ, సహాయం చేసినందువల్ల దేశానికి ఉపకారం జరిగేటట్లయితే, తప్పకుండా సహాయం చేస్తాననీ నే నానాడే అన్నాను. కాని ఆ సంగతి మీరు మఱచిపోయినారు. నేనిప్పుడు మిమ్ములను శాసన సభలకు పొమ్మనడం సహకారం చేయడానికి కాదు. వాళ్ళదగ్గరనుండి సహకారం నిక్కచ్చిగా అడగడానికి. మన దేశీయులలో చాలామందికి దాదాపు వోటు చేయగలవారిలో మూడోవంతుకు వోటిచ్చే అధికారం వచ్చింది. మన కాంగ్రెసు కార్యక్రమాన్ని వారికి తెలియచేయడానికి మనకీ ఎన్నిక లవకాశం కల్పించినవి. అటువంటప్పుడు గాంధీ సేవా సంఘు సభ్యులు దూరంగా ఉండడం మంచిదా? మనం నిర్మాణ కార్యక్రమం కోసం నిలబడినమాట నిజమే. కాని మన పేరుతో అక్కడకు పోయినవాళ్ళు కూడా నిర్మాణ కార్యక్రమాన్ని సాగించేటట్లుగా

చూడడం మన విధి కాదా? నిర్మాణ కార్యక్రమం లేకుండా రాజకీయ కార్యక్రమం నిలవజాలదని తెలుసుకోండి. నిర్మాణ కార్యక్రమమంతా సత్యాహింసల చిహ్నం. కాబట్టి అది యే విధంగానూ కొఱవడకుండా చూడడం గాంధీ సేవాసంఘ సభ్యుల ప్రధాన కర్తవ్యం.

"వోటు చేయడానికి హక్కులేని 31½ కోట్ల జనాభాలోనూ నేనొకడను" అని ఫైజుపూరులో నే నన్న మాటలు నాకు గంగాధరరావు దేశపాండే జ్ఞాపకం చేస్తూన్నాడు. కాని ఈ రోజున మనం విచారిస్తూన్న విషయాని కది వర్తించదు. గాంధీ సేవాసంఘ సభ్యులుగా మనం చేసి ఉండవల సిన పని యేమిటి? వోటు చేయరాదని మనం ప్రజలకు బోధించి ఉండ వలసిందా? కాంగ్రెసు కార్యక్రమాన్ని ప్రజలలో వ్యాపింప చేయడానికి మనం స్వయంగా నిర్మించుకొన్న సంస్థ గాంధీ సేవా సంఘం. గుజ రాతులో నున్న ప్రతి కాంగ్రెసు ప్రచారకుణ్ని- మన సంఘ సభ్యులను సహా, ఎన్నికలలో పూర్తిగా దిగి పనిచేయడానికి సర్దారు చేర్చు కొన్నాడు. అంతకంటె ఆయన ఇంకో విధంగా చేయడానికి వీలేముంది? ఇంకో విధంగా చేస్తే మనం ఎన్నికలలో గెలిచేవాళ్ళమా? ఆయనే కు మాత్రం ఎన్నికలలో ఎవళ్ళు పనిచేసి ఉండేవాళ్ళు? ఆయన "ఈ ఎన్నిక లతో నాకు నిమిత్తం లేదు. నేను నిర్మాణ కార్యక్రమం కొనసాగిస్తానని ప్రతిజ్ఞ చేశాను" అని దూరంగా నిలబడి ఉండవలసిందా? రాజగోపాలా చారి శాసనసభకు నిలబడడానికి నిశ్చయించుకొన్నాడు. పని జరిగిన తరువాత ఎప్పుడో ఒక క్షణంలో ఆయన నా అనుజ్ఞ కోరాడు. నీ యిష్టం వచ్చినట్లు చేసుకోవచ్చు నన్నాను ఆయనను. ఆయనకూడ నాకంటె తక్కువ సత్యాహింసలను అవలంబించినవాడు కాడు. మద్రాసు రాజధానిలో నైనా మనకు ఎన్నికలలో అంత అపూర్వ విజయం రావ డానికి, అక్కడ జరిగిన నిర్మాణ కార్యక్రమమే కారణం. స్నేహితులను శాసన సభలకు వెళ్ళకూడదని నే నెలా అనగలిగి ఉండేవాణ్ని. శాసన సభలకు ఒకరి వెంట ఒకరిని పంపుతూండిన సర్దారును, సంఘ సభ్యత్వం

వదులుకోమని కోరితే బాగుండేదా? జమన్‌లాలు ధనసహాయమే గాక ఇతర సహాయం కూడా చేశాడు. ఆయనను రాజీనామా యీయవలసిందని అడిగితే ఎలా ఉండేది?

కాదు; అలా జరగడానికి వీలు లేదు. మనమొక చిన్న కూటమిగా ఉండిపోయి వైదొలగవలసి వచ్చేది. అది కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమాన్ని శిథిలం చేయడ మవుతుంది. నిర్మాణ కార్యక్రమంలో నమ్మకం ఉన్నవాళ్ళు లేకపోతే ఇక కాంగ్రెస్సేమిటి!

అయితే తప్పనిసరి అయింది గనుక, తప్పయినప్పటికీ మీ సంఘ సభ్యులు శాసనసభలకు పోయేటందు కంగీకరించండని నేను మిమ్మల్ని కోరుతూన్నా ననుకోకండి. అది ధర్మంకూడా కావచ్చును. నేటి శాసనసభలు ప్రజా ప్రతినిధి వర్గాలు. మన సత్యాహింసల నిప్పుడక్కడ సాగించాలి. నేను నా ప్రత్యేక కారణాలతో, కాంగ్రెసు కింకా ఎక్కువ సహాయం చేయడానికే ఆ సంస్థకు దూరంగా ఉన్నాను. కాంగ్రెసు సత్యాహింసల మూలకమైన 1920 నాటి కార్యక్రమాన్ని అవలంబిస్తూన్నంతవరకు, దానికే నా కాలమునూ శక్తినీ కూడా వినియోగిస్తాను. మనం ప్రాతికూల్యంగా ఉన్న సంస్థలలోకి ఎలా మనం పోవడం? అని అడుగుతూన్నారు మీరు. నేటి శాసనసభలు పాత శాసనసభలు కావు. చాలా భేదముంది. వీటిని మనం నాశనం చేయదలచుకోలేదు. ఇవి ఎందుకోసం నిర్మింపబడ్డవో ఆ ఉద్దేశాన్ని భగ్నం చేయదలచుకొన్నాము. అక్కడకు మనం పోవలసివస్తే సత్యాహింసలను త్యజించడానికి పోము, వాటిని నిలబెట్టడానికే పోతాము. కాంగ్రెసు ఈ రోజున ఎన్నికలలో కొన్ని లక్షలు ఖర్చుపెట్టింది. మనకు దేశంలో ఎదురులేని శక్తి కలిగినప్పుడు మనమొక దమ్మిడీకూడా అందుకోసం వెచ్చించము. నిర్మాణ కార్యక్రమమని మనం ఊరికే అంటూంటాము కాని నిజంగా మనమింతవరకే పని నిర్వహించాము? ఖాదీ శాస్త్రంలో

నిపుణు లీనాడెంతమంది ఉన్నారు? మనం పూర్తిగా నిర్మాణ కార్య క్రమాన్ని సాగించి ఉండినట్లయితే ఎన్నికలలో కాంగ్రెసు కెక్కడా ఎదురుపక్షం ఉండేదే కాదు.

అయితే నేనిప్పుడు చెప్పిన దానంతటికీ అర్థం, ఈ నాటినుండీ మీరు శాసన సభలను గూర్చి ఆలోచించడం మొదలు పెట్టండని కాదు. మీ అందటిమాట అలా ఉండనీయండి. మీలో ఒక్కరుకూడా శాసన సభల లోకి వెళ్ళేటందుకు ప్రయత్నించ కూడదు. అవసరం వచ్చినప్పుడు మాత్రం మది తప్పించుకోవాలని చూడకూడదనే నేను చెప్పదలచు కొన్నది. అక్కడకు వెళ్ళేటందుకు న్యాయశాస్త్ర ప్రవీణత అక్కర లేదు. నిర్మాణ కార్యక్రమంలో అచంచల విశ్వాసమూ ధైర్యమూ ఉంటే చాలు. మీరక్కడకు పోతే అక్కడ మీ శక్తులు వడుకుతూనే ఉండాలి. మద్యపాన నిషేధం కోసం, నిర్మాణ కార్యక్రమం కోసం, పనిచేస్తూ ఉండాలి. అంతేకాని అధికారం కోసం దేవులాడ కూడదు. అది మనకు పని చెటుపు. గాంధీ సేవా సంఘం వెళ్ళమని కోరినవారు మాత్రమే వెళ్ళాలి. దాదాపు కల్లు దుకాణాల వలెనే శాసన సభలు కూడా గొప్ప వ్యసనమనే మాట నేను కాదనను. స్వార్థపరులకు, ఉద్యోగాసక్తులకు అవి చాలినన్ని సావకాశాలు కల్పిసవి. కాని అటు వంటి నీచోద్దేశంతో కాంగ్రెసువాది కాని, గాంధీ సేవాసంఘ సభ్యుడు, కానీ అక్కడకు పోడు. కాంగ్రెసు నాయకుడు కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని, దానికి భిన్నంగా ఎవరినీ నడవనీయడు. ఈవిధంగా ప్రతిజ్ఞ చేసి అక్కడకు పోయేవారు ధర్మబుద్ధితో వెళ్ళుతూన్నారే కాని, ఆపద్ధర్మంగా పోవడం లేదు. మనకు చేతనైతే నిస్స్వార్థంగా సేవ చేసే టందుకు ప్రతిజ్ఞ చేసిన, ఉక్కువంటి నిక్కచ్చి మనుష్యులతో రాష్ట్ర శాసన సభలను నింపివేయాలి. రాజభక్తి ప్రమాణం చేయడానికి అంత రాత్మ సంబంధమైన అభ్యంతరా లున్నవారెవ్వరూ అక్కడకు పోన

క్కర లేదు. మత విశ్వాసానికి సంబంధించిన ప్రమాణం కాదది. రాజ్యాంగ చట్టాన్ని నేనర్థం చేసుకొన్నంత వఱకు మనం కోరే తక్షణ సంపూర్ణ స్వరాజ్యాని కది ఏమంతమాత్రమూ భిన్నమైనది కాదు.

1938 నాటికి గాంధీ సేవా సంఘం బాగా బలిష్ఠమయింది. పూర్తిగా సంఘ ఆదర్శముల తోను కార్యక్రమం తోనూ లీనమైనవారి సంఖ్య, 102 నుండి 118 వరకు పెఱిగింది. సానుభూతి పరులుగా గానీ, సహచర వర్గంగా గానీ ఉన్నవారి సంఖ్య 31 నుండి 39 వరకు పెఱిగింది. వీరిలో 26 మందికి మాత్రం సంఘ నిధులనుండి జీతాలిస్తూన్నారు. వారి ప్రతిఫలం నెలకు రు 7/- ల నుండి రు 75/- ల వరకూ అంతరువులుగా ఉన్నది.

1938 డెలాంగు సభలో సభ్యులను ఆత్మపరీక్ష చేసుకోవలసిందని కోరుతూ గాంధీ యిచ్చిన ఉపన్యాసం నిరంతరం స్మరించ తగినది. "అహింస దుర్బలుల ఆయుధం కాదుసుమా! బలిష్ఠుల ఆయుధమది" అని అందులోనే ఆయన స్పష్టపఱిచాడు.

ఆయన ఇలా అన్నాడు :

నేడు రాజప్రతినిధి కాంగ్రెసు అధ్యక్షుణ్ని పిలిచి మీ మగతు లేమిటని అడుగుతా డనుకోండి! "కాంగ్రెసు పరిపాలనా బాధ్యత తీసుకోగలిగిన స్థితిలో ఉంది. ఇక బ్రిటిష్‌వారు వెళ్ళిపోవచ్చును" అని చెప్పగలిగిన బలం ఉందా ఆయనకు? సైన్యము పోలీసు లేకుండా మనం పరిపాలించ గలమని, చెప్పగల స్థితిలో ఉన్నామా? సంస్థానాధిపతులతో, జమీందారులతో, ముసల్మానులతో మనం రాజీ చేసుకోగలమనే ధైర్యం మనకుందా? తేలికగా మనమీ పనులన్నీ నిర్వహించ గలమని చెప్పడానికి తగిన నమ్మకం నాకు లేదు. అయినప్పటికీ మనలో నిజమైన అహింస ఉన్నట్లయితే మనం వీటన్నిటినీ నిర్వర్తించ గలమని చెప్పి, చెప్పినప్రకారం చేసే సమర్థులం కావాలి.

కాబట్టి మన అహింస, దుర్బలుల అహింసయా లేక బలిష్ఠుల కుండతగిన అహింసయా అని, నన్ను నేను ప్రశ్నించుకొంటూ మిమ్మల్నను కూడా ప్రశ్నిస్తున్నాను. దుర్బలుల చేతులలో అది కొంతవఱకు ఉపయోగకరంగా ఉండేమాట వాస్తవమే. సరిగా మనకది అలాగే ఉపయోగించింది. కాని దాన్ని మన దుర్బలాని కొక మిషగా ఉపయోగించుకొంటూన్నట్లయితే, అది మనలను నిర్వీర్యులనుగా చేస్తుంది. నిర్వీర్యులం కావడంకంటె, శరీరబలం ఉపయోగించగల ధైర్యం ఉండడం అనేక రెట్లు మంచిది. పిఱికితనం కంటె పోట్లాడుతూ చచ్చిపోవడం ఎంతో ఘనకార్యం. బహుశా మనమంతా మొట్టమొదట పశువులుగా ఉండేవార మనుకుంటాను. తరువాత నెమ్మదిగా క్రమ పరివర్తనం పొంది పశుత్వమునుండి మానవత్వమునకు రాగలిగాము. మనం పశుబలంతోనే ముందు జన్మించాము. కాని మనలో నున్న దైవాన్ని తెలుసుకొనేటందుకు మనుష్యుల మయినాము. అదీ మానవునికిగల ప్రత్యేక సౌకర్యం. అందువల్లనే అతడు పశు ప్రపంచానికి భిన్నంగా కనిపిస్తున్నాడు. ప్రతి సజీవ పదార్థం లోనూ భగవంతుణ్ని చూడగలగడమే, అతనిని ప్రత్యేకం చేసుకోవడం. అంటే సృష్టికీ మనకూ గల భిన్నత్వాన్ని అర్థం చేసుకోవడం. మన అందఱిలోనూ అంతర్గర్భితంగా ఉన్న సచేతనా హింసను పెంపుచేసుకొని, బుద్ధిపూర్వకంగా దౌర్జన్యాన్ని పారదోలితేనే కాని ఇది సాధ్యం కాదు. ఇది బలం వలన తప్ప సిద్ధించదు. మనది బలవంతుల కుండవలసిన అహింసయేనా? అటువంటి అహింస అసాధ్యమని తోసివేసి, అందుకు బదులుగా హింసాపద్ధతిని అవలంబించడానికి మనకు హక్కున్నది.

కాక అహింస బలవంతుల ఆయుధమని మనం అంగీకరించినట్లయితే తప్పనిసరిగా కొన్ని కర్తవ్యాలను మనం నిర్వహించవలసి ఉంటుంది. హిందూ మహమ్మదీయ కలహాలను మనమాపాలి. ఈ కొట్లాటలను దూపు మాప

వలెనంటే మనమేమి చేయవలెనని మీరు ప్రశ్నించ వచ్చును. ఈ కొట్లాటలను ఆపడం పని, మొట్టమొదట కాంగ్రెసు కమిటీది. అటువంటి సంకట స్థితి వచ్చినప్పుడు పని చేయడానికి మనకు వేలకొలదీ స్వచ్ఛంద సైనికులు కావాలి. 1921 లో స్వచ్ఛంద సైనిక దళాలకు మేమొక ప్రమాణ పత్రం వ్రాశాము. ఆ ప్రకారం ప్రతి స్వచ్ఛంద సైనికుడు త్రికరణ శుద్ధిగా (మనసా వాచా కర్మణా) అహింసావలంబకుడై ఉండాలి. అప్పటి కాంగ్రెసు అధ్యక్షుడు ఖిలాఫతు వలంటీర్లచేత కూడా ఆ ప్రమాణ పత్రాన్నే అంగీకరింప చేశాడు. ఖిలాఫతు మహాసభలో ఆ ప్రమాణపత్ర మంగీకరింప బడటం కష్టంమీద జరిగింది. మాట, క్రియ, ఇవి అహింసాయుతములుగా ఉండవలెనంటే అర్థమవుతుంది కాని, మనస్సులో కూడా అహింస ఉండవలె ననడం గొంతెమ్మ కోరిక అన్నారు కొంతమంది మౌలానాలు. నేను వారి మనస్సులపైన యాజమాన్యం వహించాలని చూస్తున్నా నన్నారు కొంతమంది. "అదికాదు. అహింస యాజమాన్యం వహించాలని నా అభిప్రాయం" అన్నాను నేను. చిట్టచివరకు వారా ప్రమాణ పత్రాన్ని అంగీకరించారు. కాని 17 సంవత్సరాల కిందట మనమూ అహింసా ప్రమాణాన్ని అంగీకరించి నప్పటికీ అది ఉద్దేశించిన ఆ అప్రతిహత శక్తిని మన మభివృద్ధి కావించుకోలేక పోయినాము. దానికి కారణం, అటువంటి స్వచ్ఛంద సైనిక దళాన్ని యేర్పాటు చేయడానికి మన మెంతమాత్రమూ కృషి చేయకపోవడమే. మనం చేసిన ప్రమాణాన్ని మనం నిర్వహించుకోలేక పోయినప్పుడు మన స్థితిని గూర్చి పునరాలోచన చేసుకోవడం మంచిది. ఆ ప్రమాణ పత్రం ఆచరణలో లేకుండా, ఇంతవరకూ కాగితంమీద మాత్ర ముండడం అన్నిటికంటె దురదృష్టం. అయితే, దాని ప్రకారం చాలినంత మంది అహింసా యోధులను మనం సంపాదించ గలిగినట్లయితే, ఈ కొట్లాటలుండేవే కావు. ఒకవేళ అవి తటసించి నప్పటికీ కూడా మన అహింసా సైనికులు వాటిని చల్లార్చగలిగి ఉండేవారు. లేదా ఆ ప్రయత్నంలో

తా మాహుతి అయి ఉండేవారు. అలా మరణించినవారి నొక్కరినే మన మెఱిగి ఉన్నాము. వారి సర్వ సమర్పణ బుద్ధి కొనియాడ తగినది. [illegible]ప్త వంటివా ళ్ళనేకమంది ఉన్నట్లయితే నా హృదయం సంతోషంతో ఉప్పొంగి పోయేది. ఇదంతా వట్టి కలలనుకుంటూన్నారా? అటువంటి అహింసా దళంతో కూడా కొట్లాటలను చల్లార్చలేమనేనా మీ అభిప్రాయం? శాంతంగా సమ చిత్తంతో ఆలోచించి మీ రలా నిర్ణయించి నట్లయితే స్వరాజ్యం కూడా అహింసా పద్ధతులతో లభించదనే అభిప్రాయ పడవలసి వస్తుంది.

గాంధీ సేవా సంఘం అయిదవ మహాసభ బృందావనంలో జరిగినప్పు డాయన ఉపన్యాసంలో ప్రతిఫలిస్తూన్న దుఃఖాన్ని పరిశీలించండి :

కాంగ్రెసు కళంకాన్ని గమనించండి. కాంగ్రెసులో ఇంత కళంకం ఎందుకు పెరిగి పోవాలి. ఇంత కళంకం పెట్టుకొని మనం కాంగ్రెసు వాదులమని ఏ మొగంతో పిలుచుకోగలం. మీలో కొందఱు గాంధేయు లనిపించు కొంటూన్నారు. గాంధేయు డనే పేరు పెట్టుకోతగినది కాదు. అంతకంటె అహింసా వాదులని ఎందుకు పిలిపించుకో కూడదు. గాంధీ గుణా గుణముల, బలా బలముల, హింసా హింసల మిశ్రమం. కాని అహింసలో కల్తీ ఉండదు. ఇక అహింసా వాదులైన మీరు అచ్చంగా అహింసను ఆచరించగలమని చెప్పగలరా? ప్రతికక్షుల బాణ పరంపర లకు, ఎదురు బాణాలు వేయకుండా రొమ్ము చూపగలరా? ఎదుటి వారు చేసే విమర్శలకు కల్లోల పడమని గానీ కోపపడమని గానీ మీ రన గలరా? మీలో చాలామంది అలా చెప్పలేరనే నా నమ్మకం.

"అయితే అంతదాకా అహింసాభ్యాసం చేయాలని మీ రిదివఱ కెన్నడూ అని ఉండలేద"ని మీరు జవాబు చెప్పవచ్చును. అలా అయితే అంత వఱకు నా కార్య నిర్వహణంలో ఉన్న తప్పును నేను ఒప్పుకొంటాను.

అహింస మన తప్పులను పెద్దవిగాను, ప్రతిపక్షుల తప్పులను చిన్నవిగానూ గణింప చేస్తుంది. మన గోరంత తప్పును కొండంత గాను, ఎదటివాని తప్పు కొండంతయినా గోరంతగానూ నిరూపిస్తుంది అహింస. మనం ఇందుకు విరుద్ధంగా ప్రవర్తించాము.

సంస్థానాల విషయంలో వాటి పరిపాలనమును సంస్కరింప తలపెట్టామే కాని వాటిని నాశనం చేదామని అనుకోలేదు. సంస్థానాధిపతులకు చిత్త సంస్కారం కలిగించా లనుకొన్నాను. కాని మనమాటలు మన సంకల్పానికి తగినట్లుగా లేవు.

రాజకోటను గూర్చి నేనా ప్రకటనను చేసినంత మాత్రాన ఆ సంస్థాన ప్రజలను చిక్కులలో వదిలిపెట్టి వేస్తానని మీ రనుకోకండి. నా సహకారుల నెన్నడు నేను జారవిడచి వారికి నిరుత్సాహం కలిగించను. అది చేస్తే కేవలం మనో దౌర్బల్య మనిపించు కొంటుంది. అట్లా ఉంటుందో ఇంతవరకు నే నెరుగను. పైగా అక్కడ పనిచేసేవా రంతకంతకు బలిష్ఠులు కావలెనని ప్రతిదినము నేను ప్రార్థన చేస్తున్నాను. కార్య నిర్వహణంలో పద్ధతిలో ముఖ్యమైన మార్పు రావాలని మాత్రమే నేను చెప్పేది. ఇక గాంధీ సేవా సంఘం అవలంబించ వలసిన పద్ధతిని గూర్చి యోచిద్దాము. ఇంతవరకు నేను చెప్పినదంతా మీరు గ్రహించి ఉన్నట్లయితే మనం కూడా కొంతవరకు సంస్కరించుకోవలసి వస్తుందనే సంగతి అర్థమై ఉంటుంది. మనం ఆత్మపరీక్ష చేసుకొని మన సిద్ధాంతాల కనుగుణంగా ఎంతవరకు నడచుకొంటున్నామో అని యోజించుకోవాలి. అప్పుడు మనలో లోపం కనిపిస్తే మన సంఖ్యను తగ్గించుకోవడం ఎక్కువ ఉపయోగం. సత్యాహింసలలో హృదయపూర్వక విశ్వాసంగల స్వచ్ఛమైన సభ్యులు ఇరవైమంది ఉంటే, ఉదాసీన భావంగల సభ్యులు రెండు వందల మంది ఉండడంకంటె ఎక్కువ ప్రయోజనం. మొదటిరకం సభ్యులు మన ఉన్నతికి కారణం కాగలరు. రెండో రకం సభ్యులు మన నాశనానికి దారి తీస్తారు. మన సంఘంలో కూడా కళంక మేర్పడలేదా? మన

సభ్యులు కూడా కపటానికి, అనుమానానికి, పరస్పర అవిశ్వాసానికీ చోటీయడం లేదా? నేనందరి సభ్యులనూ ఎరుగను. కొందరి పేర్లు నే నెరుగుదును. నేనీ మాటలు స్వయంగా తెలుసుకొని అనడం లేదు. నాకున్న కొద్ది అనుభవంతో నేను మాట్లాడుతున్నాను. దురదృష్ట వశాత్తు జమన్‌లాల్‌జీ ఇక్కడ లేడు. ఆయనకు సంబంధమున్న అనేక సంస్థలలో, నా అనుభవాలే ఆయనకూ కలిగినట్లుగా అనేకసార్లాయన ఒప్పుకొన్నాడు. ఒడుదుడుకు లేకుండా మనమీ సంస్థలను నడపడ మెందుకు కష్టమవ్వాలి? మన ప్రచారకులను దేశంలో ఒక కొననుండి ఇంకో కొనకు పోయి పనిచేయమని పంపించడానికి మనకెందుకు ధైర్య ముండకూడదు?

చిట్టచివరకు 1940లో సంఘ విషయాలు మరీ విషమపరిస్థితికి రాగా, సమగ్రాలోచనలు జరిగినపిమ్మట మలికందలో సంఘ సభ్యులు తొమ్మిదిమంది మాత్రమే ఉండాలని నిశ్చయింపబడినది. రాజకీయాలలో పనిచేసేవారంతా సంఘ సభ్యత్వానికి రాజీనామాలిచ్చారు. అసలీసంగతి తెలిసిన కొంతమంది అంతకు పూర్వమే సభ్యత్వం వదులుకొన్నారు. ఈ సంగతులన్నీ ఇంతకంటె ఎక్కువ వివరంగా తెలుసుకోవలెనంటే, హరిజన సంచికలలో చదువవచ్చును. గాంధీ సిద్ధాంతాలకూ ఉపదేశాలకూ సంబంధించిన వివిధ విషయాలపైన ప్రమాణవచనాల కోసం, ఆయన గాంధీసేవాసంఘ సాంవత్సరిక సమావేశాలలో చేసిన ఉపన్యాసాలు హరిజన్‌లో చాలామంది విరివిగా చదువు తూంటారు.

గాంధీ సేవాసంఘం - దాని నియమావళి.

(ఎ) గాంధీమహాత్ముని ఉపదేశాల ననుసరించిన సత్యాగ్రహి సిద్ధాంతాల ప్రకారం ప్రజాసేవ చేయడమే ఈ సంఘోద్దేశం.

(బి) సంఘోద్దేశమును నెరవేర్చేటందుకు తక్షణం ఈ కార్యక్రమం అంగీకరింపబడింది. చేతితో వడుకుట, చేతితో నేయుట; ఈ పనులను పునరుద్ధరించాలి.

గ్రామసేవ,
జాతీయవిద్య,
జాతీయ భాషాప్రచారం,
తాగుడును, మత్తుపదార్థాలను మాన్పించడం, వెనుకపడిఉన్న సంఘాలకు సేవచేయడం, వివిధ సంఘాలలోను పరస్పరం ఐక్యభావాన్ని స్థాపించడం;
స్త్రీల స్థితిని అభివృద్ధిచేయడం,
వైద్యసహాయము, రోగులకు ఉపకారము,
కష్టనివారణకోసం పనిచేయడం,
పశువుల వృద్ధికి పాటుపడడం,
గాంధీ సంబంధమైన సాహిత్యాన్ని ప్రచురించడం,
కార్యవాహకసమితి అంగీకరించిన ఇతర పనులు.

వ్యా:- "గాంధీమహాత్ముని ఉపదేశాల ననుసరించిన సత్యాగ్రహి సిద్ధాంతాలు" అంటే, త్రికరణశుద్ధిమైన అహింస, దానికి సన్నిహితములైన ప్రేమ, ఇంద్రియ నిగ్రహం; దారిద్ర్య స్వీకరణం, అలోభత్వం, నిర్భయత్వం, జిహ్వేంద్రియ నిగ్రహం, కష్టజీవనం, స్వదేశ, అస్పృ

శ్యతా నివారణం, గొప్పవారి, తక్కువవారు అనే భేదం లేకుండా ఉండడం, సర్వమత సమబుద్ధి, మంచిచెడ్డ చెడుగును ఎదిరించడం — వీటన్నిటిద్వారా వినమ్రతతో చేసే నిరంతర సత్యాన్వేషణమే.

౨ సంఘంలో మూడుతరగతుల సభ్యులున్నారు. (౧) సేవకవర్గం (౨) సహయోగి వర్గం (౩) సహాయక వర్గం.

౩ సభ్యత్వ యోగ్యతలు:- (౧) సంఘోద్దేశాన్ని అంగీకరించాలి. ముఖ్యంగా సత్యాహింసలను మతవిశ్వాసంగా అంగీకరించాలి. (౨) గ్రామాలలో నూలువడకడం ఉపవృత్తిగా ఉండాలనే విశ్వాసం కలిగి, నిరంతర ఖాదీ ధారిగా ఉండాలి. మత్తుపదార్థాలను గ్రహించకూడదు. తనకు సంబంధించినంతవరకు హరిజనులను సమానప్రతిపత్తితో చూడాలి. వివిధ సంఘాలమధ్యనూ మిత్రత్వమును విస్తరింపచేయాలి.

౪ ఇవికాక సేవకుడు హిందూస్థానీలో పనిజరుపుకొని పోవడానికి తగిన జ్ఞానం కలిగిఉండాలి. చురుకుగా పనిచేయడానికి తగిన ఇష్టము, సామర్థ్యము కలిగిఉండాలి. తన జీవితంలోను, ప్రవర్తనలోను సత్యాగ్రహ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టడానికి నిరంతరం ప్రయత్నిస్తూండాలి, నెలకు వేయిగజాలకు తక్కువకాకుండా నూలు వడకాలి. రోజంతా పనిచేసేవాడుగా ఉండాలి. కార్యవాహక సమితి అంగీకారం లేకుండా, సొంతానికి లాభించేపనిని దేనినీ చేయకూడదు.

౫ సంఘం అంగీకరించిన కార్యక్రమ లోని ఒకటి రెండు పనులలోనైనా సహయోగి నియామకంగా పాల్గొంటూండాలి. ఆ సందర్భంలో సంఘ నియతికి కట్టుబడి ఉండాలి. సేవకునివలెనే ఆయనకూడా నూలు వడకాలి.

౬ అధ్యక్షుడు నిర్ణయించినప్రకారం ప్రతి సహాయకుడు నియామకంగా కొంత సొమ్మును సంఘ కార్యనిర్వాహకంకోసం చెల్లిస్తూండాలి. లేదా మొత్తంగాకూడా చందాలిస్తూండవచ్చు.

౭ సంఘ కార్యవాహకసమితి, ఈవిధంగా నిర్మింపబడును:- సేవక సభ్యులలోనుండి అయిదేళ్ళు పనిచేయడానికి వాళ్ళచేత అధ్యక్షుడు ఎన్నుకోబడును.

సేవకులలోనుండి మూడేండ్లవఱకూ ఉండేపద్ధతిని వారిచేతనే ఆరుగురు సభ్యులు ఎన్నుకోబడుదురు. కాని ప్రతిసంవత్సరము క్రమంగా ఇద్దరు చొప్పున విరమిస్తూంటారు.

ముగ్గురు యావజ్జీవ ట్రస్టీలు, ఏ తరగతి సభ్యులలోనుండియైనా ఎన్నుకోబడతారు.